
'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 97

బుధవారం 28-6-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



కౌంట్‌డౌన్ మొదలు.. 100 రోజుల్లో వన్డే ప్రపంచకప్

భారత్ వేదికగా మరో 100 రోజుల్లో మొదలయ్యే వన్డే ప్రపంచకప్ టోర్నీ షెడ్యూల్‌ను మంగళవారం విడుదల చేశారు. అక్టోబర్ 5న అహ్మదాబాద్‌లో ఇంగ్లండ్, న్యూజిలాండ్ జట్ల మధ్య మ్యాచ్‌తో టోర్నీ మొదలవుతుంది. అక్టోబర్ 15న అహ్మదాబాద్‌లోనే చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్తాన్ జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది. నవంబర్ 19న అహ్మదాబాద్‌లో జరిగే ఫైనల్‌తో టోర్నీ ముగుస్తుంది.

12లో



యూపీలో క్రిమినల్ హతం

ఉత్తరప్రదేశ్‌లోని కౌశంబి జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ గుఫ్రాన్ హతమయ్యాడు.


వివరాలు 6లో ▸



మమతకు గాయాలు

ప్రతికూల పరిస్థితుల మధ్య మమతా బెనర్జీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ అత్యవసరంగా ల్యాండైంది. ఆమెకు గాయాలయ్యాయి.

వివరాలు 6లో ▸



టమాటా రూ.100..

కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోనూ రిటైల్ మార్కెట్‌లో టమాటా కిలో రూ.100కు చేరింది.

వివరాలు 14లో ▸



వాగ్నర్ సేనకు రష్యా క్షమాభిక్ష

వాగ్నర్ సైన్యం తిరుగుబాటును నిలిపేయడంతో ఆ సైన్యం చీఫ్ ప్రిగోజిన్, అతని బలగాలకు రష్యా క్షమాభిక్ష ప్రసాదించింది.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

ఈటల హత్యకు కౌశిక్‌రెడ్డి కుట్ర: జమున



బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్‌ను హత్యచేయించే కుట్ర జరుగుతోందని ఆయన సతీమణి జమున సంచలన ఆరోపణలు చేశారు. ఈ కుట్ర వెనుక ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి ఉన్నారని, సీఎం కేసీఆర్ చెబితేనే కౌశిక్‌రెడ్డి అలా మాట్లాడతారని అన్నారు.

- వివరాలు 2లో▶


20 ఏళ్లలో 21 వేల గుండె ఆపరేషన్లు



ఉస్మానియా ఆస్పత్రి కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ సయ్యద్ ఇమాముద్దీన్ అరుదైన రికార్డు సృష్టించారు. 20 ఏళ్లలో 21 వేల గుండె శస్త్రచికిత్సలు నిర్వహించిన వైద్యుడిగా ఖ్యాతి గాంచారు. ఇతర డాక్టర్లతో కలసి ఆయన చేసిన ఆపరేషన్ల సంఖ్య 50 వేలు దాటింది.

- వివరాలు 14లో▶

ఔటర్‌పై స్పీడ్ @120



ఔటర్ రింగురోడ్డుపై వాహనాల గరిష్ట వేగం పెరిగింది. ఈ రహదారిపై వాహనాలకు గంటకు 100 కిలోమీటర్ల వరకే గరిష్టవేగానికి అనుమతి ఉండగా, తాజాగా 100 నుంచి 120 కిలోమీటర్లకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

- వివరాలు 3లో▶

నాలుగేళ్ల బీఈడీ వచ్చేసింది



సమీకృత బీఈడీ కోర్సులు ఈ ఏడాది నుంచి ప్రారంభం కానున్నాయి. ఇంటర్ తర్వాత డిగ్రీ, బీఈడీ కలిపి ఒకేసారి పూర్తి చేయవచ్చు. ఈ కోర్సు కాలపరిమితి నాలుగేళ్లు. వీటిలో ప్రవేశానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) రాత పరీక్ష నిర్వహిస్తుంది.

- వివరాలు 3లో▶



ప్రధాని పదవిపై చర్చ జరిగేదాకా విపక్ష భేటీలు జరుగుతూనే ఉంటాయి సార్



ఢిల్లీలో ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్, ఖర్గే, రాత్రే కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయిన రాష్ట్ర ముఖ్య నాయకులు

పార్టీ గీత దాటొద్దు.. రచ్చ చేసుకోవద్దు..
రాష్ట్ర నేతలకు స్పష్టం చేసిన రాహుల్, ఖర్గే
విభేదాలపై మీడియాకు ఎక్కొద్దు..
చర్యలు తీసుకోవాల్సిన అవసరం మాకు కల్పించొద్దు

చేయి దాటితే వేటే..

- 'కర్ణాటక స్ఫూర్తి'తో పనిచేయండి
- ఎవరూ అభ్యర్థులను ప్రకటించవద్దు.. హైకమాండ్ ప్రకటనే ఫైనల్
- బీఆర్‌ఎస్‌తో ఎన్నికల ముందు, తర్వాత ఎలాంటి పొత్తు ఉండదు..
- జాతీయ స్థాయి ప్రతిపక్ష కూటమిలోనూ బీఆర్‌ఎస్‌కు చోటివ్వబోం!
- బీఆర్‌ఎస్, బీజేపీ ఒక్కటేనని ప్రచారం చేయండి.. ఇంటింటికీ కాంగ్రెస్ పేరుతో మేనిఫెస్టోను ప్రజలకు వివరించండి

సాక్షి, న్యూఢిల్లీ/ సాక్షి, హైదరాబాద్: ''పార్టీ అంతర్గత విషయాలు మాట్లాడేందుకు చాలా వేదికలు ఉన్నాయి. మీకు ఎలాంటి సమస్యలున్నా పెద్దల దృష్టికి తీసుకురండి. బయట ఎక్కడా బహిరంగంగా మాట్లాడే ప్రయత్నం చేయకండి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రచ్చ చేసుకోవద్దు. పార్టీ గీత దాటొద్దు. చర్యలు తీసుకునేలా మాకు అవకాశం కల్పించొద్దు. కర్ణాటక ఎన్నికల సమయంలో ఇదే విషయాన్ని చెప్పాం. వారంతా తప్పకుండా పాటించి విజయం సాధించారు. మీరు కూడా అది స్ఫూర్తిగా తీసుకుని పనిచేయండి'' అని తెలంగాణ కాంగ్రెస్ నేతలకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. అంతర్గత విభేదాలతో పార్టీని రచ్చకెక్కిస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఇక తెలంగాణలో ఎన్నికలకు ముందుగానీ, తర్వాతగానీ బీఆర్‌ఎస్‌తో పొత్తు ఉండదని స్పష్టం చేశారు. జాతీయ స్థాయి ప్రతిపక్ష కూటమిలోనూ బీఆర్‌ఎస్‌ను భాగస్వామిని చేయలేదన్న విషయాన్ని వివరించారు.

కీలక అంశాలపై మార్గనిర్దేశం

మంగళవారం ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో నిర్వహించిన వ్యూహాత్మక భేటీలో తెలంగాణ కాంగ్రెస్ నేతలకు అధిష్టానం పెద్దలు కీలక అంశాలపై మార్గనిర్దేశం చేశారు. రెండున్నర గంటలపాటు జరిగిన ఈ భేటీలో నేతల ఐక్యత, మేనిఫెస్టో అంశాలు, ముందస్తు అభ్యర్థుల ప్రకటన, సంప్రదాయక ఓటర్లను తిరిగి ఆకర్షించడం, ఇంటింటికీ కాంగ్రెస్, ప్రభుత్వ అవినీతిపై పోరు వంటి అంశాలపై 120 రోజుల పాటు చేపట్టాల్సిన ఎన్నికల కార్యాచరణపై కూలంకషంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎన్నికల వ్యూహాలపై రాష్ట్ర నేతలు తమ అభిప్రాయాలను అధిష్టానం పెద్దలకు వెల్లడించారు.

మీడియాకు ఎక్కితే కఠినచర్యలు

విశ్వసనీయ సమాచారం ప్రకారం.. భేటీలో తొలి ప్రాధాన్యతగా నేతల మధ్య ఐక్యతపైనే

మిగతా 2వ పేజీలో ▶

కాంగ్రెస్‌లో ఎన్నికల దూకుడు!

ఢిల్లీలో జరిగిన వ్యూహాత్మక భేటీలో కీలక నిర్ణయాలు

- ఖమ్మం బహిరంగ సభ నుంచే ఎన్నికల ప్రచారం షురూ!
- త్వరలో రాష్ట్రస్థాయి ఎన్నికల కమిటీ నియామకం.. టికెట్ల కేటాయింపులో దానికే కీలక బాధ్యత
- రాహుల్ గాంధీతో జగ్గారెడ్డి ప్రత్యేక భేటీ

2లో

వారికి ఓటేస్తే ఆ కుటుంబాలే బాగుపడతాయి

మీ కుటుంబాల సంక్షేమం కోరుకుంటే బీజేపీకే ఓటేయండి

- ఉమ్మడి పౌరస్మృతి అవసరం ఎంతో ఉంది
- ప్రతిపక్షాలు ముస్లింలను రెచ్చగొడ్తున్నాయి
- భోపాల్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ



దేశంలోని కుటుంబ పార్టీలపై ప్రధాని మోదీ నిప్పులు చెరిగారు. ఆయా పార్టీలకు ఓటేస్తే కొన్ని కుటుంబాలు బాగుపడతాయే తప్ప, ప్రజలకు ఒరిగేదేమీ ఉండదన్నారు. బీజేపీకి ఓటేస్తే అన్ని కుటుంబాలకు మంచి జరుగుతుందని చెప్పారు. పట్నాలో ఇటీవల జరిగిన ప్రతిపక్ష నేతల సమావేశాన్ని ఆయన ఫొటో షూట్‌గా అభివర్ణించారు. మంగళవారం మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో బీజేపీ చేపట్టిన 'మేరా బూత్ సబ్ సే మజ్‌బూత్' కార్యక్రమంలో కార్యకర్తలనుద్దేశించి మోదీ మాట్లాడారు. 2024 ఎన్నికల్లో మరోసారి బీజేపీకే అధికారం అప్పగించాలని ప్రజలు ఇప్పటికే నిర్ణయానికి వచ్చారని ప్రధాని చెప్పారు. దేశంలో ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) అవసరం ఎంతో ఉందని ఆయన నొక్కిచెప్పారు. యూసీసీతో వివాహం, విడాకులు, అనువంశికత, భరణం, ఆస్తి వారసత్వం వంటి వాటిలో ఒకే చట్టం అమలవుతుందని చెప్పారు.

> తెలంగాణ సీఎం కేసీఆర్ కూతురు సంక్షేమం కోరుకుంటున్న వారయితే బీఆర్‌ఎస్‌కు ఓటేయండి. గాంధీల కుటుంబం అభివృద్ధిని మీరు కోరుకుంటే కాంగ్రెస్‌కు ఓటేయండి. ములాయం సింగ్ కొడుకు కుటుంబం సంక్షేమం కోరుకున్నట్లయితే సమాజ్‌వాదీ పార్టీకి ఓటేయండి. కరుణానిధి కుటుంబ సంక్షేమం కోరుకుంటున్నట్లయితే డీఎంకేకు ఓటేయండి. మీ ఇంట్లో మీ కొడుకులు, కూతుళ్లు, మనవళ్ల సంక్షేమం కోరుకుంటున్న వారయితే కుటుంబ పార్టీలను వదిలేసి, బీజేపీకే ఓటేయండి
>
> - ప్రధాని నరేంద్ర మోదీ

ఒకే దేశం.. ఒకే చట్టం సాధ్యమేనా..?

ఉమ్మడి పౌరస్మృతిపై దేశంలో మళ్లీ చర్చ ఊపందుకుంది. దీనిపై ఇప్పటికే 22వ లా కమిషన్‌ను ఏర్పాటు చేసి దేశ ప్రజలు, మత సంస్థల అభిప్రాయాలను 30 రోజుల్లోగా తీసుకోవాలని గడువు విధించారు. దీనిపై ప్రత్యేక కథనం..

- వివరాలు 6లో



సర్కోలి సభలో విఠలుడి సంగీత పరికరాలుగా భావించే తంబుర, చిడతలతో సీఎం కేసీఆర్. మహారాష్ట్ర నేత భగీరథ బాల్కే వీటిని బహూకరించారు

మాది రైతుల టీం

మేము ఎవరికీ 'ఏ' టీం కాదు.. 'బీ' టీం కాదు: కేసీఆర్

- మహారాష్ట్రలో తెలంగాణ పథకాలు అమలుచేస్తామని వెల్లడి
- పండరీపూర్, తుల్జాపూర్ ఆలయాల్లో కేసీఆర్ పూజలు
- ముగిసిన రెండు రోజుల మహారాష్ట్ర పర్యటన

సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్రలో బీఆర్‌ఎస్ ప్రస్థానం ప్రారంభమైన మూడు నెలల్లోనే బీజేపీ, కాంగ్రెస్‌తోపాటు ఏ పార్టీ కూడా తమను వదలకుండా విమర్శలు చేస్తోందని బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ అన్నారు. రెండు జాతీయ పార్టీలు ఒకరికొకరు తమను బీ టీం అంటూ విమర్శలు చేస్తున్నాయని, తాము ఎవరికీ 'ఏ' టీం, 'బీ' టీం కాదని చెప్పారు. తాము రైతులు, వెనుకబడిన వర్గాలు, అల్పసంఖ్యాకులు, దళితుల టీమ్ అని ప్రకటించారు. రెండు రోజుల మహారాష్ట్ర పర్యటనలో భాగంగా మంగళవారం సర్కోలిలో ఎన్సీపీ మాజీ ఎమ్మెల్యే భరత్ బాల్కే కుమారుడు భగీరథ బాల్కే తన అనుచరులతో కలిసి బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కేసీఆర్ మాట్లాడుతూ అబ్‌కీ బార్ కిసాన్ సర్కార్ నినాదంతో ముందుకెళ్తున్న బీఆర్‌ఎస్‌కు దేశ జనాభాలో 60 శాతానికి పైగా ఉన్న రైతులు, కార్మికులు మద్దతు పలుకుతున్నారన్నారు. దీన్ని జీర్ణించుకోలేక అన్ని పార్టీలు వింత ప్రకటనలు చేస్తున్నాయని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ తెలంగాణకో, మహారాష్ట్రకో పరిమితం కాదని భారత్ పరివర్తన కోసం పనిచేసే మిషన్ అని చెప్పారు.

మహారాష్ట్రలో తెలంగాణ మోడల్

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అయినా లక్ష్యం లేకుండా పయనిస్తోందని, దక్షిణకొరియా, జపాన్, సింగపూర్, మలేసియా, చైనా వంటి ఎన్నో దేశాలు గొప్పగా అభివృద్ధి చెందాయని కేసీఆర్ అన్నారు. మహారాష్ట్రలో కాంగ్రెస్, ఎన్సీపీ, శివసేన, బీజేపీ సహా అన్ని పార్టీలకు అవకాశం ఇచ్చినా ప్రజల ఆకాంక్షలను నెరవేర్చలేదని ధ్వజమెత్తారు. కొత్త రాష్ట్రం తెలంగాణ అతి తక్కువ సమయంలో రైతు సంక్షేమం కోసం పనిచేసిందన్నారు. తెలంగాణ

మిగతా 10వ పేజీలో ▶

తెలంగాణలో మతతత్వం పెరుగుతోంది

ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో మతతత్వం పెరుగుతోందని ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ దారుస్సలాంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ...ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అన్ని కులాలకు భవనాలు కట్టి ఇస్లామిక్ సెంటర్‌ను మాత్రం ఎందుకు నిర్మించలేదో సమాధానం చెప్పాలన్నారు. మెట్రో రైలును పాతబస్తీలో ఎందుకు విస్తరించలేదని ప్రశ్నించారు. ఉస్మానియా ఆస్పత్రి గురించి ఎన్నిసార్లు దృష్టికి తీసుకెళ్లినా ప్రభుత్వం పట్టించుకోలేదని

మిగతా 2వ పేజీలో ▶

వర్షాకాల సమస్యలపై అప్రమత్తంగా ఉండండి

జీహెచ్‌ఎంసీ, పురపాలికల్లో వర్షాకాల సన్నద్ధతపై సమీక్షలో మంత్రి కేటీఆర్




సాక్షి, హైదరాబాద్: వానాకాలంలో ప్రజలు ఎదుర్కొనే సమస్యలపై మున్సిపల్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పురపాలక శాఖ మంత్రి కె. తారక రామారావు ఆదేశించారు. మ్యాన్‌హోల్స్, నాలాలు, వరదనీటి కాలువల వల్ల గతంలో తలెత్తిన సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్రంలోని పట్టణాల్లో ఆయా మునిసిపాలిటీలు చేపట్టిన వర్షాకాల సన్నద్ధత ప్రణాళికలపై పురపాలక శాఖలోని వివిధ

మిగతా 3వ పేజీలో ▶

ఫార్మాసిటీ కోసం ఆలయ భూములా?

ఆ వెయ్యి ఎకరాల సేకరణకు అనుమతి లేదు: హైకోర్టు

- సాగునీటి ప్రాజెక్టుల కోసమే గతంలో ఉత్తర్వులు
- పిటిషన్ వేయాల్సింది రెవెన్యూ శాఖ కదా..
- టీఎస్‌ఐఐసీ సింగిల్ జడ్జిని ఎలా ఆశ్రయించింది?
- దేవాదాయ శాఖ భూసేకరణ డివిజన్ బెంచ్ పరిధిలోనిది
- ఫార్మాసిటీకి ఓంకారేశ్వర భూమి సేకరణపై యథాతథస్థితి
- భూసేకరణ ఆపాలంటూ డివిజన్ బెంచ్ ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్: ఫార్మాసిటీ ఏర్పాటు కోసం వెయ్యి ఎకరాల ఆలయ భూముల సేకరణను హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం తప్పుబట్టింది. దేవాదాయ శాఖ భూములను సాగునీటి ప్రాజెక్టుల కోసమే సేకరించాలని గతంలోనే ద్విసభ్య ధర్మాసనం చెప్పిందని, ఇతర అవసరాల కోసం కాదని స్పష్టంచేసింది. భూ సేకరణ, రెవెన్యూ అధికారులకు సంబంధించిన అంశంలో తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక, మౌలిక వసతుల సంస్థ (టీఎస్‌ఐఐసీ) పిటిషన్ ఎలా దాఖలు చేస్తుందని ప్రశ్నించింది. ద్విసభ్య ధర్మాసనం విచారణ జరపాల్సిన దేవాదాయ భూ సేకరణపై సింగిల్ జడ్జిని ఆశ్రయించడాన్ని తప్పుబట్టింది. రంగారెడ్డి జిల్లా నందివనపర్తి, సింగారంలో ఓంకారేశ్వర స్వామి ఆలయానికి చెందిన 1,022 ఎకరాల భూ సేకరణపై యథాతథస్థితి విధించింది. నీటి ప్రాజెక్టులకు కాకుండా ఇతర ప్రజావసరాలకు ఆలయ

మిగతా 5వ పేజీలో ▶



వైద్యవిద్యలో 'నెక్ట్స్' లెవెల్

ఎంబీబీఎస్ పాస్‌తోపాటు పీజీ మెడికల్‌లో ప్రవేశానికీ కీలకంగా నెక్ట్స్ పరీక్ష

- నీట్ పీజీ మెడికల్ పరీక్ష రద్దుకు ఎన్‌ఎంసీ నిర్ణయం
- విదేశాల్లో వైద్యవిద్య పూర్తి చేసిన వారికీ ఇది తప్పనిసరి
- ఈ ఏడాది ఎంబీబీఎస్ పూర్తయ్యే వారి నుంచే అమలు
- జూలైలో మాక్ టెస్ట్.. దానికి నేటి నుంచి దరఖాస్తు ప్రక్రియ
- నెక్ట్స్‌పై గందరగోళం.. లేఖ రాయనున్న ఆరోగ్య వర్సిటీ

సాక్షి, హైదరాబాద్: వైద్యవిద్యలో నేషనల్ ఎగ్జిట్ టెస్ట్ (నెక్ట్స్) విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టనుంది. ఈ ఏడాది నుంచే దాన్ని అమలులోకి తేవాలని జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం మార్గదర్శకాలు విడుదల చేసింది. దీని ప్రకారం ఎంబీబీఎస్ పాస్‌కు, తర్వాత రిజిస్ట్రేషన్, మెడికల్ ప్రాక్టీస్‌కు కూడా ఈ పరీక్ష పాస్ కావడం తప్పనిసరి. అలాగే పీజీ మెడికల్ సీటులో ప్రవేశం కూడా నెక్ట్స్ అర్హతతోనే ఉంటుంది. అంటే నీట్ పీజీ పరీక్ష రద్దవుతుంది. అలాగే విదేశీ వైద్యవిద్యకు గుర్తింపు కూడా ఈ పరీక్ష ద్వారానే ఉంటుంది. అంటే వీటన్నింటికీ ఇదే కీలకమైన పరీక్షగా ఉంటుంది. నెక్ట్స్‌ను ఈ ఏడాది ఎంబీబీఎస్ పూర్తయ్యే విద్యార్థులతో ప్రారంభిస్తారు. నెక్ట్స్–1, నెక్ట్స్–2 అనే పరీక్షలు నిర్వహిస్తారు. నెక్ట్స్–1 ఏటా మే, నవంబర్ నెలల్లో రెండుసార్లు ఉంటుంది. ఆ పరీక్ష జరిగిన నెలలోపే ఫలితాలు ప్రకటిస్తారు. ఈ ఏడాది మొదటిసారిగా నవంబర్‌లో పరీక్ష జరగనుంది. ఇప్పుడు ఎంబీబీఎస్

మిగతా 3వ పేజీలో ▶

క్లుప్తంగా...

వృత్తి నిపుణుల జాబితాలోకి కౌలు రైతులు

సాక్షి, అమలాపురం/కొత్తపేట: ఇతర వృత్తి నిపుణులకు ఇస్తున్న మాదిరిగానే ఇకపై కౌలుదారులను కూడా అగ్రికల్చరల్ ప్రొఫెషనల్స్ (వ్యవసాయ నిపుణులు)గా గుర్తిస్తూ ఇకపై వీరికి కూడా వ్యక్తిగత రుణాలు అందించేందుకు ఏపీలోని అంబేడ్కర్ కోనసీమ జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. పంట భూమి లేకపోయినా.. వ్యవసాయం చేస్తున్న కౌలు రైతులను 'అగ్రికల్చరల్ ప్రొఫెషనల్స్'గా గుర్తించి జిల్లా యంత్రాంగం రుణాలు మంజూరుకు శ్రీకారం చుట్టింది. కౌలు కార్డులు (సీసీఆర్సీ) ఉన్నా రుణాలు అందుకోలేక ఇబ్బంది పడుతున్న కౌలుదారుల దుస్థితిని గుర్తించిన అంబేడ్కర్ కోనసీమ జిల్లా యంత్రాంగం రైతుల పేరిట సెంటు భూమి లేకున్నా.. సంబంధిత వీఆర్వో, వీఏవోలు, తహసీల్దార్ సిఫార్సు మేరకు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) రుణాలు మంజూరు చేసింది. పైలట్ ప్రాజెక్టుగా జిల్లా లో తొలివిడతగా 10 మండలాల్లోని 10 గ్రామాలను ఎంపిక చేసి.. ఆయా గ్రామాల్లో 540 మంది అగ్రికల్చరల్ ప్రొఫెషనల్స్‌కు రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వీరిలో 323 మందికి మంగళవారం రుణాలు అందజేశారు.

స్థలాల కబ్జా లెక్క తేల్చాలి

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు రాఘవులు



తుర్కయంజాల్ (హైదరాబాద్): హైదరా బాద్ చుట్టూ ప్రభుత్వ భూములను బడా బాబులు, పేదలు ఎంత కబ్జా చేశారో లెక్కలు తేల్చాలని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు డిమాండ్ చేశారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా తుర్కయాంజాల్ మున్సిపాలిటీ చౌరస్తాలో జరిగిన సీపీఎం, అనుబంధ ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో కొనసాగిన బస్సుయాత్ర ముగింపు సభకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. బడా బాబులు ప్రభుత్వ స్థలాలను ఆక్ర మిస్తే ఫిర్యాదు అందినా స్పందించని పోలీసు లు.. పేదలు ప్రభుత్వ స్థలాలలో నివాసం ఏర్పాటు చేసుకుంటే మాత్రం రాత్రికి రాత్రే పోలీసులు బలగాలను దింపి పూరి గుడిసె లపై దాడి చేసి ఖాళీ చేయిస్తారని విమర్శించారు. బడా బాబులకు ఒక న్యాయం.. పేద లకు మరో న్యాయమా? అని ప్రశ్నించారు. పేదలు లేకపోతే నగర నిర్మాణం జరిగేదా? అని ప్రశ్నించారు.

మహారాష్ట్రలో బీఆర్ఎస్ ప్రభావం ఉండదు

శివసేన రాష్ట్ర అధ్యక్షుడు సింకారు శివాజీ



సాక్షి, హైదరాబాద్: రెండుసార్లు అధికారాన్ని కట్టబెట్టిన తెలంగాణ ప్రజలను గాలికి వదిలిన ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు మహారాష్ట్ర చుట్టూ తిరగడం శోచనీయమని, 600 కార్ల కాన్వాయ్‌తో వెళ్లినా, ఆరు వేల వాహనాలతో మహారాష్ట్రకు వెళ్లినా అక్కడ బీఆర్ఎస్ ప్రభా వం ఉండదని శివసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సింకారు శివాజీ పేర్కొన్నారు. హిమాయత్ నగర్‌లోని తెలంగాణ రాష్ట్ర శివసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన ముఖ్య పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తెలంగాణలో ఓటు అడిగే హక్కు కోల్పోయిన కేసీఆర్ మహారాష్ట్రలో ఏం ఒరగబెడతారని ప్రశ్నించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో శివసేన పార్టీ పోటీ చేస్తుందని స్పష్టం చేశారు.

ప్రాజెక్టుల పేరుతో కేసీఆర్ లక్షల కోట్లు దోచుకున్నారు

వైఎస్ షర్మిల ధ్వజం



సాక్షి, హైదరాబాద్: ప్రాజెక్టుల పేరుతో రూ.లక్ష కోట్లు తిన్న అవినీతిపరుడు ముఖ్య మంత్రి కె.చంద్రశేఖర్‌రావును ఎందుకు జైల్లో పెట్టకూడదో మంత్రి కె.తారకరామా రావు సమాధానం చెప్పాలని వైఎస్సార్‌టీపీ అధి నేత్రి వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని నిరుద్యోగులు, రైతుల ఆత్మహత్యలకు, అటవీ అధికారుల మరణాలకు బీఆర్ఎస్ ప్రభుత్వానిది బాధ్యత కాదా అని మంగళవా రం ట్విట్టర్ వేదికగా ఆమె నిలదీశారు. సొంత ప్రయోజనాలకు 35 వేల ఎకరాల సర్కారు భూమిని అమ్మడమే కాకుండా రాజ్యాంగాన్ని అవమానించి తిరగరాయాలని చెప్పిన దేశద్రోహిని ఏమని పిలవాలన్నారు. మోసాలకు, అవినీతికి, హత్యలకు శిక్షలు వేసినట్లే సీఎం కేసీఆర్‌కి కూడా శిక్ష వేయాలని డిమాండ్ చేశారు. ప్రజాకోర్టులో తండ్రీకొడుకులిద్దరికీ శిక్షపడి జైలుకెళ్లే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని హెచ్చరించారు. బీఆర్ఎస్ నేతలను దేశం నుంచే తరిమికొట్టాలని పిలుపునిచ్చారు.

తెలంగాణలో మతతత్వం పెరుగుతోంది

▶ మొదటి పేజీ తరువాయి

విమర్శించారు. మంత్రి కేటీఆర్ కేంద్రమంత్రులను కలవడం మంచి పరిణామమేనని, అయితే కేటీఆర్‌ను సీఎం కేసీఆర్ ప్రమోట్ చేస్తున్నట్లు కనిపిస్తోందన్నారు. దేశంలో హిందూ సివిల్ కోడ్ అమలు చేసేందుకు ప్రధాని మోదీ కుట్ర పన్నుతున్నారని బీజేపీకి దమ్ముంటే ముందుగా పంజాబ్‌లో ఉమ్మడి పౌరస్మృతి అమలు చేయాలని సవాల్ విసిరారు. యూనిఫామ్ సివిల్ కోడ్ అమలు చేసే ముందు దేశంలో మద్యపాన నిషేధం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌లో ఎన్నికల దూకుడు!

ఢిల్లీలో జరిగిన వ్యూహాత్మక భేటీలో కీలక నిర్ణయాలు

ఖమ్మం బహిరంగ సభ నుంచే ఎన్నికల ప్రచారం షురూ!

- రాష్ట్ర సభల్లో రాహుల్, ప్రియాంకలతో కీలక ప్రకటనలు చేయించే యోచన
- హామీలపై ప్రత్యేక కసరత్తు.. వారంలో మేనిఫెస్టో కమిటీ ఏర్పాటు
- త్వరలో రాష్ట్రస్థాయి ఎన్నికల కమిటీ నియామకం.. టికెట్ల కేటాయింపులో దానికే కీలక బాధ్యత
- కర్ణాటక తరహాలో వ్యూహాలు, ముందుగా టికెట్ల ప్రకటనకు నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీలో అసెంబ్లీ ఎన్నికల దూకుడు మొదలైంది. ఐదారు రోజుల్లో ఖమ్మంలో జరగనున్న బహిరంగ సభతోనే ఎన్నికల ప్రచారం మొదలుపెట్టేందుకు రంగం సిద్ధమవుతోంది. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలో రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గేల సమక్షంలో జరిగిన ఎన్నికల వ్యూహ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారని కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ఐదు నెలలే గడువున్న నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహాలు, అవసరమైన అస్త్రాలను సమకూర్చుకోవడంపై స్పష్టత వచ్చిందని అంటున్నాయి. టికెట్ల కేటాయింపు మొదలు ప్రజలకు ఇవ్వాల్సిన హామీల దాకా అన్ని విషయాల్లో వ్యూహాత్మకంగా ముందుకెళతామని రాహుల్, ఖర్గేల సమావేశానికి హాజరైన కాంగ్రెస్ ముఖ్య నాయకులు స్పష్టం చేస్తున్నారు.

ముందస్తుగా టికెట్లు ప్రకటించేలా..

2018 అసెంబ్లీ ఎన్నికల అనుభవాన్ని బట్టి ఈసారి కాంగ్రెస్ అభ్యర్థులను ముందుగానే ఖరారు చేస్తారని ఎప్పట్నుంచో ప్రచారం జరుగుతోంది. ఈసారి ఎన్నికలకు కనీసం మూడు నెలల ముందే అభ్యర్థులను ప్రకటించాలని కాంగ్రెస్ నేతలు కోరుతున్నారు. ఇటీవలి కర్ణాటక ఎన్నికల్లో ముందే అభ్యర్థులను ప్రకటించిన క్రమంలో మంగళవారం రాహుల్, ఖర్గేలతో జరిగిన సమావేశంలోనూ టికెట్ల కేటాయింపు అంశంపై చర్చ జరిగినట్టు తెలిసింది. కర్ణాటక ఫార్ములాతోనే ముందుకెళ్దామని.. కానీ కొన్ని బలహీనతలు, పార్టీ నేతల మధ్య విభేదాలను అధిగమించాలని అధిష్టానం పెద్దలు సూచించినట్టు తెలిసింది. టికెట్ల ఖరారు ప్రక్రియకు సంబంధించి త్వరలో ప్రదేశ్ ఎన్నికల కమిటీ (పీఈసీ)ని ఏర్పాటు చేస్తామని.. తర్వాత ఏఐసీసీ నుంచి స్క్రీనింగ్ కమిటీని కూడా వీలైనంత ముందే తెలంగాణకు పంపుతామని, ఎన్నికలకు రెండు నెలల ముందే అభ్యర్థులను ఖరారు చేసే అంశాన్ని పరిశీలిస్తామని పేర్కొన్నట్టు తెలిసింది.

వారం, పది రోజుల్లో మేనిఫెస్టో కమిటీ!

పార్టీ మేనిఫెస్టో కమిటీని కూడా త్వరలోనే ప్రకటిస్తామని అధిష్టానం పెద్దలు సంకేతాలు ఇచ్చినట్టు తెలిసింది. మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ నేతృత్వంలో ఈ కమిటీ ఏర్పాటవుతుందని చాలా రోజులుగా గాంధీ భవన్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్ పక్షాన ఇప్పటికే రైతు, యూత్ డిక్లరేషన్లను ప్రకటించగా.. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల వారీగా డిక్లరేషన్లు ప్రకటించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీనికితోడు బీసీలకు ఎక్కువ టికెట్ల కేటాయింపు, ఎస్సీ, ఎస్టీల తరహాలోనే బీసీలకు కూడా సబ్‌ప్లాన్ ప్రకటిస్తామనే హామీ ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. మంగళవారం నాటి సమావేశంలో.. బీసీల కులగణన, పార్టీ, టికెట్ల కేటాయింపులో ప్రాధాన్యత గురించి పార్టీ సీనియర్ నేత వీహెచ్ తన వాదన వినిపించడంతో కొంతసేపు ఈ అంశంపై చర్చ సాగింది. ఇక రాష్ట్రంలో మైనార్టీ వర్గాలను ఆకట్టుకునేలా ఎన్నికల హామీలిచ్చే యోచనలో కాంగ్రెస్ పార్టీ ఉంది. ప్రజాకర్షక పథకాలను మేనిఫెస్టోలో చేర్చేలా, ప్రజల నాడిని పట్టే సత్తా, ఎన్నికల్లో విస్తృత అనుభవం ఉన్న నాయకులను మేనిఫెస్టో కమిటీలోకి తీసుకోనున్నట్టు సమాచారం. ఎన్నికల కమిటీలో కూడా సీనియర్లకు ప్రాధాన్యం కల్పిస్తారని, ఆ కమిటీ సిఫార్సులను టికెట్ల కేటాయింపులో పరిగణనలోకి తీసుకుంటారని కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి. ఈ కమిటీలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు భర్తీ కాని పార్టీ పదవులన్నింటినీ వారం, పది రోజుల్లోగా పూర్తి చేయాలని ఏఐసీసీ పెద్దలు తెలంగాణ నేతలను ఆదేశించినట్టు తెలిసింది.

ధరణి రద్దుపై స్పష్టత ఇచ్చే యోచన

బీఆర్ఎస్ అవినీతిని ఎండగట్టాలని, బీఆర్ఎస్–బీజేపీల బంధాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని వ్యూహాత్మక భేటీలో రాహుల్, ఖర్గేలు తెలంగాణ కాంగ్రెస్ నేతలకు సూచించినట్టు సమాచారం. సమావేశంలో భాగంగా ధరణి పోర్టల్‌పై పార్టీ వైఖరి గురించి కూడా చర్చించినట్టు తెలిసింది. ధరణి కారణంగా రైతులు ఇబ్బంది పడుతుండటంతోనే ఆ పోర్టల్‌ను రద్దు చేస్తామని ప్రకటించామని రాష్ట్ర నాయకులు అధిష్టానానికి వివరించగా.. దీనికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు తెలిసింది. అయితే ధరణి పోర్టల్‌పై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి సమస్యలు, పరిష్కారాలపై దృష్టిపెట్టి పనిచేయాలని సూచించినట్టు సమాచారం.

ఐదు కీలక హామీలతో..

వ్యూహాత్మక సమావేశంలో పాల్గొన్న నేతలంతా వచ్చే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపైనే మాట్లాడినట్టు తెలిసింది. ఫిర్యాదులకు ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా ఎన్నికల వ్యూహమే ఎజెండాగా అధిష్టానం పెద్దలు భేటీని నిర్వహించినట్టు సమాచారం. మొత్తమ్మీద కర్ణాటక ఫార్ములాతోనే తెలంగాణలోనూ ఎన్నికలకు సిద్ధం కావాలని టీపీసీసీ నేతలకు అధిష్టానం దిశానిర్దేశం చేసినట్టు తెలిసింది. కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఐదు హామీల తరహాలోనే.. ప్రజలను బాగా ఆకర్షించేలా తెలంగాణలోనూ ఐదు కీలక హామీలు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్టు సమాచారం.

బీజేపీకి మద్దతుగానే కేసీఆర్ తీరు!

- కాంగ్రెస్ బలంగా ఉన్నచోట దెబ్బతీసే కుట్ర: మాణిక్‌రావ్ ఠాక్రే
- ఈ క్రమంలోనే మహారాష్ట్రలో సభలు, సమావేశాలని ఆరోపణ
- రాష్ట్రంలో కాంగ్రెస్ ఎన్నికల కార్యాచరణ ప్రారంభం: రేవంత్‌రెడ్డి
- ఐక్యంగా ముందుకెళ్లాలని అధిష్టానం సూచించిందన్న నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న మాణిక్‌రావ్ ఠాక్రే. చిత్రంలో జీవన్‌రెడ్డి, ఉత్తమ్, రేణుకాచౌదరి, రేవంత్‌రెడ్డి, వీహెచ్, షబ్బీర్ అలీ తదితరులు

సాక్షి, న్యూఢిల్లీ: ''మహారాష్ట్ర సహా ఇతర ప్రాంతాల్లో ఎక్కడైతే కాంగ్రెస్ బలంగా ఉందో అక్కడ కేసీఆర్ సమావేశాలు పెట్టి బీజేపీకి మద్దతు ఇస్తున్నారు. ఎక్కడికి వెళ్లినా కాంగ్రెస్‌కు నష్టం చేకూర్చాలని, బీజేపీకి ప్రయోజనం చేకూర్చాలనే ప్రచారం చేస్తున్నారు. అందరం కలసి బీఆర్ఎస్‌ను ఓడించాల్సిన అవసరం ఉంది''అని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ కుటుంబం లూటీ చేసిందని ఆరోపించారు. మంగళవారం ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌లతో భేటీ అనంతరం టీపీసీసీ నేతలతో కలసి ఠాక్రే మీడియాతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో ఎలా ముందుకెళ్లాలనే అంశంపై సమావేశంలో చర్చించామని.. జాతీయ నేతలు రాష్ట్ర నేతలతో ముఖాముఖి మాట్లాడి వారి అభిప్రాయాలు తీసుకున్నారని వెల్లడించారు. అనంతరం రాష్ట్రంలో సమస్యలేమిటి? ఏయే అంశాలపై దృష్టి పెట్టాలో దిశానిర్దేశం చేశారని చెప్పారు. తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్నారని.. వారంతా కాంగ్రెస్ వైపు చూస్తున్నారని, కాంగ్రెస్ వస్తే అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందుతాయని ప్రజలు భావిస్తున్నారని పేర్కొన్నారు.

కలసికట్టుగా ముందుకు వెళ్లేలా..: రేవంత్‌రెడ్డి

వచ్చే ఎన్నికలకు ఎలా ముందుకెళ్లాలి, కలసికట్టుగా ఎలా పోరాటం చేయాలనే దానిపై అధిష్టానం పెద్దలతో చర్చించామని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో బూత్‌స్థాయి నుంచీ పార్టీ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టి ఎన్నికలకు సన్నద్ధం కావాలని నిర్ణయించామన్నారు. కేసీఆర్ పాలనలో అవినీతి పెచ్చరిల్లిందని, అవినీతి ఆకాశంలో–అభివృద్ధి పాతాళంలో ఉన్నాయని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్‌ను గద్దె దించే కార్యాచరణ ప్రారంభమైందన్నారు. కర్ణాటకలో ఏ వ్యూహంతో ముందుకెళ్లామో అదే పదునైన వ్యూహంతో రాష్ట్రంలో ముందుకెళ్లాలని.. కర్ణాటకలో పాటించిన మౌలిక సూత్రాలనే ఇక్కడా పాటించాలని జాతీయ నేతలు సూచించారని వెల్లడించారు. త్వరలోనే కాంగ్రెస్ ఎన్నికల కార్యాచరణను వెల్లడిస్తామని చెప్పారు.

పార్టీలో 'గ్యాప్'ను పూర్తి చేసుకునేలా..

రాష్ట్ర నేతలంతా ఐకమత్యంగా ముందుకెళ్లాలని, గ్యాప్‌ను పూర్తి చేసుకోవాలని అధిష్టానం పెద్దలు సూచించారని ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. టికెట్ల కేటాయింపు ప్రక్రియ పూర్తి చేయాలన్న అంశంపై చర్చ జరిగిందన్నారు. ఇక కర్ణాటకలో మాదిరిగా అంతా కలసికట్టుగా పనిచేసి తెలంగాణలో అధికారంలోకి రావాలన్నది అధిష్టానం యోచన అని వీహెచ్ తెలిపారు. రాష్ట్రంలో అవినీతిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరానన్నారు. పార్టీ, ప్రభుత్వంలో ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు సముచిత స్థానం ఇవ్వాలని నిర్ణయించామని షబ్బీర్‌అలీ తెలిపారు. బీఆర్ఎస్‌తో రాష్ట్రంలో, కేంద్రంలో ఎలాంటి పొత్తు ఉండబోదని రాహుల్‌గాంధీ స్పష్టం చేశారని ఏఐసీసీ కార్యదర్శి మధుయాష్కీ వెల్లడించారు. పార్టీలో భిన్నాభిప్రాయాలు సహజమని, అంతకుమించి నేతల మధ్య జగడాలేమీ లేవని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ చెప్పారు.

జగ్గారెడ్డి.. రాహుల్‌తో పర్సనల్‌గా..

- ఏఐసీసీ కార్యాలయం నుంచి ఇంటి వరకు రాహుల్‌తో కలసి వెళ్లిన ఎమ్మెల్యే
- ఏం మాట్లాడానో మీడియాకు చెప్పబోనంటూ దాటవేత



ఢిల్లీలో రాహుల్ గాంధీతో ఎమ్మెల్యే జగ్గారెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: సొంత పార్టీ నేతల తీరుపై గుర్రుగా ఉన్న కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్యే జగ్గారెడ్డి మంగళవారం ఢిల్లీలో జరిగిన సమావేశానికి ముందు, తర్వాత హల్‌చల్ చేశారు. భేటీకి ముందు ఏపీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై పరోక్షంగా విమర్శలు చేశారు. ఉత్తమ్‌ను, తనను, ఇతర నాయకులను కొందరు టార్గెట్ చేస్తున్నారని వ్యాఖ్యానించారు. రాహుల్‌గాంధీ సూచన మేరకే సైలెంట్‌గా ఉన్నానని, ఈ రోజు ఆయనకు అన్నీ చెప్తానని పేర్కొన్నారు. అన్నట్టుగానే.. భేటీ తర్వాత వ్యక్తిగతంగా మాట్లాడాలని రాహుల్ గాంధీని కోరారు. దీనికి అంగీకరించిన రాహుల్.. జగ్గారెడ్డి చేయి పట్టుకుని ఏఐసీసీ కార్యాలయం నుంచి పక్కనే ఉన్న సోనియా నివాసం 10 జన్‌పథ్‌లోని లోపలి గేటు వరకు తీసుకెళ్లారు. ఈ సమయంలోనే వారు మాట్లాడుకున్నారు. పార్టీలోని కొందరు నేతలు తనపట్ల వ్యవహరిస్తున్న తీరును వివరించగా.. అన్నీ తాను చూసుకుంటానని, పార్టీ విజయం కోసం కృషి చేయాలని జగ్గారెడ్డికి రాహుల్ సూచించినట్టు తెలిసింది. తర్వాత జగ్గారెడ్డి అక్కడి నుంచి తిరిగి వస్తూ.. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తోనూ మాట్లాడారు. అయితే రాహుల్‌తో ఏం మాట్లాడారని మీడియా ప్రశ్నించగా.. ఆ విషయాలేవీ మీడియాకు చెప్పబోనంటూ వెళ్లిపోయారు.

చేయి దాటితే వేటే..

▶ మొదటి పేజీ తరువాయి

ప్రధానంగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ స్పందిస్తూ.. ''కాంగ్రెస్ ఉమ్మడి కుటుంబం వంటిది. అప్పుడప్పుడు సమస్యలు, భేదాభిప్రాయాలు వస్తాయి. దానికే రచ్చకెక్కడం, మీడియాకు ఎక్కడం మంచి పద్ధతి కాదు. దీనిపై మాకు అనేక ఫిర్యాదులు ఉన్నాయి. ఇకముందు విభేదాలపై ఎవరూ బయట మాట్లాడొద్దు. ఏదైనా నాతో, ఖర్గేతో లేకుంటే కేసీ వేణుగోపాల్‌తో మాట్లాడండి. అలాకాకుండా మీడియాకు ఎక్కితే కఠిన చర్యలుంటాయి..'' అని స్పష్టం చేశారు. నేతలు ఐక్యంగా ఉంటే బీఆర్ఎస్‌ను ఢీకొట్టడం కష్టమేమీ కాదన్నారు. ఈ సందర్భంగా కర్ణాటక ఎన్నికల్లో అనుసరించిన విధానాలను, అక్కడి నేతల పనితీరును రాహుల్ గాంధీ వివరించారు. పార్టీ నేతలెవరూ అభ్యర్థులను ప్రకటించడానికి వీల్లేదని.. హైకమాండ్ ప్రకటించే అభ్యర్థులే ఫైనల్ అని, అప్పటి వరకు వేచి ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. కర్ణాటక తరహాలోనే వీలున్నంత ముందుగా అభ్యర్థులను ప్రకటించేందుకు కసరత్తు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలే ఎజెండాగా ముందుకు సాగాలని, ఆ దిశలో కసరత్తు చేయాలని సూచించారు. ముఖ్యంగా ఓబీసీల కులగణన అనేది కాంగ్రెస్ పార్టీ విధానమని, ఈ విషయాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆదేశించారు. రాష్ట్రంలో బీసీ వర్గాలకు రాజకీయంగా ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు.

అవినీతిపై పోరు.. మేనిఫెస్టోపై హోరు..

భేటీలో పాల్గొన్న చాలామంది నేతలు బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతి అంశాన్ని ప్రస్తావించగా.. ఒక్కో శాఖలో అవినీతిపై బలంగా పోరాటం చేయాలని, వివిధ మీడియాల ద్వారా ఈ అంశాన్ని ప్రజలకు వివరించాలని అధిష్టానం పెద్దలు సూచించారు. దీనితోపాటు పార్టీ మేనిఫెస్టో అంశాలను బహిరంగ సభల ద్వారా ఇప్పటికే వెల్లడించిన దృష్ట్యా.. అవి గడపగడపకూ చేరేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఇక ముందస్తుగా అభ్యర్థుల ప్రకటనపై చర్చజరగగా.. జూలై నెలలోనే 60 మందికిపైగా అభ్యర్థులను ప్రకటించేందుకు కసరత్తు చేస్తున్నట్టుగా అధిష్టాన పెద్దలు వెల్లడించినట్టు సమాచారం. సర్వేల ఆధారంగానే ఈ టికెట్ల పంపిణీ ఉంటుందని పేర్కొన్నట్టు తెలిసింది. మరోవైపు భట్టి విక్రమార్క పాదయాత్ర ముగింపు సభ, మాజీ ఎంపీ పొంగులేటి చేరిక సభ ఒక్కటిగానే జూలై 2న నిర్వహించాలని నిర్ణయించినట్టు సమాచారం.

భేటీ అంశాలపై నేతల మౌనం

అధిష్టానం పెద్దలతో భేటీ అంశాలపై బహిరంగంగా మాట్లాడేందుకు రాష్ట్ర నేతలెవరూ ముందుకు రాలేదు. మీడియాకు ఎక్కొద్దన్న రాహుల్ సూచన నేపథ్యంలో చాలామంది నేతలు భేటీ ముగియగానే ఏఐసీసీ కార్యాలయం నుంచి వెళ్లిపోయారు. ఠాక్రే, రేవంత్ సహా కొందరు నేతలే మీడియా సెంటర్‌లో మాట్లాడి భేటీ వివరాలు వెల్లడించారు. భేటీ అనంతరం రాహుల్ గాంధీ ట్వీట్ చేస్తూ 'తెలంగాణ ప్రజలు రాష్ట్రంలో మార్పు కోరుంటున్నారు. త్వరలోనే ప్రగతిశీల నాయకత్వానికి బాటలు వేస్తారు' అని పేర్కొన్నారు. కాగా ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్‌ఠాక్రే, పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, ఎంపీలు ఉత్తమ్, కోమటిరెడ్డి, ఎమ్మెల్యేలు జగ్గారెడ్డి, శ్రీధర్‌బాబు, సీతక్క, పొదెం వీరయ్య, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, సీనియర్ నేతలు జానారెడ్డి, దామోదర రాజనర్సింహ, రేణుకాచౌదరి, బలరాం నాయక్, వీహెచ్, మహేశ్ కుమార్‌గౌడ్, చిన్నారెడ్డి, వంశీచంద్‌రెడ్డి, ఎన్నికల వ్యూహకర్త సునీల్ కనుగోలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తో ముఖాముఖి పోరు..

రాష్ట్రంలో బీఆర్ఎస్‌తో ముఖాముఖి పోరు ఉంటుందని, కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా పోరాడాలని అధిష్టానం పెద్దలు రాష్ట్ర నేతలకు మరోసారి స్పష్టత ఇచ్చారు. బీజేపీకి బీఆర్ఎస్ దగ్గరైందని, ఢిల్లీ లిక్కర్ స్కాంలో కవిత అరెస్టు కాకుండా సయోధ్య కుదిరిందని.. కేంద్ర మంత్రులతో మంత్రి కేటీఆర్ వరుస భేటీలు అందుకేనని, ఈ అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ''బీఆర్ఎస్‌తో ఎలాంటి పొత్తు ఉండదని ఖర్గే, రాహుల్ స్పష్టంగా చెప్పారు. జాతీయ స్థాయి ప్రతిపక్ష కూటమిలోనూ బీఆర్ఎస్‌ను భాగస్వామ్యం చేయబోమన్నారు. 'త్యాగం కాంగ్రెస్‌ది, భోగం బీఆర్ఎస్‌ది' అన్న నినాదంతో ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. పొత్తుల విషయంలో బీఆర్ఎస్ కానీ, బీజేపీ కానీ చేసే తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని ప్రజలకు వివరించాలన్నారు..'' అని భేటీ అనంతరం టీపీసీసీ నేతలు వెల్లడించారు.

తెలంగాణలో బీఆర్ఎస్ ఓటమిపైనే చర్చ

- కేసీఆర్ ప్రజల చేతిలో చిక్కి మాయమవడం ఖాయం
- సర్వేలకు అందని అనూహ్య ఫలితాలొస్తాయి...
- నాకు ప్రజలే రక్షణ: బీజేపీ నేత ఈటల



మీడియాతో మాట్లాడుతున్న ఈటల

సాక్షి, హైదరాబాద్: వచ్చే ఎన్నికల్లో సీఎం కేసీఆర్ ప్రజల చేతిలో చిక్కి మాయం కావడం ఖాయమని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. విపక్షాలు ఉండకూడదని అన్ని పార్టీలలో కేసీఆర్ గందరగోళం సృష్టిస్తున్నారని, ప్రజాతీర్పును, పార్టీలను, నాయకులను ఖతం చేసే చర్యలకు పాల్పడుతున్నారని ఆయన మండిపడ్డారు. అయితే కేసీఆర్ పాలనపై వ్యతిరేకత వ్యక్తమవుతుండటంతో తెలంగాణలో బీఆర్ఎస్‌కు ఈసారి ఓటమి తప్పదన్న చర్చే సాగుతోందన్నారు. ప్రజలందరూ కేసీఆర్‌ను ఓడించాలని అనుకుంటున్నారని ఈటల వ్యాఖ్యానించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, బీఆర్ఎస్‌ను ఓడించేది బీజేపీనేనని, వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో ఎగిరేది బీజేపీ జెండానేనని చెప్పారు. ఇంకా ఆరు నెలల సమయం ఉందని, తెలంగాణ లో ప్రత్యేక వ్యూహంతో బీజేపీ ముందుకెళుతోందన్నారు. సర్వే సంస్థల అంచనాలకు అందని రీతి లో తెలంగాణ అసెంబ్లీ ఫలితాలు ఉండబోతున్నాయన్నారు. కేసీఆర్ పాలనలో తమ ఆత్మగౌ రవం పోయిందని వీఆర్ఏ నుంచి కలెక్టర్ దాకా కానిస్టేబుల్ నుంచి ఎస్పీ దాకా వాపోతున్నారన్నారు. 'ధరణి పేరుతో పేదల భూములను మాయం చేశారు. ఎస్సీ ఎస్టీ అసైన్డ్ భూములకు పట్టాలివ్వలేదు. అవన్నీ కేసీఆర్ అనుచరులు ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా చెప్పినట్టు పార్టీ అధికారంలోకి వచ్చాక ధరణిపై చర్యలుంటాయని చెప్పారు.

నాకు రక్షణ ప్రజలే...

తనను హత్య చేయించేందుకు రూ.20 కోట్లు ఖర్చు చేసేందుకు వెనుకాడని కుట్రపై ఈటల స్పందించారు. కొన్నినెలలుగా జాగ్రత్తగా ఉండాలంటూ తనకు హెచ్చరికలొస్తున్నాయని, ఈ బెదిరింపులకు భయపడే వ్యక్తిని కానని అన్నారు. నేను ప్రజల్లో ఉండే వాడిని.. నాకు రక్షణ కల్పించేది పోలీసులు కాదు.. ప్రజలు. నన్ను చంపేందుకు రూ. 20 కోట్లు సుపారీ ఇచ్చామని వారే చెప్తున్నారు. అయినా..నా జాతి భయపడే జాతి కాదు. ఉద్యమకారుడిని నేను. గుండెల నిండా ఆత్మగౌరవంతో బతుకుతాను తప్ప ఎవరికీ భయపడేది లేదు'అని స్పష్టం చేశారు.

పదవి ఆశించి బీజేపీలోకి రాలేదు..


బట్టలు మార్చినంత సులభంగా తాను పార్టీ మారనని మరో ప్రశ్నకు ఈటల బదులిచ్చారు. 'నేను టీఆర్ఎస్ నుంచి మారలేదు. 20 ఏళ్లు పార్టీ కోసం పనిచేశాక పనికి రావంటూ వారే బయటికి వెళ్లగొట్టారు. బీజేపీ నన్ను అక్కున చేర్చుకుంది. నేను ఏ పదవీ ఆశించి బీజేపీకి రాలేదు. పార్టీలో నేను అసంతృప్తితో లేను. జీవితంలో పార్టీలు మారడం అంటే చాలా పెద్ద విషయం. పార్టీలన్నప్పుడు భేదాభిప్రాయాలు సహజం. కేసీఆర్‌ను ఓడించడమే నా లక్ష్యం. బీఆర్ఎస్‌తో నాకు పంచాయితీ లేదు. నన్ను వెళ్లగొట్టిన రోజు కేసీఆర్ కుటుంబసభ్యులు కూడా బాధపడి ఉంటారు'అని ఆయన వ్యాఖ్యానించారు.

ఈటలకు 'వై' కేటగిరీ భద్రత!

బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు 'వై'కేటగిరీ భద్రతను కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. ఈటలను రాష్ట్ర ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్ లేదా మరేదైనా ముఖ్యమైన పదవిలో త్వరలోనే నియమించాలని బీజేపీ జాతీయ నాయకత్వం నిర్ణయించిన నేపథ్యంలో దీనికి ప్రాధాన్యత ఏర్పడింది. ఈటలను అంతమొందించేందుకు రూ.20 కోట్లకు సుపారీ ఇచ్చారన్న వార్తల దృష్ట్యా ఆయనకు కేంద్ర బలగాల భద్రత కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలుస్తోంది. దీనికి సంబంధించి రెండు, మూడు రోజుల్లోనే ఉత్తర్వులు వెలువడే అవకాశముందని, ఈ మేరకు కేంద్ర హోంమంత్రిత్వశాఖ ఈటల కుటుంబానికి మంగళవారం సమాచారం అందించిందని పార్టీ వర్గాలు తెలిపాయి.


ఈటల హత్యకు కౌశిక్‌రెడ్డి కుట్ర

- ఈటల జమున సంచలన ఆరోపణలు
- కేసీఆర్‌ను భూస్థాపితం చేసేందుకు ప్రజలు ఓటుతో సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్య



సాక్షి, హైదరాబాద్: బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్‌ను హత్యచేయించే కుట్ర జరుగుతోందని ఆయన సతీమణి జమున సంచలన ఆరోపణలు చేశారు. ఈటలను రూ.20 కోట్లు ఖర్చు పెట్టి చంపించేందుకు రెడీగా ఉన్నట్టు, ఆయన ఇక ఎమ్మెల్యేగా ఎలా ఉంటాడంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి అన్నట్టు తెలిసిందన్నారు. వ్యతిరేకించే వారు ఎవరున్నా చంపించడమేనా ప్రజాస్వామ్యం, రూ.20 కోట్లు ఇచ్చి చంపిస్తామంటే దాని వెనక ఎవరున్నట్టు అని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ చెబితేనే కదా కౌశిక్‌రెడ్డి అలా మాట్లాడతారని ఆమె ఆరోపించారు. తెలంగాణను అప్పుల పాలు చేసి లక్షల కోట్లు సంపాదించిన కేసీఆర్, తనను వ్యతిరేకించే వారిని, చెప్పినట్టు వినని వారిని ఒక్కొక్కరిని కోట్ల రూపాయలు పెట్టి చంపించేందుకు రెడీగా ఉన్నారా అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మంగళవారం తమ నివాసంలో మాజీ ఎమ్మెల్యే భిక్షపతి, తుల ఉమ, ముదిరాజ్ సంఘం నాయకులతో కలిసి జమున మీడియాతో మాట్లాడుతూ, తన భర్త ఈటల, పిల్లల్లో ఎవరి రక్తం బొట్టు చిందినా అందుకు సీఎం కేసీఆరే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో ఈటలను గెలిపించారని, దీంతో చిల్లర రాజకీయాలు చేస్తూ ఒక దిగజారిన వ్యక్తిని ఎమ్మెల్సీని చేశారని చెప్పారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్‌ను ప్రజలు ఓటుతో భూస్థాపితం చేసేందుకు సిద్ధంగా ఉన్నారని జమున చెప్పారు. మీడియా ప్రతినిధులు వేసిన వివిధ ప్రశ్నలకు ఆమె బదులిస్తూ...ప్రజలు అనుకుంటే కేసీఆర్‌ను ఓడించడం సాధ్యమన్నారు. ప్రజలు కళ్లు తెరవాలని, ఈ దుర్మార్గ ప్రభుత్వాన్ని మహిళలందరం కలిసి ఇంటికి పంపిద్దామని పిలుపునిచ్చారు.

ఓటమి భయంతోనే ఈటల దంపతుల విమర్శలు



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి ఖాయమని సర్వేల్లో తేలడంతోనే హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ తనపై ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ శాసనసభా పక్షం కార్యాలయంలో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ, ఈటల రాజేందర్ దంపతులు తనపై చేసిన విమర్శలను ఖండించారు. మున్సిపాలిటీ తీర్మానంతో పాటు ఈటల రాజేందర్ ఆమోదంతో హుజూరాబాద్ అమరవీరుల స్మారక స్తూపాన్ని కొత్తగా నిర్మించారన్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా కూల్చిన పాత స్తూపానికి శిలాఫలకం కూడా లేదని, ఉద్దేశపూర్వకంగానే ఈ అంశాన్ని ఈటల వివాదాస్పదం చేస్తున్నారని చెప్పారు. రూ.20 కోట్లతో ఈటలను హత్య చేసేందుకు ప్రణాళిక చేశానంటూ నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, హత్యా రాజకీయాలు ఆయనకే తెలుసని కౌశిక్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ముదిరాజ్ కులాన్ని ఈటల భార్య జమున చిన్నచూపు చూస్తున్నారనేందుకు ఆమె చేసిన వ్యాఖ్యలే నిదర్శనమని పేర్కొన్నారు. తనపై వచ్చిన ఆరోపణలకు హుజూరాబాద్‌లో బహిరంగ చర్చకు సిద్ధమని, ఈటల రాజేందర్‌ను ఓడించే వరకు విశ్రమించేది లేదన్నారు. వందల కోట్ల రూపాయల అధిపతిగా మారిన ఈటల రాజేందర్ దళితులు, బీసీ, గిరిజనుల భూములు లాక్కున్నారని కౌశిక్‌రెడ్డి ఆరోపించారు.

క్లుప్తంగా...

నేటినుంచి ఎంసెట్ ఆప్షన్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించే ఎంసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలైంది. ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు బుధవారం నుంచి ఆప్షన్లు ఇచ్చుకోవచ్చని టీఎస్ ఎంసెట్ విభాగం తెలిపింది. ఉస్మానియా, జేఎన్‌టీయూహెచ్, కాకతీయ యూనివర్సిటీల పరిధిలో మొత్తం 155 కళాశాలల్లో 80,091 ఇంజనీరింగ్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. తొలి విడత కౌన్సెలింగ్‌లో 62,079 సీట్లు అందుబాటులో ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఏయే కళాశాలల్లోని ఏ బ్రాంచీల్లో ఉన్న సీట్ల వివరాలను ఎంసెట్ విభాగం పొందుపరిచింది. వీటిని బట్టి ఆప్షన్లు ఇచ్చుకోవచ్చని తెలిపింది.

స్టడీసర్కిల్ దరఖాస్తుల గడువు 2 వరకు

వచ్చేనెల 9న రాత పరీక్ష

సాక్షి, హైదరాబాద్: షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖకు చెందిన రాష్ట్ర స్టడీసర్కిల్‌లో సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ (పది నెలల రెసిడెన్షియల్) కోచింగ్‌కు దరఖాస్తు చేసుకునేందుకు జూలై 2వ తేదీ తుదిగడువని స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీధర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 2,300 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. అందులో అత్యధికంగా 174 నల్లగొండ జిల్లా నుంచి, అతి తక్కువగా 23 దరఖాస్తులు మేడ్చల్ నుంచి వచ్చాయన్నారు. రాత పరీక్షను హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్‌లో వచ్చే నెల 9న నిర్వహిస్తామని తెలిపారు. మొత్తం 100 సీట్లలో 75 సీట్లు షెడ్యూల్డ్ కులాల వారికి, 15 సీట్లు వెనుకబడిన తరగతుల వారికి, 10 సీట్లు షెడ్యూల్డ్ తెగల వారికి కేటాయించామన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుకు www.tsstudycircle.co.in చూడాలని శ్రీధర్ తెలిపారు.

ఇక ఔటర్‌పై దూసుకెళ్లొచ్చు

గరిష్ట వేగం 100 నుంచి 120 కి.మీ.లకు పెంపు ● హెచ్‌ఎండీఏ కమిషనర్ అర్వింద్‌కుమార్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ఔటర్ రింగురోడ్డుపై వాహనాల గరిష్ట వేగం పెరిగింది. హైదరాబాద్ చుట్టూ ఉన్న 158 కిలోమీటర్ల ఔటర్ మార్గంలో ఇప్పటివరకు వాహనాలకు గంటకు 100 కిలోమీటర్ల వరకే గరిష్టవేగానికి అనుమతి ఉండగా, తాజాగా 100 నుంచి 120 కిలోమీటర్లకు గరిష్ట వేగాన్ని పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ వివిధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన అనంతరం వేగాన్ని పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు హెచ్‌ఎండీఏ కమిషనర్ అర్వింద్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ట్విటర్ ద్వారా ఆయన వెల్లడించారు. ఇందుకనుగుణంగా రహదారి భద్రతా చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు ఔటర్ రింగ్‌రోడ్డు డిజైనింగ్ ప్రకారం వాహనాలు 120 కిలోమీటర్ల గరిష్ట వేగంతో వెళ్లవచ్చునని హెచ్‌ఎండీఏ ఉన్నతాధికారులు తెలిపారు. గతంలో కొన్ని చోట్ల చిన్నచిన్న మరమ్మతుల కారణంగా 100 కిలోమీటర్లకు తగ్గించినట్లు చెప్పారు. ప్రస్తుతం ఔటర్ అన్ని విధాలుగా 120 కిలోమీటర్ల గరిష్ట వేగానికి అనుకూలంగా ఉందన్నారు. ఈ మేరకు ఔటర్‌పైన సైన్‌బోర్డులను కూడా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

...అప్రమత్తంగా ఉండండి

▶ మొదటి పేజీ తరువాయి

విభాగాల అధికారులతో మంగళవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పురపాలికలతోపాటు హైదరాబాద్‌లో తలెత్తే ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. వర్షాల కారణంగా ప్రాణ నష్టం జరగకుండా చూడటమే అధికారుల ప్రథమ ప్రాధాన్యత అని, ఆ దిశగా యంత్రాంగం పనిచేయాలని మంత్రి సూచించారు. ఈ సందర్భంగా జీహెచ్‌ఎంసీ చేపట్టిన ఎస్‌ఎన్‌డీపీ ప్రాజెక్టు పనుల పురోగతిని ఆరా తీశారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాలలో అవసరమైన డీవాటరింగ్ పంపులు, ఇతర ఏర్పాట్లు చేసుకుని సన్నద్ధంగా ఉండాలని మంత్రి కేటీఆర్ అధికారులను ఆదేశించారు. నగరవ్యాప్తంగా ప్రారంభించిన వార్డు కార్యాలయాల పనితీరుపైన మంత్రి కేటీఆర్ ఈ సమావేశంలో ప్రత్యేకంగా చర్చించారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయాల వ్యవస్థ ప్రారంభ దశలోనే ఉన్నదని, ఈ దశలో ఎదురయ్యే సవాళ్లను ఎప్పటికప్పుడు పరిష్కరించుకుంటూ ముందుకు పోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ పలువురు నగర పౌరులతో ఫోన్లో మాట్లాడి సమస్యలు, వాటి పరిష్కారం జరిగిన తీరు అడిగి తెలుసుకున్నారు.

నాలుగేళ్ల బీఈడీ వచ్చేసింది

నోటిఫికేషన్ విడుదల
- డిగ్రీ ప్లస్ బీఈడీ ఒకేసారి
- తెలంగాణలో 250 సీట్లు
- జూలై 19 వరకూ దరఖాస్తులు

కాలేజీ	కోర్సు	సీట్లు
మౌలానా ఆజాద్ ఉర్దూ యూనివర్సిటీ రాజేంద్రనగర్, రంగారెడ్డి	బీకాం–బీఈడీ	50
	బీఎస్సీ–బీఈడీ	50
	బీఏ–బీఈడీ	50
గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ		
లక్సెట్టిపేట, మంచిర్యాల జిల్లా	బీఏ–బీఈడీ	50
వరంగల్ నిట్	బీఎస్సీ–బీఈడీ	50



ముఖ్యమైన తేదీలు

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ ఫీజు చెల్లింపుతో..	19.7.2023
డేటా కరెక్షన్ అవకాశం	20–21.7.2023
పరీక్ష తేదీ	తర్వాత ప్రకటిస్తారు
హాల్ టికెట్ల డౌన్‌లోడ్	పరీక్షకు మూడు రోజుల ముందు
దరఖాస్తు చేసుకోవాల్సిన వెబ్‌సైట్లు	www.nta.ac.in, https://neet.samarth.ac.in/

సాక్షి, హైదరాబాద్: సమీకృత బీఈడీ కోర్సులు ఈ ఏడాది నుంచే ప్రారంభం కానున్నాయి. ఇంటర్ తర్వాత ఒకే సమయంలో డిగ్రీ, బీఈడీ కలిపి పూర్తి చేయవచ్చు. ఈ కోర్సు కాలపరిమితి నాలుగేళ్లు ఉంటుంది. సాధారణంగా బీఈడీ చేయాలంటే మూడేళ్ల డిగ్రీ పూర్తి చేసి, రెండేళ్ల బ్యాచ్‌లర్ ఆఫ్ ఎడ్యుకేషన్ కోర్సు చేయాలి. దీనికి మొత్తం ఐదేళ్లు పడుతుంది. కొత్త విధానం వల్ల నాలుగేళ్లలోనే పూర్తి చేసే వీలుంది. జాతీయ విద్యా విధానం–2020లో భాగంగా తీసుకొచ్చిన ఈ కోర్సును జాతీయ స్థాయిలో పలు కళాశాలల్లో ప్రవేశపెడుతున్నారు. వీటిలో ప్రవేశానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) రాత పరీక్ష నిర్వహిస్తుంది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను సోమవారం అర్ధరాత్రి ఎన్‌టీఏ విడుదల చేసింది. తెలంగాణలో మూడు విద్యా సంస్థలకు నాలుగేళ్ల బీఈడీ కోర్సు నిర్వహించేందుకు అనుమతి లభించింది. మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ, వరంగల్ ఎన్ఐటీ, మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఈ జాబితాలో ఉన్నాయి. వీటిలో 250 సీట్లు ఉంటాయి. తెలుగు సహా మొత్తం 13 భాషల్లో ఉమ్మడి ప్రవేశ పరీక్ష రాయవచ్చని ఎన్‌టీఏ పేర్కొంది. ఆధునిక విద్యా బోధనకు అనుగుణంగా సమీకృత బీఈడీ కోర్సును ఎన్‌సీఈఆర్‌టీ రూపొందించింది. విద్యార్థి మానసిక ధోరణి, ఆన్‌లైన్, డిజిటల్ విద్యా బోధనతో పాటు సరికొత్త మెలకువలతో ఎలా బోధించాలన్న అంశానికి ఈ కోర్సులో అత్యధిక ప్రాధాన్యమిస్తారు. తరగతి గదిలో పాఠాల కన్నా, అనుభవం ద్వారా నేర్చుకునే రీతిలో పాఠ్య ప్రణాళిక రూపొందించినట్టు అధికారులు చెబుతున్నారు.

ప్రవేశ పరీక్ష ఇలా..

ఇంటర్ తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు ఈ ప్రవేశ పరీక్ష రాయాల్సి ఉంటుంది. పన్నెండో తరగతి, ఇంటర్ సిలబస్‌లోంచి ప్రశ్నలు ఇస్తారు. మొత్తం 160 బహుళ ఐచ్ఛిక ప్రశ్నలుంటాయి. జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ, లాజికల్ అండ్ అనలిటికల్ రీజనింగ్, టీచింగ్ ఆప్టిట్యూడ్ నుంచి ప్రశ్నలు ఇస్తారు. ఎన్‌సీఈఆర్‌టీ ప్రశ్నపత్రాన్ని రూపొందిస్తుంది. తెలంగాణలో మూడు కళాశాలల్లో ఇంటిగ్రేటెడ్ బీఈడీకి అనుమతించారు. వీటిలో మొత్తం 250 సీట్లు ఉన్నట్టు ఎన్‌టీఏ తెలిపింది.

ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలకు శిక్షణ

అమెరికా విదేశాంగ శాఖ ఆర్థిక సాయం

సాక్షి, హైదరాబాద్:మహిళ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నైపుణ్య శిక్షణ కార్యక్రమం 'అకాడమీ ఫర్ విమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ ప్రోగ్రామ్'కు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్ జనరల్ కార్యాలయం మంగళవారం విజ్ఞప్తి చేసింది. అమెరికా విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆర్థిక సాయం అందిస్తున్న ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు తెలంగాణ, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఔత్సాహిక మహిళ పారిశ్రామికవేత్తలు అర్హులు. ఆసక్తిగలవారు జూన్ 30వ తేదీలోగా https:// awe.kiitincubator.in వెబ్‌సైట్‌లోని దరఖాస్తు నింపి పంపాలని అమెరికన్ కాన్సులేట్ జనరల్ కార్యాలయం ఒక ప్రకటనలో కోరింది. మహిళా పారిశ్రామికవేత్తల వ్యాపారాభివృద్ధికి సంబంధించిన నైపుణ్యాలను ఈ కార్యక్రమం ద్వారా అందిస్తామని తెలిపింది. కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ 'టెక్నాలజీ బిజినెస్ ఇన్‌క్యుబేటర్స్ (కేఐఐటీ–టీబీఐ)' ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపింది. వరంగల్, భువనేశ్వర్, విశాఖపట్నం, తిరుపతి నగరాల నుంచి మొత్తం వందమంది ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలు పాల్గొనవచ్చని, ఒక్కో నగరం నుంచి గరిష్టంగా 25 మందికి ప్రవేశం ఉంటుందని స్పష్టం చేసింది.

వైద్యవిద్యలో 'నెక్స్ట్' లెవెల్

▶ మొదటి పేజీ తరువాయి

కోర్సు పూర్తయ్యేవారు ఈ పరీక్ష రాయాల్సి ఉంటుంది. నెక్స్ట్–1 తర్వాత ప్రాక్టికల్స్ ఉంటాయి. ఆ తర్వాత హౌస్‌సర్జన్ పూర్తిచేశాక నెక్స్ట్–2ను జూన్ మూడో వారం లేదా డిసెంబర్‌లో నిర్వహిస్తారు. నెక్స్ట్–2కు సప్లమెంటరీ పరీక్ష ఉంటుంది. ఏటా మార్చి లేదా సెప్టెంబర్‌లో నిర్వహిస్తారు. నెక్స్ట్–1ను దేశవ్యాప్తంగా కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) పద్ధతిలో నిర్వహిస్తారు. నెక్స్ట్–2 పూర్తిగా ప్రాక్టికల్ పరీక్షే. దీన్ని సంబంధిత ఆరోగ్య విశ్వవిద్యాలయాల ఆధ్వర్యంలో నిర్వహిస్తారు.

అర్హత కటాఫ్ 50 శాతం..

నెక్స్ట్–1 పరీక్షకు అర్హత కటాఫ్ 50% ఉంటుంది. అప్పుడు ఉత్తీర్ణత సాధించినట్లుగా పరిగణిస్తారు. ఇంటర్న్‌షిప్ ప్రారంభించడానికి అర్హులు. ఇంటర్న్‌షిప్ తర్వాత పీజీ సీట్లను కేటాయించడంలో నెక్స్ట్–1లో సాధించిన స్కోర్‌ను పరిగణలోకి తీసుకుంటారు. పీజీ ప్రవేశ ర్యాంకింగ్ కోసం నెక్స్ట్ పరీక్ష స్కోర్ మూడేళ్ల పాటు చెల్లుబాటు అవుతుంది. అయితే నెక్స్ట్–2 పరీక్ష పీజీ సీట్ల కేటాయింపునకు దోహదం చేయదు. ఇది అర్హత పరీక్ష మాత్రమే.

నాణ్యతను పెంచడమే లక్ష్యంగా...

అభివృద్ధి చెందిన దేశాల్లో మాదిరిగా వైద్యవిద్యలో నాణ్యతను పెంచడమే లక్ష్యంగా ఎన్‌ఎంసీ నెక్స్ట్ పరీక్షకు శ్రీకారం చుడుతోంది. జాతీయ స్థాయిలో ఏకీకృత పరీక్షను పెట్టడం ద్వారా దేశవ్యాప్తంగా ఒకే నాణ్యమైన వైద్యవిద్యను అందించాలని కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం విదేశాల్లో ఎంబీబీఎస్ పూర్తి చేసినవారికి ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్ ఎగ్జామ్ (ఎఫ్‌ఎంజీఈ) నిర్వహిస్తున్నారు. అందులో పాసైతేనే ఇండియాలో డాక్టర్‌గా రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి, ప్రాక్టీస్ చేయడానికి, ప్రభుత్వ వైద్య ఉద్యోగాల్లో చేరడానికి అనుమతి ఉంది. అయితే ఎఫ్‌ఎంజీఈ పరీక్ష ఎంతో కఠినంగా ఉండటంతో పరీక్ష రాసే వారిలో 20 శాతానికి మించి అర్హత సాధించలేకపోతున్నారు. దీంతో అనేకసార్లు ఈ పరీక్ష రాయాల్సి వస్తోంది. చాలా మంది అర్హత సాధించలేక ఇతరత్రా వృత్తుల్లో స్థిరపడిపోయినవారున్నారు. ఇప్పుడు వాళ్లు కూడా నెక్స్ట్ పరీక్ష రాయాల్సి ఉంటుంది. ఇది పాస్ కాకుంటే ఎంబీబీఎస్ పట్టా ఇవ్వరు. దేశంలో వైద్యవిద్యకు ఒకే పరీక్షగా, వైద్యవిద్యను క్రమబద్ధీకరించడానికి ఇది నిర్వహించాలన్నది ఎన్‌ఎంసీ ఉద్దేశమని చెబుతున్నారు.

వచ్చే నెల 28న మాక్ టెస్ట్...

నెక్స్ట్‌పై అవగాహనకు ఈ ఏడాది ఎంబీబీఎస్ చదివే విద్యార్థుల కోసం మాక్ టెస్ట్ నిర్వహించాలని ఎన్‌ఎంసీ నిర్ణయించింది. వచ్చే నెల 28న ఆ పరీక్ష నిర్వహిస్తారు. అందుకోసం బుధవారం (జూన్ 28) నుంచి దరఖాస్తు చేసుకోవాలని విద్యార్థులకు ఎన్‌ఎంసీ సూచించింది. నెక్స్ట్–1 మాక్ టెస్టును ఢిల్లీ ఎయిమ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. నెక్స్ట్–1ను ఎంబీబీఎస్ థియరీ పరీక్షకు బదులుగా నిర్వహిస్తున్నందున మూడు రోజులపాటు రోజు విడిచి రోజు ఈ పరీక్ష ఉంటుంది. మెడిసిన్ అలైడ్ సబ్జెక్టు పరీక్ష 3 గంటలపాటు నిర్వహిస్తారు. 120 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలుంటాయి. అలాగే సర్జరీ, అలైడ్ సబ్జెక్టుల నుంచి 120 ప్రశ్నలు 3 గంటలపాటు ఉంటుంది. ఓబీజీ 120 ప్రశ్నలు, మూడు గంటలు ఉంటుంది. పీడియాట్రిక్స్ పరీక్ష 60 ప్రశ్నలకు గంటన్నరపాటు ఉంటుంది. ఈఎన్‌టీ పరీక్షకు 60 ప్రశ్నలు... గంటన్నర సమయం ఉంటుంది. ఆఫ్తాల్మాలజీ పరీక్ష 60 ప్రశ్నలు... మూడు గంటలు ఉంటుంది. ఉదయం సాయంత్రం వేళల్లో పరీక్ష నిర్వహిస్తారు. నెక్స్ట్–2 పరీక్ష పూర్తిగా ప్రాక్టికల్ పరీక్ష మాత్రమే. క్లినికల్ ఎగ్జామినేషన్ ఉంటుంది. రోగులను పరీక్షించే పరీక్ష నిర్వహిస్తారు. కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పరీక్షిస్తారు. నెక్స్ట్ పరీక్షకు సంబంధించి కొంత గందరగోళం ఉందని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్‌ఎంసీకి లేఖ రాయాలని వర్సిటీ నిర్ణయించింది.



“శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడం ఒక బాధ్యత. లేదంటే మన మనసును స్థిరంగా, స్పష్టంగా ఉంచుకోవడం సాధ్యం కాదు.

– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 28 జూన్ 2023

కలసి సాగుదాం... ప్రగతి బాట!

సారూప్యం, సాన్నిహిత్యం రెండూ ఉన్న దేశాల మధ్య స్నేహగీతాలాపన సహజమే. చిరకాలం తర్వాత ఇరు ప్రభుత్వాల పెద్దలు మరోసారి పల్లవి అందుకున్నారంటే సంబంధాల పునరుద్ధరణతో పాటు బంధం మళ్ళీ బలపడుతోందని అర్థం. గత వారాంతంలో ఈజిప్టులో భారత ప్రధాని మోదీ జరిపిన పర్యటన అందుకు సాక్ష్యం. ఉభయ దేశాలూ తమ ద్వైపాక్షిక బంధాన్ని వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి పెంచుకోవడం విశేషమే. ఆ మేరకు 'చరిత్రాత్మక' ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఈజిప్టులో ప్రాథమిక వసతుల కల్పనలో, ముఖ్యంగా సూయజ్ కాలువ అథారిటీలో భారత పెట్టుబడులు సహా ఆర్థిక సహకారం పెంపుపై ఇరుపక్షాలూ చర్చించాయి. వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణలో ఒప్పందాలపై చేవ్రాలు చేశాయి. వెరసి, ఆఫ్రికా, పశ్చిమాసియాలలో భాగమైన జన సంఖ్యాక అరబ్బు దేశం ఈ ప్రాంతంలో భారత్‌కు కీలక భాగస్వామి కానుంది. ప్రతిగా దాని అవసరాలు తీర్చేందుకు భారత్ ముందుకు రావడంతో ఈ పర్యటన ఫలాలు ఉభయ తారకమే!

భారత ప్రధాని తాజా ఈజిప్ట్ పర్యటన అదాటునో, ఆలోచనా రహితంగానో జరిగింది కాదు. దాదాపు ఏడాది పైచిలుకుగా ఎన్నో లెక్కలతో చేపట్టిన వరుస చర్యల్లో ఇది ఒక భాగమనాలి. ద్వైపాక్షిక బంధాలున్నా అవి ఆశించినంతగా సత్తా చాటని వేళ గడచిన ఏడాది కాలంలో మన రక్షణ, విదేశాంగ మంత్రులు కైరో చుట్టివచ్చారు. ఈ ఏటి గణతంత్ర దినోత్సవ కవాతుకు ఈజిప్ట్ అధ్యక్షుడు భారత ప్రభుత్వ ముఖ్యఅతిథిగా ఢిల్లీకి విచ్చేశారు. దానికి కొనసాగింపు ఇప్పుడు మన ప్రధాని పర్యటన. గమనిస్తే– ఈజిప్టులో భారత ప్రధాని ఆఖరుసారిగా పర్యటించింది 1997లో. ఆ తర్వాత ఈ పాతికేళ్ళలో ప్రపంచం చాలా మారింది. ప్రచ్ఛన్న యుద్ధం కాలం నుంచి భౌగోళిక రాజకీయాలు కీలకంగా మారిన రోజులకు వచ్చాం. ఈ సమయంలో ఢిల్లీ, కైరోల భాగస్వామ్యం ఉభయులకూ లాభదాయకం. ప్రపంచంలో అయిదో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ భారత్, భారీస్థాయిలో అప్పుల్లో ఉన్న ఈజిప్టుకు ఎంతో అవసరమైన భాగస్వామి. మరోపక్క వాణిజ్యానికీ, భౌగోళికంగానూ కీలకమైన సూయజ్ కాలువను శాసించే ఈజిప్టుతో బంధం భారత్‌కూ లాభదాయకం.

క్రీస్తుపూర్వం నుంచే అతి ప్రాచీన నాగరకతల మధ్య ముడిపడిన బంధమిది. అప్పట్లోనే భారత ద్వీపకల్పానికి ఈజిప్టు ఓడలు వస్తే, ఈజిప్టు మమ్మీలను చుట్టడానికి వాడిన వస్త్రం, ఆ వస్త్రానికి అద్దిన నీలిమందు భారతదేశానివి అన్నది చరిత్ర. గడచిన శతాబ్దకాలంలోనూ మన మైత్రి బలమైనది. వలస పాలన అనంతరం స్వాతంత్ర్యం వచ్చిన మూడు రోజులకే ఈజిప్టుతో దౌత్య సంబంధాలు పెట్టుకున్న చరిత మనది. ఇక్కడ ప్రధాని నెహ్రూ, అక్కడ అధ్యక్షుడు నాజర్‌లతో మన స్నేహలత మరింత అల్లుకుంది. ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో అటు అమెరికా, ఇటు రష్యా కూటములు దేనిలోనూ చేరకుండా మనగలగవచ్చంటూ 1961లో అలీనోద్యమాన్ని నిర్మించి, మూడోప్రపంచ దేశాల్లో ఉత్సాహం ప్రోది చేసిన భారత, ఈజిప్టుల సామీప్యమూ గమనార్హం. ఈ చిరకాల స్నేహం ఇప్పుడు ద్వైపాక్షిక బంధం నుంచి బలమైన భాగస్వామ్యంగా కాంతులీనడం సంతోషదాయకం.

ప్రధాని మోదీ, ఈజిప్టు అధ్యక్షుడి మధ్య ఆంతరంగిక ముఖాముఖి సంభాషణ, మోదీకి ఈజిప్టు అత్యున్నత పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ ది నైల్' బహూకరణ, అంతర్జాతీయంగానూ మీద పడుతున్న మైనారిటీల ప్రతికూల ముద్రను చెరుపుకొనేలా 11వ శతాబ్దం నాటి చారిత్రక అల్ హకీం మసీదుకు మోదీ వెళ్ళడం, ప్రపంచపు ఏడు వింతల్లో ఒకటైన గాజా పిరమిడ్ల సందర్శన, ఈజిప్టు – పాలస్తీనాల్లో ఉంటూ మొదటి ప్రపంచ యుద్ధంలో పోరాడి కన్నుమూసిన భారతీయ సైనికుల స్మారకం వద్ద నివాళులు అర్పించడం... అలా ఈ పర్యటనలో ఆకర్షణీయ అంశాలు అనేకం. కొన్ని కైరోతో స్నేహం పంచేవి. గుజరాతీ దావూదీ బోహ్రాలు పునరుద్ధరించిన మసీదు సందర్శన లాంటి మరికొన్ని సొంతగడ్డపై మోదీకి ఓట్లు పెంచేవి. మొత్తానికి అధినేతలిరువురూ ప్రతిదీ ఉపయోగించుకున్నారు.

నిజానికి, ఈ ఏటి జీ–20 సదస్సుకు మనం 9 దేశాలను అతిథులుగా ఆహ్వానించగా, అందులో ఈజిప్ట్ ఒకటి. కానీ, మేలో శ్రీనగర్‌లో జరిగిన పర్యాటక అధికారుల సమావేశానికి కైరో దూరంగా ఉంది. ఫలితంగా పొరపొచ్చాలుంటే, అవన్నీ తాజా బంధాల పునరుద్ధరణతో సమసిపోతాయి. రక్షణ, ఆర్థిక సహకారం, విద్యా – వైజ్ఞానిక ఆదాన ప్రదానాలు, సాంస్కృతిక సంబంధాలనే నాలుగు స్తంభాలపై నిర్మించాల్సిన భాగస్వామ్యమిది. ఈజిప్టులోని భారతీయుల సంఖ్య 5 వేల లోపే కావచ్చు. అయితేనేం, మన హిందీ సినిమాలంటే కళ్ళింత చేసుకొని చూసే ఈజిప్ట్ వాసులు, వారి ఈజిప్షియన్ సంగీతాన్ని స్వరాల్లో జొప్పించే భారతీయ సంగీత దర్శకుల బంధం అవిస్మరణీయం.

ఈజిప్టుకు ఆరో అతిపెద్ద వాణిజ్య భాగస్వామి భారత్. కరోనా, ఉక్రెయిన్‌లో యుద్ధంతో ఆర్థిక వ్యవస్థ తలకిందులై, వసతుల పెంపులో కైరో నిదానించింది. ఇప్పుడిది మనకు సదవకాశం. సూయజ్ కాలువ ఆర్థిక మండలిని ఆసరాగా చేసుకుంటే ఆఫ్రికా, పశ్చిమాసియా, ఐరోపా విపణులకు చేరాలన్న భారత ప్రయత్నాలూ నెరవేరతాయి. చమురు, సహజవాయువు, రసాయన ఎరువుల్ని కైరో నుంచి దిగుమతి చేసుకుంటున్న మనం, గత జూన్‌లో తీవ్రకొరతలో పడ్డ ఆ దేశానికి గోధుమలు పంపినట్టే ఇకపైనా అవసరంలో అండగా నిలవాలి. భౌగోళిక రాజకీయాల్లో 'దక్షిణ ప్రపంచ' దేశాలవాణిగా మారాలన్న మన ఆకాంక్ష నెరవేరాలంటే, ప్రస్తుతం చైనా ఆర్థిక ప్రభావంలో ఉన్న ఈజిప్టును కలుపుకొని నడవడమే తెలివైన పని. తాజా పర్యటన అందుకు ఉత్ప్రేరకం.

రాజకీయ గాలివాటం మారనుందా?

విశ్లేషణ



రాహుల్ వర్మ

ఇటీవల దేశంలోని పదిహేను ప్రతిపక్ష పార్టీలు పట్నాలో సమావేశమై, రానున్న ఎన్నికల్లో అధికార బీజేపీని అడ్డుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టాయి. సార్వత్రిక ఎన్నికలకు ఏడాది కంటే తక్కువ సమయం ఉన్న నేపథ్యంలో థర్డ్ ఫ్రంట్ లేదా కాంగ్రెసేతర పక్షాలతో ప్రాంతీయ పార్టీల కూటమి ఏర్పడే అవకాశాలు దాదాపుగా లేవు. 'సహజ నేత' విషయంలో పట్టుబట్టబోమని ఇప్పటికే కాంగ్రెస్ సూచనప్రాయంగా స్పష్టం చేసింది. అయితే అధికార పక్షాన్ని ఎదుర్కొనేందుకు నమ్మదగ్గ సైద్ధాంతిక ఆలోచన మాత్రం ప్రతిపక్షాల వద్ద కరవైంది. పరిపాలన విషయంలోనూ ప్రత్యామ్నాయాన్ని చూపించాల్సి ఉంటుంది. బలమైన ప్రత్యర్థిగా ఎదగాలంటే భాగస్వామ్య పక్షాలన్నీ తమ బలాలు, బలహీనతలను క్షుణ్ణంగా అర్థం చేసుకోవాల్సి ఉంటుంది.

బిహార్ రాజధాని పట్నా వేదికగా జరిగిన పదిహేను ప్రతిపక్ష పార్టీల సమావేశానికి వర్తమాన రాజకీయ పరిస్థితుల్లో ప్రాముఖ్యత ఏర్పడింది. ఆమ్ ఆద్మీ పార్టీ వ్యక్తం చేసిన భిన్నాభిప్రాయాన్ని పక్కనపెడితే, ప్రతిపక్షాల సమావేశం సరైన దిశలోనే సాగిందని చెప్పాలి. అలాగే ఈ సమావేశంతో కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీల మధ్య వచ్చే ఎన్నికల్లో రాజకీయ అవగాహన, పొత్తు ఉండే అవకాశాలూ సన్నగిల్లాయి. అయితే పట్నా మీటింగ్‌తో మూడు విషయాలైతే స్పష్టమయ్యాయి. మొదటిది... సార్వత్రిక ఎన్నికలకు ఏడాది కంటే తక్కువ సమయం ఉన్న నేపథ్యంలో థర్డ్ ఫ్రంట్ లేదా కాంగ్రెసేతర పక్షాలతో ప్రాంతీయ పార్టీల కూటమి ఏర్పడే అవకాశాలు దాదాపుగా లేవు. ప్రతిపక్ష కూటమి ఏదైనా ఏర్పడాలంటే కాంగ్రెస్ పార్టీ కేంద్రంగానే జరగాలి. అప్పుడే భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని కూటమితో ధీటైన పోటీ సాధ్యం. రానున్న కొన్ని నెలల్లో రాజకీయ శక్తుల పునరేకీకరణ జరగనుంది.

రెండోది... పట్నా సమావేశానికి హాజరు కాని పార్టీలు ఒక దగ్గర చేరే అవకాశాలు లేకపోవడం. తెలుగుదేశం, అకాలీదళ్, ఆలిండియా అన్నా ద్రవిడ మున్నేట్ర కజగం వంటివి బీజేపీ వైపు మొగ్గుతూంటే... వైఎస్ఆర్ కాంగ్రెస్, బిజూ జనతాదళ్ ఏ కూటమిలోనూ చేరే అవకాశాలు లేవు. భారత రాష్ట్ర సమితి కూడా ఈ ఏడాది చివరిలో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యేంతవరకూ తాము ఏ పక్షమన్నది స్పష్టం చేయకపోవచ్చు. ప్రతిపక్ష కూటమి తమ భాగస్వాముల విషయంలో కొన్ని నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. దీనికి బహుజన్ సమాజ్ మంచి ఉదాహరణ. ప్రతిపక్ష కూటమిలో చేరతామంటూనే గతంలో ఈ పార్టీ పార్లమెంటులో బీజేపీకి మద్దతిచ్చిన విషయం ప్రస్తావనార్హం.మధ్యప్రదేశ్, రాజస్థాన్ లలో బీఎస్పీ మద్దతును కాంగ్రెస్ ఆశిస్తోంది. ఈ రెండు రాష్ట్రాల్లోనూ 2018లో బీఎస్పీ చెప్పుకోదగ్గ స్థాయిలో సీట్లు గెలుపొందింది. ఆమ్ ఆద్మీ పార్టీ సంగతి ఏమిటన్నది కూడా ప్రతిపక్ష కూటమి నిర్ణయించుకోవాలి.

ముచ్చటగా మూడో అంశం... భాగస్వాముల విషయంలో కాంగ్రెస్ గతం కంటే ఎక్కువగా కొంత పట్టువిడుపుల ధోరణితో వ్యవహరిస్తుందనేందుకు కొన్ని తార్కాణాలు కనిపిస్తున్నాయి. 'సహజ నేత' విషయంలో పట్టుబట్టబోమని ఇప్పటికే కాంగ్రెస్ సూచన ప్రాయంగా స్పష్టం చేసింది. ప్రాంతీయ పార్టీలు ఆయా రాష్ట్రాల్లో ఒత్తిడికి గురి చేసి లోకసభ స్థానాలు తక్కువగా కేటాయించినా ఆ పార్టీ ఇదే విషయానికి కట్టుబడి ఉంటుందా అన్నది చూడాలి.

బీజేపీని ఎదుర్కొనే విషయంలో ఇంకా ఏమేం చేయాలన్న విషయంపై చర్చించేందుకు ప్రతిపక్ష పార్టీలు జూలై నెలలో సిమ్లాలో మరోసారి సమావేశం కానున్నాయి. బహుశా ఈ కూటమి తమ బలాలు, బలహీనతలు, అవకాశాలు, భయాల విశ్లేషణ (స్వాట్



అనాలసిస్) చేసుకుంటుందేమో!

బలాలు: కూటమి ఒక రూపం సంతరించుకుంటే మహారాష్ట్ర, బిహార్, జార్ఖండ్, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లలోని సామాజిక సమీకరణలు కచ్చితంగా బీజేపీని దెబ్బతీయగల సామర్థ్యం కలిగి ఉంటాయి. ఎంతమేరకన్నది ప్రస్తుతానికి అస్పష్టం. 2019లో ఉత్తర ప్రదేశ్‌లో జరిగినట్లుగానే చాలా స్వల్పమైన మార్పే ఉండవచ్చు. మూడేళ్ల క్రితం అక్కడ సమాజ్‌వాదీ పార్టీ, బీఎస్పీలు రెండూ జట్టు కట్టినా అట్టడుగు స్థాయిలోని వైరుధ్యం తగిన లాభాలు ఇవ్వలేకపోయింది. బీజేపీ వేసిన సామాజిక సమీకరణలు, ప్రధాని నరేంద్ర మోదీ పలుకుబడి ముందు నిలవలేకపోయాయి. ఒక్కటైతే వాస్తవం. ప్రతిపక్షాలు విడివిడిగా కంటే ఉమ్మడిగా పోటీచేస్తేనే బీజేపీకి ధీటైన సవాలు విసరగలవు.

బలహీనతలు: 'మోదీ హఠావో' వంటి ఊకదంపుడు పిలుపులతో ప్రయోజనం ఉండదు. అధికార పక్షాన్ని ఎదుర్కొనేందుకు నమ్మదగ్గ సైద్ధాంతిక ఆలోచన ప్రతిపక్షాల వద్ద కరవైంది. పరిపాలన విషయంలోనూ ప్రత్యామ్నాయాన్ని చూపించాల్సి ఉంటుంది. ప్రజాస్వామ్య విలువల పతనం, క్రోనీ కేపిటలిజమ్ అంటూ ఎంత గోలపెట్టినా వచ్చే లాభం అంతంతే. ఇదే సమయంలో దేశాద్యంతం మోదీ మాదిరిగా అందరినీ మెప్పించగల నాయకుడు కూడా ప్రతిపక్ష కూటమిలో కనిపించరు. ఇది ఒకరకమైన విచిత్రమైన పరిస్థితి కల్పిస్తుంది. కూటమి తరఫున ఒక నేతను ప్రతిపాదిస్తే, అధ్యక్ష తరహా ఎన్నికల రూపు సంతరించుకుంటుంది. గతంలో ఇది బీజేపీకి లాభం చేకూర్చింది. పేరు చెప్పకుండానే ఎన్నికలకు వెళితే బీజేపీ కాస్తా ప్రతిపక్ష కూటమి అవకాశవాద రాజకీయాలు చేస్తోందని ఆరోపించవచ్చు. వచ్చే ఎన్నికలు వారసత్వ రాజకీయాలకూ, ఈ దేశపు మట్టి మనిషికీ మధ్య జరిగేవని ప్రధాని మోదీ ఇప్పటికే ప్రతిపక్ష కూటమి ఏర్పాటును తక్కువ చేసే ప్రయత్నం చేశారు. మోదీ ఇంకో వ్యాఖ్య కూడా చేశారు. వచ్చే ఎన్నికలు కష్టపడి రోజంతా పనిచేసే రాజకీయ నేతకూ, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికీ మధ్య జరిగేవన్నారు.

అవకాశాలు: గత పన్నెండు నెలల్లో జరిగిన అనేక ఒపీనియన్ పోల్స్, సర్వేలు దేశంలో ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైందన్న విషయాన్ని స్పష్టం చేశాయి. చాలామంది భారతీయులు ఆర్థిక వ్యవస్థపై ఆందోళన వ్యక్తం చేశారు. 2019, 2014లలో బీజేపీ వెంట నిలిచిన యువ ఓటర్లు ఇప్పుడు అంత ప్రేమగా ఏమీ లేరు. 2022లో జరిగిన 'ది ఆక్సిస్–మై ఇండియా' ఎగ్జిట్ పోల్‌లో 18 – 25 ఏళ్ల వారు వేసిన ఓట్లలో బీజేపీ, ఎస్పీల మధ్య అంతరం ఒక్క శాతమే. 25 ఏళ్ల పైబడ్డ వారిలో రెండు పార్టీల మధ్య అంతరం ఎక్కువ. ఈ ఏడాది 'ఇండియా టుడే, సీ ఓటర్' నిర్వహించిన మూడ్ ఆఫ్ ద నేషన్ సర్వేలోనూ చాలామంది ఉద్యోగాల విషయంలో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అసంతృప్తి 18–34 మధ్య వయస్కుల్లో ఎక్కువగా ఉండటం గమనార్హం. చాలా రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వాల పనితీరు అంత గొప్పగా ఏమీ లేదు. 2014 నుంచి ఇప్పటి వరకూ 57సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగితే బీజేపీ 29 ఎన్నికల్లో ఓటమి పాలైంది. ఇటీవలి కర్ణాటక ఎన్నికలు మారుతున్న పరిస్థితులకు ప్రబల తార్కాణం. వీటి వల్లనే ప్రతిపక్షాలు రానున్న ఎన్నికలను వీలైనంత వరకూ స్థానికాంశాలపై జరిగేలా చూడాల్సి ఉంటుంది.

ముప్పు: 2024 లోక్‌సభ ఎన్నికలు ప్రాంతీయ స్థాయిలో కాకుండా, జాతీయ స్థాయి అంశాలపై జరిగితే బీజేపీకి కొంత మెరుగైన అవకాశాలు ఏర్పడతాయి. మత, జాతీయవాద రాజకీయాలతో బీజేపీ జనాలను తనవైపు తిప్పుకోగలగడం దీనికి కారణం. 2019లో ముఖాముఖి పోరులో కాంగ్రెస్ నుంచి తొంభై శాతం సీట్లను బీజేపీ లాక్కోగలిగింది. యూపీలో బీజేపీ మును పటి స్థాయిలో సీట్లు సాధించగలిగితే, మిగిలిన చోట్ల ఫలితాలు ఎలా ఉన్నా కేంద్రంలో మెజారిటీకి కూతవేటు దూరంలోకి వచ్చేస్తుంది.

పట్నాలో జరిగిన ప్రతిపక్ష పార్టీల సమావేశం 2024 ఎన్నికల హంగామాకు శ్రీకారం చుట్టింది. సిమ్లా సమావేశం నాటికి కూటమి... ప్రజలకు ఏ రకమైన సందేశం ఇవ్వాలి అన్న విషయంతో పాటు దాన్ని నియోజకవర్గాల వారీగా చేరవేసేది ఎవరు? ప్రణాళికలు, వ్యవస్థాగతమైన యంత్రాంగం వంటి వాటిని నిర్ధారించుకోవాలి. లోక్‌సభ ఎన్నికల సినిమా అనేది ఇప్పుడు రాష్ట్రాల్లో మాత్రమే నడవడం లేదని ప్రతిపక్ష కూటమి గుర్తించాలి. జాతీయ రాజకీయాల్లో మారుతున్న పరిస్థితులను కూడా ప్రతిపక్ష కూటమి గుర్తించి మరీ తాము చెప్పదలచుకున్న విషయాలను చెప్పాల్సి ఉంటుంది. లేదంటే ప్రతిపక్ష పార్టీల సమావేశాలు మంచి ఫొటోలు తీసుకునేందుకు మాత్రమే ఉపయోగపడతాయి.

వ్యాసకర్త ఫెలో, సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్, న్యూఢిల్లీ
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఇదేం తర్కం?



కొల్పులు జరుగుతున్నప్పుడు సంగీతం సరిహద్దులు దాట కూడదు కాబట్టి గాయకులు అలీ సేఠీ, శాయె గిల్ భారత్‌లో ప్రదర్శన ఇవ్వకూడదు; వారిని పూర్తిగా సర్వ నాశనం చేయొచ్చు; కానీ పాకిస్తానీ పాటల హక్కులు కొని వాటిని ఇక్కడి సినిమాల్లో వ్యాపారం కోసం వాడటం మాత్రం పూర్తిగా సబబు.

– రజత్ దత్తా, కామెంటేటర్

ఎంతలో?



మరణం విచిత్రమైనది. నాన్నతో హాస్పిటల్‌లో ఉన్నాను. అదే వార్డులో ఒకాయన్ని పొద్దున చూశాను. చూడ్డానికి బాగా కనబడ్డారు. నావైపు చూసి నవ్వారు. కానీ సాయంత్రానికల్లా వెళ్లిపోయారు. వాళ్ల కుటుంబం కుప్పకూలిపోయింది.

– సేవియో రోడ్రిగ్స్, సంపాదకుడు

అది చాలా?



ఒక ప్రభుత్వాధినేత పనితీరును అంచనా గట్టడానికి వారి సెకండ్ లాంగ్వేజీ (భారతీయులు, బంగ్లా దేశీయులకు ఆంగ్లం లాగా) దక్షత ఒక ప్రమాణం కాబోదు. నేను ఇంగ్లిష్‌లో బాగా రాస్తాను, మాట్లాడుతాను. కానీ అది నన్ను ప్రధాని అభ్యర్థిని చేస్తుందని అనుకోలేను.

– షా అలీ ఫర్హాద్, బంగ్లాదేశ్ సుప్రీంకోర్టు అడ్వకేట్

ఎత్తు?



షీ జిన్‌పింగ్‌ను చికాకు పెట్టడానికి మోదీని బైడెన్ జూన్‌లో వాషింగ్టన్ డి.సి.కి ఆహ్వానించారు. బైడెన్‌ను చికాకు పెట్టడానికి నెతన్యాహూను జూలైలో బీజింగ్‌కు ఆహ్వానిస్తున్నారు షీ జిన్‌పింగ్.

– అశోక్ స్వైన్, ప్రొఫెసర్

ఎఫెక్ట్



ప్రొడక్టివిటీ పెరగడానికి రోజూ గంటసేపు ధ్యానం చేయడంలో నా భయం ఏమిటంటే, ఇదేదీ ప్రాధాన్యం కలిగినది కాదన్న జ్ఞానోదయం కలిగి నేను మొత్తంగానే ప్రొడక్టివిటీకి దూరం అవుతానేమోనని!


– దేవయ్య బోపన్న, కంటెంట్ క్రియేటర్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

దేశాన్ని గట్టెక్కించిన పాలనాదక్షుడు

భారత దేశ చరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానం కలిగిన మేధావీ, పరిపాలనాదక్షుడూ పాములపర్తి వెంకట నరసింహారావు. ఎవరి జీవితం, ఎట్లా మలుపు తిరుగుతుందో ఎవరికీ తెలియదు. తమిళనాడు శ్రీపెరుంబుదూర్‌లో ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న రాజీవ్ గాంధీని 1991 మే 21న ఎల్‌టీటీఈ ఆత్మాహుతి దాడితో హత్య చేసింది. అత్యధిక మెజారిటీతో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టారు. భారత పదవ ప్రధానమంత్రిగా బాధ్యత చేపట్టారు పీవీ.

ఆ సమయంలో భారతదేశం అంతర్జాతీయ చెల్లింపులపై డిఫాల్ట్ అయ్యి రెండు వారాలు కావస్తోంది. విదేశీ మారక నిల్వలు కేవలం రెండు వారాల దిగుమతులకు మాత్రమే సరిపోయేంతగా ఉన్నాయి. అంతకు నెలరోజుల క్రితం మొత్తం 55 టన్నుల బంగారాన్ని రిజర్వ్ బ్యాంక్ తనఖా పెట్టింది. పెద్ద మొత్తంలో చెల్లింపులు తగ్గుముఖం పట్టాయి. భారతదేశానికి రుణం ఇవ్వడానికి ఎవరూ సిద్ధంగా లేరు.



పీవీ నరసింహారావు

ఈ క్లిష్ట పరిస్థితుల్లో ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్‌ను ఆర్థిక మంత్రిగా నియమించారు పీవీ. దేశ ఆర్థిక వ్యవస్థ గాడిలో పడడానికి ఎటువంటి నిర్ణయం తీసుకోవడానికైనా ఆయనకు స్వేచ్ఛ నిచ్చారు. అప్పటివరకూ ఉన్న కఠిన నిబంధనలను సడలించి సరళీకరణకు ద్వారాలు తెరచింది పీవీ ప్రభుత్వం. దాని ఫలితాలనే ఇప్పుడు మనమంతా అనుభవిస్తున్నాం. అంతర్జాతీయ సమాజంలో భారత్ పట్ల సన్నగిల్లిన విశ్వాసాన్ని తిరిగి పాదుకొల్పారు పీవీ. ఫలితంగా అంతర్జాతీయ ద్రవ్య సంస్థల సహాయం మళ్లీ ప్రారంభమయ్యింది. అలా దేశాన్ని తిరిగి అభివృద్ధి పథంలోకి తీసుకువచ్చారు.

ప్రస్తుత తెలంగాణలోని హనుమకొండ జిల్లాలోని 'వంగర' గ్రామంలో 1921లో పీవీ జన్మించారు. అంచెలంచెలుగా రాష్ట్ర, కేంద్ర రాజకీయాల్లో ఎదిగారు. ఆయన ప్రధానమంత్రిగా ఉన్నప్పుడే బాబ్రీ మసీద్ కూల్చివేత జరిగింది. ఆ సమయంలో ఆయన తీవ్ర మైన విమర్శలను ఎదుర్కొన్నారు. దక్షిణ భారత్‌కు చెందిన పీవీకి వ్యతిరేకంగా ఆయన సొంత పార్టీ ప్రముఖులే పనిచేసి ఆయనను పదవి నుంచి లాగి వేయడానికి ప్రయత్నించారు. కానీ ఇటు ప్రతి పక్షాలు, అటు అసంతృప్తులైన సొంత పార్టీ వారి ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ ఆయన విజయవంతంగా తన ఐదేళ్ల పదవీకాలాన్ని దిగ్విజయంగా ముగించారు. ఆయన మరణించి 18 ఏళ్లు గడిచాయి. ఈ తరుణంలో దేశానికి పీవీ చేసిన సేవను అన్ని వర్గాలూ మరచిపోవడం బాధాకరం. ఆయన శత జయంతి సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు శత జయంతి ఉత్సవాలను ఏడాది పాటు ఘనంగా నిర్వహించి ఆయన కీర్తి ప్రతిష్ఠలను ఇనుమడింప చేశారు.

ఇంతటి మహా మేధావినీ, పరిపాలనా దక్షుణ్ణీ నేను నా జీవితంలో ఆరుసార్లు అతి దగ్గర నుండి చూశాను. ఆయనతో కొంత సమయం గడిపాను. నా జీవితంలో మరపు రాని సందర్భాలివి. 1977లో పెద్దపల్లి జిల్లా మా కొలనూరు పక్క ఊరైన 'పెగడపల్లి'లో మా చుట్టాల ఇంటిలో పెళ్లి సందర్భంగా ఆయనతో కలిసి బంతి భోజనం చేశాను. మరొకసారి ఒక దినపత్రిక విలేక రిగా పెద్దపల్లి విశ్రాంత భవనంలో ఆయన పక్క కూర్చుని ముచ్చటించడం అరుదైన ఘటన.

– దండంరాజు రాంచందర్ రావు, రిటైర్డ్ డిప్యూటీ సూపరింటెండెంట్, సింగరేణి భవన్, హైదరాబాద్
(నేడు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి)

సామాజిక న్యాయానికి కొత్త నిర్వచనం

అభిప్రాయం



జి. కిరణ్ కుమార్

సామాజిక న్యాయం ఏ అభ్యుదయ సమాజానికైనా మూలస్తంభంగా నిలుస్తుంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సామాజిక న్యాయానికి దార్శనిక నాయకుడిగా అవతరించారు. ప్రతి వ్యక్తి అభివృద్ధి చెందడానికీ, అవకాశాలను పొందడానికీ ఒక వాతా వరణాన్ని సృష్టించడానికి కృషి చేస్తున్నారు. అనేక కార్యక్రమాలు, పథకాల ద్వారా అట్టడుగు వర్గాల అవస రాలను తీర్చి, సమసమాజ అభివృద్ధిని పెంపొందించే దిశగా ఆయన ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

ముఖ్యమంత్రిగా జగన్ సామాజిక న్యాయానికి కొత్త నిర్వచనాన్ని ఇచ్చారు. విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్లను అమలు చేయడం మాత్రమే సామాజిక న్యాయంగా పరిగణించిన వారు... జగన్ తీసుకున్న నిర్ణయాలు దేశంలో సామాజిక న్యాయానికి కొత్త ఒరవడిని సృష్టించాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు. అందరికీ తప్పనిసరిగా ఇంగ్లీష్ మీడియం విద్యను అందించడం, దేశంలో ఎక్కడా లేని విధంగా రాజకీయ రంగంలో అన్ని కులాల వాళ్లకి సముచిత స్థానాన్ని కల్పించడం, 'అమ్మ ఒడి', 'నవ రత్నాలు' వంటి పథకాల ద్వారా ప్రభుత్వ ఫలాలను అందరికీ, ముఖ్యంగా బీసీ కులాలకు అందేలా చర్యలు చేపట్టి అమలు చేయడం. ఆర్థికంగా వెనుకబాటుకు గురైన వెనుకబడిన తరగతులకు కార్పొ రేషన్‌లు ఏర్పాటు చేయడం వంటి ఎన్నో జగన్ నిర్ణయాలు విప్లవాత్మకమైనవి.

గత మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో జగన్ బీసీలకు ఒక డిప్యూటీ సీఎం పదవితో పాటు 11 మంత్రి పదవులూ ఇచ్చారు. షెడ్యూల్డ్ కులాలకు చెందిన ఐదుగురికీ, షెడ్యూల్డ్ తెగకు చెందిన ఒకరికీ తన 25 మంది సభ్యులున్న కేబినెట్‌లో స్థానం కల్పించారు. వైసీపీ ప్రభుత్వ ప్రారంభించిన 56 వెనుకబడిన కులాల కార్పొరేషన్లు బీసీ కులాలకు వైసీపీని దగ్గర చేశాయి. ఈ కార్పొరేషన్‌లలో సగానికి



పైగా నామినేటెడ్ పదవులను మహిళలకు కేటాయించడం మరో విశేషం.

అంబేడ్కర్ చెప్పిన విధంగా రాజ్యాధికారమే అన్నిటికీ 'మాస్టర్ కీ' అనే మాటను విశ్వసించి బీసీలకు దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా జగన్ క్యాబినెట్‌లో ఉన్నత స్థానాన్ని కల్పించారు. ఈ చర్య కుల వివక్ష అడ్డంకులను విచ్ఛిన్నం చేయడమే కాకుండా, ఆంధ్రప్రదేశ్‌లో సమ్మిళిత, వైవిధ్య భరితమైన రాజకీయ ముఖచిత్రాన్ని సృష్టించడానికి జగన్ నిబద్ధతను స్పష్టం చేస్తోంది. ఒకటి రెండు కులాలకే కాకుండా బీసీల్లో ఉన్న అత్యధిక కులాలకు రాజకీయ నాయకత్వాన్ని ఇచ్చిన లీడర్ జగన్. వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి అసెంబ్లీ, లోక్ సభల్లో బీసీ రిజర్వేషన్ల కోసం ప్రైవేట్ బిల్లును ప్రవేశ పెట్టారు. ఈ చర్య జగన్‌కు ఓబీసీల పట్ల ఉన్న నిబద్ధతకు మరో నిదర్శనం.

కులగణన చేయడం బీసీలకు న్యాయం చేస్తుంది అనడంపై ఎటువంటి సందేహం లేదు. వివిధ కులాలకు సంబంధించిన సామాజిక, విద్య, ఆర్థిక పరంగా సమా చారాన్ని కులగణన ద్వారా స్వీకరించవచ్చు. ఈ విలువైన సమాచారాన్ని వివిధ ప్రజా సంక్షేమ విధానాల రూపకల్పన కోసం ఉపయోగించవచ్చు. కుల గణనకు జగన్ పూర్తి మద్దతు ఇస్తున్నారు.

బీసీల రాజకీయ భాగస్వామ్యాన్ని మెరుగుపరిచేందుకు చంద్రబాబు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. బీసీ సాధికారత, వారి రాజకీయ భాగస్వామ్యానికి సంబంధించిన పరిజ్ఞానం పవన్ కల్యాణ్‌కు లేదు. ఒక్క కులానికి మాత్రమే మద్దతిచ్చే ఇమేజ్ చంద్రబాబు నాయుడికి ఉంది. ఈ నేపథ్యంలో బీసీలు వచ్చే ఎన్నికల్లో ఎవరికి ఓటు వేయాలో ఆలోచించాలి. రాజకీయ సాధి కారత, విద్య, సామాజిక అభివృద్ధి వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ సామాజిక న్యాయానికి కొత్త నిర్వచనం ఇచ్చిన జగన్‌కు బీసీలందరూ మద్దతివ్వాల్సిన సమయం ఆసన్నమైంది.

వ్యాసకర్త జాతీయ అధ్యక్షుడు, ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్

అనిత్యత్వపు ఎరుక

త్రిపిటకాల్లో మూడవదీ, అర్థం చేసుకోవడానికి అతి కష్టమైనదీ అభిదమ్మ పిటకం. ఇందులో బుద్ధుడు ఉపదేశించిన ప్రవచనాలు అన్నింటినీ ఒక నిర్దిష్ట పద్ధతి ప్రకారం పేర్చి, పట్టిక రూపంలో పొందుపర్చి విషయపరంగా వర్గీకరించారు. అభిదమ్మమంటే ఉన్నతమైన ధర్మం. ఇది బుద్ధుని బోధనల సారాంశం. సమస్త విషయాలను విశ్లేషణాత్మకంగా విమర్శించి వాటి విశిష్టతలను నిరూపించటంలో ఈ పిటకం చాలా ప్రత్యేకతను కలిగివుంది.

బుద్ధుడి ఉపదేశాల అన్నింటి లక్ష్యం మానవుడిని దుఃఖ విముక్తుణ్ణి చేయటం, నిర్వాణ స్థితికి జేర్చటం. సుత్త పిటకంలో బుద్ధుడు శ్రోతల మేధోస్థాయికి తగ్గట్టుగా ఉపదేశించాడు. నీవు, నేను, పురుషుడు, స్త్రీ, ఆవు, చెట్టు – ఇట్లాంటి వ్యావహారిక పదాల్ని ఉపయోగించాడు. అభిదమ్మ పిటకంలో బుద్ధుడు అలాంటి మాటల్ని



కాకుండా, పారమార్థిక సత్యం వెలుగులో వాటి మూలక పదార్థాలు అన్నింటినీ విశ్లేషించి, అవి ఎలా అనిత్యమో, దుఃఖ కారకమో నిరూపిస్తాడు.

ఈ పిటకంలో ఏడు గ్రంథాలు ఉన్నాయి. అవి 1. ధర్మసంగణి: భిక్షువుల కొరకు రూపొందించిన నీతి సూత్రాలు. 2. విభంగ: విభజన, వర్గీకరణ. ఇది ధర్మసంగణికి అనుబంధ రచన. 3. ధాతుకథా: పారమార్థిక సత్యాల గురించిన చర్చ. 4. పగ్గలపుణ్ణత్తి: నిర్వాణ స్థితికి చేరుకొనే మార్గంలో సాధకుని లక్షణాల వర్గీకరణ. 5. కథావత్తు: అశోకుని కాలంలో క్రీ. పూ. 3వ శతాబ్దంలో జరిగిన మూడవ బౌద్ధ సంగీతి (సభ)కి అధ్యక్షత వహించిన మొగ్గలిపుత్త తిస్స రచన. బుద్ధ ధర్మం గురించి తలెత్తిన వివాదాల చర్చ ఇందులో ప్రధానాంశం. 6. యమక: మానసిక దృగ్విషయాల చర్చ. 7. పఠాన: మానసిక, భౌతిక విషయాల మధ్య సంబంధం గురించిన చర్చ.

అభిదమ్మ పిటకం గురించి సంగ్రహంగా ఇలా చెప్పొచ్చు. ఈ పిటకం, మానసిక లక్షణాలు, పదార్థ లక్షణాలు, దృగ్విషయాల మధ్య సంబంధాలు, ధ్యాన వ్యాయామాల గురించి వివరిస్తుంది. అన్ని విషయాల అనిత్యత్వాన్ని మానవుడు గ్రహించి, జ్ఞానోదయం పొంది, విముక్తిని సిద్ధింపజేసుకోవటం దీని లక్ష్యం.

అభిదమ్మ పిటకం ఆధారంగా అనురుద్ధాచార్యులు 11–12 శతాబ్దాల్లో పాళీ భాషలో సంగ్రహంగా 'అభిదమ్మత్త సంగహో' రచించారు. దీని తెలుగు అనువాదం 'అభిధర్మ అర్థసంగ్రహము' అనే పేరుతో లభిస్తోంది.

– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** శు.దశమి రా.10.45 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** చిత్త ప.12.23 వరకు, తదుపరి స్వాతి, **వర్జ్యం:** సా.6.11 నుండి 7.48 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.35 నుండి 12.27 వరకు, **అమృతఘడియలు:** తె.4.06 నుండి 5.43 వరకు (తెల్లవారితే గురువారం): **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.31, **సూర్యాస్తమయం:** 6.34.

క్లుప్తంగా...

చట్టాలే నవ్వుకొనే పరిస్థితులు వచ్చాయి

- 'ఉపా' చట్టాన్ని రద్దు చేయాలంటూ సీపీఐ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం
- నిరసన వ్యక్తం చేసిన పలువురు వక్తలు


సమావేశంలో మాట్లాడుతున్న కూనంనేని

హిమాయత్‌నగర్ (హైదరాబాద్): ఆర్థిక నేరాలు, హత్యలు, దొంగతనాలు, మానభంగాలు చేసిన వారు స్వేచ్ఛగా బయట తిరుగుతుంటే.. ఉన్నత చదువులు చదివి.. ప్రభుత్వాలు ప్రజల పట్ల అవలంబిస్తున్న దారుణ విధానాలను ప్రశ్నిస్తున్న వారు జైళ్లల్లో మగ్గుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజల పక్షాన నిలుస్తూ ప్రశ్నించిన వారిపై దేశద్రోహం లాంటి కేసులు, ఉపా చట్టాలను పెడుతున్న ఈ క్రమంలో ఈ దేశ చట్టాలే నవ్వుకునే పరిస్థితులు ప్రస్తుతం దేశంలో ఏర్పడ్డాయన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా)ను రద్దు చేయాలని, తాడ్వాయిలో 152 మందిపైన నమోదు చేసిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి కూనంనేని సాంబశివరావు సమన్వయకర్తగా వ్యవహరించగా, ప్రొఫెసర్ హరగోపాల్, సీనియర్ పాత్రికేయులు కె.శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా, వామపక్ష నాయకులు, ప్రజా సంఘాల నేతలు చాడ వెంకట్‌రెడ్డి, పల్లా వెంకట్‌రెడ్డి, ఎస్.బాలమల్లేశ్, వి.ఎస్.బోస్, ఇ.టి.నర్సింహ, చెరుపల్లి సీతారాములు, పోటు రంగారావు, సాధినేని వెంకటేశ్వర్‌రావు తదితరులు హాజరై ప్రసంగించారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ, ఇస్లామిక్ టెర్రరిస్టులు, అంతర్జాతీయ ఉగ్రవాదులు- ప్రభుత్వాలను ప్రశ్నించే ఉద్యమకారులు, కవులు, కళాకారులు, పాత్రికేయులపై ఒకే రకమైన 'ఉపా'లాంటి చట్టాలను ఎలా ఉపయోగిస్తారని ప్రశ్నించారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే 'ఉపా'చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేయబోమని రాజకీయ పార్టీలు స్పష్టమైన హామీ ఇవ్వాలన్నారు. చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ 'ఉపా'చట్టాన్ని ఉపసంహరించుకునే అంశంపై జాతీయ స్థాయిలో ఉద్యమించాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతో ఏర్పడిన రాష్ట్రంలో ఈ చట్టం అమలు చేయాల్సిన అవసరం ఏముందని విమలక్క ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జర్నలిస్టు తులసిచందుకు ఏదైనా నష్టం జరిగితే కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది.

ఆచార్య బేతవోలుకు సాహిత్య అకాడమీ భాషా సమ్మాన్ పురస్కారం



నల్లజర్ల: శాస్త్రీయ, మధ్యయుగ సాహిత్య రంగంలో చేసిన కృషికి గుర్తింపుగా తూర్పు గోదావరి జిల్లా నల్లజర్లకు చెందిన ఆచార్య బేతవోలు రామబ్రహ్మానికి కేంద్రప్రభుత్వం మంగళవారం సాహిత్య అకాడమీ భాషా సమ్మాన్ పురస్కారం ప్రకటించింది. త్వరలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ఆయనకు ఈ పురస్కారం కింద రూ.లక్ష నగదు బహుమతి, రాగి ఫలకంపై ప్రశంసాపత్రం అందజేయనున్నారు.

నీళ్లలా ఇంత ఖర్చా?

కాళేశ్వరం ప్రాజెక్టు ఆర్థిక సుస్థిరతపై కాగ్ తీవ్ర సందేహాలు

- భారీ స్థాయిలో రుణాలు, కరెంట్ బిల్లులపై ఆందోళన... పనుల అసంపూర్తిపై ప్రశ్నలు
- రూ. లక్షన్నర కోట్లకు అంచనా వ్యయం పెరుగుతుందని ఆక్షేపణ
- సర్కారుకు ప్రాథమిక ఆడిట్ నివేదిక
- కాగ్‌కు వివరణలపై సర్కారు మల్లగుల్లాలు



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై తీవ్ర అభ్యంతరాలతో కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) రాష్ట్ర ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక సమర్పించినట్లు తెలిసింది. ఈ ప్రాజెక్టు ఆర్థిక సుస్థిరత, భవిష్యత్తు మనుగడపై కాగ్ తీవ్ర సందేహాలను వ్యక్తం చేసినట్లు నీటిపారుదల శాఖ వర్గాల ద్వారా తెలియవచ్చింది. ప్రాజెక్టుల రీడిజైనింగ్‌లో భాగంగా ప్రాణహిత-చెవెళ్ల ప్రాజెక్టును కాళేశ్వరం ప్రాజెక్టుగా మార్చడం ద్వారా అనవసర భారం పడినట్లు ఆక్షేపించినట్లు సమాచారం. ఈ ప్రాజెక్టుపై రెండేళ్లపాటు సుదీర్ఘ ఆడిట్ నిర్వహించిన తర్వాత కాగ్ ఈ మేరకు ప్రాథమిక నివేదికను రూపొందించింది. ముఖ్యంగా ప్రాజెక్టు నిర్మాణం కోసం తీసుకున్న రుణాలకు వడ్డీలతో కలిపి చెల్లింపులకు ఏటా రూ. 13 వేల కోట్లు, ప్రాజెక్టు విద్యుత్ చార్జీలకు ఏటా మరో రూ. 12 వేల కోట్లు, ప్రాజెక్టు నిర్వహణ, మరమ్మతులకు రూ. 270 కోట్లు కలిపి ఏటా సుమారు రూ. 25 వేల కోట్ల వ్యయం కానుందని కాగ్ ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం. ఎకరం ఆయకట్టు సాగుకు కాళేశ్వరం పెట్టుబడి వ్యయం రూ. 6.4 లక్షలు కానుందని స్పష్టం చేసినట్లు తెలియవచ్చింది.

ప్రాజెక్టు 12 శాతమే పూర్తి...

కాళేశ్వరం ప్రాజెక్టులోని 56 పనుల్లో ఇప్పటివరకు 12 మాత్రమే పూర్తయ్యాయని, మరో 40 పనులు 3 శాతం నుంచి 99 శాతం వరకు, మిగిలిన 4 పనులు ఇంకా ప్రారంభం కాలేదని నివేదికలో కాగ్ వివరించినట్లు తెలిసింది. ప్రాజెక్టు భూసేకరణ కోసం 98,110 ఎకరాలకుగాను 63,972 ఎకరాలనే సేకరించారని తప్పుబట్టింది. ప్రాజెక్టు నిర్మాణం కోసం సేకరించిన అప్పుల్లో రూ. 1,700 కోట్లను ఇతర అవసరాలకు దారి మళ్లించినట్లు ఆరోపించింది.

ఉన్నతాధికారుల భేటీ...

కాళేశ్వరం ప్రాజెక్టుపై ఈ మేరకు కాగ్ తీవ్ర సందేహాలు, అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో వివరణలు ఇచ్చేందుకు రాష్ట్ర నీటిపారుదల శాఖ మల్లగుల్లాలు పడుతోంది. కాగ్ నివేదికపై బుధవారం ఆర్థిక శాఖ ఉన్నతాధికారులతో నీటిపారుదల శాఖ అధికారులు, ఇంజనీర్లు చర్చించారు. దీనిపై ప్రభుత్వం నుంచి వివరణలను తీసుకున్నాక తుది నివేదిక సమర్పించే అవకాశం ఉంది.

రుణాలు, వడ్డీల భారం..

కాళేశ్వరం ప్రాజెక్టు కోసం 6 బ్యాంకులు, ఆర్థిక సంస్థలు కలిపి 15 భారీ రుణాల రూపంలో మొత్తం రూ. 97,449 కోట్ల రుణాలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంది. వార్షిక వడ్డీ రేట్లు 8.25 శాతం నుంచి 10.9 శాతం వరకు ఉన్నాయి. 2023–24 నుంచి 2034–35 మధ్యకాలంలో ఏటా రూ. 13 వేల కోట్లను వడ్డీలతో సహా రుణాల తిరిగి చెల్లింపుల కోసం కట్టాల్సి ఉండనుంది. ఇప్పటివరకు పొందిన రుణాల తిరిగి చెల్లింపులు 2039–40 వరకు కొనసాగనున్నాయి. దీని నిర్మాణానికి ఇప్పటి వరకు రూ. 85 వేల కోట్లకుపైగా ఖర్చు చేయగా నిర్మాణం పూర్తయ్యే సరికి అంచనా వ్యయం రూ. 1.50 లక్షల కోట్లకు ఎగబాకనుందని కాగ్ అభ్యంతరం తెలిపినట్లు సమాచారం. ఈ ప్రాజెక్టు కింద ఎకరా ఆయకట్టు సాగుకు రూ. లక్ష వరకు కరెంట్ బిల్లు కానుందని ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిసింది.

టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో హెచ్‌ఓ ప్రాథమిక కీ

సాక్షి, హైదరాబాద్: ఉద్యానవన శాఖ పరిధిలో హార్టికల్చర్ ఆఫీసర్ (హెచ్‌ఓ) ఉద్యోగాల భర్తీకి సంబంధించి ఈ నెల 17న నిర్వహించిన అర్హత పరీక్షల ప్రశ్నపత్రాల ప్రాథమిక 'కీ'ని టీఎస్‌పీఎస్సీ మంగళవారం విడుదల చేసింది. దీనిపై అభ్యంతరాలుంటే ఈ నెల 28 నుంచి జూలై 1 సాయంత్రం 5 గంటల వరకు వెబ్‌సైట్‌లో అభ్యర్థి లాగిన్ ద్వారా తెలియజేయాలని ఒక ప్రకటనలో తెలిపింది. మ్యాన్యువల్‌గా పంపే అభ్యంతరాలను పరిగణించబోమని స్పష్టం చేసింది.

ఫార్మాసిటీ కోసం ఆలయ భూములా?

▶ మొదటి పేజీ తరువాయి

భూములు సేకరించవచ్చన్న నిబంధనలు ఏవైనా ఉంటే.. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని టీఎస్‌ఐఐసీ ఎండీ, రెవెన్యూ-దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి, దేవాదాయ శాఖ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, శ్రీ ఓంకారేశ్వర స్వామి ఆలయ ఈవోకు నోటీసులు జారీ చేసింది. తాము తదుపరి ఆదేశాలిచ్చే వరకు భూ సేకరణపై ముందుకెళ్లరాదని ఆదేశించింది. తదుపరి విచారణను జూలై 12కు వాయిదా వేసింది. దేవాదాయ భూముల సేకరణకు హైకోర్టు నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాల్సి ఉన్న నేపథ్యంలో నందివనపర్తి, సింగారం పరిధిలోని ఓంకారేశ్వర స్వామి ఆలయానికి చెందిన 1,022 ఎకరాల భూముల సేకరణ కోసం టీఎస్‌ఐఐసీ గత నవంబర్‌లో హైకోర్టు సింగిల్ జడ్జి వద్ద పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి.. భూ సేకరణకు అనుమతి ఇస్తూ అదే నెలలో ఉత్తర్వులు జారీ చేశారు. భూ సేకరణ చట్ట ప్రకారం భూమిని సేకరించాలని, ఆ వచ్చిన మొత్తం నగదును ఓంకారేశ్వర స్వామి ఆలయ ఖాతాలో జమ చేయాలని ఆదేశించారు. సదరు మొత్తాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని సింగిల్ జడ్జి చెప్పారు.

ద్విసభ్య ధర్మాసనం అనుమతి తప్పనిసరి

సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాల్ చేస్తూ రంగారెడ్డి జిల్లా యాచారం మండలం తాటిపర్తి గ్రామానికి చెందిన భక్తులు మోతెకాని జంగయ్య, కుర్మిద్దకు చెందిన దేవోజీ రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ టి.వినోద్‌కుమార్, జస్టిస్ పుల్ల కార్తీక్ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఆలయ భూముల సేకరణకు ద్విసభ్య ధర్మాసనం అనుమతి తప్పనిసరి అని.. సింగిల్ జడ్జిని ఆశ్రయించి ఉత్తర్వులు పొందడం చెల్లదన్నారు. తాగు, సాగునీటి ప్రాజెక్టులకు మాత్రమే ఆలయ భూములు సేకరించాలని గతంలో డివిజన్ బెంచ్ పేర్కొందన్నారు. భూసేకరణతో ఎలాంటి సంబంధం లేని టీఎస్‌ఐఐసీ పిటిషన్ ఎలా వేస్తుందని ప్రశ్నించారు. భూ సేకరణను వెంటనే నిలిపివేయాలని, సింగిల్ జడ్జి ఉత్తర్వులను ఆపాలని కోరారు.

ఇతర అవసరాలకు సేకరించవచ్చు...

ఇతర ప్రజావసరాలకు కూడా దేవాదాయ భూములను సేకరించవచ్చని ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపించారు. గతంలో దీనికి సంబంధించి పలు తీర్పులు కూడా ఉన్నాయన్నారు. అయితే వివరాలు సమర్పించడానికి కొంత సమయం కావాలని కోరారు. భూములు ఇచ్చేందుకు ఓంకారేశ్వర ఆలయ కమిటీ, దేవాదాయశాఖ అంగీకరించాయని చెప్పారు. ఇందులో ఇతరులకు అభ్యంతరం ఉండాల్సిన అవసరం లేదన్నారు.

రామగుండంలో 'ఉగ్ర' కలకలం

గుజరాత్ పోలీసుల అదుపులో తండ్రి, కూతురు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉగ్రవాదులతో సంబంధాలున్నాయన్న అనుమానంతో గుజరాత్ పోలీసులు రామగుండంలో తండ్రి, కూతురిని అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల శ్రీనగర్‌కు చెందిన నలుగురు ఇస్లామిక్ స్టేట్ సానుభూతిపరులను గుజరాత్ యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్ (ఏటీఎస్) అరెస్టు చేసింది. వారిలో సమేరా భాను అనే మహిళతో తెలంగాణ రాష్ట్రంలోని పలువురు చాటింగ్ చేసినట్లు గుర్తించిన ఏటీఎస్ పోలీసులు పాతబస్తీతో పాటు వివిధ ప్రాంతాల్లో మంగళవారం దాడులు నిర్వహించారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటూ సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా పని చేస్తున్న తండ్రి (40), కూతురు (20) నాలుగు రోజుల క్రితం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని శ్రీనగర్ కాలనీలోని బంధువుల ఇంట్లో షెల్టర్ తీసుకున్నారు. దీంతో గుజరాత్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని రామగుండం సీపీ ముందు హాజరుపరిచి ఉగ్రవాద సంబంధాలపై విచారించినట్లు సమాచారం. సమేరా భానుతో ఎలా పరిచయం? ఎన్ని రోజుల నుంచి తెలుసు? ఏం చాట్ చేశారు.. తదితర అంశాలపై ప్రశ్నించి తదుపరి విచారణ కోసం హైదరాబాద్ తరలించారు.

'పోడు రైతుబంధు' నమోదుకు 3 వరకు గడువు

సాక్షి, హైదరాబాద్: పోడు హక్కుదారులకు కొత్త పోడు పట్టాలు జారీ చేయనున్న నేపథ్యంలో అటువంటి వారు రైతుబంధు కోసం వచ్చే నెల మూడో తేదీవరకు నమోదు చేసుకోవాలని వ్యవసాయశాఖ విజ్ఞప్తి చేసింది. కొత్త పోడు పట్టాలకు సంబంధించి డేటా రైతుబంధు పోర్టల్‌లో ఉంచారు. ఆ వివరాలు వ్యవసాయ విస్తరణాధికారుల (ఏఈవో)ల లాగిన్లలో అందుబాటులో ఉంది. జిల్లాల వారీ గా ఎంతమందికి పోడు పట్టాలు ఇ స్తున్నారన్న డేటాను వ్యవసాయ శాఖ విడుదల చేసింది. అందుకు అనుగు ణంగా మండలస్థాయి బృందాలు బ్యాంకు వివరాలను సేకరించాయి. సేకరించిన బ్యాంకు వివరాలన్నీ మూడో తేదీలోపు రైతుబంధు పోర్టల్‌లో అప్‌డేట్ చేయాలని వ్యవ సాయ శాఖ ఆదేశించింది. కాగా, రా ష్ట్రంలో 4.26 లక్షల ఎకరాలకు పోడు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. లక్షన్నర మంది పోడు రైతులకు పట్టాలు రానున్నాయి. అత్యధికంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1.59 లక్షల ఎకరాలు, మహబూబాబాద్ జిల్లాలో 75,132 ఎకరాలకు పోడు పట్టాలు రానున్నాయి. అత్యంత తక్కువగా పెద్దపల్లి జిల్లాలో రెండు ఎకరాలకు చెందిన నలుగురు రైతులకు పోడు పట్టాలు రానున్నాయి.

రెండో రోజు రైతుబంధు రూ. 1,278.60 కోట్లు...

ఇదిలావుండగా, రైతుబంధు సొమ్ము రెండో రోజైన మంగళవారం కూడా జమ చేశారు. 16.98 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ. 1,278.60 కోట్లు జమ చేసినట్లు వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి తెలిపారు. దీంతో రెండు రోజుల్లో మొత్తం 39.54 లక్షల మంది రైతుల ఖాతాలలో రూ. 1921.18 కోట్లు జమ చేసినట్లయిందన్నారు. రైతుబంధు పథకంతో తెలంగాణలో సాగు విప్లవం వచ్చిందన్నారు.

గురుకుల విద్యార్థి ఆత్మహత్య

పాఠశాలలో చేరిన మర్నాడే..


రంజిత్ గౌడ్ (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్: పాఠశాలలో చేరిన మర్నాడే ఓ గురుకుల విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలో మంగళవారం జరిగిన ఈ సంఘటనపై పోలీసుల కథనమిది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం జైకేసారం గ్రామానికి చెందిన పందుల శ్రీధర్‌గౌడ్ కుమారుడు రంజిత్ గౌడ్ (13) గతేడాది పటాన్‌చెరులోని బీసీ గురుకుల పాఠశాలలో చేరాడు. అయితే తన ఊరి నుంచి దూరం ఎక్కువగా ఉండటంతో.. ఈ విద్యాసంవత్సరం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారంలోని మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలలో సోమవారం సాయంత్రం విద్యార్థిని ఎనిమిదో తరగతిలో చేర్పించారు. మంగళవారం ఉదయం 8.30 గంటల సమయంలో విద్యార్థులంతా అల్పాహారం తినేందుకు వెళ్తుండగా వారితో పాటే వెళ్లిన రంజిత్.. కొద్దిసేపటి తర్వాత తన ప్లేట్ తీసుకొస్తానంటూ చెప్పి తిరిగి రాలేదు. అరగంట తర్వాత విద్యార్థులు వెళ్లి చూడగా.. అతను పడుకునే బెడ్‌కు టవల్‌తో ఉరేసుకుని కనిపించాడు. దీంతో తోటి విద్యార్థులు కిందకు దింపి ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకువెళ్లారు. రంజిత్‌ను వెంటనే అబ్దుల్లాపూర్‌మెట్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

క్లుప్తంగా...

29, 30 తేదీల్లో మణిపూర్‌కు రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ జాతుల ఘర్షణలతో అట్టుడుకుతున్న మణిపూర్‌ను సందర్శించనున్నారు. ఈ నెల 29, 30వ తేదీల్లో ఆయన మణిపూర్ వెళ్తారని కాంగ్రెస్ తెలిపింది. చురాచంద్‌పూర్, ఇంఫాల్‌ల్లోని సహాయక శిబిరాల్లో తలదాచుకున్న వారితోపాటు పలువురు సామాజిక కార్యకర్తలతో రాహుల్ మాట్లాడతారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. దాదాపు రెండు నెలలుగా రాష్ట్రంలో కొనసాగుతున్న హింసాత్మక ఘటనల్లో వందమందికి పైగా చనిపోయిన విషయం తెలిసిందే.

కశ్మీర్‌లో ఉగ్రవాది హతం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో మంగళవారం భద్రతా బలగాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో అల్ బద్ర్ సంస్థకు చెందిన ఒక ఉగ్రవాది హతమయ్యాడు. ఈ సందర్భంగా ఒక పోలీసు గాయపడ్డారు. నిఘా వర్గాల సమాచారం మేరకు బలగాలు సోమవారం రాత్రి హవూరా ప్రాంతంలో గాలింపు చేపట్టాయి. మాటువేసి ఉన్న ఓ ఉగ్రవాది వారిపైకి యథేచ్ఛగా కాల్పులకు దిగాడు. బలగాలు జరిపిన కాల్పుల్లో అతడు హతమయ్యాడు. ఈ సందర్భంగా గాయపడిన పోలీసును అధికారులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. హతమైన ఉగ్రవాదిని హవూరా ప్రాంతం అక్బరాబాద్‌కు చెందిన అదిల్ మజీద్ లోన్‌గా గుర్తించారు. ఘటనకు కొద్ది సేపటి ముందు అతడు సోషల్ మీడియాలో ఒక వీడియో పోస్ట్ చేశాడు. తనను తాను అల్‌బద్ర్ సంస్థలో చాలా కాలంగా పని చేస్తున్నట్లు చెప్పుకున్నాడు.

తాలిబన్ హయాంలో వెయ్యి మంది పౌరులు మృతి: ఐరాస

ఇస్లామాబాద్: అఫ్గానిస్తాన్‌లో తాలిబన్లు 2021 ఆగస్ట్‌లో అధికారం చేజిక్కించుకున్న నాటి నుంచి గత మే నెల వరకు జరిగిన దాడుల్లో 1,095 మంది పౌరులు చనిపోయారని ఐక్యరాజ్యసమితి అఫ్గాన్ విభాగం తెలిపింది. ఇందులో చాలా వరకు జనసమ్మర్థం ఉండే స్కూళ్లు, మార్కెట్లు, ప్రార్థనాస్థలాల్లో బాంబులు పేలడంతోనే జరిగాయని పేర్కొంది. మొత్తం 1,095 మృతుల్లో 92 మంది మహిళలు, 287 మంది చిన్నారులు ఉన్నారంది. ఈ దాడులకు ఐఎస్ గ్రూపే ముఖ్య కారణమని పేర్కొంది. కొన్ని దాడుల వెనుక ఎవరున్నారో కూడా తెలియడం లేదని వ్యాఖ్యానించింది. అంతకు ముందు అంతర్యుద్ధ కాలంతో పోలిస్తే చాలా తక్కువే అయినప్పటికీ, పౌరుల మరణాలు ఆందోళనకరమైన విషయమని తెలిపింది. దాడులను వెంటనే ఆపేయాలని డిమాండ్ చేసింది. పౌరుల రక్షణ బాధ్యత తాలిబన్ ప్రభుత్వానిదేనని స్పష్టం చేసింది.

ఒకే దేశం.. ఒకే చట్టం సాధ్యమేనా!

ఉమ్మడి పౌరస్మృతిపై దేశంలో మళ్లీ చర్చ ఊపందుకుంది.
ఒక దేశానికి రెండు చట్టాలు కావాలా అంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూటిగానే ప్రశ్నించారు. ఒకే కుటుంబంలో ఉండే ఇద్దరు వ్యక్తులకి రెండు నిబంధనలు పెడితే దేశం ఎలా ముందుకు వెళుతుందని నిలదీశారు. ఇప్పటికే 22వ లా కమిషన్‌ను ఏర్పాటు చేసి దేశ ప్రజలు, మత సంస్థల అభిప్రాయాలను 30 రోజుల్లోగా తీసుకోవాలని గడువు విధించారు.
ఈ పరిణామాలతో అసలు ఉమ్మడి పౌరస్మృతి అంటే ఏమిటి ? అది అమలు చేయడం వల్ల ఏమవుతుంది ? అనుకూల వర్గం ఏమంటోంది? ప్రతికూలుర వాదనలు ఏంటి ?
వంటి ప్రశ్నలు చర్చనీయాంశంగా మారాయి.

ఒకే దేశం.. ఒకే చట్టం.. ఇదే ఇప్పుడు కేంద్రంలో బీజేపీ ముందున్న లక్ష్యం. బీజేపీ ఎన్నికల మ్యానిఫెస్టోలో కూడా యూనిఫామ్ సివిల్ కోడ్ (యూసీసీ) తీసుకువస్తామని హామీ ఇచ్చింది. అయోధ్య రామ మందిర నిర్మాణం, కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత బీజేపీ ఉమ్మడి పౌరస్మృతి పైనే దృష్టి సారించింది. ఉమ్మడి పౌరస్మృతి అంటే దేశవ్యాప్తంగా ఒకే పౌర చట్టం అమల్లోకి వస్తుంది. ప్రస్తుతం మన దేశంలో వివాహం, విడాకులు, దత్తత, భరణం, సంరక్షణ, వారసత్వం తదితర వ్యక్తిగత అంశాల్లో మతాలవారీగా చట్టాలు అమల్లో ఉన్నాయి. హిందువులు, ముస్లింలు, క్యాథలిక్ క్రిస్టియన్లు, పార్సీలు ఎవరికి వారు తమ మత చట్టాలనే అనుసరిస్తారు. ఇప్పుడు ఉమ్మడి పౌరస్మృతిని అమల్లోకి తీసుకువస్తే ఈ వ్యక్తిగత చట్టాలన్నీ రద్దయి అందరికీ ఒకే చట్టం అమలవుతుంది. ఇప్పటికే బీజేపీ పాలిత రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, గుజరాత్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్‌లు యూసీసీని తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నాయి.



రాజ్యాంగ హక్కులు వర్సెస్ ఆదేశిక సూత్రాలు

రాజ్యాంగంలోని ఆర్టికల్ 44 భారత పౌరులందరికీ ఒకే చట్టం వర్తించేలా యూసీసీ రూపొందించడానికి ప్రభుత్వం ప్రయత్నించాలని పేర్కొంది. రాజ్యాంగంలో ఆర్టికల్ 37 ప్రకారం ఆదేశిక సూత్రాలలో ఉన్న నిబంధనలు దేశ పరిపాలనలో ప్రాథమికమైనవి. ఈ సూత్రాలను వర్తింప జేయడం ప్రభుత్వ విధి అని స్పష్టం చేసింది. అయితే యూసీసీ అనేది ఆదేశిక సూత్రాల్లో ఒకటిగా ఉంది తప్ప రాజ్యాంగం ఇచ్చిన హక్కు కాదు. అందుకే స్వాతంత్ర్యానంతరం యూసీసీ అమలు చేయడానికి కొన్ని ప్రయత్నాలు జరిగినా అమల్లోకి రాలేదు. పర్సనల్ లా అనేది మత సంప్రదాయాలు, విశ్వాసాలకు సంబంధించినది కావడంతో వారి మనోభావాలు దెబ్బ తీసేలా యూసీసీ తీసుకురావడం అంత సులభం కాదన్న వాదనలు ఉన్నాయి.

షాబానో కేసుతో మలుపు

రాజ్యాంగాన్ని రచించిన సమయంలోనే ఉమ్మడి పౌరస్మృతి ఉండాలని అప్పటి నాయకులు గుర్తించారు. భవిష్యత్‌లోనైనా దేశవ్యాప్తంగా ఒకే చట్టం తీసుకురావాలని అయితే ఇది నిర్బంధంగా కాకుండా స్వచ్ఛందంగా అమల్లోకి వస్తే బాగుంటుందని భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్ అభిప్రాయపడ్డారు. మైనార్టీలు తిరుగుబాటు చేసే విధంగా ప్రభుత్వాలు ఎలాంటి నిర్ణయాలు తీసుకోకూడదు అని ఆయన అప్పట్లోనే వ్యాఖ్యానించారు. ఆ తర్వాత యూసీసీని తీసుకురావాలని ప్రభుత్వం పెద్దగా ప్రయత్నాలు చేయలేదు. 1985లో షా బానో కేసుతో యూసీసీ ఆవశ్యకత ఉందన్న అభిప్రాయం బలంగా వచ్చింది. మధ్యప్రదేశ్‌కు చెందిన షాబానో అనే ముస్లిం మహిళ 40 ఏళ్ల వైవాహిక జీవితం తర్వాత మూడు సార్లు తలాక్ చెప్పి తనకు విడాకులిచ్చిన భర్త నుంచి భరణం కోరుతూ కోర్టుకెక్కారు. సుప్రీం కోర్టు కూడా ఆమెకు జీవనభృతి చెల్లించాలని తీర్పు చెప్పింది. అయితే అప్పట్లో కేంద్రంలో అధికారంలో ఉన్న రాజీవ్ గాంధీ సర్కార్ ముస్లిం మహిళల చట్టాన్ని పార్లమెంటులో ఆమోదించింది. ఈ చట్టం ప్రకారం ముస్లిం మహిళలకు విడాకులు ఇచ్చినా భర్త భరణం ఇవ్వక్కర్లేదు. ఇలా పర్సనల్ చట్టాల్లోని సంక్లిష్టత, వివక్షను ఆయుధాలుగా చేసుకొని బీజేపీ ఉమ్మడి పౌరస్మృతి అమల్లోకి తీసుకురావాలని గట్టి పట్టుదలతో ఉంది. మన దేశంలో గోవాలో మాత్రమే ఒకే చట్టం అమలవుతోంది. 1867లో పోర్చుగల్ సివిల్ కోడ్ అమల్లోకి వచ్చింది. అది ఇప్పటికీ కొనసాగుతోంది. ఆ రాష్ట్రంలో మాత్రమే అన్ని మతాలకు ఒకే చట్టం అమల్లో ఉంది.



ఉమ్మడి పౌరస్మృతి అమల్లోకి తేవడంలో ఎన్ని అనుకూలతలు ఉన్నాయో అన్నే ప్రతికూలతలు కూడా ఉన్నాయి. దేశంలో ముస్లింలలో అభద్రతా భావం పెరిగిపోతుందన్నది ప్రధాన ఆందోళన. అటు హిందువుల్లో కూడా వ్యతిరేకత వచ్చే అవకాశాలున్నాయనే అనుమానాలున్నాయి. ఎందుకంటే నాగాలాండ్, మేఘాలయ, మిజోరం వంటి ఈశాన్య రాష్ట్రాల్లో హిందూ చట్టాల్లో కూడా తేడాలున్నాయి. 200కి పైగా ఆదివాసీ తెగలు తమ సొంత సంప్రదాయ చట్టాలనే అనుసరిస్తాయి.

అనుకూలం

రాజ్యాంగంలోని లౌకిక స్ఫూర్తికి అనుకూలంగా కులం, మతం, ప్రాంతం, వర్గం లింగ భేదాలు లేకుండా దేశవ్యాప్తంగా పౌరులందరికీ ఒకే చట్టం అమలై జాతి సమగ్రతకు దోహదపడుతుంది.

ప్రస్తుతం దేశంలో అమల్లో ఉన్న మతపరమైన పర్సనల్ చట్టాలు కాలం చెల్లిపోయినవి. ఉమ్మడి పౌర స్మృతి వస్తే అవన్నీ రద్దవుతాయి

పర్సనల్ చట్టాల్లో స్త్రీ, పురుష వివక్ష ఎక్కువగా ఉంది. ముస్లిం పర్సనల్ లా ప్రకారం పురుషులు నాలుగు పెళ్లిళ్లు చేసుకోవచ్చు. యూసీసీ వస్తే ఇలాంటి వివక్ష పోయి స్త్రీ, పురుష సమానత్వం సాధ్యపడుతుంది.

చైనాను దాటేసి ప్రపంచ జనాభాలో నంబర్ వన్ స్థానానికి చేరుకున్నాం. జనాభా పెరుగుదల వల్ల కలిగే దుష్ప్రభావాలను అరికట్టడానికి, అన్ని మతాల్లోనూ చిన్న కుటుంబాలను ప్రోత్సహించడానికి వీలవుతుంది

సుప్రీం కోర్టులో తీర్పులు చెప్పడం సులభమవుతుంది. భిన్న మతాచారాలకు సంబంధించిన కేసులు వస్తున్నప్పుడు తీర్పుల్లో విపరీతమైన గందరగోళం నెలకొంటోందని అత్యున్నత న్యాయస్థానం ఎన్నో సందర్భాల్లో స్పష్టం చేసింది. యూసీసీ ఆవశ్యకత గురించి పలు మార్లు వ్యాఖ్యలు చేసింది. దీనిని వీలైనంత తర్వగా తీసుకురావాలని కేంద్రానికి పలు కేసుల సందర్భంగా సూచించింది.

ప్రతికూలం

ఉమ్మడి పౌరస్మృతిని ముస్లిం సమాజం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. తమ మీద జరిగే మత, సాంస్కృతిక దాడిగా భావిస్తోంది. బీజేపీ మైనార్టీ వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందన్న భావన ఇప్పటికే ఉంది. యూసీసీని కూడా తీసుకువస్తే దేశంలో ఘర్షణలకు దారి తీసే అవకాశాలున్నాయి

ఉమ్మడి పౌరస్మృతిని రూపొందించడంలో సవాళ్లు ఎదురయ్యే అవకాశాలున్నాయి. పెళ్లి, విడాకులు, ఆస్తి, హక్కులు, భరణాలు వంటి వాటిపై ఏ మత ప్రాతిపదికన నిర్ణయాలు తీసుకుంటారన్నది అతి పెద్ద సమస్యగా మేధోవర్గం భావిస్తోంది.

యూనిఫామ్ సివిల్ కోడ్‌ని తీసుకురావడం కోసం 2016లో మోదీ ప్రభుత్వం ప్రయత్నాలు చేసింది. అప్పట్లో ఏర్పాటు చేసిన 21వ లా కమిషన్ దీనిని తీసుకురావడం ఏ మాత్రం వాంఛనీయం కాదని నివేదిక ఇచ్చింది. అప్పుడున్న పరిస్థితులకి, ఇప్పటికి పెద్ద తేడా ఏమీ రాలేదు.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 ద్వారా సంక్రమించే మత స్వేచ్ఛ, మైనార్టీ హక్కుల్ని పరిరక్షించే ఆర్టికల్ 29కి యూసీసీ అడ్డంకిగా మారుతుంది

బ్రిటిష్ పాలకుల్ని కూడా అబ్బురపరిచిన భిన్నత్వంలో ఏకత్వం మన దేశం సొంతం. యూసీసీని తీసుకువస్తే సమాజంలో ఆ వైవిధ్యం దెబ్బ తింటుందన్న ఆందోళనలు ఉన్నాయి.

సాక్షి, నేషనల్ డెస్క్

వాగ్నర్ సేనకు రష్యా క్షమాభిక్ష

మాస్కో: వాగ్నర్ సైన్యం తిరుగుబాటును నిలిపేయడంతో ఆ సైన్యం చీఫ్ ప్రిగోజిన్, అతని బలగాలకు రష్యా ప్రభుత్వం క్షమాభిక్ష ప్రసాదించింది. వారిపై ఎలాంటి క్రిమినల్ విచారణ ఉండదని ప్రకటించింది. 24 గంటల్లోపే వారు తమ కార్యకలాపాలను ఆపేయడంతో ఈ కేసును నిలిపివేస్తున్నట్టు ఫెడరల్ సెక్యూరిటీ సర్వీస్ తెలిపింది. ఉక్రెయిన్‌తో 16 నెలలుగా యుద్ధం సాగుతున్న నేపథ్యంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ అధికారానికి ముప్పుగా పరిణమించిన సంఘటనల వరుసలో ఇది తాజా మలుపు. ప్రస్తుత సంక్షోభాన్ని నివారించే లక్ష్యంతో ప్రిగోజిన్‌కు పుతిన్ కొన్ని వాగ్దానాలు చేశారని, మరికొన్ని హామీలు ఇచ్చారని క్రెమ్లిన్ ప్రతినిధి చెప్పారు. వాగ్నర్ గ్రూప్‌కు ఏడాదిలో రూ.8 వేల కోట్లకు పైగా చెల్లించినట్లు అధ్యక్షుడు పుతిన్ వెల్లడించారు. ఆ గ్రూపు బలగాలకు జీతాలు, అలవెన్సులను సమకూర్చామన్నారు. ఆ డబ్బును ఎలా ఖర్చు చేశారన్న విషయమై అధికారులు దర్యాప్తు చేస్తారని పుతిన్ చెప్పారు. ఇలా ఉండగా, ప్రిగోజిన్ తమ దేశంలోనే ఉన్నారని బెలారస్ అధ్యక్షుడు అలెగ్జాండర్ లుకషెంకో ప్రకటించారు. అతని బలగాలు కూడా కొంతకాలం పాటు బెలారస్‌లోనే ఉంటాయని వెల్లడించారు. రష్యా మిలిటరీ ఆధీనంలో పనిచేయడానికి ఒప్పందాలపై సంతకం చేయడానికి జూలై 1 గడువు కంటే ముందే తన దళాలు తమ ఆయుధాలను మార్చుకోవడానికి సిద్ధమవుతున్నాయని ప్రిగోజిన్ తెలిపారు.

యూపీలో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ హతం

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో కౌశంబి జిల్లాలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ హతమయ్యాడు. ప్రతాప్‌గఢ్ జిల్లాకు చెందిన గుఫ్రాన్‌పై 12కి పైగా క్రిమినల్ కేసులున్నాయి. సందా గ్రామం దగ్గర ఉత్తరప్రదేశ్ ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ జరిగిన ఎదురుకాల్పుల్లో గుఫ్రాన్ గాయపడ్డాడు. వెంటనే అతనిని జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతను మరణించినట్టు వైద్యులు ప్రకటించారు. గుఫ్రాన్‌పై 13 హత్య కేసులతో పాటు హత్యాయత్నం, దోపిడీ, లూటీ వంటి కేసులున్నాయి. అతని తలపై రూ.1.25 లక్షల రివార్డు కూడా ఉంది.

10 రాజ్యసభ స్థానాలకు జూలై 24న ఎన్నికలు

న్యూఢిల్లీ: పది రాజ్యసభ స్థానాలకు జూలై 24న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం (ఈసీ) మంగళవారం వెల్లడించింది. ఈ పది స్థానాల్లో ఎంపీల పదవీకాలం జూలై, ఆగస్టుల్లో ముగియనుంది. వినయ్ టెండూల్కర్ (బీజేపీ-గోవా), విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్, దినేశ్‌చంద్ర అనవదియా, జుగల్‌సిన్హ్ లోఖండ్‌వాలా (గుజరాత్)ల రాజ్యసభ పదవీకాలం ముగియనుంది. అలాగే బెంగాల్ నుంచి డెరెక్ ఒబ్రియాన్, డోలా సేన్, సుస్మితా దేవ్, శాంత చెత్రి, సుఖేందు శేఖర్ రాయ్, ప్రదీప్ భట్టాచార్యల స్థానాలు కూడా ఖాళీ కానున్నాయి. ఈ పది స్థానాలకు జూలై 24న ఎన్నికలు నిర్వహిస్తామని, అదేరోజు కౌంటింగ్ ఉటుందని ఈసీ తెలిపింది.

కుటుంబ పార్టీలపై మోదీ ధ్వజం

వారికి ఓటేస్తే ఆ కుటుంబాలే బాగుపడతాయి

- మీ కుటుంబాల సంక్షేమం కోరుకుంటే బీజేపీకే ఓటేయండి
- ప్రతిపక్ష పార్టీలది లక్షల కుంభకోణాల చరిత్ర
- ఉమ్మడి పౌరస్మృతి అవసరం ఎంతో ఉంది
- రెండు చట్టాలతో దేశం ఎలా నడుస్తుంది?
- భోపాల్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యలు



భోపాల్: దేశంలోని కుటుంబ పార్టీలపై ప్రధాని మోదీ నిప్పులు చెరిగారు. ఆయా పార్టీలకు ఓటేస్తే కొన్ని కుటుంబాలు బాగుపడతాయే తప్ప, ప్రజలకు ఒరిగేదే ఉండదన్నారు. తమ బీజేపీకి ఓటేస్తే అన్ని కుటుంబాలకు మంచి జరుగుతుందని చెప్పారు. పట్నాలో ఇటీవల జరిగిన ప్రతిపక్ష నేతల సమావేశాన్ని ఆయన ఫొటో షూట్‌గా అభివర్ణించారు. ఆయా పార్టీలన్నిటికీ కుంభకోణాల చరిత్ర ఉందంటూ నిప్పులు చెరిగారు. దేశంలో ఉమ్మడి పౌరస్మృతి అవసరం ఎంతో ఉందని పేర్కొన్న మోదీ..ఈ విషయంలో ప్రతిపక్షాలు ముస్లింలను తప్పుదోవ పట్టిస్తున్నాయంటూ విమర్శలు గుప్పించారు. 2024 ఎన్నికల్లో బీజేపీని ఎదుర్కొనే ఏకైక లక్ష్యంతో ఏకతాటిపైకి వచ్చేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నాలు వేగవంతం చేసిన సమయంలో ప్రధాని మోదీ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. మంగళవారం మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో బీజేపీ చేపట్టిన 'మేరా బూత్ సబ్ సే మజ్ బూత్'కార్యక్రమంలో కార్యకర్తలనుద్దేశించి ప్రధాని మోదీ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణలోని బీఆర్ఎస్ సహా దేశంలోని కుటుంబ పార్టీల తీరును ఎండగట్టారు. ఆయన ఏమన్నారంటే.. 'తెలంగాణ సీఎం కె.చంద్రశేఖర్ రావు కూతురు సంక్షేమం కోరుకుంటున్న వారయితే బీఆర్ఎస్‌కు ఓటేయండి. గాంధీల కుటుంబం అభివృద్ధిని మీరు కోరుకుంటే కాంగ్రెస్‌కు ఓటేయండి. ములాయం సింగ్ కొడుకు కుటుంబం సంక్షేమం కోరుకున్నట్లయితే సమాజ్‌వాదీ పార్టీ(ఎస్‌పీ)కి ఓటేయండి. లాలూ ప్రసాద్ యాదవ్ కొడుకులు, కూతుళ్ల సంక్షేమం కావాలనుకుంటే ఆర్‌జేడీకి, శరద్ పవార్ కూతురు అభివృద్ధి చెందాలంటే ఎన్సీపీకి ఓటేయండి. అబ్దుల్లా కుటుంబం బాగుండాలని భావిస్తే నేషనల్ కాన్ఫరెన్స్‌కు, కరుణానిధి కుటుంబం సంక్షేమం కోరుకుంటున్నట్లయితే డీఎంకేకు ఓటేయండి. 'మీరు ఇంట్లో మీ కొడుకులు, కూతుళ్లు, మనవల సంక్షేమం కోరుకుంటున్న వారయితే కుటుంబపార్టీలను వదిలేసి, బీజేపీకే ఓటేయండి'అని ఆయన పిలుపునిచ్చారు.

రాజ్యాంగం కూడా చెప్పింది

దేశంలో ఉమ్మడి పౌరస్మృతి(యూసీసీ)అవసరం ఎంతో ఉందని ప్రధాని మోదీ నొక్కిచెప్పారు. పౌరులందరికీ సమాన హక్కులుండాలన్న విషయాన్ని రాజ్యాంగం ప్రస్తావించిందని ఆయన పేర్కొన్నారు. సుప్రీంకోర్టు కూడా యూసీసీకి మద్దతు తెలిపింది..అయితే ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్న వాళ్లు దానిని వ్యతిరేకిస్తున్నారని ఆరోపించారు. బుజ్జగింపు, ఓటు బ్యాంకు రాజకీయాల విధానాలకు బదులుగా, సంతృప్తికర విధానాలను అనుసరించాలని పార్టీ నిర్ణయించిందని ఆయన వెల్లడించారు. యూసీసీతో వివాహం, విడాకులు, అనువంశికత, భరణం, ఆస్తి వారసత్వం వంటి వాటిలో ఒకే చట్టం అమలవుతుందని చెప్పారు. ముస్లింలను తప్పుదోవ పట్టించేందుకు, రెచ్చగొట్టేందుకు ప్రతిపక్షాలు ఈ అంశాన్ని వాడుకుంటున్నాయన్నారు. 'ఒకే ఇంట్లో ఒకరికి ఒక న్యాయం, ఇంకొకరికి ఇంకో రకమైన న్యాయం ఉంటే ఎలా ఉంటుందో మీరే చెప్పండి? అలా ఆ ఇంటిని నడపటం సాధ్యమేనా? ఇలాగే రెండు రకాలైన వ్యవస్థలతో దేశం ఎలా పనిచేయగలదు? అందరికీ సమాన హక్కులుండాలన్న విషయాన్ని రాజ్యాంగం కూడా ప్రస్తావించిందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి'ప్రధాని అన్నారు. బుజ్జగింపు విధానాల కారణంగానే యూపీ, బిహార్, కేరళ, తెలంగాణ, తమిళనాడు సహా పలు రాష్ట్రాల్లోని చాలా కులాల వారు వెనుకబాటుకు గురవుతున్నారన్నారు.

ట్రిపుల్ తలాక్‌తో బిడ్డలకు అన్యాయం

'ట్రిపుల్ తలాక్ పద్ధతికి మద్దతిచ్చే వారు ముస్లిం ఆడబిడ్డలను తీవ్ర అన్యాయానికి గురిచేస్తున్నారు. ఈ పద్ధతి ఈజిప్టులో 80–90 ఏళ్ల క్రితమే రద్దయింది. ఇది అవసరమే అయితే పాకిస్తాన్, ఖతర్, ఇతర ముస్లిం మెజారిటీ దేశాలు ఎందుకు నిషేధించాయి? ట్రిపుల్ తలాక్‌తో ముస్లిం కుటుంబాలకు నష్టం జరుగుతుంది. అది ఇస్లాంలో అత్యవసర భాగమే అయితే, ఖతర్, జోర్డాన్, ఇండోనేసియాలు ఎందుకు నిషేధించాయి'అని ప్రధాని మోదీ ప్రశ్నించారు.

వారిది ఫొటో షూట్

ఈ నెల 23న బిహార్ రాజధాని పట్నాలో ప్రతిపక్ష పార్టీల నేతల భేటీపై ప్రధాని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అది డజనుకుపైగా పార్టీల ఫొటో షూట్ అని వ్యాఖ్యానించారు. 'సమావేశంలో పాల్గొన్న పార్టీలన్నిటిదీ రూ.20 లక్షల కోట్ల కుంభకోణాల చరిత్ర. ఒక్క కాంగ్రెస్ పార్టీ కుంభకోణాల విలువే లక్షల కోట్లలో ఉంటుంది. కాంగ్రెస్ పార్టీకి బొగ్గు, 2జీ, కామన్ వెల్త్ తదితర స్కాంలతో సంబంధముంది. ఆర్‌జేడీ, డీఎంకే, టీఎంసీ, ఎన్‌సీపీలకూ కుంభకోణాల చరిత్ర ఉంది'అని ఆరోపించారు. ఒకప్పుడు ఒకరినొకరు తీవ్రంగా విమర్శించుకున్న ఈ పార్టీలే నేడు అధికారం కోసం ఒక చోటికి చేరాయని చెప్పారు. బీజేపీకి వ్యతిరేకంగా ఏకమైన వీరిపై కోపం కాదు, సానుభూతి చూపాలని కార్యకర్తలను కోరారు.

2024లోనూ మనదే గెలుపు

2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ బీజేపీ విజయం వైపు దూసుకుపోతుందని ప్రధాని విశ్వాసం వ్యక్తం చేశారు. గత ఏడాది యూపీలోని ముస్లిం మెజారిటీ లోక్‌సభ స్థానాలైన ఆజంగఢ్, రాంపూర్‌లలో లభించిన గెలుపుతో ఉత్సాహంతో ఉన్నామన్నారు. 2024 ఎన్నికల్లో మరోసారి బీజేపీకే అధికారం అప్పగించాలని ప్రజలు ఇప్పటికే నిర్ణయానికి వచ్చారని చెప్పారు. ప్రస్తుతం గ్యారెంటీలతో రాజకీయాలు నడుస్తున్నాయని వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాలు ఇస్తున్న ఈ హామీలతో లక్షల కోట్ల కుంభకోణాలు గ్యారెంటీ అని ప్రధాని ఎద్దేవా చేశారు. ఈ స్కాములతో సంబంధాలున్న వారిపై తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ప్రకటించారు. ఈ విషయాన్ని ప్రజల్లో ప్రచారం చేయాలని కార్యకర్తలకు సూచించారు. 'మనం ఏసీ కార్యాలయాల్లో కూర్చుని, ఆదేశాలివ్వం. కఠినమైన వాతావరణ పరిస్థితులను సైతం ఎదుర్కొంటూ ప్రజల వెంటే ఉంటాం'అని ఆయన అన్నారు.

ఒకేరోజు 5 వందే భారత్ రైళ్లు

ముఖ్య నగరాలకు కనెక్టివిటీ పెరుగుతుందన్న ప్రధాని మోదీ



భోపాల్‌లో తను గీచిన చిత్రాన్ని ప్రధానికి ఇస్తున్న విద్యార్థిని

భోపాల్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం ఒకేరోజు అయిదు వందే భారత్ రైళ్లకు పచ్చజెండా ఊపారు. ఆయన మంగళవారం మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లోని రాణి కమలాపతి రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి ఆయన రెండు రైళ్లను ప్రారంభించారు. వర్చువల్‌గా మరో మూడింటికి పచ్చజెండా ఊపారు. ఈ సందర్భంగా ప్రధాని వందే భారత్ రైలులోని విద్యార్థులు, సిబ్బందితో ముచ్చటించారు. రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, మధ్యప్రదేశ్ గవర్నర్ మంగుభాయ్ పటేల, సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర మంత్రులు నరేంద్ర సింగ్ తోమర్, జ్యోతిరాదిత్య సింధియా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ అయిదు రైళ్ల మధ్యప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, గోవా, బిహార్, జార్ఖండ్‌ల్లో కనెక్టివిటీని మెరుగుపరుస్తాయని అనంతరం ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. వందే భారత్ రైళ్ల అయిదింటిని ఒకే రోజు ప్రారంభించడం ఇదే తొలిసారి. ఈ సెమీ హైస్పీడ్ రైళ్ల ఏవంటే..రాణి కమలాపతి(భోపాల్)–జబల్పూర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్, ఖజురహో–భోపాల్–ఇండోర్ వందేబారత్ ఎక్స్‌ప్రెస్, మడ్గావ్(గోవా)–ముంబై వందేభారత్ ఎక్స్‌ప్రెస్, ధార్వాడ్–బెంగళూరు వందే భారత్ ఎక్స్‌ప్రెస్, హతియా– పట్నా వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఉన్నాయని పీఎంవో ఒక ప్రకటనలో వివరించింది. రాణి కమలాపతి– జబల్పూర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు మహాకౌశల్ ప్రాంతంతో భోపాల్ సెంట్రల్ రీజియన్‌ను కలుపుతుంది. ఈ మార్గంలో అనేక ప్రముఖ పర్యాటక ప్రాంతాలున్నాయని తెలిపింది. ఈ మార్గంలో అత్యధిక వేగంతో ప్రయాణించే రైలు కంటే వందే భారత్ రైలు అరగంట వేగంగా వెళ్తుందని వివరించింది. హతియా– పట్నా రైలు ప్రయాణంతో గంటన్నర సమయం ఆదా అవుతుందని తెలిపింది. మిగతా రైళ్లు కూడా పర్యాటక ప్రాంతాలను అనుసంధానిస్తాయని పేర్కొంది. విద్యార్థులు, వ్యాపారులకు కూడా ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని పీఎంవో తెలిపింది.

ఎయిరిండియా విమానంలో ప్రయాణికుడి అసహ్యకర ప్రవర్తన

న్యూఢిల్లీ: ఈ నెల 24న ఢిల్లీ–ముంబై ఎయిరిండియా విమానంలో ఓ ప్రయాణికుడు అసహ్యకరంగా ప్రవర్తించాడు. విమానంలోనే మల, మూత్ర విసర్జన చేశాడు. ఢిల్లీ ఎయిర్‌పోర్టులో విమానం ల్యాండయ్యాక సదరు వ్యక్తిని భద్రతా సిబ్బందికి అప్పగించినట్లు ఎయిరిండియా ఒక ప్రకటనలో తెలిపింది. ఘటనపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ)కి తెలిపి, పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించింది. విమానం లోపల తొమ్మిదో వరుసలో రాంసింగ్ అనే వ్యక్తి మల, మూత్ర విసర్జన జరపడంతోపాటు ఉమ్మి వేశాడు. అనుచిత ప్రవర్తన గమనించిన సిబ్బంది అతడిని హెచ్చరించి, మిగతా ప్రయాణికులకు దూరంగా ఉంచామని ఎయిరిండియా పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. రాం సింగ్‌పై ఐపీసీ సెక్షన్లు–294(అసభ్య చేష్టలు), 510(మద్యం మత్తులో అనుచిత ప్రవర్తన) కింద కేసు నమోదు చేశామని ఢిల్లీ పోలీసులు తెలిపారు. విమానాల్లో ప్రయాణికులు అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఘటనలు ఇటీవలి కాలంలో ఎక్కువయ్యాయి.

మణిపూర్‌కు సాయం చేసేందుకు అవకాశమివ్వండి

ఇంఫాల్: ఈశాన్య రాష్ట్రాల్లో శాంతిని పునరుద్ధరించేందుకు ప్రజలు తమకు సహాయం చేయాలనిఆర్మీ కోరింది. సహాయక చర్యలందించడానికి తాము వెళ్లకుండా మహిళా ఉద్యమకారులు రోడ్లపై అడ్డంకులు సృష్టిస్తున్నారని, తమ కార్యకలపాలకు ఆటంకం కలిగిస్తున్నారని ఆర్మీ తెలిపింది. ఇలాంటి అనవసర జోక్యం వల్ల భద్రతా బలగాలు సరైన సమయానికి చేరుకోలేకపోతున్నాయని ఆర్మీ ట్విట్టర్‌లో సోమవారం ఓ వీడియో విడుదల చేసింది. ''శాంతి పునరుద్ధరణకోసం కార్యక్రమాలకు మద్దతు ఇవ్వాలని అన్ని వర్గాల ప్రజలను ఇండియన్ ఆర్మీ కోరుతోంది. మణిపూర్‌కు సాయం చేసేందుకు మాకు సాయం చేయండి'' అంటూ ట్వీట్ చేసింది. తూర్పు ఇంఫాల్‌లోని ఇథం గ్రామంలో ఆర్మీ, మహిళల నేతృత్వంలోని ఓ సమూహం మధ్య శనివారం రోజంతా ప్రతిష్టంభన నెలకొంది. దీంతో ఆర్మీ 12 మంది ఉగ్రవాదులను వదిలిపెట్టింది. ఈ ఘటన జరిగిన రెండు రోజుల తరువాత ఆర్మీ ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. 2015లో 6 డోగ్రా యూనిట్‌పై ఆకస్మిక దాడితో సహా అనేక దాడుల్లో పాల్గొన్న మైతీ మిలిటెంట్ గ్రూప్ అయిన కంగ్లీ యాహోల్ కన్న లుప్ (కేవైకేఎల్)కు చెందిన 12 మంది సభ్యులు గ్రామంలో దాగి ఉన్నారని వారు తెలిపారు. భద్రతా సిబ్బంది ఆయుధాలు, మందుగుండు సామగ్రిని కూడా వారు స్వాధీనం చేసుకున్నారు. షెడ్యూల్డ్ తెగ (ఎస్టీ) హోదా కోసం మైతీ కమ్యూనిటీ డిమాండ్‌కు వ్యతిరేకంగా కొండ జిల్లాల్లో మే 3న 'ఆదివాసి సంఘీభావ యాత్ర' నిర్వహించిన తర్వాత మొదట ఘర్షణలు చెలరేగడం, ఈశాన్య రాష్ట్రంలో మైతీ, కుకీ కమ్యూనిటీల మధ్య చెలరేగిన హింసలో ఇప్పటివరకు 100 మందికి పైగా ప్రాణాలు కోల్పోవడం తెలిసిందే. ఈ నేపథ్యంలో తమ కార్యకలాపాలకు సహకరించండంటూ ఆర్మీ విజ్ఞప్తి చేస్తోంది.

మమతకు గాయాలు

హెలికాప్టర్ ఎమర్జెన్సీ ల్యాండింగ్‌తో ప్రమాదం

కోల్‌కతా: ప్రతికూల వాతావరణ పరిస్థితుల మధ్య పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ మంగళవారం సెవోక్ వైమానిక స్థావరంలో అత్యవసరంగా ల్యాండింగ్ అయింది. ఆకాశంలో దట్టంగా మబ్బులు కమ్ముకొని భారీగా వర్షాలు కురుస్తూ ఉండడంతో ముందున్నది కనిపించక హెలికాప్టర్‌ను అత్యవసరంగా ల్యాండ్ చేయాల్సి వచ్చింది. ల్యాండింగ్ సమయంలో మమత మోకాళ్లకి, వీపుకి గాయాలయ్యాయి. దీంతో చికిత్స కోసం ఆమెను కోల్‌కతాలో ఎస్ఎస్‌కేఎం ఆస్పత్రికి తరలించారు. జల్పాయ్‌గురిలోని క్రాంతి బహిరంగ సభలో మాట్లాడి బాగ్‌డోగ్రాకు వెళుతుండగా ఈ ఘటన జరిగింది. రానున్న పంచాయతీ ఎన్నికల కోసం మమత రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

ఫిబ్రవరిలో లోక్‌సభ ఎన్నికలు

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మరో ఆరునెలలు మాత్రమే ఉంటుందని మమతా బెనర్జీ అన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చిలో లోక్‌సభ ఎన్నికలు జరుగుతాయని అందులో అధికార బీజేపీకి ఓటమి ఖాయమన్నారు. జల్పాయ్‌గురి జిల్లాలో జరిగిన ఒక ర్యాలీలో మమత మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఓడిపోవడం ఖాయమన్నారు. సరిహద్దు భద్రతా దళం (బీఎస్‌ఎఫ్) నిష్పాక్షికంగా పని చేయాలన్నారు. ఇటీవల బీఎస్‌ఎఫ్ కాల్పుల్లో మరణించిన వారి కుటుంబాలకు 2 లక్షల నష్టపరిహారం, ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామన్నారు.



సాక్షి హైదరాబాద్

బుధవారం : 28 : జూన్ : 2023



థ్యాంక్యూ పోలీస్ అంకుల్

'సమయానికి నన్ను ఆస్పత్రికి తీసుకెళ్లి కాపాడినందుకు థ్యాంక్యూ' అంటూ ఓ అయిదేళ్ల బాలుడు నారాయణగూడ పోలీసులకు కృతజ్ఞతలు చెప్పాడు. -8లో



ఫీజు బకాయిలు విడుదల చేయాలి

కాలేజీ విద్యార్థుల ఫీజుల బకాయిలను విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. -8లో

సమష్టి కృషితోనే పరిశుభ్రత



బక్రీద్ నేపథ్యంలో జంతు వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పారవేయకుండా వీధులను పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ సూచించారు. -8లో

న్యూస్‌రీల్

సీఎం కేసీఆర్‌తోనే ఆలయాలకు ఆధ్యాత్మిక శోభ

- దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

చిలకలగూడ: తెలంగాణలోని ఆలయాలకు ఆధ్యాత్మిక శోభను చేకూర్చిన ఘనత సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్‌కే దక్కుతుందని దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్‌లోని శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఆయన కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీర్ణోద్ధరణ ఆలయాల అభివృద్ధికి నిధుల కేటాయింపు, అర్చకులకు వేతనాలు, ధూప దీప నైవేద్యం వంటి పథకాలను ప్రవేశపెట్టి ఆధ్యాత్మిక తెలంగాణను సీఎం కేసీఆర్ ఆవిష్కరించారని కొనియాడారు. శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం కుటుంబ సభ్యులు, స్థానిక కార్పొరేటర్ సామల హేమలతతో కలిసి బాలాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రాజేష్‌కుమార్, ధర్మకర్తల మండలి చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు వేణుగోపాలరావు, పునర్నిర్మాణ కమిటీ ప్రతినిధులు లక్ష్మీనారాయణ, కేజీ నారాయణన్, బాలభాస్కర్, శివశంకరన్, సుజయ్ ప్రకాశ్, ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

బండ్లగూడ ఫ్లాట్‌లకు భారీ డిమాండ్

సాక్షి, సిటీబ్యూరో: నాగోల్ బండ్లగూడ రాజీవ్ స్వగృహ (సహ భావన టౌన్‌షిప్)లో మిగిలిన ఫ్లాట్‌ల కొనుగోలుకు బిడ్డర్‌లు పోటీపడ్డారు. సోమవారం జరిగిన బహిరంగ వేలంలో 7 ట్రిపుల్ బెడ్రూం (డీలక్స్) ఫ్లాట్లకు 86 మంది బిడ్డర్లు, 6 ట్రిపుల్ బెడ్రూం ఫ్లాట్లకు 108 మంది బిడ్డర్‌లు పోటీ పడగా, మరో 21 డబుల్ బెడ్రూం ఫ్లాట్లకు 167 మంది బిడ్డర్‌లు ఓపెన్ యాక్షన్‌లో పాల్గొన్నట్లు హెచ్‌ఎండీఏ అధికారులు తెలిపారు. మొత్తం 34 ఫ్లాట్లను బిడ్డర్‌లు కొనుగోలు చేశారు. మరో 226 సింగిల్ బెడ్రూం ఫ్లాట్‌లకు అధికారులు మంగళవారం వేలం నిర్వహించారు. ఈ నెల 30వ తేదీ శుక్రవారం వరకు వరుసగా 4 రోజుల పాటు ఈ వేలం కొనసాగనున్నట్లు అధికారులు తెలిపారు. గతంలో లాటరీ ప్రాతిపదికన బండ్లగూడ ఫ్లాట్ల అమ్మకాలకు వచ్చిన రేటు కంటే ఈసారి బిడ్డింగ్ ద్వారా ఎక్కువ ధరకు అమ్ముడైనట్లు అధికారులు పేర్కొన్నారు.

పాతబస్తీ బోనాలపై మంత్రి సమీక్ష నేడు

చార్మినార్: పాతబస్తీలో ఈసారి జరిగే ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 28న సాలార్‌జంగ్ మ్యూజియం ఆడిటోరియం హాల్‌లో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఈ సమావేశం ఈ నెల 26న నిర్వహించనుండగా... అనివార్య కారణాలతో వాయిదా పడి 28న నిర్వహించనున్నారు. బోనాల జాతర ఉత్సవాల నిర్వహణ, ఏర్పాట్లపై మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వివిధ ప్రభుత్వ విభాగాల ఉన్నతాధికారులతో పాటు పాతబస్తీలోని బోనాల జాతర ఉత్సవాల నిర్వాహకులతో ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించనున్నారు. ఇప్పటి వరకు పాతబస్తీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ఏయే అభివృద్ధి పనులు ఎక్కడెక్కడ నిర్వహించనున్నారు అనే అంశాలపై చర్చించనున్నారు.



బక్రీద్‌కు భలే పొట్టేళ్లు!

ఈ నెల 29న బక్రీద్ నేపథ్యంలో నగరంలో పొట్టేళ్ల సందడి ప్రారంభమైంది. ప్రత్యేకంగా పాతబస్తీలో గొర్రెలు, మేకల విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి. 35– 70 కిలోల బరువున్న పొట్టేళ్లు రూ.12 వేల నుంచి రూ.26 వేల వరకు ధర పలుకుతున్నాయి. మిగతా రాష్ట్రాల పొట్టేళ్లతో పోలిస్తే తెలంగాణ పొట్టేళ్లు రూ.20 వేల పైచిలుకు ధరలున్నాయి. ఆకర్షణీయంగా పెద్ద పెద్ద కొమ్ములతో భారీగా ఉండే పొట్టేళ్ల ధరలు రూ.1.5 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఉన్నాయి. బక్రీద్‌ను సందర్భంగా నగరంలో రూ.240 కోట్ల వ్యాపారం జరగనున్నట్లు సమాచారం.

– సాక్షి, సిటీబ్యూరో







జియాగూడలో..

ఇక.. బల్దియా ఫ్రెష్‌రూమ్స్

మల్టీపర్పస్ పబ్లిక్ బాత్రూమ్స్ ఏర్పాటుకు చర్యలు

- సీఎస్సార్ కింద ప్రైవేటు సంస్థకు బాధ్యతలు
- 14 ఏళ్ల పాటు నిర్వహణకు ఒప్పందం
- గ్రేటర్ పరిధిలో 23 ప్రాంతాల్లో ఏర్పాటు

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలోని ఎంపిక చేసిన ప్రాంతాల్లో ప్రజల సదుపాయార్థం మల్టీపర్పస్ ఫ్రెష్‌రూమ్స్ ఏర్పాటుకు జీహెచ్‌ఎంసీ సిద్ధమైంది. నగరంలోని వివిధ ప్రాంతాల్లో క్షేత్రస్థాయి సర్వే చేసిన 'ది అర్బన్ లూ' సంస్థ 25 ప్రాంతాల్లో మల్టీ పర్పస్ పబ్లిక్ ఫ్రెష్‌రూమ్స్ ఏర్పాటు చేసేందుకు జీహెచ్‌ఎంసీని సంప్రదించింది. సీఎస్సార్ కింద సదరు ఫ్రెష్‌రూమ్స్ నిర్మాణంతోపాటు 14 సంవత్సరాల వరకు నిర్వహణ బాధ్యతలు సైతం తమకే అప్పగించాల్సిందిగా కోరింది. సాధారణ టాయ్‌లెట్స్‌లో లేని విధంగా స్నానాలు చేసే సదుపాయాలు కూడా కల్పిస్తామని తెలిపింది. క్షేత్రస్థాయి పరిస్థితులు పరిశీలించిన సంబంధిత జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్లు 23 ప్రాంతాల్లో ఈ మల్టీ పర్పస్ ఫ్రెష్‌రూమ్స్ ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేశారు. స్టాండింగ్‌కమిటీ ఆమోదం పొందాక వీటి ఏర్పాటు బాధ్యతలు 'ది అర్బన్ లూ'కు అప్పగించనున్నారు. గతంలో నగరంలో సులభ్ సంస్థకు పబ్లిక్ టాయ్‌లెట్ల ఏర్పాటుకు విధించిన నిబంధనలకు అనుగుణంగా కాంట్రాక్టు ఒప్పందం కుదుర్చుకోనున్నట్లు సంబంధిత అధికారి ఒకరు తెలిపారు. కాంట్రాక్టు ఒప్పందంలో భాగంగా వీటిల్లో యూరినల్స్ (మూత్రశాల)కు ఎలాంటి ఫీజు వసూలు చేయరు. వెస్టర్న్ కమోడ్ (మరుగుదొడ్డి) వినియోగదారులకు రూ.5, బాత్రూం వినియోగానికి (స్నానానికి) రూ.7లు యూజర్ చార్జీలుగా వసూలు చేసుకోవచ్చు. నిర్వహణ లోపాలు లేకుండా ప్రజలకు సదుపాయంగా నిర్వహణ ఉండాలి.



ఎక్కడెక్కడ..

ఖైరతాబాద్ జోన్‌లో..
నాంపల్లి రైల్వే స్టేషన్, బేగంబజార్ ఫిష్‌మార్కెట్ దగ్గర, మెహిదీపట్నం బస్టాప్, అబిడ్స్ నెహ్రూ విగ్రహం ఎదురుగా బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం దగ్గర, కోఠి బస్టాండ్, ఉస్మానియా మెడికల్ కాలేజ్ (కోఠి మెట్రోస్టేషన్ దగ్గర), కింగ్‌కోఠి బస్టాప్ చివరి గేటు దగ్గర, టోలిచౌకి ఫ్లై ఓవర్.

సికింద్రాబాద్ జోన్‌లో..
బషీర్‌బాగ్ (విజయ జ్యువెలర్స్ ఎదురుగా), వైఎంసీఏ (నారాయణగూడ), చే నెంబర్ జంక్షన్, మోండా మార్కెట్ (పాతజైలు పార్కింగ్ ఎదుట).

శేరిలింగంపల్లి జోన్‌లో..
టెలికాంనగర్ (హ్యుందాయ్ షోరూమ్ ఎదుట), మియాపూర్ క్రాస్‌రోడ్స్.

ఎల్‌బీనగర్ జోన్‌లో..
ఉప్పల్ జంక్షన్ (మెట్రో స్టేషన్ దగ్గర), ఉప్పల్‌బస్టాండ్ వెనుక, డీమార్ట్ పక్కన/సుష్మ థియేటర్ (వనస్థలిపురం), ఎల్‌బీనగర్ క్రాస్‌రోడ్స్ (ఫ్లై ఓవర్ కింద), కొత్తపేట సిగ్నల్ (పాతకోర్టు దగ్గర).

చార్మినార్ జోన్‌లో..
నల్లగొండ క్రాస్‌రోడ్స్, ఆల్‌నూర్ మసీదు (డీఆర్‌డీఓ గోడ దగ్గర), చాంద్రాయణగుట్ట ఫ్లై ఓవర్.

కూకట్‌పల్లి జోన్‌లో..
ఐడీపీఎల్ క్రాస్‌రోడ్స్(చింతల్)

వేల పబ్లిక్ టాయ్‌లెట్లు గాలికే..

గ్రేటర్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పబ్లిక్ టాయ్‌లెట్లు వివిధ కారణాలతో పనికిరాకుండా పోయాయి. గత బల్దియా ఎన్నికలకు ముందు ప్రభుత్వం ఏర్పాటు చేయమనడంతో ఎక్కడపడితే అక్కడ ఇష్టానుసారం ఏర్పాటు చేశారు. అవి ఎన్నికల ప్రచారానికి ఉపయోగపడ్డాయి తప్ప వాటికి అవసరమైన నీరు, విద్యుత్ తదితర సదుపాయాలు పట్టించుకోలేదు. నిర్వహణనూ గాలికొదిలేశారు. కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన అవి ఎందుకూ పనికిరాకుండా పోవడంపై మంత్రి కేటీఆర్ సైతం ఇటీవల వేదన వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పాటు చేసే మల్టీ పర్పస్ పబ్లిక్ ఫ్రెష్‌రూమ్స్‌తో పాత పరిస్థితుల్ని మార్చాలనే తలంపుతో అధికారులున్నారు.

ఉప్పల్ సరే.. మరి లష్కర్?



సాక్షి, సిటీబ్యూరో: ఉప్పల్ చౌరస్తాలో నిర్మించిన స్కైవాక్ అందుబాటులోకి వచ్చింది. రక్షణ శాఖ స్థలాన్ని కేటాయిస్తే మెహిదీపట్నం వద్ద మరొకటి నిర్మిస్తామని హెచ్‌ఎండీఏ ప్రకటించింది. ఇంత వరకు బాగానే ఉన్నా.. 2011లో సర్వే చేసిన సికింద్రాబాద్ స్కైవాక్ ఊసే లేకుండాపోయింది. నగరంలోనే తొలి స్కైవాక్‌గా దీన్ని నిర్మించాలని అప్పట్లో భావించిన అధికారులు ఫీల్డ్ సర్వే కూడా చేశారు. ఇది జరిగి పుష్కర కాలమైనా ఒక్క అడుగూ ముందుకు పడలేదు.

పద్మవ్యూహాన్ని తలపించే ట్రాఫిక్

- ఉమ్మడి రాష్ట్రంలో ఎన్.కిరణ్‌కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా హయాంలో హైదరాబాద్ రూపురేఖల్ని మార్చేస్తానంటూ 'ప్రాజెక్ట్ 100 రోజుల్లో' కార్యక్రమాన్ని చేపట్టారు. నగరంలో మౌలిక సదుపాయాల కల్పన, దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి విభాగాల వారీగా ప్రతిపాదనలు కూడా కోరారు. వీటిలో భాగంగా ట్రాఫిక్ విభాగం అధికారులు పంపిన ప్రపోజల్స్‌లో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో, బేగంపేట ప్రాంతంలో ప్రయాణికులకు ఉన్న ఇక్కట్లు తొలగించడానికి పెద్దపీట వేశారు. వివిధ రకాలైన అంశాలతో పాటు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ వద్ద స్కైవాక్ నిర్మించాలని ప్రతిపాదించారు.
- వీటిని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం ఫీల్డ్ విజిట్‌ను ఆదేశించింది. అత్యంత కీలకమైన జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్, హెచ్‌ఎండీఏ, వాటర్ వర్క్‌లతో సహా వివిధ శాఖలతో కలిపి ఏర్పాటు చేసి కో–ఆర్డినేషన్ కమిటీకి ఈ బాధ్యతల్ని అప్పగించింది. 2011 ఫిబ్రవరి 10న ఫీల్డ్ సర్వే చేసిన ఈ కమిటీ స్కైవాక్‌తో పాటు బేగంపేట రహదారిలో ఉన్న ట్రాఫిక్ అడ్డంకులను తొలగింపు పైనా దృష్టి పెట్టి నివేదిక రూపొందించింది.
- నిత్యం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్రాంతంలో పాదచారుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. దీనికి తోడు స్టేషన్ నుంచి ఇటు రేతిఫైల్, అటు 31 బస్టాప్‌ల మధ్య చిరు వ్యాపారుల కారణంగా మరిన్ని ఇబ్బందులు ఉంటున్నాయి. వీటికి తోడు వాహనాల రద్దీ కూడా చెప్పుకోదగ్గ స్థాయిలోనే ఉంటుంది. వెరసీ.. ఈ ప్రాంతం నిత్యం ట్రాఫిక్ నరకాన్ని తలపిస్తూ ఉంటుంది. వీటిని పరిష్కరించేందుకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ కేంద్రంగా రెండు వైపులకు స్కైవాక్ నిర్మించాలని కో–ఆర్డినేషన్ కమిటీ సూచించింది.

కాగితాలకే పరిమితం..

- పాదచారులు నడవటానికి ఉపకరించే ఈ స్కైవాక్‌లు అప్పటికి బయటి రాష్ట్రాల్లోనే వినియోగంలో ఉన్నాయి. ఫుట్‌ఓవర్ బ్రిడ్జి మాదిరి ఉండే ఈ వంతెనల్ని అంత ఎత్తులో కాకుండా నిర్మించాలని ప్రతిపాదించారు. రోడ్డు పక్కగా 5 నుంచి 6 అడుగుల ఎత్తులో ఉండాలని, పాదచారులు వీటిపై నడిచి నిర్దేశించిన ప్రాంతాలకు చేరుకునేలా డిజైన్ చేయాలని భావించారు. వీటి నిర్మాణం వల్ల రోడ్డుకు అడ్డంగా పాదచారులు నడవటం, ఎక్కడపడితే అక్కడ రోడ్డు దాటడం, చిరు వ్యాపారుల ఆక్రమణలు తదితర సమస్యలు శాశ్వతంగా తొలగుతాయని ప్రతిపాదించారు.
- ప్రయాణాల నేపథ్యంలో రేతిఫైల్ బస్టాప్ నుంచి రైల్వేస్టేషన్ వరకు, అక్కడ నుంచి '31 బస్టాప్' వరకు ఉన్న ప్రాంతంలో పాదచారుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. దీన్ని పరిగణలోకి తీసుకున్న అధికారులు తొలివిడతగా ఈ మూడు ప్రాంతాల మధ్య స్కైవాక్‌లు ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ఇప్పటికీ ఈ ప్రతిపాదనలు ఫైళ్లల్లోనే ఉండిపోయాయి. వివిధ ప్రాంతాల్లో స్కైవాక్‌లపై చర్చ జరుగుతున్నా అటు జీహెచ్‌ఎంసీ, ఇటు హెచ్‌ఎండీఏ ఎవరూ లష్కర్ స్కైవాక్ విషయం పట్టించుకోవట్లేదు.

కృత్రిమ మేధతో తొలి స్కిన్ ఎనలైజర్

నగరం వేదికగా దేశంలోనే మొదటిసారిగా ఆవిష్కరణ

- 45 సెకన్లలోనే చర్మానికి సంబంధించిన సమగ్ర సమాచారం



సాక్షి, సిటీబ్యూరో: నగరం వేదికగా దేశంలో మొదటిసారిగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ) ఆధారంగా పనిచేసే ఐదో తరం స్కిన్ ఎనలైజర్ ప్రారంభమైంది. మాదాపూర్‌లోని డాక్టర్ బాత్రాస్ క్లినిక్ వేదికగా ఈ అధునాతన ఏఐ స్కిన్ ఎనలైజర్‌ను సంస్థ రీజినల్ హెడ్ డాక్టర్ డి డేనియల్ రాజ్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా హోమియోపతి రంగంలో తీసుకువచ్చిన అధునాతన సాంకేతిక విధానం ఈ ఏఐ స్కిన్ ప్రో అని తెలిపారు. అన్ని రంగాలకు వేదికగా నిలుస్తున్న నగరంలో మొదటిసారిగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్కిన్ ప్రోను ఆవిష్కరించడంతో ఈ వైద్య సేవలు విశ్వవ్యాప్తమవుతాయని అభిప్రాయపడ్డారు. దీని ఆధారంగా కేవలం 45 సెకన్లలోనే చర్మానికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని, సంరక్షణ నియమాలను అందించే అరుదైన వినూత్న సాంకేతిక విధానమన్నారు. డాక్టర్ బాత్రాస్ క్లినిక్ వేదికగా ఏఐ హోమియో క్లియర్, పిగ్మెంటేషన్, యాంటీ ఏజింగ్, రెన్యూ వంటి విభిన్న చర్మ సంబంధిత వివరాలను అందించడంలో ఈ ఏఐ స్కిన్ ప్రో ప్రసిద్ధి గాంచిందన్నారు. నగరంలో స్కిన్ ఎలర్జీ, ఉబ్బసం, కేశాల సమస్యలు ఎక్కువగా ఉన్నట్లు గమనించామని డా.డేనియల్ అన్నారు. నీరు, కాలుష్యం కారణంగా ఈ సమస్యలు పెరుగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో భాగంగా కృత్రిమ మేధతో చేసే ఈ చికిత్స విధానాన్ని ప్రత్యక్షంగా చూపించారు.

లాభాల బాటలో ఆర్టీసీ

- మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

అఫ్జల్‌గంజ్: ప్రజల ఆకాంక్షల మేరకు ఆర్టీసీని ఆధునికీకరిస్తున్నామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. మంగళవారం మహాత్మా గాంధీ బస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పీకల్లోతు నష్టాల్లో ఉన్న ఆర్టీసీని సీఎం కేసీఆర్ నేతృత్వంలో లాభాల బాట పట్టిస్తున్నామన్నారు. కొత్తగా ఎలక్ట్రిక్, ఏసీ, ఓల్వో బస్సులను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఎండీ వీసీ సజ్జనార్ మాట్లాడుతూ... గత రెండేళ్లుగా ఆర్టీసీని ప్రజలు బాగా ఆదరిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో టీఎస్ ఆర్టీసీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సంగ్రాం సింగ్ జి పాటిల్, ఈడీలు పురుషోత్తం, మునిశేఖర్, కృష్ణకాంత్, రంగారెడ్డి ఆర్ ఎం శ్రీధర్ పాల్గొన్నారు.



రక్తదాతలను అభినందిస్తున్న మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్

నగరానికి రావాలనుకుందా?

సిటీలో మకాం కోసం సుమేరా బాను యత్నం?

- ఉగ్రవాద సంస్థ ఐఎస్‌కేపీలో ఈమెది కీలకపాత్ర
- కాలాపత్తర్‌కు చెందిన వ్యాపారితో సంప్రదింపులు
- పాతబస్తీకి వచ్చి వెళ్లిన గుజరాత్ ఏటీఎస్ అధికారులు



సుమేరా (ఫైల్)

సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ ఐఎస్ఐఎస్‌కు అనుబంధంగా ఏర్పడిన ఇస్లామిక్ స్టేట్ ఇన్ ఖొరాసన్ ప్రావెన్స్‌లో (ఐఎస్‌కేపీ) కీలక పాత్ర పోషించిన సూరత్ మహిళ సుమేరా బాను మాలిక్ హైదరాబాద్‌లో అడ్డా ఏర్పాటు చేసుకోవడానికి ప్రయత్నించిందా? అనే ప్రశ్నకు సమాధానం అవుననే అంటున్నాయి గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) వర్గాలు. మంగళవారం నగరానికి వచ్చిన ప్రత్యేక బృందం సదరు వ్యాపారి నుంచి వాంగ్మూలం నమోదు చేసుకువెళ్లింది.

ఆన్‌లైన్ ద్వారా ప్రేరణ పొంది..

- సూరత్‌కు చెందిన సుమేరా బాను ఆన్‌లైన్ ద్వారా ప్రేరణ పొంది ఐఎస్‌కేపీలో చేరింది. విదేశాల్లో ఉన్న అబు హంజాలా అనే ఉగ్రవాది ఈమెకు హ్యాండ్లర్‌గా వ్యవహరించారు. టెలిగ్రామ్ సహా వివిధ సోషల్‌మీడియా గ్రూపుల ద్వారా అతడితో సంప్రదింపులు జరిపింది. ఉత్తరాదిలోని అనేక ప్రాంతాల్లో విధ్వంసాలు పథక రచన చేసిన సుమేరా శ్రీనగర్‌కు చెందిన నలుగురితో ముఠా కట్టింది. వీళ్లు కూడా అబు హంజాలా ద్వారానే ఈమెకు పరిచయం అయ్యారు. వీరిలో ఉబేద్ నాసిర్ మీర్, హనన్ హయత్ సోల్, మహ్మద్ హాజిం షాలను ఇటీవల గుజరాత్‌లోని పోర్‌బందర్‌కు పిలిపించింది. అక్కడి ఓ హోటల్‌లో బస చేసిన సుమేరా సహా నలుగురూ విధ్వంసాలపై కుట్రలు చేశారు. దీనిపై సమాచారం అందుకున్న ఏటీఎస్ అధికారులు ఈ నెల 9న దాడి చేసి నలుగురినీ అరెస్టు చేశారు. వీరి విచారణలో శ్రీనగర్‌కు చెందిన జుబేర్ అహ్మద్ మున్షీ కూడా ముఠా సభ్యుడని తేలడంతో రెండు రోజుల క్రితం అతడినీ అరెస్టు చేశారు. కోర్టు అనుమతితో సుమేరాను అహ్మదాబాద్ ఏటీఎస్ అధికారులు తమ కస్టడీలోకి తీసుకున్నారు.
- ఈ నేపథ్యంలోనే తాను హైదరాబాద్‌లో మకాం ఏర్పాటు చేసుకోవడానికి ప్రయత్నం చేసినట్లు వెలుగులోకి వచ్చింది. కాలాపత్తర్ ప్రాంతానికి చెందిన ఓ మెడికల్ షాపు యజమానితో ఈమెకు సోషల్ మీడియా ద్వారా పరిచయమైంది. కొన్నాళ్లు అతడితో సంప్రదింపులు జరిపిన సుమేరా తనకు హైదరాబాద్‌లో టీచర్ ఉద్యోగం కావాలని కోరింది. దాని కోసమే కాలాపత్తర్ వ్యాపారితో అనేకసార్లు ఫోనులోనూ మాట్లాడింది. సాంకేతికంగానూ ఈ విషయం నిర్ధారించిన ఏటీఎస్ అధికారులు మంగళవారం నగరానికి చేరుకున్నారు. కాలాపత్తర్‌లోని సదరు వ్యాపారి ఇంటికి వెళ్లి వాంగ్మూలం నమోదు చేశారు. అహ్మదాబాద్‌లో నమోదైన సుమేరా కేసులో ఇతడిని సాక్షిగా పరిగణిస్తున్నారు. భర్త నుంచి 2021లో వేరైన ఆమెకు ఇద్దరు సంతానం ఉన్నట్లు సమాచారం. మరోపక్క సుమేరా హైదరాబాద్‌కు ఎందుకు రావాలని భావించింది? ఇక్కడ మకాం ఏర్పాటు చేసుకుని ఏం చేయాలని పథకం వేసింది? నగరంలో ఇంకా ఎవరినైనా ఐఎస్‌కేపీ వైపు మళ్లించిందా? ఎవరితోనైనా సంప్రదింపులు జరిపిందా? ఇతర అంశాలపై రాష్ట్ర నిఘా వర్గాలు ఆరా తీస్తున్నాయి. ప్రస్తుతం అహ్మదాబాద్ ఏటీఎస్ కస్టడీలో ఉన్న సుమేరాను విచారించడానికి ప్రత్యేక బృందం అక్కడకు వెళ్లాలని నిర్ణయించింది. సుమేరా బాను సోషల్ మీడియా ద్వారా గోల్కొండ ప్రాంతానికి చెందిన ఓ తండ్రి, కూతురితో సంప్రదింపులు జరిపింది. మంగళవారం వీరిద్దరూ కరీంనగర్‌లో ఓ శుభ కార్యానికి వెళ్లిన విషయం తెలిసి అక్కడికి ఏటీఎస్ బృందం వెళ్లి వారి వాంగ్మూలాలను నమోదు చేసుకుంది.

బల్కంపేట ఎల్లమ్మకు బంగారు బోనం

పాతబస్తీ కోట మైసమ్మ ఆలయం నుంచి ఊరేగింపు



గౌలిపురాలో బంగారు బోనంతో జోగిని నిషా క్రాంతి



స్వాగతం పలుకుతున్న బల్కంపేట దేవాలయ ఈఓ అన్నపూర్ణ

చార్మినార్: పోతరాజుల నృత్యాలు.. కళాకారుల ప్రదర్శనలతో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. పాతబస్తీ భక్తులు బల్కంపేట ఎల్లమ్మకు భక్తి శ్రద్ధలతో బంగారు బోనం, పట్టు వస్త్రాలను సమర్పించారు.

భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో మొదటి బోనాన్ని ఈ నెల 22న గోల్కొండ జగదాంబ అమ్మవారికి, రెండో బంగారు బోనాన్ని మంగళవారం బల్కంపేట ఎల్లమ్మ తల్లికి సమర్పించారు. గౌలిపురా దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సామూహిక ఊరేగింపు అంగరంగ వైభవంగా బయలుదేరి బల్కంపేటకు వెళ్లింది. అమ్మ వారికి నైవేద్యంతో కూడిన బంగారు పాత్రను జోగిని నిషా క్రాంతి తలపై పెట్టుకుని చేతుల్లో వీర గోలాలు పట్టుకుని దారిపొడవునా నృత్యాలు చేస్తూ భక్తులను ఉత్సాహపర్చారు. భక్తులు నీళ్లతో సాక పోసి స్వాగతం పలికారు. కాగా.. మూడో బంగారు బోనాన్ని ఈ నెల 30న జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లికి సమర్పించనున్నారు. వచ్చే నెల 2న విజయవాడ కనకదుర్గ అమ్మవారికి ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో బోనాల సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

ఓయూలో జాతీయ సదస్సు ప్రారంభం


మాట్లాడుతున్న సదస్సు కన్వీనర్ ప్రొ.శంకర్

సికింద్రాబాద్: ఓయూ క్యాంపస్ బీఈడీ కాలేజీలో రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. మంగళవారం కళాశాల బ్లాక్–సి కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన కార్యక్రమానికి సదస్సు కన్వీనర్ డాక్టర్. పారిపల్లి శంకర్ అధ్యక్షత వహించగా ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుతం అమలవుతున్న విద్యా విధానాన్ని సమీక్షించి విద్య పట్ల మన దృక్పథాన్ని మార్చుకోవాన్నారు. కార్యక్రమంలో హెడ్ ప్రొ.రామకృష్ణ, డీన్ ప్రొ. రాజేష్‌కుమార్, ఐసీఎస్ఎస్ఆర్ డైరెక్టర్ ప్రొ.సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

నూతన వీసీ వచ్చే వరకు సురేష్‌కుమార్ కొనసాగుతారు

ఇఫ్లూ అధికార వర్గాల వెల్లడి

సికింద్రాబాద్: నూతన వీసీ నియామకం జరిగేవరకు ప్రొ.సురేష్‌కుమార్ వీసీగా కొనసాగుతారని ద ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజస్ యూనివర్సిటీ (ఇఫ్లూ) అధికార వర్గాలు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నాయి. ఇఫ్లూ వీసీగా ప్రొ. సురేష్ కుమార్ ఐదేళ్ల పదవీకాలం గతేడాది ముగిసింది. అయితే ఆ తర్వాత మరో ఏడాది పాటు గడువును పొడిగించిన విషయం విదితమే. పొడిగించిన గడువు ఈ నెల 23న ముగిసినప్పటికీ నూతన వీసీ నియామకం జరిగేవరకు ప్రొ.సురేష్‌కుమార్ కొనసాగనున్నట్లు ఇఫ్లూ అధికారులు వివరించారు.

థ్యాంక్యూ పోలీస్ అంకుల్..

- టిన్నర్ తాగి బాలుడికి తీవ్ర అస్వస్థత
- డయల్–100 కాల్‌తో స్పందించి హుటాహుటిన ఆసుపత్రికి తరలించిన నారాయణ గూడ పోలీసులు
- కోలుకున్న బాలుడు


నారాయణగూడ పోలీసులతో చిన్నారి దివ్యాన్ష్

హిమాయత్‌నగర్: ''హాయ్ పోలీసు అంకుల్స్. మీరు సమయానికి స్పందించి నన్ను హాస్పిటల్‌కు తీసికెళ్లకపోతే నేను చచ్చిపోయేవాడినని మా మమ్మీ, డాడీ చెప్పారు. నన్ను కాపాడినందుకు అందరికీ థ్యాంక్యూ'' అంటూ ఓ ఐదేళ్ల చిన్నారి ముద్దొచ్చే మాటలతో నారాయణగూడ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు. ఈనెల 13న దత్తానగర్‌కు చెందిన బాలుడు దివ్యాన్ష్ ఇంట్లో ఉన్న పెయింట్ టిన్నర్ తాగడంతో అపస్మారకస్థితికి చేరుకున్నాడు. ఆ సమయంలో తల్లిదండ్రులు ఇంట్లో లేకపోవడంతో అతడి పిన్ని ఏం చేయాలో తోచక డయల్–100కు కాల్ చేసి బోరున విలపించింది. తక్షణమే స్పందించిన పెట్రోకార్ కానిస్టేబుల్ రాజు, ప్రమోద్, హోంగార్డు బాసిత్ క్షణాల్లో అక్కడికి చేరుకున్నారు. బాలుడిని పెట్రోకార్‌లో ఎక్కించుకుని ఐదు నిమిషాల్లో కింగ్‌కోఠి జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిశీలించిన వైద్యులు అతడి పరిస్థితి విషమంగా ఉందని, మెరుగైన వైద్యం కోసం నీలోఫర్ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ విషయాన్ని ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందిస్తూ బాలుడిని అదే వాహనంలో నిలోఫర్‌కు తరలించారు. దాదాపు పదిరోజులకు పైగా ఆస్పత్రిలో చికిత్స పొందిన దివ్యాన్ష్ పూర్తిగా కోలుకుని డిశ్చార్జి అయ్యాడు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి పీఎస్‌కు వచ్చిన అతను ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, అడ్మిన్ ఎస్ఐ నరేష్, ఆరోజు ప్రాణాలు కాపాడిన సిబ్బంది రాజు, ప్రమోద్, హోంగార్డు బాసిత్, తదితర సిబ్బందిని కలిసి కృతజ్ఞతలు తెలిపాడు.

ఆర్టీఏ 'స్మార్ట్' లెస్ కార్డులు

- చిప్స్‌లేని డ్రైవింగ్ లైసెన్సులు, ఆర్సీలు
- చిప్‌రీడర్స్ లేవనే సాకుతో సాంకేతికతకు మంగళం
- రవాణాశాఖ మంత్రి పువ్వాడ అసంతృప్తి
- నాణ్యత పెంచాలని అధికారులకు ఆదేశం
- త్వరలో అధునాతన ప్రింటర్లు

సాక్షి, సిటీబ్యూరో: ఆర్టీఏ 'స్మార్ట్'లెస్ కార్డులు మరోసారి చర్చనీయాంశమయ్యాయి. గతంలో వాహనదారుల పూర్తి వివరాలతో కూడిన చిప్స్‌తో నాణ్యమైన 'స్మార్ట్' కార్డులను రవాణాశాఖ అందజేసింది. అయితే గతేడాది నవంబర్ నుంచి చిప్స్‌ను తొలగించారు. డ్రైవింగ్ లైసెన్సులు, ఆర్సీల కోసం సాధారణ కార్డులనే వినియోగిస్తున్నారు. 'స్మార్ట్'లెస్ కార్డులపై స్వయంగా ఆ శాఖ మంత్రే పెదవి విరిచారు. ప్రస్తుతం ఆర్టీఏ అందజేస్తున్న డ్రైవింగ్ లైసెన్సులు, ఆర్సీలు పేలవంగా కనిపిస్తున్నాయి. గతంలో తెలుపు రంగు కార్డులపైన నలుపు, ఎరుపు రంగు అక్షరాలతో వివరాలు స్పష్టంగా ముద్రించి ఇచ్చేవారు. నాణ్యత ఉండేది. ప్రస్తుతం ఇస్తున్న చిప్‌లెస్ డ్రైవింగ్ లైసెన్స్‌లు, ఆర్సీల్లో నాణ్యత లోపించింది. కార్డులపైన ముద్రించిన వివరాలు స్పష్టంగా కనిపించడం లేదు. మరోవైపు ప్రస్తుతం వాటర్‌ప్రూఫ్ కార్డులనే ఇస్తున్నప్పటికీ తేలిగ్గా వంగిపోతున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు. గతంలో చిప్స్‌తో కూడిన స్మార్ట్ కార్డులకు రూ.200 చొప్పున ఫీజు వసూలు చేస్తుండగా, ప్రస్తుతం చిప్‌లేని కార్డులకు కూడా అంతే మొత్తం వసూలు చేయడం గమనార్హం.

ప్రతిష్టాత్మకంగా 'స్మార్ట్' సేవలు....

సుమారు 13 ఏళ్ల క్రితం ప్రతిష్టాత్మకంగా 'స్మార్ట్' కార్డులను ప్రవేశపెట్టారు. కోవిడ్ కారణంగా తైవాన్, చైనా, తదితర దేశాల నుంచి చిప్స్ దిగుమతి కావడం లేదనే కారణంతో ఏడాది క్రితం నిలిపివేశారు. ప్రస్తుతం చిప్స్ కొరత లేకపోయినా 'స్మార్ట్'కార్డులను తిరిగి వినియోగంలోకి తేవడం లేదు. వాహన తయారీ రంగంలో కీలకంగా భావించే చిప్స్ ప్రస్తుతం విదేశాల నుంచి నిరాటంకంగా దిగుమతి అవుతున్నాయి. దీంతో వాహన తయారీ రంగం కూడా తిరిగి వేగం పుంజుకుంది. రవాణాశాఖ మాత్రం వాహనాల భద్రత కోసం రూపొందించిన చిప్స్‌ను విస్మరించడం గమనార్హం. వివిధ రకాల పౌరసేవలను పారదర్శకంగా అందజేసేందుకు రవాణాశాఖ 2009లో త్రీ టైర్ వ్యవస్థను ప్రవేశపెట్టింది. అప్పటి వరకు ఉన్న టూటైర్ సాంకేతిక వ్యవస్థ స్థానంలో మరింత అభివృద్ధి చేసిన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. ఇందులో భాగంగా డ్రైవింగ్ లైసెన్సులు, ఆర్సీలు, వాహన బదిలీ పత్రాలు తదితరాలను స్మార్ట్ కార్డుల రూపంలోకి తెచ్చారు. వాహనదారులపైన ఇది ఆర్థికంగా భారంగా మారినప్పటికీ పత్రాల రూపంలో వెంట తీసుకెళ్లాల్సిన అవసరం తప్పింది. మరోవైపు ఈ స్మార్ట్ కార్డుల్లో చిప్స్‌ను ప్రవేశపెట్టారు. వాహనదారుడి పూర్తి వివరాలను ఇందులో నమోదు చేశారు. దీంతో ఎలాంటి నకిలీ పత్రాలకు తావు లేకుండా ఆర్టీఏ సేవలు మరింత నాణ్యంగా, పారదర్శకంగా మారాయి. వాహనదారుడికి పూర్తి భద్రత లభించింది. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి స్మార్ట్ సేవలు అందుబాటులో లేని రోజుల్లోనే 'చిప్స్' ను పరిచయం చేయడం విశేషం. చిప్స్‌లో నమోదు చేసిన సమాచారాన్ని తెలుసుకునేందుకు చిప్స్ రీడర్స్ కూడా ఉండేవి. వాహనాలు ప్రమాదానికి గురైనప్పుడు, ఇతరత్రా సంఘటనల్లో ఈ స్మార్ట్ కార్డులలోని చిప్స్ ద్వారా సమాచారం తెలుసుకొనేందుకు అవకాశం ఉంటుంది.

నాణ్యత పెంచాలి : మంత్రి పువ్వాడ

రెండు రోజుల క్రితం ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయాన్ని సందర్శించిన రవాణాశాఖ మంత్రి పువ్వాడ కార్డుల ప్రింటింగ్ విభాగంలో ఎక్కువ సమయం గడిపారు. ప్రస్తుతం గంటకు 40 కార్డులు మాత్రమే ప్రింట్ అవుతున్నాయి. అధునాతన ప్రింటర్‌ల ద్వారా గంటకు 120 కార్డుల వరకు ముద్రించే అవకాశం ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఆయన పాత ప్రింటర్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు కార్డుల నాణ్యతపైన కూడా అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. కార్డుల నాణ్యతను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

సమష్టి కృషితోనే పరిసరాల పరిశుభ్రత


మాట్లాడుతున్న నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

బహదూర్‌పురా: బక్రీద్ పండుగను ముస్లింలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని మంగళవారం సాలార్‌జంగ్ మ్యూజియంలో జీహెచ్ఎంసీ, పశు సంవర్ధక శాఖ అధికారులు, ముస్లిం మత పెద్దలు, ఖురేషిలతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ బక్రీద్ నేపథ్యంలో జంతు వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పారవేయకుండా జీహెచ్ఎంసీ అధికారులు అందజేసే ప్లాస్టిక్ కవర్లలో వేసి వారికి అందజేయాలన్నారు. వీధులను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులు, జీహెచ్ఎంసీ సిబ్బందికి సహాయ సహకారాలు అందించాలన్నారు. పోలీసు సిబ్బంది, జీహెచ్ఎంసీ, పశు సంవర్ధక సిబ్బంది మాత్రమే చెక్ పోస్టులను నిర్వహిస్తారన్నారు. పలు ప్రాంతాల్లో బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. జీహెచ్ఎంసీ జాయింట్ కమిషనర్ శైలజ మాట్లాడుతూ... చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేందుకు మసీదులు, వార్డుల వద్ద అదనపు పారిశుద్ధ్య బృందాలు, చెత్త సేకరించేందుకు వాహనాలను ఏర్పాటు చేశామయన్నారు... చెత్తను సేకరించేందుకు అవసరమైనన్ని ప్లాస్టిక్ బ్యాగ్‌లను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తేవడంతో వాటిని సత్వరమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యాకుత్‌పురా ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ, చార్మినార్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్, అదనపు సీపీ విక్రమ్ సింగ్ మాన్, ట్రాఫిక్ అదనపు సీపీ సుధీర్ బాబు, సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ జాయింట్ సీపీ ఎం.శ్రీనివాసులు, మత పెద్దలు ముఫ్తీ ఖలీల్ అహ్మద్, ముంతాజ్ పాషా, హఫీజ్ ముజఫర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు బక్రీద్ సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపులు

చార్మినార్: బక్రీద్ పండుగను పురస్కరించుకుని ఈనెల 29న మీరాలం ఈద్గాలో నిర్వహించనున్న సామూహిక ప్రార్థనల నేపథ్యంలో పాతబస్తీలో ట్రాఫిక్ నిబంధనలు అమలులో ఉంటాయని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మీరాలం ఈద్గా వైపు వచ్చే వాహనాలను ప్రార్థనలు ముగిసేంత వరకు దారి మళ్లించనున్నట్లు తెలిపారు. ఉదయం 8 నుంచి 11.30 గంటల వరకు ఈ నిబంధనలు అమలులో ఉంటాయన్నారు. పురానాపూల్, కామాటిపురా, కిషన్‌బాగ్ నుంచి ప్రార్థనల కోసం మీరాలం ఈద్గాకు వచ్చే వాహనాలను బహదూర్‌పురా ఎక్స్ రోడ్డు మీదుగా అనుమతిస్తామన్నారు. వీరు తమ వాహనాలను జూపార్కు ప్రాంతం, ఓపెన్ స్పేస్ ఎదురుగా మసీదు అల్లాహో అక్బర్ వద్ద పార్కు చేయాలన్నారు. ఈ సమయంలో సాధారణ వాహనాల రాకపోకలు అనుమతి ఉండదన్నారు. వీరిని బహదూర్‌పురా ఎక్స్ రోడ్డు వద్ద కిషన్‌బాగ్, కామాటిపురా, పురానాపూల్ వైపు దారి మళ్లించనున్నారు. శివరాంపల్లి, దానమ్మ హట్స్ నుంచి ప్రార్థనల కోసం వచ్చే వాహనాలను దాన్నమ్మ హట్స్ ఎక్స్ రోడ్డు మీదుగా ఉదయం 8 నుంచి 11.30 గంటల వరకు అనుమతిస్తారు. వీరు తమ వాహనాలను ఈద్గా ప్రధాన రహదారి ముందు, మోడ్రన్ సా మిల్ పార్కింగ్‌తో పాటు మీరాలం ఫిల్టర్ బెడ్, మీరాలం బెడ్ పక్కన ఖాళీ స్థలం, సూఫీ కార్లు (నాలుగు చక్రాల వాహనాల కోసం), యాదవ్ పార్కింగ్ (నాలుగు చక్రాల వాహనాలకు) పక్కన పార్కు చేయాలన్నారు. ఈ సమయంలో సాధారణ వాహనాల రాకపోకలను ఈద్గా వైపు అనుమతించమన్నారు. వీరిని దానమ్మ హట్స్ ఎక్స్ రోడ్డు వద్ద శాస్త్రిపురం, నవాబ్‌సాబ్‌కుంట తదితర ప్రాంతాల నుంచి దారి మళ్లించనున్నట్లు తెలిపారు. కాలాపత్తర్, మీరాలం ట్యాంక్ వైపు నుంచి వాహనాలను కాలాపత్తర్ పోలీస్‌స్టేషన్ (లా అండ్ ఆర్డర్) మీదుగా ఉదయం 8 నుంచి 11.30 గంటల వరకు అనుమతించమన్నారు. వీరు తమ వాహనాలను భయ్యా పార్కింగ్, ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద వాహనాలను పార్కు చేయాలన్నారు. ఈ సమయంలో సాధారణ వాహనాలను కాలాపత్తర్ పోలీస్‌స్టేషన్ (లా అండ్ ఆర్డర్) వద్ద మోచీ కాలనీ, బహదూర్‌పురా, షంషీర్‌గంజ్, నవాబ్‌సాబ్‌కుంట వైపు మళ్లిస్తారు. పురానాపూల్, బహదూర్‌పురా వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులతో పాటు భారీ వాహనాలను పురానాపూల్ దర్వాజా వద్ద జియగూడ, సిటీ కాలేజీ వైపు దారి మళ్లించనున్నారన్నారు. ఉదయం 8 నుంచి 11.30 గంటల వరకు శంషాబాద్, రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి నుంచి బహదూర్‌పురా వైపు వచ్చే ఆర్టీసీ బస్సులతో సహా భారీ వాహనాలను ఆరాంఘర్ జంక్షన్ వద్ద శంషాబాద్ లేదా రాజేంద్రనగర్ లేదా మైలార్‌దేవ్‌పల్లి వైపు దారి మళ్లిస్తారు. అత్యవసర పరిస్థితుల్లో వాహనదారులు ట్రాఫిక్ హెల్ప్‌లైన్ నంబర్ 9010203626లో సంప్రదించాలన్నారు.

డిగ్రీ పరీక్షలు వాయిదా

సికింద్రాబాద్ : టీఎస్‌సీపీజీఈటీ–2023లో భాగంగా (పీజీ ప్రవేశ పరీక్షలు) ఓయూ పరిధిలో జరగాల్సిన వివిధ డిగ్రీ కోర్సుల పరీక్షలను వాయిదా వేశారు. వాయిదాపడిన డిగ్రీ కోర్సుల సెమిస్టర్ పరీక్షల వివరాలను ఉస్మానియా.ఏసీ.ఇన్ వెబ్‌సైట్లో చూడవచ్చు.

స్విమ్మింగ్‌పూల్‌లో పడి యువకుడి మృతి


నియాజ్ మృతదేహం

పహాడీషరీఫ్: స్విమ్మింగ్ పూల్‌లో పడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ కథనం ప్రకారం.. బహదూర్‌పురా ఉస్మాన్‌పురాకు చెందిన ఆటో డ్రైవర్ మహ్మద్ నియాజ్ (23) తరచూ మద్యం సేవిస్తుండటంతో మూడు నెలల క్రితం తల్లి మందలించింది. అప్పటి నుంచి ఇంటికి వెళ్లడం మానేశాడు. హాజిరా బేగంను వివాహం చేసుకుని అద్దె ఇంటి కోసం స్నేహితులతో కలిసి వెతుకులాటలో ఉన్నాడు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం అతను తన స్నేహితుడు అతీక్ తండ్రి వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న జల్‌పల్లి కమాన్ రోడ్డులోని అక్తర్ హుస్సేన్ ఫాంహౌజ్‌కు భార్య, స్నేహితులు అఫ్జల్, అతీక్‌లతో కలిసి వెళ్లాడు. హాజిరాబేగం వాచ్‌మెన్ గది వద్ద ఉండగా.. ఇద్దరు స్నేహితులు ఫాంహౌజ్‌లో తిరుగుతున్నారు. నియాజ్ ఫాంహౌజ్‌లో ఉన్న స్విమ్మింగ్ పూల్‌లోకి దూకాడు. ఈత రాకపోవడంతో నీట మునిగి మృతి చెందాడు. మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు అర్బాజ్ మంగళవారం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

డీసీఎంను ఢీకొన్న కంటైనర్

- కూలీ దుర్మరణం
- ఓఆర్‌ఆర్‌పై ఘటన

కీసర: ఓఆర్‌ఆర్‌పై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. సీఐ రఘువీర్ రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..నాందేడ్‌కు చెందిన సిరాజ్ అహ్మద్ (40) ఔటర్ రింగు రోడ్డుపై నాటేందుకు సోమవారం శంషాబాద్ నుంచి డీసీఎంలో మొక్కలు తెచ్చాడు. కీసర ఎగ్జిట్ నంబర్ 8 వద్ద వాహనాన్ని నిలిపి జవహర్‌నగర్‌కు చెందిన కూలీలు పార్వతమ్మ, పల్లవి, సరస్వతి, ఈశ్వరి, జ్యోతితో మొక్కలు అన్‌లోడ్ చేయిస్తున్నాడు. అహ్మద్ కూలీలకు రక్షణగా ఉండి వాహనాలకు దారి చూపుతున్నాడు. అదే సమయంలో ఘట్‌కేసర్ వైపు నుంచి వేగంగా కంటైనర్ డీసీఎంను వెనక నుంచి ఢీకొట్టింది. దీంతో అహ్మద్ రెండు వాహనాల మధ్య ఇరుక్కుని అక్కడికక్కడే మృతి చెందగా, పార్వతమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన కంటైనర్ డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అహ్మద్ మృతదేహాన్ని బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. బాధితులను 108లో గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి

- జూలై 1న రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ల ముట్టడి
- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య తదితరులు

కాచిగూడ: రాష్ట్ర వ్యాప్తంగా 14 లక్షల మంది కాలేజీ విద్యార్థుల ఫీజుల బకాయిలు రూ.5వేల కోట్లు వెంటనే విడుదల చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంజి అధ్యక్షతన మంగళవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు పెంచాలని, ఫీజుల బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 1న రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ కార్యాలయాలు, ఆర్‌డీఓ, తహసీల్దార్ కార్యాలయాల ముట్టడి చేపట్టనున్నట్లు తెలిపారు. విద్యార్థులు తరగతులు బహిష్కరించి శాంతియుతంగా ర్యాలీలు నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు బడ్జెట్ కేటాయింపులో నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. రెండేళ్లుగా ఫీజు బకాయిలను చెల్లించకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులను ఒత్తిడి చేస్తున్నాయని, దీంతో పేద విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి బీసీ విద్యార్థికి సంవత్సరానికి రూ.20వేలు స్కాలర్‌షిప్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. విదేశీ విద్యకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరికీ స్టైఫండ్ ఇవ్వాలన్నారు. బీసీ వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని, బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీని బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. బీసీల జనాభా ప్రకారం అదనంగా మరో 120 బీసీ గురుకుల పాఠశాలలు, 50 డిగ్రీ కాలేజీలు మంజూరు చేయాలన్నారు. కొత్తగా 300 కాలేజీ హాస్టళ్లు ప్రారంభించాలన్నారు. బీసీ కాలేజీ హాస్టళ్లు, గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలన్నారు. బీసీ స్టడీ సర్కిల్ బడ్జెట్‌ను రూ.200 కోట్లకు పెంచాలని, రూ.20 వేల కోట్లతో బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలన్నారు. జూనియర్ అడ్వకేట్లకు ఇచ్చే స్టైఫండ్ రూ.10,000కు పెంచాలన్నారు. కార్యక్రమంలో సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, వేముల రామకృష్ణ, నీల వెంకటేష్, జి.కృష్ణయాదవ్, కె.నర్సింహగౌడ్ సతీష్, నందగోపాల్, రాజ్‌కుమార్, భాస్కర్, వెంకట్, నిఖిల్ పటేల్ పాల్గొన్నారు.

గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుపై నిర్లక్ష్యం తగదు


మాట్లాడుతున్న శ్రీను నాయక్

పంజగుట్ట: రాష్ట్రంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని బీఆర్ఎస్ గిరిజన విద్యార్థి నాయకుడు శ్రీను నాయక్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా మంగళవారం గిరిజన విద్యార్థులు రాజ్‌భవన్‌ను ముట్టడించారు. దీంతో భారీగా అక్కడికి చేరుకున్న పోలీసులు నిరసన కారులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా శ్రీను నాయక్ మాట్లాడుతూ.. విభజన చట్టం 2014లో పేర్కొన్న ప్రకారం కేంద్ర ప్రభుత్వం రెండు తెలుగు రాష్ట్రాల్లో గిరిజన విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. బీఆర్ఎస్ గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో పోస్టుకార్డు ఉద్యమం చేపట్టి ప్రధానికి పెద్ద ఎత్తున పోస్టుకార్డులు రాసినా స్పందన లేదన్నారు. రాష్ట్ర గవర్నర్ కేంద్రంతో మాట్లాడి గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి కేసీఆర్, గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో ఉస్మానియా, తెలుగు యూనివర్సిటీ, నిజాం కాలేజీ, సిటీ కాలేజీ ఇతర గిరిజన విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

భర్త చేతిలో భార్య హతం

అనుమానంతో దారుణం


ఫాతిమా(ఫైల్)

రహమత్‌నగర్(బోరబండ) : అనుమానంతో ఓ వ్యక్తి భార్యను దారుణంగా హత్య చేసిన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కామల్ల రవికుమార్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బతుకుదెరువు నిమిత్తం ఉత్తరప్రదేశ్ నుంచి నగరానికి వలస వచ్చిన మీరాజ్‌అలీ, ఫాతీమా(35) దంపతులు కొంత కాలంగా ఎర్రగడ్డ డివిజన్, సుల్తాన్‌నగర్‌లో నివాసముంటున్నారు. వీరికి ముగ్గురు సంతానం. భార్యపై అనుమానం పెంచుకున్న మీరాజ్ అలీ తరచూ ఆమెతో గొడవ పడేవాడు. ఈ నేపథ్యంలో మంగళ వారం రాత్రి వారి మధ్య గొడవ జరిగింది. దీంతో ఆగ్రహానికి లోనైన మీరాజ్‌అలీ ఇనుప రాడ్డుతో భార్య ఫాతిమా తలపై బాదడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో భయపడిన మీరాజ్‌అలీ అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సిబ్బంది మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలిం చారు. మృతురాలి సోదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా...

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: బీఎస్ పురి, శ్రీరామ్‌నగర్ 11కేవీ ఫీడర్లు మోతీనగర్, కళ్యాణ్‌నగర్ సబ్ స్టేషన్ల పరిధిలో జరుగుతున్న మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు గౌతంపురికాలనీ, మిడ్‌లాండ్ బేకరి, బీఎస్ పురి కాలనీ, నటరాజ్‌నగర్, రాజీవ్‌నగర్, శ్రీరామ్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ కె.కిశోర్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదే విధంగా న్యూశాస్త్రినగర్ 11కెవి ఫీడర్ జనప్రియ సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల వల్ల పి.ఆర్‌నగర్ పార్కు ఏరియా, భారత్‌గ్యాస్, గోడౌన్ ఏరియా, ఓల్డ్ శాస్త్రి నగర్, అవంతినగర్ తోట, తూర్పు అవంతినగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

జూలై 1న లక్ష్మీదేవమ్మ జయంతి

లిబర్టీ: మాజీ మంత్రి, మాజీ సీడబ్ల్యూసీ సభ్యురాలు లక్ష్మీదేవమ్మ జయంతి వేడుకలు జూలై 1వ తేదీన నిర్వహిస్తున్నట్లు మాతృదేవోభవ సంస్థ జాతీయ అధ్యక్షులు కె.బి.శ్రీధర్ వెల్లడించారు. 1వ తేదీ ఉదయం 11 గంటలకు పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆఫీసులో వేడుకలు జరుగుతాయన్నారు. ఈ మేరకు మంగళవారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా కేంద్ర మాజీ మంత్రి తెలంగాణ నీటి పారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ సముద్రాల వేణుగోపాలచారి పాల్గొంటారన్నారు. గౌరవ అతిథులుగా వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

29న బక్రీద్ ఫుడ్ ఫెస్టివల్

బంజారాహిల్స్: బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని మాసబ్‌ట్యాంక్‌లోని గోల్కొండ హోటల్‌లో ఈ నెల 29వ తేదీన ఈద్-ఉల్-అదా మెనూ పేరుతో ప్రత్యేక ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నారు. హోటల్ ఎగ్జిక్యూటివ్ చెఫ్ కొడాలి వెంకటేశ్వరరావు మంగళవారం ఈ ఫుడ్‌ఫెస్టివల్‌కు సంబంధించిన ఆహార పదార్థాల వివరాలను వెల్లడించారు. వెజ్, నాన్‌వెజ్‌లో ఈ ఫుడ్‌ఫెస్టివల్ ఉంటుందన్నారు. రాత్రి 8 గంటల నుంచి దావత్-ఏ-ఈద్ పేరుతో నిర్వహించనున్న ఈ ఫుడ్‌ఫెస్టివల్ బక్రీద్ సందర్భంగా సంప్రదాయ రుచులను ఆరగించే వారికి ప్రత్యేక డిష్‌లు అందుబాటులో ఉంచుతామన్నారు.

లింబాద్రికి సన్మానం



ఖైరతాబాద్: తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్‌గా ఆర్.లింబాద్రి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మంగళవారం మాల వెలుగు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దండు లక్ష్మణ్, బీసీ లీడర్ బసప్పలతో కలిసి కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి సాహు మహరాజ్ జయంతి వేడుకలు

లిబర్టీ: సామాజిక న్యాయం కోసం ప్రజాస్వామ్య విలువల కోసం పాటుపడిన యోధుడు ఛత్రపతి సాహు మహరాజ్ అని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ అన్నారు. విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు ప్రవేశపెట్టి సామాజిక సమన్యాయానికి బాటలు వేశారని కొనియాడారు. ఛత్రపతి సాహు మహరాజ్ జయంతి సందర్భంగా మంగళవారం మాల మహానాడు కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు.

శిథిలావస్థకు చేరిన భవాన్ని కూల్చివేయండి

ఖైరతాబాద్: శిథిలావస్థకు చేరిన భవనాన్ని కూల్చివేయాలని అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని బేగంబజార్‌కు చత్రి ప్రాంతానికి చెందిన ప్రేమ్ ప్రకాష్, సోనీ, కన్నయ్యలాల్ సోనీలు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఖైరతాబాద్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. తమ వారసత్వంగా వచ్చిన వందల సంవత్సరాల చరిత్ర కలిగిన భవనం శిథిలావస్థకు చేరుకుంది. తల్లి దండ్రులకు తాము అయిదుగురు సంతానమని అందులో ఒకరు మృతిచెందగా మిగిలిన నలుగురు ఈ ఆస్తిని సంరక్షిస్తున్నామని తెలిపారు. ఇప్పుడు భవనం పూర్తిగా శిథిలావస్తకు చేరి పెచ్చులూడిపోతుందని, ఏ క్షణంలోనైనా కూలిపోయే అవకాశం ఉందని వారు తెలిపారు. ప్రమాదం జరగక ముందు భవనాన్ని కూల్చివేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదుచేశామని తెలిపారు. వారు కూల్చడానికి కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేశారని అయితే తమ సోదరులైన ఓం ప్రకాష్ శర్మ, దిలీప్ కుమార్ సోనీలు స్వప్రయోజనాల కోసం జిఎస్‌టీయులో తప్పుడు ఫిర్యాదు చేసి దానిని కూల్చకుండా అడ్డుకుంటున్నారన్నారు.

ఉత్సాహం.. పఠనోత్సవం

- ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తకపఠనం
- రోజూ ఒక పీరియడ్
- హెచ్‌ఎంల పర్యవేక్షణలో కార్యక్రమం
- వచ్చే నెల 31 వరకు కార్యక్రమం



బంజారాహిల్స్‌లోని గతి స్కూల్‌లో పఠనోత్సవంలో విద్యార్థులు

బంజారాహిల్స్: విద్యార్థుల్లో చదివే అలవాటును పెంపొందించి చదవడంలో నైపుణ్యాలను సాధించేందుకు, నేర్చుకునేందుకు విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పఠనోత్సవం(రీడింగ్ క్యాంపెయిన్) కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. జోన్ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు ఈ పఠనోత్సంలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. జోన్ పరిధిలోని 17 ఉన్నత, 47 ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న సుమారు 27 మంది విద్యార్థులను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేశారు. ఈ నెల 26 నుంచి జూలై 31 వరకు 1 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు ఈ కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల ప్రత్యేక పర్యవేక్షణలో ఈ కార్యక్రమం అమలు చేస్తున్నారు. ఈ కార్యక్రమంతో విద్యార్థులు దారాళంగా చదవగలరని, చదివే అలవాటు వారిలో పెంపొందించాలని స్వతంత్ర పాఠకులుగా ఎదగాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బంజారాహిల్స్ రోడ్ నెం. 7లోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు జనార్ధన్ తెలిపారు.

హెచ్‌ఎంలదే బాధ్యత...

పాఠశాల స్థాయిలో ఉపాధ్యాయులంతా పఠనోత్సవం నిర్వహిస్తారు. ఇందుకు ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షిస్తారు. ప్రతి తరగతికి రోజూ పుస్తక పఠనం కోసం ఒక పీరియడ్‌ను కేటాయిస్తారు. పిల్లలంతా భాగస్వాములయ్యేలా చక్కగా చదువుకునేలా కార్యక్రమాలను కొనసాగిస్తారు. ప్రతిరోజూ తప్పనిసరిగా తాము బోధించే పాఠ్యాంశాన్ని పది నిమిషాలు విద్యార్థులతో చదివిస్తారు. కీలక పదాలను బ్లాక్ బోర్డులపై, చార్ట్‌లపై రాయిస్తారు. తెలుగు కథల పుస్తకాలు కూడా చదివిస్తారు. ప్రతి పాఠశాలలో అయిదుగురు విద్యార్థులతో గ్రంథాలయ కమిటీ ఏర్పాటు చేశారు. ఒక్కో తరగతికి గ్రంథాలయ కమిటీ ఏర్పాటు చేశారు. ఒక్కో తరగతిలో పిల్లలకు పుస్తకాలు ఇవ్వడం, సేకరించడం, తదితర వివరాలను రిజిష్టర్‌లో నమోదు చేస్తారు. పిల్లల్లో పోటీతత్వం పెంచేందుకు ప్రతి శనివారం పఠన పోటీలు నిర్వహిస్తారు. ప్రతినెలా మూడో శనివారం నిర్వహించే సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులు స్కూల్ మేనేజింగ్ కమిటీ సభ్యులను ఆహ్వానించి పిల్లలతో పుస్తక పఠన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అన్ని పాఠశాలల్లో జూలై 10 నుంచి 17 వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించి విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించారు. పఠనాసక్తి, ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు పంచుతుందని చిన్ననాటి నుంచి పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవడం ద్వారా భవిష్యత్‌లో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి అవకాశం ఏర్పడుతుందని ఉపాధ్యాయులు అంటున్నారు. నీతి కథలు, బాలల సాహిత్యాన్ని రోజూ చదివించేలా ఇందులో చర్యలు తీసుకుంటున్నారు. స్వచ్ఛంద సంస్థలను భాగస్వాములను చేసి సామాజిక సేవల్లో అవగాహన కల్పించనున్నారు. విద్యార్థులు చదివే స్థాయిని అనుసరించి గ్రూపులుగా విభజించి ఒకరికి ఒకరు సహాయం చేసుకునేలా ప్రోత్సహించనున్నారు. దీని వల్ల పిల్లల్లో ఆరోగ్యకరమైన పోటీతత్వం పెంపొందుతుందని ఉపాధ్యాయులు అంటున్నారు.

కథనాలు మానవీయకోణంలో ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న భూమిక వ్యవస్థాపకురాలు సత్యవతి

పంజగుట్ట: పిల్లలు, మహిళలు, ట్రాన్స్‌జెండర్స్‌పై మీడియాలో కథనాలు ఇచ్చే సమయంలో మానవీయకోణంలో ఇవ్వాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో భూమిక ఉమెన్స్ కలెక్టివ్ ఆధ్వర్యంలో 'జెండర్ సెన్సివిటీ స్ట్రక్చర్స్ ఇన్ ఇండియా' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. భూమిక వ్యవస్థాపకురాలు సత్యవతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రొఫెసర్ పద్మజాషా, సామాజిక కార్యకర్త దేవి, భూమిక ప్రతినిధి అపర్ణ, న్యాయవాది శ్రీకాంత్‌లతో పాటు పలు జర్నలిజం కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. ముఖ్యంగా యూట్యూబ్ చానల్స్ వచ్చిన తర్వాత ఏదైనా నేరం జరిగితే పిల్లలైనా, మహిళలైనా వారి ఇంటికి వెళ్లి చూపించడం, ఇంటి పక్కవాళ్లతో మాట్లాడించడం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ అవమానమీయమైన భాషే వాడుతున్నారని ఆగ్రహంవ్యక్తం చేశారు. ప్రధాన మీడియాలో పిల్లల్ని, స్త్రీలను, ట్రాన్స్‌జెండర్స్, అణగారిన వర్గాల గూర్చి ఎంత కవరేజీ ఉంది అనేది ప్రశ్నార్థకంగా ఉందన్నారు.

మైమరిపించిన నృత్యం



రిషిత నామాల

బంజారాహిల్స్: జూబ్లీ హిల్స్ పబ్లిక్ స్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న రిషిత నామాల భరత నాట్య అరంగేట్రం రవీంద్ర భారతిలో కన్నుల పండువగా జరిగింది. శ్రీనివాస్ నామాల, లావణ్య దంపతుల కుమార్తె రిషిత ప్రముఖ నృత్యకారిణి చిత్రానారయణన్ వద్ద శిష్యరికం చేసింది. ఈ వేడుకకు ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ఎల్ .జయంతి రెడ్డి, జేహెచ్‌పీఎస్ చైర్మన్ ఎ. మురళీ ముకుంద్, డాక్టర్ చివుకుల వసంతలక్ష్మి, మృదుల ఆనంద్ గౌరవ అతిథులుగా హాజరయ్యారు.


డ్రంక్ అండ్ డ్రైవ్‌లో నలుగురికి జైలు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన ఈ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మోతాదుకు మించి మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 13మంది పట్టుబడగా వీరందరినీ మంగళవారం నాంపల్లిలోని 8వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. ఇందులో అతిగా మద్యం సేవించి వాహనం నడుపుతున్న ఎం. శ్రీకాంత్, సంతు కుమార్ రాయ్, రిషిరాజ్, ఆర్. శివసందీప్‌లకు రెండు రోజులచొప్పున జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. మిగతా తొమ్మిది మందికి రూ. 2100 చొప్పున జరిమానా విధించారు. వీరి నుంచి రూ.27300 జరిమానా వసూలు అయినట్లు జూబ్లీహిల్స్ ట్రాఫిక్ సీఐ వినోద్ కుమార్ తెలిపారు.

హుక్కా సెంటర్‌పై దాడి - ముగ్గురి అరెస్టు

వెంగళరావునగర్ : అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న హుక్కా సెంటర్‌పై టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం రాత్రి దాడిచేసి ముగ్గురిని అరెస్టు చేశారు. మధురానగర్ పోలీసులు తెలిపిన మేరకు.. మధురానగర్‌కాలనీ మెట్రో స్టేషన్ సమీపంలో సాయి అనే వ్యక్తి ఆర్‌వీఆర్ పేరుతో కేఫే నిర్వహిస్తున్నాడు. ఈ హుక్కా సెంటర్‌కు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేవు. ఈ సమాచారం వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులులకు అందడంతో సిబ్బంది దాడి చేసి కేఫే మేనేజర్ మహేందర్, హుక్కా సరఫరా చేసే సూఫియాన్, హమీద్‌లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 13 హుక్కా పైపులు, మూడు హుక్కా ఫ్లేవర్ బాక్స్‌లు, మరో రెండు హుక్కాకు ఉపయోగించే కుండలు స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడు సాయి పరారీలో ఉన్నాడు.

ప్రపంచమంతా మోదీవైపు చూస్తోంది



ఇంటింటికీ ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ పద్మ వీరపనేని

శ్రీనగర్‌కాలనీ: దేశమే కాకుండా ప్రపంచమంతా ప్రధాని మోదీ వైపు చూస్తోందని, అగ్రరాజ్యం యూఎస్‌ఏలో మోదీకి దేశ అధ్యక్షుడుతో పాటు అగ్రనేతలు బ్రహ్మరథం పట్టారని బీజేపీ జాతీయ మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ పద్మ వీరపనేని అన్నారు. మంగళవారం ఎర్రగడ్డ డివిజన్‌లోని పలు బస్తీల్లో మహా జనసంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మోదీ తొమ్మిదేళ్ళ పాలనపై ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. కేంద్రప్రభుత్వ పథకాలను వివరిస్తూ, మోదీ విజయాలను, సంక్షేమాభివృద్ధిని ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో నేతలు సత్యనారాయణ, జ్యోతి, మహేష్, నర్సింగ్, రాజుసింగ్ పాల్గొన్నారు.

గోవు మహత్యాన్ని ఊరూరా తెలియజేస్తాం

పంజగుట్ట: హిందువులకు ఎంతో మంది దేవుళ్లు ఉన్నారు వారందరికీ ఆవుతో సంబంధం ఉందని ప్రముఖ హీరో సుమన్ అన్నారు. ఆవు పేడ, పాలు, గో మూత్రం అన్ని మనిషి ఆరోగ్యానికెంతో మంచిదని ఆయన పేర్కొన్నారు. అఖిల భారత గోసేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు బాలకృష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో గోవు మహత్యాన్ని ఊరూరా తెలియచేస్తూ ఆగస్టు 6 సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళీ అమ్మవారి దేవాలయం నుండి తిరుమల తిరుపతి, అరుణాచలం వరకు చేయనున్న గో మహా పాదయాత్ర పోస్టర్, రూట్‌మ్యాప్‌ను సుమన్ ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ప్రపంచంలోనే అతిచిన్న ఆవులకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ .. పూజలు చేసే ఒక ప్రాణిని తినడం మంచిది కాదని, తాను అన్ని మతాలను, అన్ని దేవుళ్లను ఆరాధిస్తాను కాని ఏ మతాన్ని కించపరచనని తెలిపారు. బాలకృష్ణ గురుస్వామి మాట్లాడుతూ .. గో మహాపాద యాత్రలో గోవు మహత్యాన్ని ఊరూరా తెలియచేస్తూ, గో ఉత్పత్తులు, గోఆధారిత వ్యవసాయాన్ని ప్రొత్సహించాలని ప్రచారం చేస్తూ, గోవును జాతీయ ప్రాణిగా గుర్తించాలని ఉభయ రాష్ట్రాల ప్రజలకు తెలియచేస్తూ వెళతామన్నారు.

బీఎస్ మక్తాలో అన్నదానం



అన్నదానం చేస్తున్న విజయారెడ్డి

పంజగుట్ట: ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని సోమాజిగూడ డివిజన్ బీఎస్ మక్తాలోని శ్రీ ఎల్లమ్మ దేవాలయంలో మంగళవారం టీపీసీసీ ప్రధానకార్యదర్శి పి.విజయారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మోదీ పాలన ఉత్సాహం నింపుతోంది

బంజారాహిల్స్: ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సుపరిపాలన, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తుంటే వారి నుంచి వస్తున్న స్పందన అద్భుతంగా ఉందని బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తుందని ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. నియోజక వర్గంలో పార్టీని బలోపేతం చేసే దిశలో నిర్వహిస్తున్న బూత్ దర్శన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన బంజారాహిల్స్ రోడ్ నెం 10లోని ఉదయ్‌నగర్ బస్తీలో పర్యటించారు. ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలనలోనే విజయాలను ప్రజలకు తెలియజేశారు. మోదీ ప్రపంచ దేశాల మన్ననలు పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేతలు మేచినేని శ్రీనివాసరావు కూడా పాల్గొన్నారు.

రాజ్‌భవన్ హైస్కూల్‌లో ఎన్నికల సందడి



పోస్టల్ బ్యాలెట్‌లో ఓటు వేస్తున్న విద్యార్థి

బంజారాహిల్స్: విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు అలవర్చి ఓటు వేసే విధానం తెలియజేసే ఉద్దేశంతో రాజ్‌భవన్ హైస్కూల్‌లో విద్యార్థి నాయకుల ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 28వ తేదీన జరగనున్న కెప్టెన్, వైస్ కెప్టెన్ ఎన్నికలకుగాను పోలింగ్ కేంద్రాలను తరగతి గదుల్లో ఏర్పాటు చేశారు. అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే ఓటరు స్లిప్‌లు, బ్యాలెట్ పేపర్లు, పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసి ప్రచారం చేసుకునే అవకాశాన్ని కూడా కల్పించారు. మంగళవారం పోస్టల్ బ్యాలెట్‌లో ఓటు వేసేందుకు అవకాశం ఇచ్చారు. బుధవారం పోలింగ్ సమయంలో స్కూల్‌కు రాని విద్యార్థులు మంగళవారమే తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కెప్టెన్ పదవి కోసం ఎనిమిది మంది విద్యార్థులు పోటీ పడుతున్నారు. వైస్ కెప్టెన్లుగా బాలుర నుంచి ఒకరు, బాలికల నుంచి మరొకరు పోటీలో ఉన్నారు. ఈ పదవికి ఎనిమిది మంది విద్యార్థులు పోటీ పడుతున్నారు. మొత్తం 399 మంది విద్యార్థులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. బుధవారం సాయంత్రానికి ఎన్నికల ఫలితాలు వెలువడతాయి. స్కూల్ సోషల్ స్టడీస్ టీచర్లు ప్రభాకర్, రాజు ఈ ఎన్నికలను పర్యవేక్షిస్తున్నారు. పాఠశాలలో ఎన్నికల సందడి నెలకొంది.

అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలి



కృష్ణానగర్ లేబర్ అడ్డా వద్ద కరపత్రాలు పంచుతున్న సీఐటీయు నేతలు

వెంగళరావునగర్: అర్హులైన వారందరికీ డబుల్ బెడ్‌రూం గృహాలను తక్షణమే ఇవ్వాలని సీఐటీయు నియోజకవర్గ నాయకులు రాపర్తి అశోక్ డిమాండ్ చేశారు. మంగళవారం యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని శ్రీకృష్ణానగర్ లేబర్ అడ్డా వద్ద కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అడ్డా కూలీలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ డబుల్ బెడ్‌రూం గృహాల్లో రాజకీయ నాయకులు కల్పించుకోకూడదని అన్నారు. తమ వర్గం, పార్టీలకు చెందిన వారికే కేటాయింపులు చేస్తే సహించేదిలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడ్డా కమిటీ నాయకులు రఘు, కుమార్, సురేష్, తిరుపతి, నాయుడు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గుండె సమస్యలపై 30 నుంచి వైద్యుల సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీధర్ కస్తూరి

పంజగుట్ట: గుండె సమస్యలపై వస్తున్న అత్యాధునిక చికిత్సలు, రోగులకు తక్కువ ఖర్చుతో మంచి వైద్యం అందించడంఎలా అనే అంశాలు చర్చించేందుకు కార్డియాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా (సిఎస్‌ఐ) ఆధ్వర్యంలో జూన్30 నుండి జులై 2వ తేదీ వరకు నేషనల్ ఇంటర్వెన్షనల్ కౌన్సిల్ (ఎన్‌ఐసీ) 2023 నిర్వహిస్తున్నట్లు కౌన్సిల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ శ్రీధర్ కస్తూరి తెలిపారు. హైటెక్‌సిటీ హెచ్‌ఐసీసీలో జరగనున్న సదస్సులో 3వేల మంది దేశవిదేశాలకు చెందిన సూపర్‌స్పెషాలిటీ వైద్యులు, 13 కేటగిరీల్లో 350కి పైగా ఛాలెంజింగ్ కేసులు ప్రజెంటేషన్ చేస్తారన్నారు. మంగళవారం ఎర్రమంజిల్‌లోని మెర్క్యూర్ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ సీఎస్‌ఐ అధ్యక్షులు డాక్టర్ వి.ఎస్.రామచంద్ర, మాజీ అధ్యక్షులు డాక్టర్ రాజీవ్ గార్గ్, కోశాధికారి డాక్టర్ శ్రీధర్ రెడ్డితో కలిసి మాట్లాడారు. ఇంటర్వెన్షన్‌లో కార్డియాలజీలోని తాజా పురోగతి, నిపుణులనుండి చిట్కాలు, ఉపాయాలు తెలుసుకునేందుకు, ఒకరితో ఒకరు చర్చించుకుని పరస్పరం సంభాషించుకునేందుకు మంచి వేదిక అన్నారు.

ఆటో డ్రైవర్లను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి

లిబర్టీ: ఆటో డ్రైవర్లకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాలని తెలంగాణ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు రుద్రాక్ష మల్లేష్ విజ్ఞప్తి చేశారు. ఉపాధి లేకపోవడంతో ఆటోలను అద్దెకు తీసుకొని నడుపుకుంటూ చాలీచాలని ఆర్థిక సహాయంతో ఆటో డ్రైవర్లు జీవనం వెల్లదీస్తున్నారని వారికి వడ్డీలేకుండా రుణాలు ఇప్పించి చేయూతని ఇవ్వాలన్నారు. మంగళవారం యూనియన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆటోడ్రైవర్లకు బీమా పథకాన్ని ప్రవేశపెట్టాలని, ప్రమాదవశాత్తు మృతి చెందిన, గాయపడ్డ ఆటో డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో యూనియన్ నాయకులు ఫరూఖ్ తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్ ప్రార్థనల ఏర్పాట్ల పరిశీలన



ప్లేగ్రౌండ్‌లో ఏర్పాట్లను పరిశీలిసున్న డీఎంసీ రమేశ్, సీఎస్‌రెడ్డి

రహమత్‌నగర్: బక్రీద్ ప్రార్థనల కోసం ఎస్పీఆర్ హిల్స్‌ప్లేగ్రౌండ్‌లో ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. మంగళవారం జీహెచ్‌ఎంసీ సర్కిల్ 19 డీఎంసీ రమేశ్, ఈఈ రాజ్‌కుమార్, కార్పొరేటర్ సీఎస్ రెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 29న జరిగే బక్రీద్ ప్రార్థనలకు అన్ని ఏర్పాటు చేస్తామన్నారు.

బస్తీలో పర్యటించిన కార్పొరేటర్



పనులు పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ కవితారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం .4లోని సంజయ్ నగర్ బస్తీలో మంగళవారం స్థానిక కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి జీహెచ్‌ఎంసీ ఇంజనీర్లతో కలిసి పర్యటించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో వరద నీటి కాల్వల మూతలు క్లీన్ చేయడం, పైపుల్లో, కాల్వల్లో పేరుకుపోయిన బురదమట్టి, రాళ్ళు, ఇతర వ్యర్థాలను తొలగించాలని ఈ సందర్భంగా ఏఈ సతీష్‌కు సూచించారు. త్వరితగతిన నాలాల డీసిల్టింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. ఆలస్యం చేస్తే వరదల సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవతాయని వరద నీరు ఇళ్ళను ముంచెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలపై ముదిరాజ్‌ల నిరసన



ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మతో నిరసన తెలుపుతున్న ముదిరాజ్ సంఘాల నేతలు

వెంకటేశ్వరకాలనీ: ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి ముదిరాజ్‌లపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బంజారాహిల్స్ రోడ్ నెం. 1లోని జీవీకే చౌరస్తాలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం గ్రేటర్ హైదరాబాద్ ముదిరాజ్ సంఘం నేతలు కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేసేందుకు యత్నించారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన పాడి కౌశిక్‌రెడ్డిని అరెస్ట్‌చేయాలని నేతలను నిరసన తెలిపారు. దిష్టిబొమ్మ దగ్ధం కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకొని నిరసనదారులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ పాడి కౌశిక్‌రెడ్డి బహిరంగంగా ముదిరాజ్‌లకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సంఘం అధ్యక్షుడు సురేందర్ ముదిరాజ్, స్టేట్ సెక్రటరీ నీలం శ్రీనివాస్ ముదిరాజ్ పాల్గొన్నారు.

జనాభాకు అనుగుణంగా టికెట్లు కేటాయించాలి



మాట్లాడుతున్న కాటం నరసింహ యాదవ్

పంజగుట్ట: స్వాతంత్ర్య పోరాటం మొదలుకొని తెలంగాణ ఉద్యమం వరకు కీలకపాత్ర వహించి ప్రాణాలు అర్పించిన బీసీలు నేటికీ అగ్రవర్ణాల ఆధిపత్యంలో సామాజికంగా ఎదగనీయకుండా చేస్తున్నారని బీసీ కులసంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు కాటం నరసింహ యాదవ్ ఆవేదనవ్యక్తం చేశారు. మంగళవారం తుమ్మలబస్తీలోని ఐక్యవేదిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 52 శాతం జనాభాకు తగ్గట్టుగా రాజ్యాంగ పరమైన రిజర్వేషన్లు కల్పించకపోగా 27 శాతం కూడా వర్తింపచేసే పరిస్థితులు లేకపోవడం బాధాకరమన్నారు. వీటన్నింటికీ కారణం మనం రాజ్యాధికారంలో లేకపోవడమే అని రాబోయే ఎన్నికల్లో అన్ని రాజకీయపార్టీలు జనాభాకు అనుగుణంగా టిక్కెట్లు కేటాయించాలన్న డిమాండ్‌తో అన్ని బిసి సంఘాలను ఐక్యంచేసి పోరాడతామన్నారు. ఏ వర్గాలకు లేని క్రిమీలేయర్ బీసీ వర్గాలకు ఆపాదించడం బీసీల న్యాయపరమైన వాటాకు గండికొట్టడమే అన్నారు. సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్‌లు చిగుమళ్ల బాల ప్రకాష్, పి.ఎస్.చారి, శ్రీకాంత్ యాదవ్ పాల్గొన్నారు.

మిషన్ భగీరథ కార్యాలయం ముందు కార్మికుల భారీ ధర్నా



పంజగుట్ట: మిషన్ భగీరథలో కాంట్రాక్టు కార్మికుల శ్రమ దోపిడీని అరికట్టాలని, వెంటనే కనీస వేతనాల జీవోను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయు ఆధ్వర్యంలో ఎర్రమంజిల్‌లోని మిషన్ భగీరథ కార్యాలయం ముందు కార్మికులు భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ప్రతినిధి ఎం.నరసింహ, ఐఎఫ్‌టీయూ ప్రతినిధి కే.సూర్యం మాట్లాడుతూ .. రాష్ట్రప్రభుత్వం ఇంటింటికీ తాగునీరు అనే ప్రతిష్టాత్మక పథకం తీసుకువచ్చి మిషన్ భగీరథ సంస్థను ఏర్పాటు చేసిందని, గతంలో ఆర్‌డబ్ల్యుస్, సిపిడబ్ల్యుఎఫ్ గా కొనసాగుతున్న మంచినీటి సరఫరా పథకాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ పథకంగా మార్చిందన్నారు. ఆ క్రమంలో ప్రాజెక్టులు నిర్మించేందుకు కొన్ని పెద్ద సంస్థలకు కాంట్రాక్టు అప్పచెప్పిందని నిర్మాణం పూర్తయి నీటి సరఫరా జరుగుతున్నప్పటికీ కార్మికులకు నిర్మాణానికి సంబంధించినటువంటి జీతాలే చెల్లిస్తున్నారని ప్రస్తుతం కార్మికులు లైన్‌మెన్‌లుగా, వాల్వు ఆపరేటర్లుగా, టెక్నికల్ కోర్సులు అయిన ఐటీఐ పూర్తిచేసి కూడా కార్మికులుగా విధులు నిర్వహిస్తున్నారని వారికి కనీస వేతనం ఇవ్వడంలేదన్నారు.

క్లుప్తంగా...

పోలీస్ శిక్షణకు ముమ్మర ఏర్పాట్లు

28 పోలీస్ శిక్షణ కేంద్రాలు సిద్ధం చేయాలని డీజీపీ ఆదేశం



సాక్షి, హైదరాబాద్: త్వరలో భర్తీ కానున్న నూతన కానిస్టేబుళ్ల శిక్షణపై పోలీస్ ఉన్నతాధికారులు దృష్టి సారించారు. ఇప్పటికే నియామక ప్రక్రియ తుది దశకు చేరుకుంది. దీంతో త్వరలో భర్తీ కానున్న 14,881 మంది పోలీస్ కానిస్టేబుళ్లకు శిక్షణనిచ్చేందుకు రాష్ట్రంలోని 28 పోలీస్ శిక్షణ కేంద్రాల్లో పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలని డీజీపీ అంజనీ కుమార్ ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆయన రాష్ట్రంలోని అన్ని పోలీస్ ట్రైనింగ్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో వీడియో సదస్సు నిర్వహించారు. శిక్షణ విభాగం ఐజీ తరుణ్ జోషితో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా డీజీపీ అంజనీ కుమార్ మాట్లాడుతూ...రానున్న సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించనున్నామని వెల్లడించారు. శిక్షణ ప్రారంభానికి ముందుగానే అన్ని పోలీస్ ట్రైనింగ్ సెంటర్లలో (పీటీసీ) మౌలిక సదుపాయాల కల్పన, శిక్షణకు కావాల్సిన మెటీరియల్స్, వసతి తదితర సౌకర్యాలను సిద్ధం చేసుకోవాలని పీటీసీల అధికారులను ఆదేశించారు. భవనాలకు మరమ్మతులు, వైట్‌వాష్, టాయిలెట్ల సౌకర్యం, రీడింగ్ రూమ్ తదితర ఏర్పాట్లకు నిధులను అందచేస్తున్నామన్నారు. మహిళా ట్రైనీ పోలీస్ కానిస్టేబుల్ శిక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని తెలిపారు.

నేడు, రేపు తేలికపాటి వానలు

సాక్షి, హైదరాబాద్: ఒడిశా దాని పరిసరాల్లోని దక్షిణ జార్ఖండ్, ఉత్తర ఛత్తీస్‌గఢ్ వద్ద ఉన్న అల్పపీడనం మంగళవారం తెలంగాణ నుండి దూరంగా వెళ్లిపోయిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. కాగా, రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు సాధారణ స్థితిలో ఉన్నాయి. దీంతో బుధ, గురువారాల్లో రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. గత 24 గంటల్లో ఆదిలాబాద్ సహా ఆ జిల్లాలోని థంసి, కొమురంభీం జిల్లా సిర్పూరుల్లో 5 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. కెరమెరి, తాల మడుగు, బెజ్జూరు, కాగజ్‌నగర్, వంకడి, ఆసిఫాబాద్, రంజాల్, జైనూర్, నవీపేట్‌లలో 3 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

దేవరకొండ కాలేజీ ప్రాంగణంలో మార్కెట్టా?

నల్లగొండ కలెక్టర్ ఉత్తర్వులను నిలిపివేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: దాదాపు వేయి మంది విద్యార్థులు చదివే జూనియర్ కాలేజీ, ప్రాథమిక, ఉన్నత పాఠశాల ఉన్న స్థలంలో వెజ్, నాన్ వెజ్ మార్కెట్ ఎలా ఏర్పాటు చేస్తారని అధికారులను హైకోర్టు ప్రశ్నించింది. ఇది ఎంత మాత్రం సమర్థనీయం కాదంటూ గత సంవత్సరం డిసెంబర్ 9న నల్లగొండ కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులను నిలిపివేసింది. తదుపరి వెల్లడించే వరకు ఈమధ్యంతర ఆదేశాలే అమలులో ఉంటాయని స్పష్టం చేసింది. విద్యాశాఖ కమిషనర్, నల్లగొండ కలెక్టర్, దేవరకొండ ఆర్డీవో, తహసీల్దార్‌సహా పలువురికి నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణ నాటికి కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. నల్లగొండ జిల్లా దేవరకొండలో కళాశాలకు చెందిన 11 ఎకరాల భూమిలో 2 ఎకరాల్లో మార్కెట్ నిర్మాణం చేపట్టాలంటూ కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలపై హైకోర్టులో దేవరకొండకు చెందిన టి.రవికుమార్ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది తేరా రజినీకాంత్‌రెడ్డి వాదనలు వినిపించారు.

ఆగస్టు 30 వరకు ప్రత్యేక రైళ్ల పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: దక్షిణమధ్య రైల్వేలోని వివిధ మార్గాల్లో అందుబాటులోకి తెచ్చిన 23 ప్రత్యేక రైళ్లను పొడిగించారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆగస్టు 30 వరకు పొడిగించనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్.రాకేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సికింద్రాబాద్–సుబేదార్‌గంజ్, లింగంపల్లి, కాకినాడ, కాచిగూడ–మధురై, సికింద్రాబాద్–రామనాథపురం, సికింద్రాబాద్–పట్నా, సికింద్రాబాద్–దానాపూర్, కాచిగూడ–నాగర్‌సోల్, తదితర మార్గాల్లో నడిచే రైళ్లను ఆగస్టు చివరి వరకు నడపనున్నట్లు పేర్కొన్నారు.



పండరీపూర్, తుల్జాభవానీ ఆలయాలను సందర్శించుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్



సర్కోలి సభకు హాజరైన ప్రజలు.. భగీరథ్ బాల్కేకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేసీఆర్

మాది రైతుల టీం

▶ మొదటి పేజీ తరువాయి

మాదిరిగా దేశంలోని ఇతర ప్రాంతాల్లో ఎందుకు అభివృద్ధి సాధ్యం కాలేదని ప్రశ్నించారు. దేశంలో కోట్లాది ఎకరాల వ్యవసాయ భూమి, 75 వేల టీఎంసీల నీరు ఉందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరైన విధానాలు అమలు చేస్తే ప్రతీ ఎకరాకు సాగునీరు అందించవచ్చన్నారు. నూతన జల విద్యుదుత్పత్తి విధానాలను బీఆర్‌ఎస్ లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. దేశంలోని బొగ్గు నిల్వలు 150 సంవత్సరాలపాటు అవసరాలను తీరుస్తాయని, రైతులు ఏకమైతేనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతు బీమా వంటి తెలంగాణ పథకాలు మహారాష్ట్రలోనూ అమలు కావాలన్నారు. పనిచేయని ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని, రైతుల కోసం పనిచేసే ప్రభుత్వాన్ని తెచ్చుకుందామని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్‌లో చేరిన భగీరథ బాల్కేను ఎమ్మెల్యేగా గెలిపిస్తే మంత్రిని చేస్తానని కేసీఆర్ ప్రకటించారు.

రైతు బతికుంటేనే ప్లేటులోకి భోజనం

'రైతు బతికుంటే ఎవరు మరణిస్తారు, రైతు మరణిస్తే ఎవరు బతుకుతారని నేను నిత్యం చెబుతుంటాను. రైతు జీవించి ఉంటేనే భోజనం మన ప్లేటులోకి వస్తుంది. రైతు మరణిస్తే అందరి భోజన పాత్రలు ఎండిపోతాయి. రైతులు లేకుంటే ఇక ఎవరు బతకగలరు' అని కేసీఆర్ చెప్పారు. మహారాష్ట్రలో బీఆర్‌ఎస్ సర్కారు ఏర్పడితే రైతులందరికీ పెన్షన్ ఇవ్వడంతోపాటు సంక్షేమ కార్యక్రమాలన్నీ అమలు చేస్తామన్నారు. 'తుమ్మచెట్టును నాటితే మామిడి పండ్లు ఎలా కాస్తాయి. మామిడి పండ్లు తినాలనుకుంటే మామిడి చెట్టునే నాటాలి. పాలు కావాలంటే ఆవులకు గడ్డి వేయండి, గాడిదలకు గడ్డి వేసి, ఆవుల నుండి పాలు ఎలా పొందగలం' అంటూ ఓటు శక్తితో అసాధ్యాలను సుసాధ్యం చేయవచ్చని కేసీఆర్ అన్నారు.

ముగిసిన మహారాష్ట్ర పర్యటన

రెండురోజుల పర్యటనకు రోడ్డు మార్గంలో భారీ కాన్వాయ్‌తో వెళ్లిన కేసీఆర్ మంగళవారం రాత్రి హైదరాబాద్‌కు తిరిగి చేరుకున్నారు. సోమవారం రాత్రి షోలాపూర్ బాలాజీ సరోవర్ హోటల్‌లో బస చేసిన కేసీఆర్ మంగళవారం ఉదయం రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య నేతలతోపాటు పండరీపూర్‌కు చేరుకున్నారు. 10 గంటలకు పండరీపూర్‌లోని శ్రీ విఠల్ రుక్మిణీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం సర్కోలిలోని భగీరథ బాల్కే నివాసానికి చేరుకుని ఆయన తండ్రి స్మారకానికి నివాళి అర్పించారు. అనంతరం జరిగిన సభలో కేసీఆర్ ప్రసంగించారు. తర్వాత పార్టీ నేతలతో కలిసి భాల్కే నివాసంలో భోజనం చేసి సాయంత్రం 4 గంటలకు సోలాపూర్‌కు చేరుకున్నారు. షోలాపూర్‌లోని స్థానిక కార్పొరేటర్ నగేశ్ వల్లియర్ నివాసానికి చేరుకుని పార్టీ నేతలతో కలిసి తేనీటి విందులో పాల్గొన్నారు. సాయంత్రం ఐదు గంటలకు తుల్జాపూర్ భవానీ ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం హైదరాబాద్‌కు తిరుగుపయనమయ్యారు.

విఠల్, రుక్మాయిలను దర్శించుకున్న కేసీఆర్

షోలాపూర్: పార్టీ విస్తరణలో భాగంగా షోలాపూర్ పర్యటనకు వచ్చిన బీఆర్‌ఎస్ చీఫ్, సీఎం కేసీఆర్ మంగళవారం ఉదయం పండరీపూర్‌లోని విఠల్, రుక్మాయిలను దర్శించుకున్నారు. ఉత్తరద్వారం నుంచి ఆలయంలోకి చేరుకున్న కేసీఆర్‌కు అర్చకులు, నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. విఠలేశ్వరుడి పాద ముద్రికలు, మూల విరాట్ విగ్రహం దర్శనానంతరం కేసీఆర్ రుక్మిణీ అమ్మవారి పాదాలను పసుపు కుంకుమలతో అలంకరించి మొక్కుకున్నారు. అర్చకులు కేసీఆర్ మెడలో తులసిమాలను వేశారు. ప్రత్యేక పూజల్లో పాల్గొని, వేదపండితుల ఆశీర్వాదం తీసుకున్నారు. ఆషాఢ ఏకాదశి పర్వదినానికి రెండు రోజులే ఉండటంతో ఆలయంలో, బయట భక్తుల రద్దీ విపరీతంగా ఉంది. దీంతో కేసీఆర్, కొందరు ప్రజాప్రతినిధులు మినహా ఆయన వెంట వచ్చిన మిగతా వారికి వీఐపీ దర్శనం కల్పించలేదు. దీంతో వారు ఆలయ శిఖర దర్శనం చేసుకుని వెనుదిరిగారు. అదేవిధంగా ముందుగా ప్రకటించిన ప్రకారం వేయి కేజీల గులాబీ పూలను హెలికాప్టర్ ద్వారా కురిపించేందుకు పోలీసులు అనుమతివ్వలేదు. హైదరాబాద్ నుంచి కేసీఆర్ వెంట వచ్చిన 600 వాహనాలను భద్రతా కారణాలతో పోలీసులు పండరీపూర్‌లోకి అనుమతించలేదు. కేసీఆర్ షోలాపూర్ నుంచి పండరీపూర్ ఆలయానికి వస్తున్న క్రమంలో స్థానికులు ఆయనను చూసేందుకు పోటీపడ్డారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు.



సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న తులసిచందు. చిత్రంలో వివిధ సంఘాల నేతలు

ప్రశ్నించే గొంతుకలను అణగదొక్కుతున్నారు

- స్వతంత్ర జర్నలిస్ట్ తులసిచందు ఆవేదన
- 'జర్నలిజం–ట్రోల్ ముఠాలు' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం
- ట్రోలింగ్ ముఠాలకు తగిన గుణపాఠం చెప్పాలన్న వక్తలు
- తులసీచందుకు జర్నలిస్టులు, ప్రజా సంఘాల మద్దతు

పంజగుట్ట (హైదరాబాద్): ప్రశ్నించే జర్నలిస్టుల గొంతులను కొందరు మతవాదంతో అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని స్వతంత్ర జర్నలిస్టు తులసిచందు అన్నారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల సమయంలో 'మతం వస్తుంది మేలుకో' అని వీడియో చేసినందుకు తనపై యాంటీ హిందూ ముద్ర వేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల తాను పెట్టిన కంటెంట్ మీద ఫేస్‌బుక్‌లో ఎటాక్ జరిగిందన్నారు. మంగళవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్, హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్, హైదరాబాద్ ప్రెస్‌క్లబ్, నెట్‌వర్క్ ఆఫ్ ఉమెన్ ఇన్ మీడియా, తెలంగాణ స్టేట్ స్మాల్ అండ్ మీడియం పేపర్స్, మేగజైన్స్ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో 'జర్నలిజం– ట్రోల్ ముఠాలు' అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్, ప్రొఫెసర్ హరగోపాల్, సీనియర్ పాత్రికేయులు కె.రామచంద్రమూర్తి, పాశం యాదగిరి, కె.శ్రీనివాస్, వేణుగోపాల్, ప్రొఫెసర్ పద్మజాషా, సామాజిక కార్యకర్తలు సజయ, పీవోడబ్ల్యూ సంధ్య, రాజకీయ విశ్లేషకులు డాక్టర్ మిత్రలతో పాటు 39 పౌరసంఘాలు పాల్గొని తులసిచందుకు సంఘీభావం తెలిపాయి. తులసిచందు మాట్లాడుతూ, తాను ఏ వార్తను సృష్టించ లేదని, అయినా తనను శత్రువుగా, అర్బన్ నక్సలైట్‌గా చిత్రీకరిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ప్రశ్నించే గొంతుకలపై దాడులు చేస్తున్నవారి వెనక ఎవరు ఉన్నారో ఆరాతీయాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ నేతలను, ప్రధానిని ప్రశ్నించే వారిపై నేరుగా దాడులు చేసేందుకు ఓ వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారని ఆమె ఆరోపించారు. తనపై దాడి చేస్తున్న మూడు యూట్యూబ్ చానల్స్, ఒక ఫేస్‌బుక్ ఖాతాపై కేసు పెట్టానని వెల్లడించారు. ప్రశ్నించే జర్నలిస్టులపై దాడులు చేస్తే అంతా ఐక్యం కావాల్సిన అవసరం ఉందన్నారు.

దేవులపల్లి అమర్ మాట్లాడుతూ, సోషల్ మీడియా వెలుగులోకి వచ్చాక ఇండిపెండెంట్ జర్నలిజం విస్తృతంగా ప్రాచుర్యం పొందిందని తెలిపారు. గతంలో వార్తాపత్రికలే ఉన్నప్పుడు ఒక సంస్థపైగానీ, వ్యక్తిపైగానీ వ్యతిరేక వార్తలు రాస్తే యాజమాన్యానికి, సంపాదకులకు ఫిర్యాదు చేసేవారని, సోషల్ మీడియా పెరుగుతున్న క్రమంలో ఇండిపెండెంట్ జర్నలిజంలో ఏ సంపాదకుని కట్టడి లేకుండా పోయిందన్నారు. ఇండిపెండెంట్ జర్నలిజం రావడం చాలామందికి ఇష్టం ఉండదని, అదే తులసిపై దాడికి దారితీసిందని అన్నారు. తులసికి తానుపూర్తి సంఘీభావం తెలుపుతున్నట్లు ప్రకటించారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ, సమాజంలో దళిత, మైనార్టీ మహిళలపై దాడులు జరుగుతూనే ఉన్నాయని, ఈ దాడి తులసి మీద కాకుండా యావత్ మహిళలపై దాడిగా భావించాలన్నారు. తులసికి పౌరహక్కుల సంఘాలు, ప్రజా సంఘాలు పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు.

ముగ్గురి ప్రాణం తీసిన ఆన్‌లైన్ జూదం

- ఆన్‌లైన్ పేకాటలో రూ.లక్షలు పోగొట్టుకున్న మహిళ
- అప్పులు ఇచ్చినవారి ఒత్తిడి పెరగడంతో మనస్తాపం
- ఇద్దరు చిన్నారులను చంపేసి, తానూ ఆత్మహత్య

చౌటుప్పల్: ఆన్‌లైన్ పేకాట ముగ్గురి ప్రాణాలు బలిగొంది. ఆటలో డబ్బులు పోవడం, అప్పుల వాళ్ల ఒత్తిడి పెరగడంతో.. తీవ్ర మనోవేదనకు గురైన మహిళ తన ఇద్దరు కుమారులను నీటి సంపులో తోసి హత్య చేసింది. ఆపై తానూ అందులోనే దూకి ప్రాణాలు తీసుకుంది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో జరిగిన ఈ విషాదకర ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. వలిగొండ మండలం గొల్నేపల్లి గ్రామానికి చెందిన అవిశెట్టి నర్సింహ పెద్ద కుమారుడు మల్లేశ్‌కు భూదాన్ పోచంపల్లి మండలం దంతూరు గ్రామానికి చెందిన రాజేశ్వరి(28)తో పదేళ్ల కిందట పెళ్లైంది. వీరికి అనిరుధ్(5), హర్షవర్దన్(3) కుమారులు. కొంతకాలం చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెంలో ఉండి.. ఏడేళ్ల క్రితం చౌటుప్పల్ పట్టణ కేంద్రానికి వచ్చారు. సాధారణ గృహిణి అయిన రాజేశ్వరి ఇంటర్మీడియట్ వరకు చదువుకుంది. తన వద్దనున్న స్మార్ట్‌ఫోన్‌లో ఆన్‌లైన్ (పేకాట)గేమ్‌కు ఆకర్షితురాలైంది. వేలల్లో పెట్టుబడి పెట్టి పేకాట ఆడి చాలా నగదు పోగొట్టుకుంది. ఇంట్లో తెలియకుండా పలువురి వద్ద అప్పు చేసింది. మొత్తంగా సుమారు రూ.8లక్షల వరకు పోగొట్టుకోవడంతో విషయం ఇంట్లో తెలిసింది. ఆమె భర్త మల్లేశ్ ఇటీవలే కొంత అప్పు తిరిగి చెల్లించాడు. ఇంకొంతమందికి ఇవ్వాల్సి ఉంది. అది తీర్చేందుకు నారాయణపురంలో ఉన్న ప్లాటును విక్రయించాలని ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం మల్లేశ్ ఇంటికి వచ్చిన అప్పు ఇచ్చిన వ్యక్తులు తమ డబ్బు చెల్లించాలని ఒత్తిడి చేశారు. వాళ్లు వెళ్లిపోయాక, మల్లేశ్ సమీపంలోనే ఉన్న బంధువు వద్దకు వెళ్లాడు. కాసేపటి తరువాత వచ్చిన అతనికి ఇంటి ఆవరణలోనే ఉన్న నీటి సంపులో ఇద్దరు కొడుకులు, భార్య విగతజీవులుగా కనిపించారు. ముగ్గురి మృతితో చౌటుప్పల్‌లో విషాదం అలుముకుంది.

జూలై 8న హైదరాబాద్‌లో బీజేపీ సమావేశం

హాజరుకానున్న 11 రాష్ట్రాల అధ్యక్షులు, సంస్థాగత జీఎస్‌లు

సాక్షి, హైదరాబాద్: దక్షిణాది రాష్ట్రాలతోపాటు వాటికి ఆనుకుని ఉన్న 11 రాష్ట్రాల బీజేపీ అధ్యక్షులు, సంస్థాగత ప్రధానకార్యదర్శుల సమావేశం వచ్చేనెల 8న హైదరాబాద్‌లో జరగనుంది. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, సంస్థాగత ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ హాజరుకానున్న ఈ భేటీలో వచ్చే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించనున్నారు. ఈ ఏడాది చివర్లోగా ఐదు రాష్ట్రాల ఎన్నికలతో సహా 2024 ఏప్రిల్‌లో జరగనున్న లోక్‌సభకు సన్నద్ధమయ్యే విషయంపైనా చర్చ జరగనుంది. తెలంగాణతో సహా ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, గోవా, లక్షద్వీప్, అండమాన్–నికోబార్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌ల నుంచి నేతలు పాల్గొననున్నారు. కొన్ని నెలల క్రితం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ప్రాథమికంగా చర్చలు జరపగా, అందులో చర్చించిన అంశాలు, సాధించిన లక్ష్యాలను ఈ సమావేశంలో సమీక్షించనున్నారు. ఈ సమావేశం ముగిశాక సాయంత్రం.. ప్రధాని మోదీ లేదా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పాల్గొనేలా బహిరంగసభ నిర్వహించాలనే ఆలోచనలో రాష్ట్ర పార్టీ ఉంది.

బీఆర్‌ఎస్‌కు ఓటేస్తే.. బీజేపీకి వేసినట్లే!

- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ధ్వజం
- బీజేపీకి బీఆర్‌ఎస్ మద్దతిస్తోంది
- మైనారిటీలను కేసీఆర్ మోసం చేశారు
- తెలంగాణలోనూ కర్ణాటక ఫలితమే వస్తుందని ధీమా



చివ్వెంల మండలం బి.చందుపట్ల గ్రామంలో డప్పు వాయిస్తున్న భట్టి విక్రమార్క

చివ్వెంల (సూర్యాపేట): కర్ణాటక ఎన్నికల్లో వచ్చిన ఫలితమే తెలంగాణలోనూ వస్తుందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. బీఆర్‌ఎస్‌కు వేసే ప్రతి ఓటు బీజేపీ వేసినట్లేనని దుయ్యబట్టారు. లౌకిక పార్టీ కాంగ్రెస్‌కు ఓటు వేస్తేనే బీజేపీకి వ్యతిరేకంగా వేసినట్లు అవుతుందని చెప్పారు. భట్టి మంగళవారం సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం తిమ్మాపురం, బి.చందుపట్ల గ్రామాల్లో ప్రాదయాత్ర చేశారు. చందుపట్లలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ.. మైనారిటీలకు 12 శాతం రిజర్వేషన్ ఇస్తామని మోసం చేసిన కేసీఆర్‌కు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. మంత్రి కేటీఆర్ ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను కలవడంతోనే బీజేపీ, బీఆర్‌ఎస్ వేర్వేరు కాదని మరోసారి స్పష్టమైందన్నారు. చట్టసభల్లో బీజేపీ తెచ్చిన అనేక బిల్లులకు బీఆర్‌ఎస్ ఎంపీలు మద్దతు తెలిపారన్నారు. భారత్ జోడో యాత్రకు భయపడి రాహుల్ గాంధీ అభ్యర్థిత్వాన్ని ప్రధాని మోదీ రద్దు చేయించారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చట్టాలు తెచ్చినా బీఆర్‌ఎస్ మద్దతు ఇస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపై మాట్లాడుతున్న కేంద్ర ప్రభుత్వ పెద్దలు.. సీఎం కేసీఆర్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించి, బీసీ సబ్‌ప్లాన్ తెస్తామన్నారు. తెలంగాణలో ప్రజల ఆకాంక్ష నెరవేరలేదని, నియామకాలు లేకపోవడంతోనే యూనివర్సిటీలు నిరుద్యోగుల కు కేంద్రాలుగా మారాయని ఎద్దేవా చేశారు. రైతుబంధు మాత్రమే ఇచ్చి రైతులకు అన్ని రకాల సబ్సిడీలు రాష్ట్ర ప్రభుత్వం తొలగించిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. ఇళ్లులేని వారికి డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేస్తామన్నారు. కాగా, బి.చందుపట్ల గ్రామంలో భట్టి పత్తిచేను దున్నుతున్న రైతు వద్దకు వెళ్లి అరక పట్టి కొద్దిసేపు దుక్కిదున్నారు. గీత కార్మికులతో మాట్లాడి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి, టీపీసీసీ మహిళా కాంగ్రెస్ చైర్మన్ సునీతారావు పాల్గొన్నారు.

పాపం పండే రోజు దగ్గరలో ఉంది: గద్దర్

చివ్వెంల(సూర్యాపేట): పదేళ్ల పాలనలో పాపం నిండిపోయింది.. ఆ పాపం పండే రోజు దగ్గరకు వచ్చింది.. అని ప్రజాపార్టీ వ్యవస్థాపకుడు గద్దర్ అన్నారు. ఆయన మంగళవారం సూర్యాపేట జిల్లా చివ్వెంల మండల పరిధిలోని బి.చందుపట్ల గ్రామంలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పాదయాత్రకు మద్దతు తెలిపి మాట్లాడారు. ధరణి పేరుమీద రైతులను, ప్రశ్నపత్రాలను లీక్ చేసి విద్యార్థులను ప్రభుత్వం మింగేసిందని విమర్శించారు. భట్టి విక్రమార్క పాదయాత్ర చారిత్రకమైందన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు గీతాలు ఆలపించి.. మహిళలతో కోలాటం ఆడారు.

మరో పతకం సాధించిన స్విమ్మర్ 'గంధం క్వీని'



కాచిగూడ: అండర్ వాటర్ ఫిన్స్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ స్విమ్మర్ 'గంధం క్వీని విక్టోరియా'మరో పతకం సాధించింది. ఈజిప్ట్ రాజధాని కైరోలో ఈనెల 24 నుంచి 27వ తేదీ వరకు జరిగిన చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రపంచ వ్యాప్తంగా 38 దేశాల నుంచి పాల్గొనగా, భారతదేశం తరఫున స్విమ్మర్ గంధం క్వీని 200 మీటర్ల మహిళల విభాగంలో పాల్గొని 2వ స్థానంలో నిలిచి మరో రజత పతకం సొంతం చేసుకుని రికార్డు కెక్కింది. ఈనెల 25న 400 మీటర్ల మహిళల విభాగంలో స్విమింగ్ పోటీలో గంధం క్వీని పాల్గొని రజత పతకం సాధించిన విషయం తెలిసిందే. హైదరాబాద్, బర్కత్‌పురాకు చెందిన స్విమ్మర్ గంధం క్వీని భారతదేశం తరఫున అంతర్జాతీయ స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొని రజత పతకాలు సాధించడం పట్ల రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు పలువురు ప్రముఖులు అభినందనలు తెలిజయజేశారు. బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్‌కు చేరకుంటామని ఆమె తెలిపారు.

ముగిసిన శాకంబరి ఉత్సవాలు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ శ్రీ పెద్దమ్మ ఆలయంలో ఈనెల 25న ప్రారంభమైన శాకంబరి ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. 3 రోజుల పాటు జరిగిన ముగింపు వేడుకల్లో భాగంగా మధ్యాహ్నం పూర్ణాహుతి వైభవంగా జరిగింది. జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి దంపతులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఉదయం నవగ్రహ హోమం, రుద్ర చండీ హోమాలు నిర్వహించారు. మూడు రోజుల పాటు ఆలయంలో ఉత్సవాల సందర్భంగా వివిధ రకాల కూరగాయలు, పండ్లతో అలంకరించిన కూరగాయలను భక్తులకు వితరణ చేశారు. రాత్రి జరిగిన పెద్దమ్మ తల్లి ఉత్సవమూర్తి పల్లకీ సేవలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముగింపు వేడుకల్లో నగర నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు విచ్చేసి శాకంబరి దేవిగా దర్శనమిచ్చిన పెద్దమ్మ తల్లిని దర్శించుకున్నారు.

నగర వార్తలు

'పీవీ' జీవితం విలువలకు నిదర్శనం

డాక్టర్ మోహన్ కందా



సమావేశంలో మాట్లాడుతున్న మోహన్ కందా

బంజారాహిల్స్: భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జీవితం విలువలకు నిదర్శనమని మాజీ ఐఏఎస్ అధికారి డా.మోహన్ కందా పేర్కొన్నారు. పీవీ 102వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో నిర్వహించిన స్మారకోపన్యాస కార్యక్రమానికి ఆయన హాజరై 'పాలన–విలువలు'అనే అంశంపై స్మారకోపన్యాసం చేశారు. పాలనలో జవాబుదారితనం అనేది మాజీ ప్రధాని పాలనలో బాగా కనిపించిందని పాలకులు, అధికారులు ప్రజల సేవకులుగా ఉండాలని, ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన అవసరాన్ని ఆయన గుర్తుచేశారు. దేశంలో చిన్న పిల్లలను అమ్ముకోవడం, మానభంగాలు, ఆత్మహత్యలు, వరకట్న వేధింపులు, మత వైషమ్యాలు, అనేవి దేశ అభివద్ధిని దెబ్బతీస్తాయని మొదట వీటిని పరిష్కరించాలని పాలకులకు సూచించారు. ఉపకులపతి ఆచార్య సీతారామ రావు మాట్లాడుతూ.. తెలంగాణ వైతాళికుల జీవిత విశేషాలు, సమాజానికి వారు చేసిన సేవలను భవిష్యత్ తరాలకు అందించాలనే లక్ష్యంతోనే వర్సిటీలో క్రమం తప్పకుండా స్మారకోపన్యాసాలు నిర్వహిస్తున్నామన్నారు. పీవీ తన హయాంలో తెచ్చిన ఆర్థిక సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసినట్లు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఇన్‌చార్జి అకడమిక్ డైరెక్టర్ ప్రొ.సుధారాణి ముఖ్య కార్యక్రమ ప్రాధాన్యతను పీవీ స్మరకోపన్యాసాల వివరాలను సభ దృష్టికి తెచ్చారు. యూజీసీ–డీఈబీ అఫైర్స్ ఇన్‌చార్జి డైరెక్టర్ డా. పల్లవి కాబ్దే వందన సమర్పణ చేశారు. సికా డైరెక్టర్ ప్రొ. మధుసూదన్‌రెడ్డి, డీన్‌లు ప్రొ.షకీలా ఖానం, ప్రొ.వడ్డాణం శ్రీనివాస్ పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగం మరువలేం

చిక్కడపల్లి: తెలంగాణ సహకారానికి అమరవీరుల త్యాగాలు మరువలేమని సీఎం కేసీఆర్ అమరవీరుల కుటుంబాలకు తగిన గుర్తింపు ఇచ్చారని పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ అన్నారు. మంగళవారం చిక్కడపల్లి త్యాగరాయగానసభ ప్రధాన వేదికపై శ్రుతిలయ ఆర్ట్స్ అకాడమీ, సీల్‌వెల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి పురస్కార ప్రదానోత్సవ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న దామోదర్ పురస్కారాలు బహూకరించి మాట్లాడారు. 1969లో తెలంగాణ తొలి పోరాటంలో ఎందరో మృతి చెందినా రాష్ట్ర సాధన జరగలేదని మలిదశ పోరాటం కేసీఆర్ నాయకత్వంలో గాంధీమార్గంలో అహింసా మార్గంలో రాష్ట్రం ఏర్పడిందన్నారు. తొమ్మిదేళ్ల పాలనలో అన్ని రంగాల్లో తెలంగాణ ప్రగతి సాధించిందన్నారు. వంశీ సంస్థల అధినేత వంశీరామరాజు మాట్లాడుతూ.. సంస్థ నిర్వాహకులు ఆమని నిరంతరం సాంస్కృతిక సామాజిక కార్యక్రమాల నిర్వహణలో దిట్ట అని ఆమెకు రవీంద్రభారతి కార్యదర్శిగా సాంస్కృతిక శాఖలో ఏదైనా పదవి ఇస్తే మా సంస్థలకు ఆనందమన్నారు. పట్టాభి, రామకృష్ణ, శ్రీనివాస్‌గౌడ్, సతీష్‌రెడ్డి, ఆనందరాజు తదితరులు స్ఫూర్తి పురస్కారాలు అందుకున్నారు. సంస్థ అధ్యక్షుడు భీమ్‌రెడ్డి అధ్యక్షత వహించిన సభకు ఆమని స్వాగతం పలికారు. తొలుత ఆమని, సుభాష్ తదితరులు పాడిన పాటలతో పాటు నటి పూర్ణిమ తన పాటలతో అలరించారు.

మాజీ ఎంపీ సోలిపేట రాంచంద్రారెడ్డి కన్నుమూత



బంజారాహిల్స్/దుబ్బాక టౌన్: రాజ్యసభ మాజీ సభ్యుడు సోలిపేట రాంచంద్రారెడ్డి (88) మంగళవారం ఉదయం బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని తన నివాసంలో కన్నుమూశారు. గత కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నా రు. మంగళవారం సాయంత్రం ఫిలింనగర్ మహాప్రస్థానంలో ఆయన అంత్యక్రియలు జరిగాయి.

మచ్చలేని వ్యక్తిగా పేరు: సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం చిట్టాపూర్‌కు చెందిన సోలిపేట రాంచంద్రారెడ్డి 1935 మే 17న మాలిపటేల్ గాలిరెడ్డి–సుందరమ్మ దంపతులకు జన్మించారు. స్వగ్రామం చిట్టాపూర్‌లో ప్రాథమిక, సిద్దిపేటలో హైస్కూల్ విద్యాభ్యాసం కొనసాగింది. రాంచంద్రా రెడ్డి తొలితరం కమ్యూనిస్టు నాయకుల స్ఫూర్తితో తెలంగాణ రైతాంగ పోరాటంలో పాల్గొన్నారు. సిటీ కాలేజీలో పట్టభద్రులైన రాంచంద్రారెడ్డి రాజకీయాల్లో పూర్తి కాలం పనిచేశారు. 70 ఏళ్లపాటు రాజకీయాల్లో క్రియాశీలకంగా పని చేసి మచ్చలేని వ్యక్తిగా పేరొందారు.

సర్పంచ్ నుంచి ఎంపీ వరకు..

చిట్టాపూర్ తొలి సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానం (1955 నుంచి 1964 వరకు) చేపట్టిన రాంచంద్రారెడ్డి 1972 నుంచి 1978 వరకు దొమ్మాట నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా పనిచేశారు. 1996 నుంచి 2002 వరకు టీడీపీ నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఎంపికై రాజ్యసభలో టీడీపీ ఫ్లోర్ లీడర్‌గా, రాజ్యసభ అస్యూరెన్స్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. కమ్యూనిస్టుగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి కాంగ్రెస్, టీడీపీలో కీలక పదవుల్లో పనిచేశారు. అలాగే దుబ్బాక సమితి అధ్యక్షుడిగా, సిద్దిపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, మెదక్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధ్యక్షుడిగా, భారత్–చైనా మిత్ర మండలికి అధ్యక్షుడిగా, సీఆర్ ఫౌండేషన్, తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్‌లకు ఆయన సేవలు అందించారు. కొంతకాలం లోక్‌సత్తాలోనూ పనిచేశారు. దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, సీఎంలు చెన్నారెడ్డి, ఎన్టీఆర్, చంద్రబాబు, సీఎం కేసీఆర్‌లతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ప్రముఖ కవి సినారెకు రామచంద్రారెడ్డి వియ్యంకుడు. డాక్టర్ సి.నారాయణరెడ్డి చిన్న కుమార్తెను తన పెద్ద కుమారుడు వెంకటేశ్వరరెడ్డికి చేసుకున్నారు.

సీఎం సంతాపం: సోలిపేట రామచంద్రారెడ్డి మృతిపట్ల ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు సంతాపాన్ని ప్రకటించారు. నాటి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొన్న సోలిపేట జీవితం ఆదర్శవంతమైదని గుర్తుచేశారు.

కస్తూర్బా టీచర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి



విద్యా శాఖమంత్రికి వినతి పత్రం సమర్పిస్తున్న నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్

కాచిగూడ: హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం కస్తూర్బా పాఠశాలలో తొలగించిన 937 మంది టీచర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్ డిమాండ్ చేశారు. కస్తూర్బా పాఠశాలలో పనిచేసే టీచర్లను తొలగించడం అన్యాయమని వీరిని హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం డ్యూటీలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కలిసి చర్చించి వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ.. రెండేళ్ల క్రితం అక్టోబర్‌లో ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ జీఓఆర్‌నెం.1321 ఇస్తూ కస్తూర్బా పాఠశాలల్లో 937 మంది టీచర్ పోస్టులను మెరిట్ ఆధారంగా భర్తీ చేశారు. ప్రభుత్వం జీఓలో కాంట్రాక్టు టీచర్‌గా భర్తీ చేయాలని స్పష్టంగా ఉంది. కానీ విద్యాశాఖ అధికారులు మౌఖికంగా చెప్పి తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఉన్న 937 మంది టీచర్లను మెరిట్‌పై సెలక్టు చేసి, నియామకం చేయడంతో వారు బోధకులుగా పనిచేస్తున్నారని తెలిపారు. వీరికి రాత పూర్వక ఆదేశాలు ఇవ్వడం లేదు. మౌఖికంగా చెప్పి చేర్చుకుంటున్నారు. మరల మార్చిలో తొలగిస్తున్నారు. వీరిని ఏటా మార్చిలో టర్మినెట్ చేస్తూ తిరిగి ఆగస్టులో తీసుకుంటున్నారు. మరోవైపు 7 లక్షల మంది బీఈడీ, డీఈడీ, పండింట్ శిక్షణ, పీఈటీ చేసిన నిరుద్యోగులు ఉద్యోగాలు లేక రోడ్లపై తిరుగుతున్నారని ఆయన పేర్కొన్నారు. అనురాధా, వెంగమాంబ, స్వాతి, రాణి, అర్చన, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణంపై మమత

డ్యూటీ సమయంలో బుద్ధిగా కూర్చుని తమ పని తాము చేసుకుని సమయం అయిపోగానే ఇంటికి వెళ్లిపోయే అధికారులు కొందరయితే, ఆఫీసు పని వేళల తరవాత కూడా పని గురించి ఆలోచించి వినూత్న నిర్ణయాలతో అందరికి ఆదర్శంగా నిలుస్తుంటారు మరికొందరు. ఈ రెండో కోవకు చెందిన వ్యక్తే జార్ఖండ్ ఫారెస్ట్ అధికారి మమతా ప్రియదర్శి. పర్యావరణం గురించి అవగాహన కల్పించడంతోపాటు జంతువులకు మనుషులకు మధ్యన సంధి కుదురుస్తూ అందరికీ ప్రేరణగా నిలుస్తోంది.


మమతా ప్రియదర్శి

జంషెడ్‌పూర్ డివిజినల్ ఫారెస్ట్ అధికారిగా పని చేస్తోంది మమతా ప్రియదర్శి. ఫారెస్ట్ అధికారిగా అడవులను సంరక్షించడంతోపాటు పర్యావరణం దెబ్బతినకుండా ఉండేందుకు శాయశక్తులా కృషిచేస్తోంది. ప్రకృతి ప్రాముఖ్యత, కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు చెబుతూ రేపటి పౌరులకు అవగాహన కల్పిస్తున్నారు. వాతావరణంలో చోటు చేసుకుంటోన్న మార్పులు, నీటి సంరక్షణ, మనుషులు– జంతువుల మధ్య ఏర్పడే సంఘర్షణలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు వివిధ రకాల డాక్యుమెంటరీలను ప్రదర్శన ఏర్పాటు చేసింది. ఇప్పటిదాకా 347 గ్రామాలు, వివిధ స్కూళ్లలో ప్రదర్శించిన డాక్యుమెంటరీలతో రెండున్నర లక్షలమందికిపైగా అవగాహన కల్పించింది. వ్యాన్‌కు పెద్ద ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి పర్యావరణ పరిరక్షణ గురించి వివరించి చెబుతున్నారు. ఈ కార్యక్రమం గురించి ఆమె మాటల్లోనే...



‘‘ఈ మధ్యకాలంలో తరచూ అడవుల్లో మంటలు రేగి చాలా వృక్షాలు కాలిపోతున్నాయి. దీనివల్ల పర్యావరణ సమతుల్యం దెబ్బతింటోంది. అసలు అడవులు ఎందుకు తగలబడుతున్నాయో కూడా ఈ చుట్టుపక్కల నివసిస్తోన్న చాలామందికి తెలీదు. ఏనుగులకు, మనుషులకు మధ్య తరచూ సమస్యలు ఏర్పడుతున్నాయి. ఇలాంటి వాటన్నింటిని అధిగమించడానికి తీసుకొచ్చిందే ఈ కార్యక్రమం.

అందుకే ఆడియో–వీడియో

జంతువులకు ఎలాగూ అర్థం చేయించలేము. మనమే అర్థం చేసుకుని వాటికి అడ్డు తగలకుండా, మూగ జీవాలు మనకి ఇబ్బంది కలిగించకుండా మనమే సర్దుకుపోవాలి. అందుకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో ... కూర్చోబెట్టి చెపితే ఎవరూ వినరు. అందుకే ఎల్‌ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేసి వారి ఆసక్తిని ఇటు మళ్లిస్తున్నాం. కొంతవరకైనా గుర్తుపెట్టుకుని పాటిస్తారు. ఈ డాక్యుమెంటరీలలో నాలుగు విభిన్న అంశాలపై వీడియోలు ప్లే చేస్తున్నాం. మనుష్యులు– జంతువుల సంఘర్షణ మొదటిది, రెండో వీడియోలో అడవులు తగలబడినప్పుడు ఏం చేయాలి... మూడో అంశంగా కర్బన ఉద్గారాలు విడుదలవకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఉంటాయి. నాలుగో అంశం మొక్కల పెంపకం, మొక్కలను ఎలా కాపాడాలి, నీటిసంరక్షణ గురించి సరళమైన భాషలో చెబుతున్నాం. వీటివల్ల విద్యార్థులు, గ్రామస్థులకు సులభంగా అర్థమవుతుంది.

స్కూళ్లు, పబ్లిక్ ప్లేసుల్లో..

ఇప్పటిదాకా స్కూళ్లతోపాటు, గ్రామాల్లోని పబ్లిక్ ప్లేసుల్లో వ్యాన్ వీడియోలు ప్లేచేసి వీలైనంత అవగాహన కల్పించాం. పాఠ్యపుస్తకాల్లో సిలబస్ కాకుండా కొత్త విషయాలు తెలుసుకున్నందుకు వాళ్లు చాలా సంతోషపడుతున్నారు.

పట్టుదారంతో జీవితాన్ని అల్లుకుంది

**నేనేంటి? నాకంటూ చెప్పుకోవడానికి ఏమీ లేదా?
ఈ ప్రశ్నలు పావనిని వెంటాడాయి... వేధించాయి.
చదువుంది... పెద్ద ఉద్యోగం చేయాలనే ఆకాంక్ష ఉంది.
అబ్దుల్ కలామ్ చెప్పినట్లు పెద్ద కలలు కన్నదామె.
ఆ కలలను నిజం చేసుకోవడానికి తగినట్లు శ్రమించింది కూడా.
జీవితం మాత్రం... ఆమె చదవని సిలబస్‌తో పరీక్ష పెట్టింది.
ఆ పరీక్షను సహనంతో ఎదుర్కొన్నది... ఉత్తీర్ణత సాధించింది.
ఇక... తనను తాను నిరూపించుకోవాలనుంది.
క్రియేటివిటీ ఆమెకు తోడుగా వచ్చి వెంట నిలిచింది.
ఆమె ఇప్పుడు పట్టుదారంతో చక్కటి ఆభరణాలల్లుతోంది.**


పావని కోరెం

పావని కోరెం... వరంగల్ జిల్లా, హన్మకొండలో పుట్టింది. బయో టెక్నాలజీలో గ్రాడ్యుయేషన్ చేసింది. ఇంకా చదవాలని, మంచి ఉద్యోగం తెచ్చుకోవాలని అనుకుంది. ఆమె ఆలోచనలకు భర్త అండగా నిలిచారు. పెళ్లి తర్వాత హైదరాబాద్‌లో కాపురం, ఉస్మానియాలో పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో చేరింది. బయో ఇన్‌ఫర్మాటిక్స్‌లో పీజీ పూర్తయింది. పోటీ పరీక్షల కోసం భార్యాభర్తలిద్దరూ కలిసి కోచింగ్‌కెళ్లారు. పరీక్షలకు సిద్ధమయ్యేలోపు జీవితం మరో పరీక్ష పెట్టింది. కడుపులో పెరుగుతున్న బిడ్డ గురించి చిన్న సందేహం. ఆ సందేహాన్ని నిజం చేయడానికా అన్నట్టు పుట్టగానే బిడ్డ ఏడవ లేదు. నెలరోజులు హాస్పిటల్‌లోనే ఉంచి చికిత్స చేయించుకుని ఇంటికి వచ్చారు. స్పెషల్ కిడ్ కావచ్చనే మరో సందేహం. క్షణక్షణం బిడ్డ సంరక్షణలోనే గడిచిపోయింది. అనుక్షణం బిడ్డ ఎదుగుదల కోసం శ్రమించింది. తల్లిగా కఠోరయజ్ఞమే చేసింది. ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీలతో బాబుని మెయిన్‌స్ట్రీమ్‌లోకి తీసుకు రాగలిగింది. ఈ ఒత్తిడి నుంచి బయటపడడానికి తాను ఆశ్రయించిన ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ నుంచి తనను తాను తీర్చిదిద్దుకుంది. తనను తాను నిరూపించుకోవాలనే తపనతో పని చేసింది. ఇప్పుడామె తన సృజనాత్మకతతో గుర్తింపు పొందుతోంది. తన జీవితంలో దశాబ్దంపాటు సాగిన కీలక పరిణామాలను ఆమె సాక్షితో పంచుకున్నారు.

ఊహించని శరాఘాతం!

‘‘మా పెళ్లి 2009లో జరిగింది. బాబు ఏడీహెచ్‌డీ (అటెన్షన్ డెఫిసిట్ హైపర్ యాక్టివిటీ డిజార్డర్) సమస్య ఉందని తెలిసింది. బోర్లా పడడం, పాకడం, కూర్చోవడం, నడవడం వంటివన్నీ కొంత ఆలస్యంగా చేశాడు. నార్మల్ కిడ్ చేయాల్సిన సమయానికంటే ఎంత ఆలస్యమవుతోందా అని క్యాలెండర్ చెక్ చేసుకుంటూ... కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చాను. ఇప్పుడు దాదాపుగా నార్మల్ కిడ్ అయ్యాడు. కానీ చిన్నప్పుడు రోజూ ఆందోళనే. బరువు తక్కువగా పుట్టడంతో ఇమ్యూనిటీ తక్కువగా ఉండేది. తరచూ జలుబు, జ్వరం వస్తుండేవి. అప్పట్లో మా వారికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ మైసూరులో ఉద్యోగం. కర్నాటకలో ఓ చిన్న గ్రామంలో పోస్టింగ్. అక్కడ వైద్య సదుపాయాలు తక్కువ. ప్రతినిత్యం భయంభయంగా గడిచేది. రెండున్నరేళ్లకే బాబుకి హెర్నియా ఆపరేషన్ చేయించాల్సి వచ్చింది.

స్టేట్ బ్యాంకుకు అనేక అనుబంధ బ్యాంకుల్ని అనుసంధానం చేయడం కూడా అప్పుడే జరిగింది. ఎస్‌బీఐకి మారి హైదరాబాద్‌కి వచ్చేశాం. మన ప్రాంతానికి వచ్చిన తర్వాత నన్ను వెంటాడిన భయం వదిలిపోయింది. బాబుకి మంచి వైద్యం చేయించగలమనే ధైర్యం వచ్చింది. ట్రీట్‌మెంట్ థెరపీలు జరిగేకొద్దీ బాబులో మెరుగుదల స్పష్టంగా కనిపిస్తుండేది. డిప్రెషన్ నుంచి మెల్లగా బయటపడ్డాను. రోజులు ఆశాజనకంగా గడుస్తున్నప్పటికీ నాలో ఏదో వెలితి ఉండేది.

సృజనతో సాంత్వన

నన్ను నేను ఏదో ఒక వ్యాపకంలో నిమగ్నం చేసుకోవడానికి ప్రయత్నం చేస్తూ ఉండేదాన్ని. యూ ట్యూబ్ చూసి నేర్చుకున్న పేపర్ క్విల్లింగ్ మంచి సాంత్వననిచ్చింది. బాబుకి ఫిజియోథెరపీ చేయించే ట్రైనర్ నేను క్విల్లింగ్‌లో చేసిన పూలు, బొమ్మలను చూసి, చాలా బాగున్నాయని తీసుకెళ్లారు. వాటిని ఆ రోజే వాళ్ల హాస్టల్ స్టూడెంట్స్ కొనుక్కున్నారు. అప్పుడే మా ఫ్రెండ్ పట్టు దారంతో ఆభరణాలు తయారు చేయమని చెప్పింది. అలా నా లైఫ్ కొత్త మలుపు తీసుకుంది. హాబీగా మొదలు పెట్టిన యాక్టివిటీ కాస్తా నాకు ఒక ప్రత్యేకమైన గుర్తింపునిచ్చింది. తెలిసిన వాళ్ల నుంచి నా సృజనాత్మకత ఎల్లలు దాటింది. దుబాయ్, యూఎస్, యూకే, చైనాల నుంచి ఆర్డర్‌లు వస్తున్నాయి. ఫేస్‌బుక్ బిజినెస్ పేజ్, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, జస్ట్ డయల్, మీ షోలలో నా అల్లికలు విపరీతంగా అమ్ముడవుతున్నాయి. రిటర్న్ గిఫ్ట్‌లు ఇవ్వడానికి బల్క్ ఆర్డర్‌లు వస్తుంటాయి. అలాంటప్పుడు రాత్రంతా పని చేస్తుంటాను. ముగ్గురు అమ్మాయిలకు ఎంప్లాయ్‌మెంట్ ఇచ్చాను. మేము తయారు చేసిన ఉత్పత్తులను పికప్ బాయ్స్ వచ్చి తీసుకెళ్తారు. బాబును చూసుకుంటూ నా యాక్టివిటీని కొనసాగిస్తున్నాను. మొదట్లో అయితే మెటీరియల్ కోసం వెతుక్కుంటూ బాబును బండి మీద కూర్చోబెట్టుకుని బేగం పేట నుంచి బేగం బజార్‌కు వెళ్లేదాన్ని. ఇప్పుడైనా ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తే వస్తుంది. కానీ బాబుకు ఇంకా నా అవసరం ఉంది. నేను దగ్గరుండి చూసుకుంటే మెరుగ్గా ఉంటుందనే ఉద్దేశంతో ఇప్పుడిలా కొనసాగిస్తున్నాను.

నాకు నిజంగా ఆశ్చర్యమే!

నా లైఫ్ జర్నీలో నాకు ఆశ్చర్యం, సంతోషం కలిగించే విషయం ఏమిటంటే... నన్ను రోల్‌మోడల్‌గా చూస్తూ నా నుంచి స్ఫూర్తి పొందుతున్న వాళ్లు ఉన్నారనే విషయం. అంతా బాగున్న వాళ్లు చాలామంది ఏమీ చేయకుండా ఉంటున్నారు. ఏదైనా సమస్య రాగానే దిగాలు పడిపోయి జీవితాన్ని నాలుగ్గోడలకు పరిమితం చేసుకునే వాళ్లున్నారు. కానీ... ‘సమస్యకు పరిష్కారం వెతుక్కుని, తనకు ఒక గుర్తింపును తెచ్చుకుంది’ అని ప్రశంసిస్తున్నారు. మా వాళ్లు మాత్రం మొదట్లో ‘నీకు ఇప్పుడు ఇవన్నీ ఎందుకు, పిల్లాడిని చూసుకుంటూ ప్రశాంతంగా ఉండు. ఇన్ని ఒత్తిడులు పెట్టుకోవద్ద’ని కోప్పడ్డారు. కానీ ఈ పని నాకు ఒత్తిడిని తగ్గిస్తోందని తెలిసి మా వాళ్లు కూడా సంతోషంగా ఉన్నారు. నేను ఎంతో సంపాదిస్తున్నానని కాదు, కానీ నేను ఎటువంటి ఉనికి లేకుండా లక్షల్లో ఒకరిలా ఉండిపోకుండా, ఈ పని వల్ల వందల్లో ఒకరిగా ఓ గుర్తింపు తెచ్చుకోగలిగాను’’ అంటున్నప్పుడు పావని కళ్లలో ఆనందం వెల్లివిరిసింది.

– వాకా మంజులారెడ్డి
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

బ్యూటిప్: బంగాళ దుంపతో ముఖం మిలమిల



● ఒక బంగాళదుంపను తీసుకుని తొక్క తీసి, పేస్టులా చేసుకోవాలి. దీన్ని పలుచని వస్త్రంలో వడగట్టి నీటిని తీసేయాలి. ఆ గుజ్జులో 6 టేబుల్ స్పూన్లు పాలు కలపాలి. ఈ మిశ్రమంలో 6 చుక్కల ఎసెన్షియల్ ఆయిల్ వేసి బాగా కలిపి, ఐస్ ట్రేలో వేసి రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి. ● ముఖాన్ని శుభ్రంగా కడిగి.. ఫ్రీజ్ అయిన బంగాళదుంపతో ముఖమంతా రుద్దాక, చేతులతో సున్నితంగా మర్దన చేసి, ఆరిన తరువాత కడిగేయాలి. ● వారంలో మూడుసార్లు ఇలా చేయడం వల్ల ముఖం మీద పేరుకు పోయిన దుమ్మూధూళి, మొటిమల తాలూకు మచ్చలు పోయి ముఖచర్మం నిగారింపుని సంతరించుకుంటుంది.

యువతరం... పిబరే భక్తి రసం

‘మనసులో ఉండే గదులను అసూయ, ద్వేషం, ఆగ్రహం... వంటి ప్రతికూల శక్తులతో నింపుకుంటూ వెళితే మనసు భారంతో కుంగిపోతుంది. ఆ భారం మన అడుగులపై పడుతుంది. ఒక అడుగు కూడా ముందుకు పడదు. దీనివల్ల ఎవరికి నష్టం? అలాకాకుండా మనసును ప్రేమ, శాంతి, సంతోషాలతో నింపండి. మనసు అత్యంత తేలిక అవుతుంది. అడుగులు వడివడిగా ముందుకు పడతాయి...’ ఇలాంటి మాటలతో యువతరాన్ని ఆకట్టుకుంటున్నారు యంగ్ స్పిరిచ్యువల్ ఇన్‌ఫ్లూయెన్సర్‌లు. సోషల్ మీడియాలో వీరు ఆధ్యాత్మికతకు సంబంధించి కొత్త ద్వారాన్ని తెరిచారు. వీరి ఫాలోవర్స్‌లో అత్యధికులు యువతే కావడం మరో విశేషం....

‘కాపీ కొట్టండి ఫరవాలేదు’ అంటుంది శ్రేయాసి వాలియా. ఇంతకీ ఆమె ఏం కాపీ కొట్టమంటుంది?

‘కాపీ కొట్టండి. దయగల హృదయాన్ని, ఎంత పెద్ద విమర్శను అయినా చిన్న చిరునవ్వుతో స్వీకరించే ధీరత్వాన్ని’ అంటుంది శ్రేయాసి.

దిల్లీలో జన్మించిన శ్రేయాసి కొన్ని డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల కోసం స్క్రిప్ట్ రైటర్‌గా, అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసింది. ప్రస్తుతం బెంగళూరు కేంద్రంగా ‘స్పిరిచ్యువల్ ఇన్‌ఫ్లూయెన్సర్’గా మంచి పేరు సంపాదించుకుంది.

ఏడు సంవత్సరాల వయసు నుంచే ధ్యానం తరగతులకు హాజరయ్యేది శ్రేయాసి. ధ్యానంతోపాటు ఆధ్యాత్మిక విషయాలపై చిన్నప్పటి నుంచి ఆసక్తి ఉంది.

లాక్‌డౌన్ సమయంలో కోవిడ్ మహమ్మారి భయం అనేది ఒక కోణం అయితే కరిగిపోతున్న ధైర్యం, నిలువెల్లా దైన్యం, రకరకాల మానసిక సమస్యలు మరో కోణం. ఈ సమస్యల పరిష్కారానికి ఉచితంగా మెడిటేషన్ తరగతులు నిర్వహించింది. తన ఇన్‌స్టాగ్రామ్ పేజీలో ‘ధ్యానం ఎందుకు చేయాలంటే... 500 కారణాలు’ అంటూ రాసిన దానికి మంచి స్పందన వచ్చింది.


జయ కిశోరి


శ్రేయాసి

‘ధ్యానం వల్ల నా కోపం తగ్గిపోయింది. ఆత్మవిశ్వాసం పెరిగింది’ అంటుంది శ్రేయాసి.

‘ధ్యానం’ తరువాత ఆధ్యాత్మిక విషయాలు కూడా రాయడం మొదలుపెట్టింది.

‘భక్తితత్వాన్ని గంభీరంగా మాత్రమే చెప్పాలని లేదు’ అనే భావనతో ఎంటర్‌టైన్‌మెంట్ వీడియోల ద్వారా కూడా ఎన్నో మంచి విషయాలు చెప్పింది.

‘ఇదంతా ఏమిటి! హాయిగా లక్షలు సంపాదించే ఉద్యోగం చేసుకోకుండా’ అని తనతో చాలామంది అనేవారు.

యూత్ పల్స్

ఇక సోషల్ మీడియాలో ట్రోలింగ్ సరేసరి. అయితే వారి మాటలు, ట్రోలింగ్ తనపై ప్రభావం చూపించలేకపోయాయి. ‘స్పిరిచ్యువల్ ఇన్‌ఫ్లూయెన్సర్’గా శ్రేయాసికి సోషల్ మీడియాలో ఎంతోమంది ఫాలోవర్స్ ఉన్నారు.

‘నేను ఎక్కువ ఇచ్చి తక్కువ తీసుకుంటున్నానా? తక్కువ ఇచ్చి ఎక్కువ తీసుకుంటున్నానా?’ అనేది శ్రేయాసి తనకు తాను వేసుకునే ప్రశ్న.

తీరిక సమయంలో పెయింటింగ్స్ వేయడం, పుస్తకాలు చదవడం, బ్యాడ్మింటన్ ఆడడం అంటే తనకు ఇష్టం.

● ● ●

కోల్‌కత్తాకు చెందిన 27 సంవత్సరాల జయ కిశోరిని ‘మీరాబాయి ఆఫ్ జెన్‌జెడ్’ అని పిలుచుకుంటారు అభిమానులు. సోషల్ మీడియా కేంద్రంగా కృష్ణుడి గాథలను 30 సెకండ్ల వీడియోలతో చెప్పడం ద్వారా జయ కిశోరి పాపులర్ అయింది.

జయ కిశోరి ఉపన్యాసాలకు ప్రభావితమైన ఎంతోమంది ‘మాలో ఒంటరితనం దూరమైంది. స్నేహభావం పెరిగింది’ అంటుంటారు.

జయ కిశోరికి ఫేస్‌బుక్‌లో 1.9 మిలియన్లు, యూట్యూబ్‌లో 2 మిలియన్‌ల ఫాలోవర్స్ ఉన్నారు.

‘నా తల్లిదండ్రులు ఆర్మీలో పనిచేస్తారు. దీంతో ఎన్నో ప్రాంతాలలో చదువుకోవాల్సి వచ్చింది. అయితే ఏ ప్రాంతంలో చదువుకున్నా జయ దీదీ నాతోపాటు ఉన్నట్లే ఉంటుంది. నాకు ధైర్యం చెబుతూ దారి చూపుతుంది’ అంటుంది దిల్లీకి చెందిన పదహారు సంవత్సరాల జయ పాండే.

ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఝాన్సీకి చెందిన 14 సంవత్సరాల దేవి ఉష్మ కిషోర్జీ ఒకవైపు పాఠశాల విద్యను కొనసాగిస్తూనే సోషల్ మీడియాలో రీల్స్, షార్ట్స్, పోస్ట్‌ల ద్వారా ఆధ్యాత్మికం నుంచి సెల్ఫ్–లవ్, సెల్ఫ్–కేర్ వరకు ఎన్నో విషయాలపై తన మనసులోని భావాలను పంచుకుంటుంది. దేవికి ఇన్‌స్టాగ్రామ్‌లో పదివేలమంది ఫాలోవర్స్ ఉన్నారు.

‘నాకు ఉన్న ఫాలోవర్స్ సంఖ్యను దృష్టిలో పెట్టుకొని ఒక వీడియోకు మూడు లక్షలు ఇస్తాం అంటూ ఆఫర్స్ వస్తుంటాయి. అయితే నేను డబ్బు కోసం రాజీ పడదలచుకోలేదు. వీడియోలను వైరల్ చేయడానికి ఒత్తిడి తెచ్చుకోవడం నా లక్ష్యం కాదు’ అంటుంది ముంబైకి చెందిన ఒక స్పిరిచ్యువల్ ఇన్‌ఫ్లూయెన్సర్.

‘మీ ఉపన్యాసం విన్న తరువాత నేను ఒంటరిని అనే భావన పోయింది అని మెసేజ్‌లు వస్తుంటాయి. ఇలాంటి మెసేజ్‌లు డబ్బుకంటే ఎంతో విలువైనవి అనిపిస్తాయి’ అంటుంది ఆమె.

స్థూలంగా చెప్పాలంటే యంగ్ స్పిరిచ్యువల్ ఇన్‌ఫ్లూయెన్సర్‌లు తమ ఆనందాన్ని డబ్బులలో చూసుకోవడం లేదు. తమ విజయాన్ని కరెన్సీ ధగధగలతో కొలవాలనుకోవడం లేదు.

‘మీ పోస్ట్ చదివిన తరువాత, మీ ఉపన్యాసం విన్న తరువాత నాలో చెప్పలేనంత మార్పు వచ్చింది’ ఇలాంటి చిన్న మెసేజ్ చాలు వారికి వెయ్యి ఏనుగుల బలాన్ని ఇవ్వడానికి!

విజయపథం

పీ ఫర్ పాడ్‌కాస్ట్.. బీ ఫర్ భార్గవి

లాక్‌డౌన్ లైఫ్‌స్టైల్లో మెరిసిన ఒక ట్రెండ్.... పాడ్‌కాస్ట్. ‘పాడ్‌కాస్ట్’ పాపులారిటీ గురించి వినడమేగానీ దాని పుట్టుపూర్వోత్తరాలు తెలుసుకోవడానికి, సక్సెస్‌ఫుల్ పాడ్‌కాస్టర్‌గా రాణించాలనుకునే వారికి సాధికారికమైన సమాచారం కరువైంది. ఈ లోటును పూరించడానికి మంచి పుస్తకాన్ని తీసుకువచ్చి ఔత్సాహికులకు మేలు చేసింది భార్గవి....



భార్గవి స్వామి

లీడింగ్ హెచ్‌ఆర్ కన్సల్టింగ్ కంపెనీ ‘ఎక్సెల్ కార్పోరేషన్’కు సీయీవోగా ఉన్న బెంగళూరుకు చెందిన భార్గవి స్వామి మన దేశంలోని లీడింగ్ పాడ్‌కాస్టర్‌లలో ఒకరు. కంటెంట్ ప్రొడ్యూసర్‌గా కూడా తన సత్తా చాటుతుంది.

మన దేశంలో పాడ్‌కాస్ట్‌పై వచ్చిన తొలి పుస్తకం ‘పీ ఫర్ పాడ్‌కాస్ట్’ రచయిత్రిగా ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంది. తన అనుభవాలను క్రోడీకరించి ఫస్ట్–పర్సన్‌లో రాసిన ఈ పుస్తకం పాడ్‌కాస్ట్ గురించి ప్రాథమిక విషయాలను తెలుసుకోవాలనుకునేవారికి దిక్సూచిలా నిలిచింది. ‘ఆర్ట్ ఆఫ్ పాడ్‌కాస్టింగ్’ను అక్షరాల్లోకి తెచ్చింది.

బిజినెస్ పాడ్‌కాస్ట్ షో ‘పీపుల్ హూ మ్యాటర్’తో సక్సెస్‌ఫుల్ పాడ్‌కాస్టర్‌గా పేరు తెచ్చుకుంది భార్గవి. పాడ్‌కాస్టర్‌గా ప్రయాణం మొదలుపెట్టే ముందు దాని లోతుపాతులు ఏమిటో తెలుసుకోవడానికి చిన్నపాటి రీసెర్చ్ లాంటిది చేసింది. అయితే పాడ్‌కాస్టర్‌గా తొలి అడుగులు వేయడానికి అవసరమైన సమాచారం దొరకడం గగనం అయింది. ‘జీరో ఇన్‌ఫర్‌మేషన్’ అనేది వెక్కిరిస్తున్నా తన పరిశోధనలో ఎక్కడా తగ్గింది లేదు. మాస్‌కమ్యూనికేషన్‌లో మాస్టర్స్ చేసిన భార్గవి తనదైన పద్ధతిలో పరిశోధన చేస్తూ సమాచారాన్ని సంపాదించింది.

‘తెలుసుకోవడానికి ఇన్ని విషయాలు ఉన్నాయా!’ అనిపించింది.

తాను సక్సెస్‌ఫుల్ పాడ్‌కాస్టర్‌గా రాణించడానికి అవి మంచి మార్గాన్ని చూపాయి.

తన సక్సెస్‌తోనే ఆగిపోకుండా పాడ్‌కాస్టింగ్‌లో సక్సెస్ కావాలనుకునేవారి కోసం ‘పీ ఫర్ పాడ్‌కాస్టింగ్’ అనే పుస్తకం రాసింది.

వెబ్‌సిరీస్‌ల కోసం స్క్రిప్ట్ రాసినప్పుడు ఫస్ట్ డ్రాఫ్ట్‌లోనే ఓకే అయిపోయేది. ‘పీ ఫర్ పాడ్‌కాస్టింగ్’ విషయంలో మాత్రం పలుసార్లు పుస్తకాన్ని తిరగరాసింది. ఏదో ఒక విషయాన్ని కొత్తగా చేరుస్తూ వచ్చింది.

ఈ పుస్తకానికి భార్గవి తల్లి ఎడిటర్‌లా వ్యవహరించింది. సూచనలు ఇచ్చింది. తల్లితో కలిసి ఈ ప్రాజెక్ట్ మీద పనిచేయడం భార్గవికి ఎంతో సంతోషాన్ని ఇచ్చింది.

‘పుస్తకాలు ఎక్కువగా చదవడం వల్ల రచనల ద్వారా ఒక విషయాన్ని సులభంగా కమ్యూనికేట్ చేయగలిగే విద్య పట్టుబడింది. నాలోని భావాలను ఆవిష్కరించడానికి రచనలను ఒక మాధ్యమంలా చేసుకుంటాను. అయితే పీ ఫర్ పాడ్‌కాస్ట్ అనేది నాలోని భావాల ఆవిష్కరణకు మాత్రమే పరిమితమైపోలేదు. ఎంతోమందికి దారి చూపించింది’ అంటుంది భార్గవి.

అరవింద్ అడిగ, కిరణ్ దేశాయ్, అశ్విని సంఘీ... మొదలైన వారి రచనలపై ఆసక్తి చూపించే భార్గవి కార్పొరేట్ దిగ్గజాల ఆలోచనలను, లీడర్‌షిప్, కోచింగ్‌లకు సంబంధించి పుస్తకాలను ఇష్టపడుతుంది. సంతోషం వెనక ఉండే శాస్త్రీయతను తెలుసుకోవడానికి ఆసక్తి ప్రదర్శిస్తుంది.

‘పాడ్‌కాస్టర్‌గా నా నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవడానికి మరింతగా ప్రయత్నిస్తున్నాను’ అంటున్న భార్గవి స్వామి వెబ్‌సిరీస్ కోసం స్క్రిప్ట్‌లు రాయడానికి, ఒక యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్ గురించి ఫిక్షన్ బుక్ రాయడానికి సన్నాహాలు చేస్తోంది.

సక్సెస్ మంత్ర

లాక్‌డౌన్ లైఫ్‌స్టైల్ వల్ల రీడింగ్, రైటింగ్ అనేవి మనకు బాగా చేరువయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా పాడ్‌కాస్ట్ సెగ్మెంట్ దూసుకుపోయింది. దీన్ని దృష్టిలో పెట్టుకొని పాడ్‌కాస్టర్‌గా ప్రయాణం మొదలుపెట్టాను. ‘పాడ్‌కాస్టర్‌గా సక్సెస్ కావాలి’ అనుకోగానే సరిపోదు. అందుకు తగిన కసరత్తులు చేయాలి. మనదైన ప్రత్యేకత కోసం ప్రయత్నించాలి. స్కూల్‌రోజుల్లో నేను చదువుల్లో ముందు ఉండడంతో పాటు పాటలు పాడేదాన్ని, నృత్యాలు చేసేదాన్ని, ఉపన్యాస పోటీల్లో చురుగ్గా పాల్గొనేదాన్ని. అయితే ఇవేమీ స్కూలు దగ్గరే ఆగిపోలేదు. సృజనాత్మక విషయాలలో నాకు నిరంతరం తోడుగా నిలుస్తున్నాయి.



‘మీ సక్సెస్ మంత్ర ఏమిటి?’ అని చాలామంది నన్ను అడుగుతుంటారు. సక్సెస్‌కు షార్ట్‌కట్‌లు ఉండవు. మనల్ని సక్సెస్‌ఫుల్‌గా మార్చడానికి గాడ్‌ఫాదర్‌లు ఉండరు. వృత్తిపై మనం చూపే ఆసక్తి, పడే కష్టం, మన పరిచయాలు విజయపథంలో దూసుకుపోవడానికి కారణం అవుతాయి. సక్సెస్ కోసం ఒకరిని అనుసరించాలనే రూల్ ఏమీ లేదు. ప్రతి ఒక్కరిలో ఒక ప్రత్యేకత ఉంటుంది. అదేమిటో కనుక్కుంటే చాలు.

– భార్గవి స్వామి,
స్టార్ పాడ్‌కాస్టర్, ఎంటర్‌ప్రెన్యూర్

అజేయ లంక...

- వరుసగా నాలుగో విజయంతో గ్రూప్ 'బి'లో టాప్ ర్యాంక్
- చివరి లీగ్ మ్యాచ్‌లో స్కాట్లాండ్‌పై గెలుపు


అసలంక

హరారే: వన్డే ప్రపంచకప్ క్వాలిఫయింగ్ క్రికెట్ టోర్నీ శ్రీలంక జట్టు లీగ్ దశను అజేయంగా ముగించింది. గ్రూప్ 'బి'లో భాగంగా మంగళవారం స్కాట్లాండ్ జట్టుతో జరిగిన చివరిదైన నాలుగో మ్యాచ్‌లో శ్రీలంక 82 పరుగుల తేడాతో గెలిచింది. వరుసగా నాలుగో విజయంతో శ్రీలంక ఎనిమిది పాయింట్లతో గ్రూప్ 'బి' టాపర్‌గా నిలిచింది. ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక 49.3 ఓవర్లలో 245 పరుగులకు ఆలౌటైంది. నిసాంక (85 బంతుల్లో 75; 10 ఫోర్లు), చరిత్ అసలంక (65 బంతుల్లో 63; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు చేశారు. స్కాట్లాండ్ బౌలర్లలో మార్క్ వాట్ మూడు, క్రిస్ గ్రీవెస్ నాలుగు వికెట్లు తీశారు. 246 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన స్కాట్లాండ్ 29 ఓవర్లలో 163 పరుగులకు ఆలౌటైంది. క్రిస్ గ్రీవెస్ (41 బంతుల్లో 56 నాటౌట్; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) మినహా మిగతావారు విఫలమయ్యారు. లంక బౌలర్లలో తీక్షణ మూడు, హసరంగ రెండు వికెట్లు పడగొట్టారు.

ఐర్లాండ్‌కు ఊరట...


స్టిర్లింగ్

గ్రూప్ 'బి'లో 'సూపర్ సిక్స్' దశకు చేరుకోలేకపోయిన రెండు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఐర్లాండ్ 138 పరుగుల తేడాతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) జట్టును ఓడించి విజయంతో టోర్నీని ముగించింది. ముందుగా ఐర్లాండ్ 50 ఓవర్లలో 4 వికెట్లకు 349 పరుగులు సాధించింది. ఓపెనర్ పాల్ స్టిర్లింగ్ (134 బంతుల్లో 162; 15 ఫోర్లు, 8 సిక్స్‌లు) భారీ సెంచరీ... బాల్‌బిర్నీ (66; 5 ఫోర్లు, 1 సిక్స్), హ్యారీ టెక్టర్ (33 బంతుల్లో 57; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు సాధించారు. అనంతరం యూఏఈ 39 ఓవర్లలో 211 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. గ్రూప్ 'బి' నుంచి శ్రీలంక, స్కాట్లాండ్, ఒమన్... గ్రూప్ 'ఎ' నుంచి జింబాబ్వే, నెదర్లాండ్స్, వెస్టిండీస్ జట్లు 'సూపర్ సిక్స్' దశకు అర్హత సాధించాయి. గురువారం నుంచి 'సూపర్ సిక్స్' దశ మ్యాచ్‌లు మొదలవుతాయి.

భారత్, కువైట్ మ్యాచ్ 'డ్రా'



బెంగళూరు: దక్షిణాసియా ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో భాగంగా మంగళవారం భారత్, కువైట్ జట్ల మధ్య జరిగిన చివరి లీగ్ మ్యాచ్ 1–1తో 'డ్రా'గా ముగిసింది. భారత్ తరఫున కెప్టెన్ సునీల్ ఛెత్రి (45+2వ ని.లో) కెరీర్‌లో 92వ గోల్ సాధించగా... 90+2వ నిమిషంలో భారత ప్లేయర్ అన్వర్ చేసిన సెల్ఫ్ గోల్‌తో కువైట్ స్కోరును సమం చేసింది. లీగ్ దశ తర్వాత భారత్, కువైట్ ఏడు పాయింట్లతో సమంగా నిలిచినా... గోల్స్ అంతరం కారణంగా కువైట్ టాపర్‌గా నిలిచింది. భారత్‌కు రెండో స్థానం దక్కింది.

అంకిత ఓటమి



లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ క్వాలిఫయింగ్ టెన్నిస్ టోర్నీలో భారత నంబర్‌వన్ అంకిత రైనా తొలి రౌండ్ మ్యాచ్‌లో 6–3, 6–7 (5/7), 1–6తో జెస్సికా (స్పెయిన్) చేతిలో ఓటమి పాలైంది. అంకితకు 12,750 పౌండ్లు (రూ. 13 లక్షల 32 వేలు) ప్రైజ్‌మనీ దక్కింది.

భారత్ శుభారంభం

బుసాన్: ఆసియా పురుషుల కబడ్డీ చాంపియన్‌షిప్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టు శుభారంభం చేసింది. ఆతిథ్య దక్షిణ కొరియాతో జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 76–13 పాయింట్ల తేడాతో... చైనీస్ తైపీ జట్టుతో జరిగిన రెండో లీగ్ మ్యాచ్‌లో భారత్ 53–19తో నెగ్గింది.

కౌంట్‌డౌన్ మొదలు...

100 రోజుల్లో వన్డే ప్రపంచకప్



బాబర్ ఆజమ్, రోహిత్ శర్మ (ఫైల్)
నరేంద్ర మోదీ స్టేడియం

- పూర్తి షెడ్యూల్ విడుదల చేసిన ఐసీసీ
- అక్టోబర్ 5న తొలి పోరు
- అక్టోబర్ 15న భారత్, పాక్ మ్యాచ్
- నవంబర్ 19న ఫైనల్
- కీలక మ్యాచ్‌లన్నీ అహ్మదాబాద్‌లోనే

ఈ శీతాకాలం మునుపటిలా చల్లగా ఉండదు. వన్డే ప్రపంచకప్‌తో హీటెక్కనుంది. ఫోర్లు, సిక్సర్లతో క్రికెట్ మజాను పంచనుంది. భారీ స్కోర్లతో, వీర విహారాలతో సాగిపోనుంది. బంతి, బ్యాట్ పైచేయి తేల్చుకునేందుకు సమాయత్తమైంది. బోరుకొట్టే మ్యాచ్‌లు కాకుండా... హోరెత్తించే షోలతో ఈ మెగా ఈవెంట్ మురిపించేందుకు సిద్ధమైంది. సెంచరీలు కొట్టే బ్యాటర్లు, హ్యాట్రిక్స్ వికెట్లు తీసే బౌలర్లు... ప్రపంచకప్ కలను సాకారం చేసుకునేందుకు తాజా దిగ్గజాలు సై అంటే సై అంటున్నారు.

ముంబై: వన్డే ప్రపంచకప్ అంకానికి అధికారిక షెడ్యూల్ విడుదలైంది. 12 ఏళ్ల తర్వాత భారత్ ఈ మెగా ఈవెంట్‌కు ఆతిథ్యమిస్తోంది. ఈసారి మాత్రం ఒంటరిగా నిర్వహించనుండటం ఈ కప్‌కున్న మరో ప్రత్యేకత. అందుకేనేమో అన్ని అనుకూల, ప్రతికూల అంశాలను పరిశీలించి.... అంతా కసరత్తు చేశాకే ఆలస్యంగా కేవలం వంద రోజుల ముందే షెడ్యూల్ విడుదల చేశారు. గతంలో ఓ ఏడాది ముందే ఐసీసీ ప్రపంచకప్ షెడ్యూల్‌ను ఖరారు చేసేది. వాన ముప్పున్న వేదికల్లో సెమీఫైనల్ మ్యాచ్‌లను కేటాయించలేదు. అక్టోబర్, నవంబర్ నెలల్లో జరిగే ఈ మెగా ఈవెంట్‌కు సంబంధించిన షెడ్యూల్‌ను అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మంగళవారం ముంబైలో విడుదల చేసింది. అక్టోబర్ 5న తెరలేచే ఈ ప్రతిష్టాత్మక టోర్నీకి నవంబర్ 19న జరిగే టైటిల్ పోరుతో తెర పడనుంది.

హైదరాబాద్‌లో భారత్ మ్యాచ్ లేదు

భారత్‌లోని 10 వేదికల్లో ప్రపంచకప్ మ్యాచ్‌లు ప్రత్యక్షంగా చూడొచ్చు. ఇందులో హైదరాబాద్‌కూ ఆతిథ్య భాగ్యం దక్కింది. కానీ భారత్ ఆడే మ్యాచ్‌కు నోచుకోలేకపోయింది. పాకిస్తాన్ ఆడే రెండు మ్యాచ్‌లతో పాటు న్యూజిలాండ్ ఒక మ్యాచ్ ఉప్పల్ మైదానంలో జరుగుతాయి. ఈ రెండింటికి ప్రత్యర్థులు ఖరారు కాలేదు. ప్రస్తుతం జింబాబ్వేలో జరుగుతున్న క్వాలిఫయింగ్ టోర్నీ ద్వారా రెండు జట్లు ఖరారవుతాయి. ముంబై, పుణే, ఢిల్లీ, చెన్నై, అహ్మదాబాద్, ధర్మశాల, లక్నో, కోల్‌కతా, బెంగళూరు ఈ 9 వేదికల్లో ఐదేసి చొప్పున మ్యాచ్‌లు నిర్వహిస్తారు.ఈ మెగా టోర్నీకి సన్నాహాల్లో భాగంగా భారత జట్టు రెండు వామప్ మ్యాచ్‌లు ఆడనుంది. సెప్టెంబర్ 30న గువాహటిలో ఇంగ్లండ్ జట్టుతో... అక్టోబర్ 3న త్రివేండ్రంలో క్వాలిఫయర్–1 జట్టుతో టీమిండియా తలపడుతుంది.



గత ఫార్మాటే

ఈ మెగా ఈవెంట్ కూడా గత ప్రపంచకప్ (2019) ఫార్మాట్‌లాగే రౌండ్ రాబిన్, నాకౌట్ పద్ధతిలో జరుగుతుంది. అంటే పది జట్లు ప్రతీ ప్రత్యర్థితోనూ లీగ్ దశలో తలపడుతుంది. పాయింట్ల పట్టికలో తొలి నాలుగు స్థానాల్లో ఉన్న జట్టు సెమీఫైనల్స్‌కు (నాకౌట్) అర్హత సాధిస్తాయి. తొలి సెమీఫైనల్‌కు నవంబర్ 15న ముంబై... రెండో సెమీఫైనల్‌కు నవంబర్ 16న కోల్‌కతా వేదిక కానున్నాయి. భారత్ గనుక సెమీఫైనల్ చేరితే ముంబైలో ఆ మ్యాచ్ ఆడాల్సి ఉంటుంది. ఒకవేళ సెమీఫైనల్లో భారత్‌కు పాకిస్తాన్ ఎదురైతే ఈ సెమీఫైనల్ కోల్‌కతాలో జరుగుతుంది. నాకౌట్ మ్యాచ్‌లకే (సెమీఫైనల్స్, ఫైనల్) రిజర్వ్ డేలున్నాయి.

ఆరు 'డే' మ్యాచ్‌లు... మిగతావి డే–నైట్...

ఈ టోర్నీలో మొత్తం జరిగే మ్యాచ్‌లు 48. లీగ్ దశలో 45 పోటీలు జరుగుతాయి. ఇందులో కేవలం ఆరు లీగ్‌లే డే మ్యాచ్‌లుగా ఉదయం గం. 10:30 గంటలకు మొదలవుతాయి. మిగతావన్నీ డే–నైట్ మ్యాచ్‌లుగా నిర్వహిస్తారు. వీటితో పాటు నాకౌట్ మ్యాచ్‌లు కూడా డేనైట్ వన్డేలే! డే–నైట్ మ్యాచ్‌లు మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమవుతాయి.

దాయాదులు దంచుకునేది...

మాంచి క్రికెట్ కిక్ ఇచ్చే... అందరూ ఉత్కంఠ రేపే మ్యాచ్ భారత్, పాకిస్తాన్ పోరు! చిరకాల ప్రత్యర్థుల మధ్య అక్టోబర్ 15న అహ్మదాబాద్‌లో లీగ్ మ్యాచ్ జరుగుతుంది. ఇదే కాదు... ఫైనల్ (నవంబర్ 19) సహా 2019 టోర్నీ ఫైనలిస్టులు ఇంగ్లండ్, న్యూజిలాండ్‌ల మధ్య టోర్నీ ఆరంభ పోరు (అక్టోబర్ 5న), ఇంగ్లండ్, ఆస్ట్రేలియా (నవంబర్ 4) తలపడే మేటి మ్యాచ్‌లను లక్ష పైచిలుకు ప్రేక్షకులు చూసే నరేంద్ర మోదీ స్టేడియంలోనే ఏర్పాటు చేశారు. గత మూడు ప్రపంచకప్‌లలో (2011లో భారత్; 2015లో ఆస్ట్రేలియా; 2019లో ఇంగ్లండ్) ఆతిథ్య జట్టు విజేతగా నిలవడం విశేషం.

నాలుగోసారి పూర్తిగా ఇండియాలోనే....

భారత్ ఆతిథ్యమివ్వబోయే నాలుగో వన్డే ప్రపంచకప్ ఇది. ఈసారి పూర్తిగా భారత్‌లోనే జరుగనుండటం ఈ వరల్డ్‌కప్ ప్రత్యేకత! తొలిసారిగా 1987లో పాక్‌తో కలిసి, రెండోసారి 1996లో పాక్, లంకలతో ఉమ్మడిగా, మూడోసారి 2011లో లంక, బంగ్లాదేశ్‌లతో సంయుక్తంగా భారత్ ఈ మెగా ఈవెంట్‌కు ఆతిథ్యమిచ్చింది. ఇప్పటి వరకు 12 సార్లు వన్డే ప్రపంచకప్ జరగ్గా... రెండోసారి మాత్రమే ఆతిథ్య జట్టు టోర్నీ తొలి మ్యాచ్‌లో బరిలోకి దిగడంలేదు. 1996లో భారత్ ఆతిథ్యమిచ్చిన ప్రపంచకప్‌లో ఇంగ్లండ్, న్యూజిలాండ్ మధ్య తొలి మ్యాచ్ జరగ్గా... 2023లోనూ ఈ రెండు జట్ల మధ్యే తొలి మ్యాచ్ జరగనుండటం విశేషం.

ఇదీ షెడ్యూల్

అక్టోబర్ 5: ఇంగ్లండ్ x న్యూజిలాండ్	అహ్మదాబాద్
అక్టోబర్ 6: పాకిస్తాన్ x క్వాలిఫయర్-1	హైదరాబాద్
అక్టోబర్ 7: దక్షిణాఫ్రికా x క్వాలిఫయర్-2	ఢిల్లీ
అక్టోబర్ 7: బంగ్లాదేశ్ x అఫ్గానిస్తాన్	ధర్మశాల
అక్టోబర్ 8: భారత్ x ఆస్ట్రేలియా	చెన్నై
అక్టోబర్ 9: న్యూజిలాండ్ x క్వాలిఫయర్-1	హైదరాబాద్
అక్టోబర్ 10: ఇంగ్లండ్ x బంగ్లాదేశ్	ధర్మశాల
అక్టోబర్ 11: భారత్ x అఫ్గానిస్తాన్	ఢిల్లీ
అక్టోబర్ 12: పాకిస్తాన్ x క్వాలిఫయర్-2	హైదరాబాద్
అక్టోబర్ 13: ఆస్ట్రేలియా x దక్షిణాఫ్రికా	లక్నో
అక్టోబర్ 14: ఇంగ్లండ్ x అఫ్గానిస్తాన్	ఢిల్లీ
అక్టోబర్ 14: న్యూజిలాండ్ x బంగ్లాదేశ్	చెన్నై
అక్టోబర్ 15: భారత్ x పాకిస్తాన్	అహ్మదాబాద్
అక్టోబర్ 16: ఆస్ట్రేలియా x క్వాలిఫయర్-2	లక్నో
అక్టోబర్ 17: దక్షిణాఫ్రికా x క్వాలిఫయర్-1	ధర్మశాల
అక్టోబర్ 18: న్యూజిలాండ్ x అఫ్గానిస్తాన్	చెన్నై
అక్టోబర్ 19: భారత్ x బంగ్లాదేశ్	పుణే
అక్టోబర్ 20: ఆస్ట్రేలియా x పాకిస్తాన్	బెంగళూరు
అక్టోబర్ 21: ఇంగ్లండ్ x దక్షిణాఫ్రికా	ముంబై
అక్టోబర్ 21: క్వాలిఫయర్-1 x క్వాలిఫయర్-2	లక్నో
అక్టోబర్ 22: భారత్ x న్యూజిలాండ్	ధర్మశాల
అక్టోబర్ 23:పాకిస్తాన్ x అఫ్గానిస్తాన్	చెన్నై
అక్టోబర్ 24: దక్షిణాఫ్రికా x బంగ్లాదేశ్	ముంబై
అక్టోబర్ 25: ఆస్ట్రేలియా x క్వాలిఫయర్-1	ఢిల్లీ
అక్టోబర్ 26: ఇంగ్లండ్ x క్వాలిఫయర్ 2	బెంగళూరు
అక్టోబర్ 27: పాకిస్తాన్ x దక్షిణాఫ్రికా	చెన్నై
అక్టోబర్ 28: క్వాలిఫయర్-1 x బంగ్లాదేశ్	కోల్‌కతా
అక్టోబర్ 28: ఆస్ట్రేలియా x న్యూజిలాండ్	ధర్మశాల
అక్టోబర్ 29: భారత్ x ఇంగ్లండ్	లక్నో
అక్టోబర్ 30: అఫ్గానిస్తాన్ x క్వాలిఫయర్-2	పుణే
అక్టోబర్ 31: పాకిస్తాన్ x బంగ్లాదేశ్	కోల్‌కతా
నవంబర్ 1: న్యూజిలాండ్ x దక్షిణాఫ్రికా	పుణే
నవంబర్ 2: భారత్ x క్వాలిఫయర్-2	ముంబై
నవంబర్ 3: క్వాలిఫయర్-1 x అఫ్గానిస్తాన్	లక్నో
నవంబర్ 4: ఇంగ్లండ్ x ఆస్ట్రేలియా	అహ్మదాబాద్
నవంబర్ 4: న్యూజిలాండ్ x పాకిస్తాన్	బెంగళూరు
నవంబర్ 5: భారత్ x దక్షిణాఫ్రికా	కోల్‌కతా
నవంబర్ 6: బంగ్లాదేశ్ x క్వాలిఫయర్-2	ఢిల్లీ
నవంబర్ 7: ఆస్ట్రేలియా x అఫ్గానిస్తాన్	ముంబై
నవంబర్ 8: ఇంగ్లండ్ x క్వాలిఫయర్-1	పుణే
నవంబర్ 9: న్యూజిలాండ్ x క్వాలిఫయర్-2	బెంగళూరు
నవంబర్ 10: దక్షిణాఫ్రికా x అఫ్గానిస్తాన్	అహ్మదాబాద్
నవంబర్ 11: భారత్ x క్వాలిఫయర్-1	బెంగళూరు
నవంబర్ 12: ఇంగ్లండ్ x పాకిస్తాన్	కోల్‌కతా
నవంబర్ 12: ఆస్ట్రేలియా x బంగ్లాదేశ్	పుణే
నవంబర్ 15: తొలి సెమీఫైనల్	ముంబై
నవంబర్ 16: రెండో సెమీఫైనల్	కోల్‌కతా
నవంబర్ 19: ఫైనల్	అహ్మదాబాద్

జట్లు: భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, అఫ్గానిస్తాన్, క్వాలిఫయర్-1, క్వాలిఫయర్-2 (ఈ రెండు జట్లు ప్రస్తుతం జింబాబ్వేలో జరుగుతున్న క్వాలిఫయింగ్ టోర్నీ ద్వారా ఖరారవుతాయి)

సినిమా



విహార యాత్రలో...

'ఆర్‌ఆర్‌ఆర్' సినిమా తెరకెక్కించడం, ఆ తర్వాత మూవీ ప్రమోషన్, ఆ తర్వాత ఆస్కార్ అవార్డుకి సంబంధించిన ప్రమోషనల్ ఈవెంట్స్‌తో దర్శకుడు రాజమౌళి మూడు నెలల క్రితం వరకూ ఫుల్ బిజీగా గడిపారు. నెక్ట్స్ మహేశ్ బాబు హీరోగా భారీ సినిమాకి దర్శకత్వం వహించనున్నారు రాజమౌళి. ఈ చిత్రానికి విజయేంద్ర ప్రసాద్ కథ సమకూరుస్తున్నారు. ఇంకా కథ పూర్తి కాలేదు. ఈలోపు ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి ప్లాన్ చేసుకుంటూనే కుటుంబంతో కలిసి విహార యాత్ర ప్లాన్ చేసుకున్నారు రాజమౌళి. తమిళనాడులో గల తూత్తుక్కుడిలో కుటుంబంతో కలిసి వెకేషన్‌ని ఎంజాయ్ చేస్తున్నారాయన. భార్య రమ, కొడుకు కార్తికేయ, కోడలు పూజా, కుమార్తె మయూఖతో కలిసి హాలిడే బ్రేక్‌లో ఉన్నారు రాజమౌళి. తూత్తుక్కుడిలోని ఆక్వా అవుట్ బ్యాక్ రిసార్ట్‌లో ఈ ఫ్యామిలీ బస చేసింది. అక్కడికి వెళ్లిన గుర్తుగా మొక్కలు నాటారు రాజమౌళి. ఈ విహార యాత్రకు సంబంధించిన ఫొటోలు వైరల్‌గా మారాయి.

నమ్మకంగా ఉన్నాం

\- నాగశౌర్య


● నాగశౌర్య, యుక్తి తరేజ, పవన్ బాసంశెట్టి

''రంగబలి' చిత్రకథని పవన్ చెప్పినట్లుగానే తీశాడు. ఈ సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. ఈ సినిమాతో అందరూ కనెక్ట్ అవుతారు. విజయంపై చాలా నమ్మకంగా ఉన్నాం'' అని హీరో నాగశౌర్య అన్నారు. నూతన దర్శకుడు పవన్ బాసంశెట్టి తెరకెక్కించిన చిత్రం 'రంగబలి'. నాగశౌర్య, యుక్తి తరేజ జంటగా సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ సినిమా జూలై 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం ట్రైలర్‌ను హైదరాబాద్‌లో రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో పవన్ బాసంశెట్టి మాట్లాడుతూ– ''పూర్తి స్థాయి వినోదం నేపథ్యంలో రూపొందిన చిత్రం 'రంగబలి'' అన్నారు.

నిఖిల్‌ని చూసి గర్వపడుతున్నా - నాగచైతన్య

''స్పై థ్రిల్లర్ సినిమాలు తీయడం అంత సులభం కాదు.. అది ఒక సవాల్. ఎందుకంటే ఇలాంటి హాలీవుడ్ సినిమాలను ఓటీటీల్లో చూసేస్తున్నారు. కానీ, 'స్పై' టీజర్, ట్రైలర్ చూశాక చాలా బాగా అనిపించింది. అంతర్జాతీయ స్థాయి విలువలకు ఏ మాత్రం తగ్గలేదు. రాజశేఖర్, చరణ్ తేజ్‌ల ప్యాషన్ ఏంటో తెలుస్తోంది. ఈ సినిమా ఘన విజయం సాధించాలి'' అని హీరో నాగచైతన్య అన్నారు. నిఖిల్ సిద్ధార్థ్, ఐశ్వర్యామీనన్ జంటగా గ్యారీ బీహెచ్ దర్శకత్వం వహించిన చిత్రం 'స్పై'. ఈడీ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై కె.రాజశేఖర్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా రేపు(గురువారం) విడుదలకానుంది. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన నాగచైతన్య మాట్లాడుతూ– ''నిఖిల్ అంటే నాకు చాలా ఇష్టం. 'హ్యాపీడేస్' తో కెరీర్ మొదలుపెట్టి, 'స్వామిరారా, కార్తికేయ' తో ఓ ట్రెండ్ సెట్ చేసి, 'కార్తికేయ 2' తో బాక్సాఫీస్‌ని షేక్ చేశాడు.. తనని చూసి నేను చాలా గర్వపడుతున్నాను. 'కార్తికేయ 2' తో ఒక ట్రెండ్ ఎలా సెట్ చేశాడో.. 'స్పై' చిత్రంతో ఆ ట్రెండ్ దాటి తర్వాతి స్థాయికి వెళతాడనే నమ్మకం ఉంది'' అన్నారు.

నిఖిల్ సిద్ధార్థ్ మాట్లాడుతూ– ''సుభాష్ చంద్రబోస్ వంటి ఒక గొప్ప వ్యక్తి గురించి ఉన్న సినిమా 'స్పై'. నాలుగురోజుల కిందట ఈ మూవీ ఫైనల్ కాపీ చూశాక 'థ్యాంక్యూ గ్యారీ' అన్నాను.. అంత బాగా ఈ మూవీ తీశాడు. ఇలాంటి సినిమా చేసినందుకు యూనిట్ అంతా గర్వపడుతున్నాం. ప్రతి భారతీయుడు చూడాల్సిన సినిమా ఇది'' అన్నారు. ''ఒక్క ఫోన్ కాల్‌తో 'స్పై' ప్రీ రిలీజ్ వేడుకకి వచ్చిన నాగచైతన్యగారికి థ్యాంక్స్'' అన్నారు కె.రాజశేఖర్ రెడ్డి.


● నిఖిల్, రాజశేఖర్ రెడ్డి, నాగచైతన్య, ఐశ్వర్యామీనన్

గ్యారీ బీహెచ్ మాట్లాడుతూ– ''డాక్టర్ అయిన నేను సినిమా ఇండస్ట్రీకి వెళ్తానంటే ఎవరూ ఒప్పుకోరు. కానీ, నా తల్లితండ్రులు ఒప్పుకుని, నన్ను ప్రోత్సహించినందుకు కృతజ్ఞతలు. 'స్పై' చాలా బాగా తీశావంటూ నిఖిల్‌గారు నన్ను హత్తుకోవడంతో సినిమా విజయంపై మరింత నమ్మకం పెరిగింది'' అన్నారు. ఈ వేడుకలో ఈడీ ఎంటర్‌టైన్ మెంట్స్ సీఈఓ చరణ్ తేజ్, సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకాల, కెమెరామేన్ వంశీ పచ్చిపులుసు, యూవీ క్రియేషన్స్ నిర్మాత వంశీ, నటీనటులు సాన్య ఠాకూర్, ఆర్యన్ రాజేష్ పాల్గొన్నారు.

ఆగస్టులో ఆరంభం


● నీరజ


● సిద్ధు

దాదాపు దశాబ్ద కాలంగా ఇండస్ట్రీలో కాస్ట్యూమ్ డిజైనర్‌గా రాణిస్తున్నారు నీరజ కోన. ఎన్టీఆర్, రామ్‌చరణ్, సూర్య వంటి టాప్ స్టార్స్ చేసిన సినిమాలకు నీరజ కోన కాస్ట్యూమ్ డిజైనర్‌గా చేశారు. సమంత, రకుల్ ప్రీత్‌సింగ్ వంటివారికి కూడా కాస్ట్యూమ్స్ డిజైన్ చేశారు. తాజాగా నీరజ కోన దర్శకురాలిగా మెగా ఫోన్ పట్టనున్నారని సమాచారం. రొమాంటిక్ థ్రిల్లింగ్ లవ్‌స్టోరీగా రూపొందనున్న ఈ సినిమాలో 'డీజే టిల్లు' ఫేమ్ సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తారని తెలిసింది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించనున్న ఈ సినిమా షూటింగ్ ఆగస్టు లేదా నవంబరులో ప్రారంభం కానుందట. ఈ సినిమాకు ప్రముఖ ఛాయాగ్రాహకులు పీసీ శ్రీరామ్, మ్యూజిక్ డైరెక్టర్ తమన్, రైటర్ మిథున్ చైతన్యను ఎంపిక చేసినట్లు సమాచారం.

యాక్టర్ అనిపించుకోవడం కష్టం

\- శ్రీ విష్ణు



''స్టార్ అవ్వడం అనేది మన చేతుల్లో లేదు. అయితే ఎంచుకునే పాత్రలతో మంచి యాక్టర్ అవ్వడం అనేది మన చేతుల్లోనే ఉంటుంది. కానీ యాక్టర్ అనిపించుకోవడం అనేది చాలా కష్టం. 'స్టార్' లేదా 'యాక్టర్' అని ఎవరైనా నాకు ఆప్షన్ ఇస్తే.. యాక్టర్ అవుతాననే చాలెంజ్‌నే తీసుకుంటాను'' అని శ్రీ విష్ణు అన్నారు. శ్రీ విష్ణు హీరోగా రామ్ అబ్బరాజు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సామజ వరగమన'. అనిల్ సుంకర సమర్పణలో రాజేష్ దండా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా శ్రీ విష్ణు చెప్పిన విశేషాలు..

● 'సామజ వరగమన'లో బాలసుబ్రహ్మణ్యం అనే యువకుడి పాత్రలో నటించాను. థియేటర్ బాక్సాఫీస్‌లో ఉద్యోగం చేస్తుంటాడు బాలసుబ్రహ్మణ్యం. సో.. కొంతమంది హీరోల డైలాగ్స్ ఈ సినిమాలో ఉంటాయి. నవ్వించడమే పనిగా పెట్టుకుని మేం తీసిన సినిమా ఇది.యూత్‌కు, ఫ్యామిలీ ఆడియన్స్‌కు ఈ సినిమా బాగా నచ్చుతుంది. సినిమాలో ఓ సర్‌ప్రైజింగ్ పాయింట్ కూడా ఉంది. తెలుగు సినిమాల్లో ఇప్పటివరకూ ఇలాంటి పాయింట్ రాలేదనే అనుకుంటున్నాం. ● ఇండస్ట్రీలో పెద్ద స్టార్స్ ఎక్కువైపోయారు. పెద్ద దర్శకులు తక్కువైపోయారు. కొన్నిసార్లు స్టార్ డైరెక్టర్స్‌కే స్టార్ హీరోలు దొరకడం లేదు కూడా. ఇక స్టార్ దర్శకులు మాలాంటి వారితో సినిమాలు చేయాలంటే అది టఫ్ అవుతుంది. దీనికి తోడు మార్కెట్ సమీకరణాలు కూడా ఉంటాయి. అలాగే పెద్ద దర్శకులు కొంతమంది దాదాపు రెండేళ్ల వరకూ సినిమాలను ప్లాన్ చేసుకుంటున్నారు. నేను సమయం వృథా కాకూడదని కొత్త దర్శకులతో, వీలైతే నేను ఇంట్రడ్యూస్ చేసిన వారితోనే మళ్లీ సినిమాలు చేసుకునేలా ప్లాన్ చేసుకుంటాను. ● విలన్ రోల్స్ చేయడం నాకు ఇష్టమే. అయితే 'వీరభోగ వసంతరాయలు', 'తిప్పరా మీసం' సినిమాల్లో నెగటివ్ టచ్ ఉండే రోల్స్ చేస్తే ప్రేక్షకులు అంతగా యాక్సెప్ట్ చేయలేదనిపించింది. అందుకే విలన్ రోల్స్ చేయాలనుకోవడం లేదు. ● ప్రస్తుతం హర్ష కొనుగంటి దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్‌లో ఓ సినిమా చేస్తున్నాను. అలాగే 'రాజరాజ చోర'కు ప్రీక్వెల్‌గా హసిత్ గోలి దర్శకత్వంలోనే ఓ సినిమా చేస్తున్నాను.

నారాయణతో సుధాకర్‌కి బ్రేక్ వస్తుంది

\- డైరెక్టర్ అనిల్ రావిపూడి

''నారాయణ అండ్ కో' ట్రైలర్ అద్భుతంగా ఉంది. సుధాకర్ నా స్నేహితుడు. తనతో నాది లాంగ్ జర్నీ. తనకి 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్' చిత్రంతో చక్కని టేకాఫ్ వచ్చింది. 'నారాయణ అండ్ కో'తో మంచి బ్రేక్ వస్తుందనుకుంటున్నాను'' అని డైరెక్టర్ అనిల్ రావిపూడి అన్నారు. సుధాకర్ కోమాకుల హీరోగా చిన్నా పాపిశెట్టి దర్శకత్వం వహించిన చిత్రం 'నారాయణ అండ్ కో'. పాపిశెట్టి బ్రదర్స్‌తో కలిసి సుధాకర్ కోమాకుల నిర్మించిన ఈ సినిమా ఈ నెల 30న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకు దర్శకులు అనిల్ రావిపూడి, విజయ్ కనకమేడల, హీరో తిరువీర్, నిర్మాత రాజ్ కందుకూరి, సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ అతిథులుగా హాజరై, 'నారాయణ అండ్ కో' విజయం సాధించాలి అన్నారు. సుధాకర్ కోమాకుల మాట్లాడుతూ– ''నారాయణ అండ్ కో' సకుటుంబ సపరివార సమేతంగా చూడదగ్గ సినిమా'' అన్నారు. ''ఇది ఫ్యామిలీ ఫండింగ్ మూవీ. చాలామంది సపోర్ట్‌తో ఈ సినిమా చేశాం'' అన్నారు దర్శక–నిర్మాత చిన్నా పాపిశెట్టి.


● అనిల్, సుధాకర్, విజయ్

కథే హీరో

\- డీవై చౌదరి

రోహిత్ బెహల్, అపర్ణా జనార్దనన్ జంటగా నటించిన చిత్రం 'లవ్ యూ రామ్'. డీవై చౌదరి స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ సినిమా కథ అందించిన దర్శకుడు కె. దశరథ్ మరో నిర్మాత. ఈ సినిమా ఈ నెల 30న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా జరిగిన విలేకర్ల సమావేశంలో డీవై చౌదరి మాట్లాడుతూ – ''దశరథ్, నేను గతంలో '16 డేస్' అనే సినిమా చేశాం. అయితే ఇటీవల కుటుంబం అంతా కలిసి చూడదగ్గ సినిమాలు రావడం తగ్గింది. దీంతో ఓ క్లీన్ ఎంటర్‌టైనర్‌ను ప్రేక్షకులకు అందించాలని 'లవ్ యూ రామ్' తీశాం. ఇది డిఫరెంట్ లవ్‌స్టోరీ. కథే హీరో. అందుకే కొత్తవారిని తీసుకున్నాం. కథ విషయానికొస్తే.. ప్రేమించడమే జీవితం అని నమ్మే అమ్మాయి, నమ్మించడమే జీవితం అనుకునే అబ్బాయి మధ్య నెలకొన్న సంఘర్షణే ఈ చిత్రం. నేను, దశరథ్ మూడు వెబ్ సిరీస్‌లకు కథలు రెడీ చేశాం. త్వరలో దశరథ్ నుంచి ఓ పెద్ద ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రకటన వస్తుంది'' అన్నారు.



యాక్షన్ థ్రిల్లర్

జగన్‌మోహన్ హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఎస్–99'. శ్వేతా వర్మ హీరోయిన్‌గా యతీష్, నందిని నిర్మిస్తున్న ఈ సినిమా మోషన్ టైటిల్‌ను నిర్మాత రమేష్‌ప్రసాద్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''మా నాన్నగారు (ప్రముఖ దర్శక–నిర్మాత ఎల్వీ ప్రసాద్) సినిమాల కోసం చాలా కష్టపడ్డారు.. ఆ కష్టమే నన్ను ఉత్సాహపరిచి, ఇండస్ట్రీవైపు వచ్చేలా చేసింది. మెకానికల్ ఇంజనీరింగ్ చదివిన నేను ప్రపంచవ్యాప్తంగా ప్రసాద్ ల్యాబ్స్‌ను నెలకొల్పడం హ్యాపీగా ఉంది.


● యతీష్, రమేష్‌ప్రసాద్, జగన్‌మోహన్

ప్రస్తుతం సినిమాలు సరిగ్గా ఆడటం లేదు.. కానీ చాలామంది కష్టపడి సినిమాలు చేస్తున్నారు. 'ఎస్–99' టైటిల్ కొత్తగా ఉంది. ఈ మూవీ సక్సెస్ అవ్వాలి'' అన్నారు. ''యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రమిది'' అన్నారు జగన్‌మోహన్. ''ఎస్–99' లాంటి చిత్రాలు మరిన్ని తీయడానికి రెడీగా ఉన్నాం'' అన్నారు యతీష్.

సాక్షి బిజినెస్
బుధవారం
28-6-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
446	126
63,416	18,817

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి 11.00 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	13,558	▲	222
డోజోన్స్	33,938	▲	223
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,461	▲	8
డాక్స్	15,847	▲	39
షాంఘై	3,189	▲	39
నికాయ్	32,538	▼	160

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)		
58,442	▲	284
బంగారం (99.5 స్వచ్ఛత)		
58,208	▲	285
వెండి (కిలో)		
69,523	▲	131

తప్పుడు లక్ష్యంతోనే నివేదిక

హిండెన్‌బర్గ్‌పై అదానీ గ్రూప్ ఫైర్

న్యూఢిల్లీ: కార్పొరేట్ సుపరిపాలన, సమాచార వెల్లడిలో విశ్వసనీయ విధానాలు అవలంబిస్తున్నట్లు అదానీ గ్రూప్ తాజాగా పేర్కొంది. సుప్రీం కోర్టు నియమించిన నిపుణుల కమిటీ గ్రూప్‌లో ఎలాంటి నిబంధనల ఉల్లంఘన జరగలేదని స్పష్టం చేసినట్లు అదానీ ఎంటర్‌ప్రైజెస్ విడుదల చేసిన వార్షిక నివేదికలో పేర్కొంది. యూఎస్ షార్ట్‌సెల్లర్ హిండెన్‌బర్గ్ నివేదిక వెలువడిన ఐదు నెలల తదుపరి వార్షిక నివేదికలో ఇంకా పలు అంశాలపై స్పందించింది. అదానీ గ్రూప్ కంపెనీలలో అక్రమాలు జరుగుతున్నట్లు ఈ ఏడాది జనవరి 24న హిండెన్‌బర్గ్ నివేదిక ఆరోపించిన సంగతి తెలిసిందే. దీంతో




గ్రూప్‌లోని లిస్టెడ్ కంపెనీల షేర్లలో అమ్మకాలు ఊపందుకున్నాయి. ఒక దశలో గ్రూప్ మార్కెట్ విలువలో 150 బిలియన్ డాలర్లమేర ఆవిరైంది. అయితే హిండెన్‌బర్గ్ నివేదిక తప్పుడు లక్ష్యాలతో నిరాధార ఆరోపణలకు తెరతీసిందని అదానీ గ్రూప్ కొట్టిపారేసింది. ఇది దేశంపై జరిగిన దాడిగా గౌతమ్ అదానీ పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవం రోజున నివేదిక వెలువడినట్లు తెలియజేశారు. గ్రూప్‌పై తప్పుడు ఆరోపణలు చేసి షేర్ల ధరలను పడగొట్టడం ద్వారా హిండెన్‌బర్గ్ లాభాలు ఆర్జించినట్లు వెల్లడించారు. సుపరిపాలన, సమాచార వెల్లడిలో గ్రూప్ పటిష్ట విధానాలు అనుసరిస్తున్నట్లు వివరించారు. అన్ని రకాల నిబంధనల అమలుకు కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేశారు.

జూలై 1న హెచ్‌డీఎఫ్‌సీ విలీనం

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుగా ఆవిర్భావం

- 25 హెచ్‌డీఎఫ్‌సీ షేర్లకుగాను 42 హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు జారీ
- హెచ్‌డీఎఫ్‌సీ చైర్మన్ దీపక్ పరేఖ్ వెల్లడి

ముంబై: ఫైనాన్షియల్ రంగ దిగ్గజాలు హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఏకంకానున్నాయి. జూలై ఒకటి నుంచి విలీనం అమల్లోకి రానున్నట్లు మార్టిగేజ్ దిగ్గజం చైర్మన్ దీపక్ పరేఖ్ వెల్లడించారు. దేశీ కార్పొరేట్ చరిత్రలోనే అతిపెద్ద లావాదేవీగా రికార్డ్ సృష్టిస్తూ బ్యాంకింగ్ అనుబంధ సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో మాతృ సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్ విలీనంకానుంది. దీనికి దాదాపు అన్ని అనుమతులూ లభించినట్లు పరేఖ్ తెలియజేశారు. విలీనాన్ని అనుమతించేందుకు రెండు సంస్థల బోర్డులూ ఈ నెల 30న విడిగా సమావేశమవుతున్నట్లు పేర్కొన్నారు. హెచ్‌డీఎఫ్‌సీ వైస్‌చైర్మన్ కేకి మిస్త్రీతో కలిపి పరేఖ్.. రామ్సన్ హౌ స్‌లోని హెచ్‌టీ పరేఖ్ లెగసీ సెంటర్ వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.



13 లేదా 14 నుంచి

షేర్ల మార్పిడితో చేపడుతున్న విలీనం నేపథ్యంలో జులై 13 లేదా 14 నుంచి హెచ్‌డీఎఫ్‌సీ షేర్లలో లిస్టింగ్ నిలిచిపోయే వీలున్నట్లు మిస్త్రీ వెల్లడించారు. స్టాక్ ఎక్స్ఛేంజీల నిర్ణయం మేరకు 17కల్లా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుగా ట్రేడ్ కావచ్చని అంచనా వేశారు. 2022 ఏప్రిల్ 4న తొలుత విలీన అంశం తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. అనుబంధ సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో విలీనానికి మాతృ సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ సంసిద్ధతను వ్యక్తం చేసింది. వెరసి స్టాక్ ఆధారిత 40 బిలియన్ డాలర్ల విలువైన లావాదేవీకి తెరలేచింది. విలీనంతో రూ.18 లక్షల కోట్ల ఆస్తులుగల ఫైనాన్షియల్ రంగ దిగ్గజం ఆవిర్భవించనుంది.

ఆర్ఐఎల్.. వెనక్కి

విలీనం ద్వారా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వెయిటేజీ స్టాక్ మార్కెట్ ప్రధాన ఇండెక్స్‌లో 14 శాతానికి చేరనుంది. తద్వారా 10.4 శాతంతో ఉన్న హెవీవెయిట్ రిలయన్స్ ఇండస్ట్రీస్‌ను మించనుంది. డీల్ తదుపరి బ్యాంకులో పబ్లిక్ వాటాదారుల వాటా 100 శాతానికి చేరనుంది. ప్రస్తుత హెచ్‌డీఎఫ్‌సీ వాటాదారులకు బ్యాంకులో 41 శాతం వాటా లభించనుంది. హెచ్‌డీఎఫ్‌సీలో గల ప్రతీ 25 షేర్లకుగాను వాటాదారులు 42 బ్యాంకు షేర్లను పొందనున్నారు. కాగా.. బ్యాంక్‌కుగల 7 కోట్లకుపైగా కస్టమర్లలో 2 శాతమే హెచ్‌డీఎఫ్‌సీ ద్వారా రుణాలు తీసుకున్నట్లు బ్యాంకు బోర్డులో స్వతంత్ర డైరెక్టర్‌గా ఎంపికైన మిస్త్రీ తెలియజేశారు. దీంతో మార్టిగేజ్ రుణాల వృద్ధికి భారీ అవకాశాలున్నట్లు అభిప్రాయపడ్డారు. మిస్త్రీ ఎంపికకు ఆర్‌బీఐ అనుమతి లభించవలసి ఉంది. హెచ్‌డీఎఫ్‌సీలో 46 ఏళ్లపాటు బాధ్యతలు నిర్వహించిన పరేఖ్ సంస్థలో జూన్ 30 చివరి పనిదినంగా పేర్కొన్నారు. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం 60 ఏళ్లలోపు ఉద్యోగులు బ్యాంకుకు బదిలీకానున్నట్లు వెల్లడించారు.

ఈ వార్తలతో ఎన్ఎస్ఈలో హెచ్‌డీఎఫ్‌సీ షేరు 1.3 శాతం బలపడి రూ. 2,757 వద్ద నిలిచింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు షేరు సైతం 1.4 శాతం పుంజుకుని రూ. 1,658 వద్ద ముగిసింది.

బిలియన్ డాలర్ 'సీసీఎల్'

- తెలుగు కంపెనీ కొత్త రికార్డు
- మార్చికల్లా ఏపీలో కొత్త ప్లాంటు
- సీసీఎల్ చైర్మన్ రాజేంద్ర ప్రసాద్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇన్‌స్టంట్ కాఫీ తయారీలో ప్రపంచ దిగ్గజం సీసీఎల్ ప్రొడక్ట్స్ మార్కెట్ క్యాపిటలైజేషన్ పరంగా బిలియన్ డాలర్ (రూ.8,200 కోట్లు) కంపెనీగా అవతరించింది. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా దుగ్గిరాల కేంద్రంగా 1995లో ప్రారంభమైన ఈ కంపెనీ 100కుపైగా దేశాల్లో కస్టమర్లను సొంతం చేసుకుంది. ఆంధ్రప్రదేశ్‌లో రెండు, వియత్నాం, స్విట్జర్లాండ్‌లో ఒక్కొక్క ప్లాంటు ఉంది. ఏటా 55,000 టన్నుల కాఫీని తయారు చేయగలిగే సామర్థ్యం ఉంది. ప్రపంచవ్యాప్తంగా సెకనుకు 1,000కిపైగా కప్పుల సీసీఎల్ కాఫీని కస్టమర్లు ఆస్వాదిస్తున్నారు. అనతికాలంలోనే కాఫీ రిటైల్‌లో భారత్‌లో టాప్–3 స్థానానికి ఎగబాకినట్టు సీసీఎల్ ప్రొడక్ట్స్ ఫౌండర్, చైర్మన్ చల్లా రాజేంద్ర ప్రసాద్ మంగళవారమిక్కడ మీడియాకు తెలిపారు. అయిదేళ్లలో 2 బిలియన్ డాలర్ కంపెనీగా అవతరిస్తామన్నారు.

కాఫీ రుచులు 1,000కిపైగా..

సీసీఎల్ ప్రొడక్ట్స్ 1,000కిపైగా రుచుల్లో కాఫీని తయారు చేస్తోంది. వీటిలో ఫంక్షనల్ కాఫీ, కోల్డ్ బ్రూ ఇన్‌స్టంట్, మైక్రోగ్రౌండ్ ఇన్‌ఫ్యూజ్డ్, స్పెషాలిటీ ఇన్‌స్టంట్ కాఫీ ఉన్నాయని కంపెనీ ఎండీ చల్లా శ్రీశాంత్ తెలిపారు. 'ఈ స్థాయి ఉత్పత్తులతో దేశీయ మార్కెట్లో కాంటినెంటల్ పేరుతో సొంత బ్రాండ్స్‌ను పరిచయం చేయడానికి, స్థిరమైన బిజినెస్ టు కన్స్యూమర్ కంపెనీగా రూపొందించడానికి విశ్వాసాన్ని ఇచ్చింది. బీటూసీని పటిష్టం చేయడానికి లాఫ్‌బెర్గ్స్ గ్రూప్ నుంచి ఆరు బ్రాండ్లను దక్కించుకున్నాం. ఎఫ్ఎంసీజీ కంపెనీగా నిలవాలన్నది మా కల. ఇందులో భాగంగా గ్రీన్‌బర్డ్ పేరుతో మొక్కల ఆధారిత ఉత్పత్తుల తయారీలోకి ప్రవేశించాం' అని వివరించారు.



మీడియా సమావేశంలో శ్రీశాంత్, రాజేంద్ర ప్రసాద్, మోహన్‌కృష్ణ (ఎడమ నుంచి)

ఏపీలో మరో ప్లాంటు..

ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లాలో ఉన్న కాంటినెంటల్ కాఫీ పార్కులో సీసీఎల్ కొత్తగా ప్లాంటును ఏర్పాటు చేస్తోంది. 22 ఎకరాల విస్తీర్ణంలో రానున్న ఈ కేంద్రానికి ఏపీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఇటీవలే శంకుస్థాపన చేశారు. ఈ యూనిట్ కోసం రూ.400 కోట్ల పెట్టుబడి చేస్తున్నట్టు కంపెనీ ఈడీ మోహన్‌కృష్ణ వెల్లడించారు. వార్షిక తయారీ సామర్థ్యం 16,000 మెట్రిక్ టన్నులు. 2024 మార్చిలోగా ఉత్పత్తి ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు.

సెన్సెక్స్ 446 పాయింట్లు ప్లస్

- మూడు రోజుల నష్టాలకు బ్రేక్
- హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం షేర్ల దన్ను
- బక్రీద్ సెలవు తేదీ మార్పు

ముంబై: ప్రపంచ ప్రతికూలతలను అధిగమిస్తూ దేశీయ స్టాక్ మార్కెట్ మంగళవారం లాభాలు గడించింది. హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు రాణించడంతో సూచీలు మూడురోజుల నష్టాల నుంచి గట్టెక్కాయి. తొలి సెషన్‌లో పరిమిత శ్రేణిలో కదలాడిన సూచీలు.., మిడ్ సెషన్ నుంచి కీలక రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో పరుగులు తీశాయి. ఉదయం సెన్సెక్స్ 182 పాయింట్లు పెరిగి 63,152 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 468 పాయింట్లు దూసుకెళ్లి 63,468 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 446 పాయింట్ల లాభంతో 63,416 వద్ద



స్థిరపడింది. ఈ సూచీలో మొత్తం 30 షేర్లకు గానూ మూడు మాత్రమే నష్టపోయాయి. నిఫ్టీ 58 పాయింట్లు పెరిగి 18,749 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. రోజంతా 18,829 – 18,714 శ్రేణిలో కదలాడింది. ఆఖరికి 126 పాయింట్లు ఎగసి 18,817 వద్ద నిలిచింది. ఎఫ్ఎంసీజీ, ఇంధన మినహా ఇతర అన్ని రంగాలకు చెందిన చిన్న, మధ్య తరహా షేర్లకు డిమాండ్ నెలకొంది.

- బక్రీద్ సందర్భంగా మహారాష్ట్ర ప్రభుత్వం జూన్ 29న (గురువారం) సెలవు ప్రకటించింది. దీనికి అనుగుణంగా స్టాక్ ఎక్స్ఛేంజీలు సెలవు రోజును గురువారానికి మార్చాయి. దీంతో బుధవారం (నేడు) ట్రేడింగ్ యథావిధిగా కొనసాగుతుంది.

అన్‌లిమిటెడ్ స్టోర్లలో 'రెడ్ అలర్ట్ సేల్'

న్యూఢిల్లీ: వివిధ ఉత్పత్తులపై అత్యుత్తమ రాయితీలు, ఆఫర్లతో 'రెడ్ అలర్ట్ సేల్' ప్రారంభించినట్లు అన్‌లిమిటెడ్ స్టోర్స్ ప్రకటించింది. అన్ని బ్రాండెడ్ వస్త్రాలపై 50% ఫ్లాట్ ఆఫర్ అందిస్తుంది.



అలాగే రూ. 3 వేల షాపింగ్‌పై అంతే విలువైన ఉత్పత్తులను ఉచితంగా పొందవచ్చు. దేశవ్యాప్తంగా అన్ని అన్‌లిమిటెడ్ స్టోర్లలో ఈ ఆఫర్ జూలై రెండో తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. కస్టమర్లంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కంపెనీ కోరింది.

నెమ్మదించిన అంకురాలు..

- 2023లో తగ్గిన కొత్త యూనికార్న్‌లు
- బిలియన్ డాలర్లు దాటిన స్టార్టప్‌లు మూడే
- ఆస్క్ ప్రైవేట్ వెల్త్ నివేదికలో వెల్లడి

ముంబై: దేశీయంగా స్టార్టప్ వ్యవస్థలో మందగమనాన్ని సూచిస్తూ 2023లో కొత్త యూనికార్న్‌ల సంఖ్య గణనీయంగా తగ్గింది. 2022లో మొత్తం 24 అంకుర సంస్థలు ఒక బిలియన్ డాలర్లకు పైగా వేల్యుయేషన్ అందుకోగా ఈసారి కొత్తగా మూడు మాత్రమే ఆ హోదా దక్కించుకున్నాయి. మొత్తం యూనికార్న్‌ల సంఖ్య 84 నుంచి 83కి తగ్గింది. ఆస్క్ ప్రైవేట్ వెల్త్ హురున్ ఇండియన్ ఫ్యూచర్ యూనికార్న్ సూచీ 2023 నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. ఇన్వెస్టర్లలో పెట్టుబడులపై ఆసక్తి మందగించడంతో అంకుర సంస్థలకు నిధుల లభ్యత తగ్గుతోందనడానికి తాజా పరిణామం నిదర్శనమని ఆస్క్ ప్రైవేట్ వెల్త్ సీఈవో రాజేష్ సలూజా తెలిపారు. పలు స్టార్టప్‌ల వ్యాపార విధానాలు పటిష్టమైనవిగా లేకపోవడం వేల్యుయేషన్ల తగ్గుదలకు దారితీసిందని, అయితే సరైన కంపెనీలకు మాత్రం పెట్టుబడులు లభిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. బైజూస్ వంటి కొన్ని స్టార్టప్‌లలో సమస్యలు నెలకొన్నప్పటికీ భారతీయ స్టార్టప్ వ్యవస్థకు ఫండింగ్‌పై ప్రతికూల ప్రభావాలేమీ ఉండబోవని సలూజా చెప్పారు.భారత్‌లో అంకుర సంస్థల వృద్ధికి అపార అవకాశాలు ఉన్నాయని, వచ్చే అయిదేళ్లలో దేశీయంగా యూనికార్న్‌ల సంఖ్య 200కు చేరగలదని అంచనా వేస్తున్నట్లు హురున్ ఇండియా చీఫ్ రీసెర్చర్ అనాస్ రెహ్మాన్ జునైద్ చెప్పారు. చైనాలో 1,000కి పైగా యూనికార్న్‌లు ఉన్నాయని.. భారత్ ఆర్థికంగా ఎదగాలంటే స్టార్టప్‌లు చాలా కీలకమన్నారు.



- అంకుర సంస్థలను యూనికార్న్‌లు (ఒక బిలియన్ డాలర్ల వేల్యుయేషన్), గెజెల్స్ (500 మిలియన్ డాలర్ల పైగా వేల్యుయేషన్ కలిగి ఉండి, మూడేళ్లలో యూనికార్న్‌లుగా ఎదిగే అవకాశం ఉన్నవి), చీతాలు (250 మిలియన్ డాలర్ల వేల్యుయేషన్, అయిదేళ్లలో యూనికార్న్‌లుగా ఎదిగే అవకాశం ఉన్నవి)గా వర్గీకరించారు.
- 250 మిలియన్ డాలర్ల పైగా వేల్యుయేషన్ ఉన్న మొత్తం అంకుర సంస్థల సంఖ్య గతేడాది 122గా ఉండగా 2023లో 147కి చేరింది.

జాబ్ పాయింట్

వెస్ట్రన్ రైల్వేలో 3624 అప్రెంటిస్‌లు

ముంబై ప్రధాన కేంద్రంగా ఉన్న రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ)–వెస్ట్రన్ రైల్వే.. 2023–24 సంవత్సరానికి సంబంధించి వెస్ట్రన్ రైల్వే పరిధిలోని డివిజన్ /వర్క్‌షాప్‌లలో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 3624.
» **శిక్షణ కాలం:** ఒక సంవత్సరం.
» **ట్రేడులు:** ఫిట్టర్, వెల్డర్, కార్పెంటర్, పెయింటర్, డీజిల్ మెకానిక్, మెకానిక్ మోటార్ వెహికల్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్ మెకానిక్, వైర్‌మ్యాన్, మెకానిక్ రిఫ్రిజిరేటర్(ఏసీ–మెకానిక్), పైప్ ఫిట్టర్, ప్లంబర్, డ్రాఫ్ట్స్‌మ్యాన్(సివిల్), పీఏఎస్ఎస్ఏ, స్టెనోగ్రాఫర్, మెషినిస్ట్, టర్నర్.
» **అర్హత:** పదో తరగతితోపాటు సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 26.07.2023 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** పదో తరగతి, ఐటీ మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు. రాతపరీక్ష/వైవా ఉండదు.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 27.06.2023.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 26.07.2023.
» **వెబ్‌సైట్:** www.rrc-wr.com

మనూ, హైదరాబాద్‌లో 12 నాన్‌టీచింగ్ పోస్టులు

హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్శిటీ(మనూ).. వివిధ ప్రాంతాల్లోని మనూ క్యాంపస్‌లలో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన నాన్–టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 12
» **పోస్టుల వివరాలు:** రీజనల్ డైరెక్టర్–02, అసిస్టెంట్ రీజనల్ డైరెక్టర్–04, ఇన్‌స్ట్రక్టర్–పాలిటెక్నిక్ సివిల్ ఇంజనీరింగ్–01, సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్–01, ఎంటీఎస్–04.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, సంబంధిత విభాగంలో ఐటీఐ,డిగ్రీ,పీజీ,పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** పరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**07.07.2023.
» **దరఖాస్తు హార్డ్‌కాపీ స్వీకరణకు చివరితేది:** 14.07.2023.
» **వెబ్‌సైట్:** https://manuu.edu.in

ఆర్‌బీఐలో 40 పోస్టులు

ముంబైలోని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) సర్వీసెస్ బోర్డ్.. కాంట్రాక్ట్ ప్రాతిపదికన లేటరల్ రిక్రూట్‌మెంట్ విధానంలో కన్సల్టెంట్స్/సబ్జెక్ట్ స్పెషలిస్ట్స్ /అనలిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 40
» **పోస్టుల వివరాలు:** డేటా సైంటిస్ట్–03, డేటా ఇంజనీర్–01, ఐటీ సెక్యూరిటీ ఎక్స్‌పర్ట్–10, ఐటీ సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్–డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ–08, ఐటీ ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్–డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ–06, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్–03, ఎకనామిస్ట్(మాక్రో–ఎకనామిక్ మోడలింగ్)–01, డేటా అనలిస్ట్(అప్లైడ్ మ్యాథమేటిక్స్)–01, డేటా అనలిస్ట్ (అప్లైడ్ ఎకనామెట్రిక్స్)–02, డేటా అనలిస్ట్(టీఏబీఎం/హెచ్ఏఎన్‌కే మోడల్స్)–02, అనలిస్ట్(క్రెడిట్ రిస్క్)–01, అనలిస్ట్(మార్కెట్ రిస్క్)–01, అనలిస్ట్(లిక్విడిటీ రిస్క్)–01.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ, పీజీపీఎం/పీజీడీఎం ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రిలిమినరీ స్క్రీనింగ్/షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 11.07.2023.
» **వెబ్‌సైట్:** www.rbi.org.in

స్పా, విజయవాడలో 17 నాన్‌టీచింగ్ పోస్టులు

విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్(స్పా).. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్/డిప్యుటేషన్‌పై నాన్‌టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 17
» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ రిజిస్ట్రార్(డిప్యుటేషన్)–01, సెక్షన్ ఆఫీసర్–02, ప్రైవేట్ సెక్రటరీ –01, అకౌంటెంట్–01, పర్సనల్ అసిస్టెంట్(డైరెక్ట్/డిప్యుటేషన్)–02, జూనియర్ సూపరింటెండెంట్(టెక్నికల్)(డైరెక్ట్/డిప్యుటేషన్)–02, టెక్నికల్ అసిస్టెంట్–05, లైబ్రరీ అసిస్టెంట్–01, గ్రాఫిక్ డిజైనర్/సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్(పబ్లికేషన్)–01, గ్రాఫిక్ అసిస్టెంట్/టెక్నికల్ అసిస్టెంట్(పబ్లికేషన్స్)–01.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
దరఖాస్తును రిజిస్ట్రార్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, ఐటీఐ రోడ్, విజయవాడ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 31.07.2023.
» **వెబ్‌సైట్:** www.spav.ac.in

» విదేశీ వర్సిటీల్లో ప్రవేశాలకు ప్రామాణిక పరీక్ష టోఫెల్
» టోఫెల్‌లో మార్పులు ప్రకటించిన ఈటీఎస్
» రెండు గంటలకు తగ్గిన పరీక్ష సమయం
» జూలై 26 నుంచి అమల్లోకి రానున్న కొత్త విధానం

టోఫెల్.. కీలక మార్పులు ఇవే!

టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ యాజ్ ఎ ఫారెన్ లాంగ్వేజ్.. సంక్షిప్తంగా టోఫెల్! ఇది విదేశీ విద్య విద్యార్థులు తప్పనిసరిగా అర్హత సాధించాల్సిన పరీక్ష!! ముఖ్యంగా అమెరికా, యూకే, కెనడా, ఆస్ట్రేలియా వంటి దేశాల్లోని యూనివర్సిటీల్లో అడుగుపెట్టాలంటే.. టోఫెల్ స్కోర్ తప్పనిసరి! నిర్వాహక సంస్థ ఎడ్యుకేషనల్ టెస్టింగ్ సర్వీస్(ఈటీఎస్)..ఇటీవల ఈ పరీక్షలో పలు కీలక మార్పులను ప్రకటించింది. కొత్త విధానం జూలై 26 నుంచే అమల్లోకి వస్తుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో.. టోఫెల్ నూతన విధానం, తాజా మార్పులు, బెస్ట్ స్కోర్‌కు మార్గాలు తదితర వివరాలు..

టోఫెల్.. అమెరికా సహా ప్రపంచ వ్యాప్తంగా 160 దేశాల్లోని 11,500 ఇన్‌స్టిట్యూట్‌లు ప్రామాణికంగా తీసుకుంటున్న లాంగ్వేజ్ టెస్ట్. డొమైన్ సబ్జెక్ట్‌తో సంబంధం లేకుండా అన్ని విభాగాల అభ్యర్థులకు ఇంగ్లిష్ లాంగ్వేజ్‌పై ఉన్న అవగాహన విదేశీ యూనివర్సిటీల ప్రవేశాల్లో కీలకంగా మారుతోంది. దీంతో స్టడీ అబ్రాడ్ అభ్యర్థులకు టోఫెల్ స్కోర్ అత్యంత ఆవశ్యకంగా మారింది. ఈ పరీక్షకు ఏటా లక్ష మంది వరకూ హాజరవుతున్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న పరీక్ష విధానంపై అభ్యర్థుల్లో కొంత ప్రతికూలత నెలకొంది. ముఖ్యంగా సుదీర్ఘమైన టెస్ట్ సమయం, తుది స్కోర్ కేటాయింపులో పరిగణనలోకి తీసుకోని ప్రశ్నలు ఉండటం వంటి కారణాలతో సమయాభావం ఏర్పడుతోందనే వాదన వినిపిస్తోంది. ఈ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న టోఫెల్ నిర్వాహక సంస్థ.. ఎడ్యుకేషనల్ టెస్టింగ్ సర్వీస్(ఈటీస్).. ఈ పరీక్షలో పలు కీలక మార్పులు చేసింది.

పరీక్ష వ్యవధి రెండు గంటలే

టోఫెల్ కొత్త విధానంలో పరీక్ష వ్యవధిని రెండు గంటలకు తగ్గించారు. ఇంతకాలం మొత్తం నాలుగు విభాగాల్లో (రీడింగ్, రైటింగ్, స్పీకింగ్, లిజనింగ్) మూడు గంటల వ్యవధిలో పరీక్ష నిర్వహిస్తుండగా.. తాజా–పరీక్ష సమయం రెండు గంటలుగా నిర్ణయించారు.

విభాగాల వారీగా ప్రశ్నలు

- **రీడింగ్ సెక్షన్:**రెండు ప్యాసేజ్‌ల నుంచి 10 ప్రశ్నలు చొప్పున మొత్తం 20 ప్రశ్నలు ఉంటాయి. 35 నిమిషాల వ్యవధిలో సమాధానాలు ఇవ్వాలి.
- **లిజనింగ్ సెక్షన్:** మూడు లేదా నాలుగు లెక్చర్స్. ఒక్కో లెక్చర్ నుంచి 6 ప్రశ్నలు ఉంటాయి. అదే విధంగా రెండు లేదా మూడు సంభాషణలు ఇచ్చి.. ఒక్కో సంభాషణపై 5 ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం 36 నిమిషాలు.
- **స్పీకింగ్ సెక్షన్:** ఇండిపెండెంట్ టాస్క్–1, ఇండిపెండెంట్ టాస్క్–2, ఇండిపెండెంట్ టాస్క్–3, ఇండిపెండెంట్ టాస్క్–4. దీనికి లభించే సమయం 16 నిమిషాలు.
- **రైటింగ్ సెక్షన్:** ఇందులో రెండు టాస్క్‌లు ఇచ్చి దాని ఆధారంగా ప్రశ్నలు అడుగుతారు. టాస్క్–1లో రైటింగ్ ఇంటిగ్రేటెడ్ టాస్క్, టాస్క్–2లో అకడమిక్ రైటింగ్ డిస్కషన్ టాస్క్ ఉంటాయి. ఒక్కో టాస్క్‌కు 29 నిమిషాల సమయం కేటాయిస్తారు.

అన్-స్కోర్డ్ కొశ్చన్స్ తొలగింపు

టోఫెల్ కొత్త విధానంలో భాగంగా అన్–స్కోర్డ్(స్కోర్ కేటాయింపులో పరిగణించని) ప్రశ్నలను పూర్తిగా తొలగించారు. ప్రస్తుత విధానంలో లిజనింగ్ విభాగంలో అన్ స్కోర్డ్ కొశ్చన్స్ పేరుతో అయిదు ప్రశ్నల వరకు అడుగుతున్నారు. వీటికి సమాధానాలు ఇవ్వడం తప్పనిసరి. కానీ.. ఈ ప్రశ్నల ద్వారా పొందిన మార్కులను స్కోర్ నిర్ధారణలో పరిగణనలోకి తీసుకోరు. వీటి కారణంగా అభ్యర్థులు సమయాభావ సమస్యను ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న ఈటీఎస్.. ఇకపై లిజనింగ్ విభాగంలో స్కోర్డ్ కొశ్చన్స్‌నే అడగనుంది.

కొత్తగా రైటింగ్ ఫర్

కొత్తగా 'రైటింగ్ ఫర్ యాన్ అకడమిక్ డిస్కషన్' పేరుతో కొత్త టాస్క్ చేర్చారు. ఇందులో అభ్యర్థులు ఆన్‌లైన్ విధానంలో ప్రొఫెసర్ ఇచ్చిన ప్రశ్నను చదివి.. దానికి అప్పటికే ఇద్దరు విద్యార్థులు ఇచ్చిన సమాధానాలను కూడా పరిశీలించాల్సి ఉంటుంది. ఆ తర్వాత వాటిని పరిగణనలోకి తీసుకుంటూ.. అదే అకడమిక్ అంశంపై సమాధానాన్ని ఇవ్వడంతోపాటు, తమ అభిప్రాయాన్ని కూడా వ్యక్తీకరించాల్సి ఉంటుంది.

రీడింగ్ సెక్షన్‌లోనూ సమయం కుదింపు

ప్రస్తుత విధానంలో మూడు లేదా నాలుగు ప్యాసేజ్‌ల నుంచి 10 ప్రశ్నలు చొప్పున మొత్తం 40 ప్రశ్నలు రీడింగ్ సెక్షన్‌లో అడుగుతున్నారు. వీటికి కనిష్ఠంగా 54 నిమిషాలు, గరిష్ఠంగా 72 నిమిషాల సమయం కేటాయిస్తున్నారు.

కొత్త విధానంలో మాత్రం రెండు ప్యాసేజ్‌లు, వాటి ఆధారంగా 20 ప్రశ్నలు మాత్రమే అడుగుతారు. వీటికి 35 నిమిషాల్లో సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. అంటే..పాత విధానంతో పోల్చితే అభ్యర్థులకు దాదాపు సగం సమయం కలిసొస్తుంది.

స్కోర్ వెల్లడి

కొత్త విధానంలో పరీక్ష పూర్తి కాగానే.. అభ్యర్థులు తమ స్కోర్ వెల్లడి తేదీని తెలుసుకునే సదుపాయం



కూడా కల్పించనున్నారు. దీనివల్ల అభ్యర్థులు తమ ఫలితాల కోసం ఈటీఎస్ పంపే సమాచారం కోసం వేచి చూసే పరిస్థితికి ఫుల్‌స్టాప్ పడనుంది. పరీక్ష సమయంలో ఎప్పటికప్పుడు అభ్యర్థులకు సూచనలు అందిస్తూ.. వారికి ఆన్‌లైన్ విధానంలో సహకరించే పద్ధతిని కూడా అమలు చేయనున్నారు.

స్థానిక కరెన్సీలో ఫీజు

టోఫెల్ అభ్యర్థులకు అనుకూలించే మరో మార్పు.. స్థానిక కరెన్సీలో ఫీజు చెల్లించే అవకాశాన్ని అందుబాటులోకి తేనుండడం. ఇప్పటి వరకు టోఫెల్ అభ్యర్థులు రిజిస్ట్రేషన్ సమయంలో డాలర్ల రూపంలోనే ఫీజు చెల్లించే విధానం ఉంది. కొత్తగా జూలై 26 నుంచి స్థానిక కరెన్సీలో అంటే మన దేశానికి చెందిన అభ్యర్థులు రూపాయల్లో కూడా ఫీజు చెల్లించే అవకాశం అందుబాటులోకి రానుంది.

ఇప్పటికే టోఫెల్ పరీక్ష తేదీలను, స్లాట్లను రిజర్వ్ చేసుకున్న అభ్యర్థులు కూడా జూలై 26 నుంచి అమల్లోకి వచ్చే కొత్త విధానంలో పరీక్షకు హాజరయ్యే అవకాశాన్ని ఈటీఎస్ కల్పిస్తోంది.

విజయానికి ప్రిపరేషన్ ఇలా

రీడింగ్

ఈ విభాగంలో అభ్యర్థులకు అకడమిక్ సంబంధిత ప్యాసేజ్‌లు ఇస్తారు. వీటి ఆధారంగా అడిగే ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ విభాగం ప్రధాన ఉద్దేశం.. అభ్యర్థులు యూనివర్సిటీ స్థాయి అకడమిక్స్‌ను అవగాహన చేసుకోగలరా లేదా? అనేదే. కాబట్టి ఇందులో రాణించేందుకు విద్యార్థులు తమ అకడమిక్ అర్హతలకు అనుగుణంగా ఆయా పుస్తకాలను నిరంతరం చదువుతుండాలి.

లిజనింగ్ టెస్ట్

ఈ విభాగంలో క్లాస్ రూం డిస్కషన్స్, లెక్చర్స్ లేదా ఇతర సంభాషణలు సమ్మిళితంగా ఉండే ఆడియోను వినాల్సి ఉంటుంది. ఆ సంభాషణల ఆడియో పూర్తయిన తర్వాత.. వాటి ఆధారంగా అడిగే ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. ఒక్కో ఆడియోకు సంబంధించి ఆరు ప్రశ్నలు అడుగుతారు. ఇందులో రాణించాలంటే.. ఇంగ్లిష్ న్యూస్ ఛానెళ్లను వీక్షించడం, అందులోని చర్చలను అనుసరిస్తూ భాష, యాసపై అవగాహన పెంచుకోవాలి.

రైటింగ్ టెస్ట్

ఈ విభాగంలో రాణించేందుకు అభ్యర్థులు అంతకుముందు దశలైన రీడింగ్, లిజనింగ్‌లో తమకు ఎదురైన రెండు అంశాలపై ఎస్సే రాయాల్సి ఉంటుంది.

స్పీకింగ్ టెస్ట్

రైటింగ్ టెస్ట్‌లో మాదిరిగానే ఇందులో కూడా అభ్యర్థులు అప్పటికే తాము ఎదుర్కొన్న రీడింగ్, లిజనింగ్ విభాగాల్లో పేర్కొన్న అంశాలు, లేదా కొత్త టాపిక్స్‌పై తమ అభిప్రాయాలను చర్చా రీతిలో వ్యక్తం చేయాల్సి ఉంటుంది.

స్కోరింగ్ ఇలా

టోఫెల్‌లో ప్రతి విభాగంలో గరిష్ఠంగా 30 పాయింట్లు చొప్పున 120 పాయింట్ల స్కోర్ ఉంటుంది. ఈ స్కోర్స్‌లో ప్రతి విభాగంలో 24 నుంచి 30 పాయింట్లు పొందితే.. హై పెర్ఫార్మెన్స్ క్యాండిడేట్‌గా పరిగణిస్తారు. ప్రముఖ ఇన్‌స్టిట్యూట్‌లు, యూనివర్సిటీలు ఈ అధిక స్కోర్ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యం ఇస్తాయి.

రిజిస్ట్రేషన్

టోఫెల్ అభ్యర్థులు పరీక్ష కోసం ఎప్పుడైనా రిజిస్టర్ చేసుకోవచ్చు. ఏడాది పొడవునా.. నిర్దేశిత తేదీల్లో పరీక్ష జరుగుతుంది. పరీక్షకు హాజరయ్యే విషయంలోనూ ఎలాంటి పరిమితి లేదు. అభ్యర్థులు ఒక దశ పరీక్ష రాశాక.. కనీసం 12 రోజుల తర్వాత మాత్రమే మరో దశకు దరఖాస్తు చేసుకోవాలనే నిబంధన అమలవుతోంది.

టోఫెల్ కొత్త స్వరూపం

సెక్షన్	ప్రశ్నలు	సమయం
రీడింగ్	20	35 నిమిషాలు
లిజనింగ్	28	36 నిమిషాలు
స్పీకింగ్	4 టాస్క్‌లు	16 నిమిషాలు
రైటింగ్	2 టాస్క్‌లు	29 నిమిషాలు

టోఫెల్ మార్పులు.. ముఖ్యాంశాలు

- జూలై 26 నుంచి నూతన విధానంలో టోఫెల్ పరీక్ష.
- రెండు గంటల వ్యవధిలోపే పరీక్ష నిర్వహణ.
- కొత్తగా రైటింగ్ ఫర్ యాన్ అకడమిక్ డిస్కషన్ టాస్క్.
- అన్‌స్కోర్డ్ ప్రశ్నల తొలగింపు.
- పరీక్ష ముగిసిన వెంటనే స్కోర్ వెల్లడి తేదీని చూసుకునే అవకాశం.
- స్థానిక కరెన్సీ(రూపాయల్లో) ఫీజు చెల్లించే సదుపాయం.
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.ets.org/toefl.html; www.ets.org/toefl/ibtenhancements.html

20 ఏళ్లలో 21 వేల గుండె ఆపరేషన్లు!

• అరుదైన రికార్డు సృష్టించిన ఉస్మానియా వైద్యుడు



సాక్షి, హైదరాబాద్: ఉస్మానియా ఆస్పత్రి కార్డియాలజీ విభాగాధిపతి (హెచ్ఓడీ) డాక్టర్ సయ్యద్ ఇమాముద్దీన్ అరుదైన రికార్డు సృష్టించారు. 20 ఏళ్ల వ్యవధిలో ఏకంగా 21 వేల గుండె శస్త్రచికిత్సలు నిర్వహించిన వైద్యుడిగా ఖ్యాతిగాంచారు. అలాగే డాక్టర్ల బృందంతో కలసి ఆయన చేసిన ఆపరేషన్ల సంఖ్య 50 వేలు దాటడం విశేషం. ఈ మేరకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌కు త్వరలో సమగ్ర నివేదిక చేరనుంది. హైదరాబాద్‌లోని న్యూ మలక్‌పేట ప్రాంతానికి చెందిన ఇమాముద్దీన్ బెంగళూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెడికల్ కాలేజీ నుంచి ఎంబీబీఎస్, మైసూరు మెడికల్ కాలేజీ నుంచి ఎండీ (జనరల్ మెడిసిన్), ముంబైలోని లోకమాన్య తిలక్ మున్సిపల్ మెడికల్ కాలేజీ నుంచి డీఎం (కార్డియాలజీ) పూర్తి చేశారు. ఉస్మానియా జనరల్ హాస్పిటల్ కార్డియాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా 2003 అక్టోబర్ 6న అడుగుపెట్టిన డాక్టర్ సయ్యద్ ఇమాముద్దీన్ ప్రస్తుతం ప్రొఫెసర్ హోదాలో ఆ విభాగాధిపతిగా కొనసాగుతున్నారు. 2003 అక్టోబర్ నుంచి సోమవారం వరకు ఆయన మొత్తం 21 వేల గుండె శస్త్రచికిత్సలను ఉస్మానియా ప్యాథ్‌ల్యాబ్ వేదికగా చేశారు. ఈ సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ 'ఉస్మానియా ఆస్పత్రికి వచ్చే నిరుపేదలకు వైద్యం చేయడంలో లభించిన తృప్తి మరెక్కడా ఉండదు. సెలవులు తదితరాలతో సంబంధం లేకుండా అత్యవసర శస్త్ర చికిత్సలు నిర్వహిస్తూనే ఉంటాం' అని పేర్కొన్నారు. ఇమాముద్దీన్ బెంగళూరులోని రాజీవ్ గాంధీ యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌కు అకడమిక్ కౌన్సిల్ మెంబర్‌గా వ్యవహరిస్తున్నారు. కార్డియాలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా తెలంగాణ చాప్టర్‌కు అధ్యక్షుడిగా వ్యవహరించారు. 2021కిగాను రాష్ట్రంలోనే ఉత్తమ కార్డియాలజిస్టు అవార్డుతోపాటు ఎన్నో జాతీయ, అంతర్జాతీయ అవార్డులు అందుకున్నారు.

టమాటా రూ. 100   పచ్చిమిర్చి రూ. 160

• ఉల్లిగడ్డలు మినహా పెరిగిన అన్ని కూరగాయల ధరలు
• సామాన్యుడు కొనలేనంతగా పెరిగిన అల్లం, వెల్లుల్లి ధర
• బీన్స్, చిక్కుడు ధరలు రూ.120 నుంచి రూ.160 వరకు
• హైదరాబాద్‌తోపాటు అన్ని ప్రాంతాల్లో పెరిగిన రేట్లు



సాక్షి, హైదరాబాద్: కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. నెలరోజుల క్రితం వరకు రూ.వందకు నాలుగు కిలోల చొప్పున అమ్మిన టమాటాల ధర ఒక్కసారిగా పెరిగింది. హైదరాబాద్‌తోపాటు అన్ని ప్రాంతాల్లోనూ రిటైల్ మార్కెట్‌లో టమాటా కిలో రూ.100కు చేరింది. పావుకిలో కొనాలంటే రూ.30 ఇస్తే తప్ప దొరకని పరిస్థితి. అలాగే, పచ్చిమిర్చి, బీన్స్, చిక్కుడుతోపాటు అన్ని కూరల్లో వాడే అల్లం, వెల్లుల్లి ధరలు కూడా సామాన్యుడికి ఏమాత్రం అందనంతగా పెరిగిపోయాయి. పచ్చిమిర్చి నాణ్యతను బట్టి కిలో రూ.120 నుంచి 160 వరకు విక్రయిస్తున్నారు. ఉల్లిగడ్డలు, ఆలుగడ్డలు తప్ప బెండకాయలు, బీరకాయలు, చిక్కుడు తదితర కూరగాయల ధరలు కిలో రూ.60–80కి మధ్య ఉండటం గమనార్హం. రైతుబజార్లు, మార్కెటింగ్ శాఖ మొబైల్ వ్యాన్‌లలో విక్రయించే చోట ధరలు కొంత తక్కువగా ఉన్నప్పటికీ, రిటైల్ దుకాణాల్లో కొనాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. సూపర్ మార్కెట్లలో రిటైల్ మార్కెట్ల కన్నా కిలోకు రూ.10–15 వరకు అధికంగా ఉంది.

అల్లం కిలో రూ.300

కూరల్లో రుచికి తప్పనిసరైన అల్లం ధర ఊహించని విధంగా కిలో రూ.300కి చేరింది. మంగళవారం హైదరాబాద్ చింతలబస్తీలో బండ్లపైన అల్లం పావు కిలో రూ.80 ఉండగా, కిలోకు రూ.300 చెప్పడం గమనార్హం. వెల్లుల్లి కిలో రూ.200 ఉండగా, మేలు రకం ధర రూ.240 ఉంది. మూడు నెలల క్రితం వరకు కిలో రూ.100కి లభించిన అల్లం, వెల్లుల్లి ధరలు ఎన్నడూ లేనివిధంగా పెరిగిపోయి సామాన్యుడు కొనలేనంత పైకి చేరుకున్నాయి. బీన్స్ నాణ్యతను బట్టి కిలో రూ.120 నుంచి రూ.160 వరకు ఉండగా, చిక్కుడుకాయలు కిలో రూ.80 నుంచి రూ. 100కు విక్రయిస్తున్నారు.

కూరగాయల ధరలు హైదరాబాద్ రిటైల్ మార్కెట్‌లో (కిలోకి రూ.)	
మిర్చి	120-160
బీన్స్	120-160
టమాటా	100
చిక్కుడు	80-100
బీరకాయలు	80
కాకరకాయ	80
క్యాప్సికం	80
వంకాయ	60
క్యారెట్	60
బెండకాయలు	60
కాలిఫ్లవర్ (ఒకటి)	50
సొరకాయ	40
పొట్లకాయ	40
ఆలుగడ్డ	30

వేసవిలో కూరగాయలు పండించకనే..

వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా మూడునెలలుగా రాష్ట్రంలో కూరగాయల పంటలు ఆశించిన స్థాయిలో లేవు. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్‌లో అకాల వర్షాలు, మే, జూన్‌లలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా టమాటా, పచ్చిమిర్చి, వంకాయ, బెండకాయ తదితర పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఏపీ నుంచి కూడా ఆశించినస్థాయిలో తెలంగాణకు దిగుమతులు లేవు. మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాల నుంచి ఉల్లిగడ్డలు, ఆలుగడ్డలు, క్యారెట్ వంటివి తప్ప నిత్యం వండుకునే కూరగాయల దిగుమతులు తక్కువగానే ఉన్నట్లు హైదరాబాద్ రైతుబజార్ ప్రతినిధి ఒకరు చెప్పారు.

ఏక్ నిరంజన్

• విద్యార్థులు రాని పాఠశాల.. రోజూ ఉపాధ్యాయుని నిరీక్షణ



విద్యార్థుల కోసం ఎదురు చూస్తున్న ఉపాధ్యాయుడు

చిలుకూరు: ఆ పాఠశాలలో ఇప్పటివరకు ఒక్క విద్యార్థి కూడా చేరలేదు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు ఇంటింటా తిరిగినా ఎవరూ తమ పిల్లలను పాఠశాలకు పంపలేదు. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం కొమ్మబండ తండా ప్రాథమిక పాఠశాల ప్రారంభంలో విద్యార్థులతో కళకళలాడింది. పదేళ్లుగా పాఠశాలలో విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గుతూ వచ్చింది. గత విద్యాసంవత్సరం ఈ పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు, ఒక ఉపాధ్యాయుడు ఉన్నారు. ఆ ముగ్గురు విద్యార్థులు కూడా ఈ ఏడాది ప్రైవేట్ స్కూల్ బాటపట్టారు. ప్రభుత్వ పాఠశాలలో పిల్లలు లేరని, ఇంగ్లిష్ మీడియంలో చెప్పడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. రోజూ ఉపాధ్యాయుడు రావడం.. పాఠశాల తాళాలు తీయడం.. విద్యార్థుల కోసం ఎదురుచూస్తుండటం సాధారణమైంది. గ్రామంలో మొత్తం 103 ఇళ్లు, 700 జనాభా ఉంది. ఈ గ్రామం నుంచి ఆటోలో ప్రైవేట్ పాఠశాలకు సుమారు 10మంది వరకు వెళ్తారు. మిగిలిన కొందరు విద్యార్థులు జెర్రిపోతులగూడెం ప్రాథమిక పాఠశాలకు వెళ్తున్నారు.

ఆక్వా మెరైన్ పార్క్ ఏర్పాటు చేస్తే తప్పేంటి?: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ కొత్వాల్‌గూడలో ఆక్వా మెరైన్ పార్కు, పక్షుల కేంద్రం ఏర్పాటుపై పూర్తి వివరాలు అందజేయాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. పర్యాటకులను ఆకట్టుకునేందుకు ఏర్పాటుచేస్తే తప్పేంటని సీజే జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం ప్రశ్నించింది. సింగపూర్, మలేషియా వంటి దేశాల్లో ఇలాంటి ఆక్వా మెరైన్ పార్కులున్నాయి కదా? అని పేర్కొంది. ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, పశుసంవర్ధక శాఖ కార్యదర్శి సహా పలువురు అధికారులకు నోటీసులు జారీ చేసింది. ఆక్వా మెరైన్ పార్కుతోపర్యావరణం దెబ్బతింటోందని, జంతువులు, చేపలు, ఇతర వన్యప్రాణులు అంతరించిపోవడానికి ఇదే కారణమవుతుందని.. ఈ పార్కు ఏర్పాటును ఆపాలని కోరుతూ నటీమణులు శ్రీవిద్య, రేణుదేశాయ్ దాఖలు చేసిన పిల్‌ను ధర్మాసనం విచారించింది. అనంతరం ఆగస్టు 4కి విచారణను వాయిదా వేసింది.

ఇంటికి పంటే అందం ఆరోగ్యం!

మిద్దెపైనే అన్ని కూరగాయల పంటలు
ఏ కాలమైనా పండించొచ్చంటున్న నిపుణులు
మానసికంగానూ మేలు చేస్తుందంటున్న సాగుదారులు

సాక్షి సాగుబడి డెస్క్

మొన్నటి వరకు ఎండల ప్రతాపానికి కూరగాయల దిగుబడి తగ్గి, మార్కెట్‌లో తీవ్ర కొరత ఏర్పడింది. ఫలితంగా కూరగాయల ధరలు మండిపోతున్నాయి. నాణ్యతా లోపించింది. ఇప్పటికైనా వర్షాలొచ్చాయి కాబట్టి సేంద్రియ ఇంటి పంటలు సాగు చేసుకోవటం మేలు. సొంతిల్లు ఉన్న వారు మార్కెట్‌పై ఆధారపడకుండా.. ఆరోగ్యదాయకమైన కూరగాయలను టెర్రస్ (ఇంటి పైకప్పు)ల మీద పెంచుకోవటం మేలని నిపుణులు చెబుతున్నారు ఎత్తుమడుల్లో లేదా కంటెయినర్లలో ఏ కాలమైనా కూరగాయలు సాగు చేసుకోవచ్చంటున్నారు.



మనమే పండించుకుందాం ▲

మెడిసిన్‌లో సీటు వచ్చినా ప్రకృతి మీద ఉన్న ప్రేమతో అగ్రికల్చర్ కోర్సు చదివాను. నా కుటుంబాన్ని విషపూరితమైన పంటల నుంచి కాపాడేందుకు ఇంటిపైన కూరగాయల తోటను ప్రారంభించాను. 2014 అక్టోబర్‌లో నా మిద్దె తోటలో తొలి బీజం అంకురించింది. అప్పుడు 60 కుండీలతో మొదలైన మిద్దె తోట సాగు ఇప్పుడు 600 కుండీలతో నాలుగు అంతస్తుల్లో అలరారుతోంది. ఇలా మనకు కావాల్సిన ఆకుకూరలు, కూరగాయలు, పండ్లను సాధ్యమైనంత వరకు మనమే పండించుకోవడం ఉత్తమం.

-ఓవీఎస్ ఉషారాణి, జీహెచ్ఎంసీ చందానగర్ సర్కిల్ ప్రాజెక్ట్ ఆఫీసర్

ఇంటిపంటల్లో సంపూర్ణ ఆరోగ్యం



తాజా కూరగాయలు, పండ్లతో శరీరానికి కావాల్సిన యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా లభిస్తాయి. నలిగిన లేదా పగిలిన కణాల నుంచి సెల్యులోజ్ అనే ఎంజైము విడుదలవుతుంది. దీంతో యాంటీ ఆక్సిడెంట్లు హానికరమైన ఆమ్లాలుగా రూపాంతరం చెందుతాయి. మార్కెట్‌లో లభించే చాలావరకు కూరగాయలతో ఈ ప్రమాదం ఉంటుంది. కాబట్టి, ఇంటి వద్దే పండ్లు, కూరగాయలు పండించుకొని తాజాగా తినాలి.

-డా.జి.శ్యాంసుందర్ రెడ్డి, సేంద్రియ ఇంటిపంటల నిపుణుడు

మిద్దె తోటలో...



లత కృష్ణమూర్తి, హైదరాబాద్

'సాక్షి'పేపర్‌లో 'ఇంటిపంట'ఆర్టికల్స్ చదివి మిద్దెపైన సాగు మొదలు పెట్టాను. 2017లో ఐదారు గ్రోబాగ్స్ తెచ్చి ఆకుకూరల సాగు మొదలు పెట్టాను. ఇప్పుడు కూరగాయ మొక్కలనూ మిద్దె పైనే పెంచుతున్నాను. మొక్కలకు తగిన పోషకాలు ఇస్తే మిద్దె తోటలో కూరగాయలు, ఆకుకూరలు, పండ్లను ఎలాంటి రసాయనాలు వాడకుండా పండించుకోవచ్చు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.